
'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 289

సోమవారం 3-7-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఫేవరెట్‌గా జొకోవిచ్

మహిళల విభాగంలో రిబాకినా.. నేటి నుంచి వింబుల్డన్ టోర్నీ - 12లో



ఈవీ.. బీమా లేదంటే బేజారు!

వాహనం మొత్తం దెబ్బతింటేనే పరిహారం సమగ్ర కవరేజీ ఉంటేనే మేలు - 13లో



గుజరాత్ అతలాకుతలం

గుజరాత్‌లో వర్షాలకు వాగులు పొంగి పొర్లుతున్నాయి. పలు గ్రామాలకు ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయి.


వివరాలు 6లో ▸



కేజ్రీవాల్‌కు దుబాయ్‌లో ఫ్లాట్లు

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు దుబాయ్‌లో 3 ఫ్లాట్లున్నాయని.. ముడుపులతో కొనుగోలు చేశారని జైలుశిక్ష అనుభవిస్తున్న సుఖేశ్ ఆరోపించాడు.

వివరాలు 6లో ▸



ఫ్రాన్స్‌లో అయిదో రోజూ అల్లర్లు

ఫ్రాన్స్‌లో అల్లర్లు కొనసాగుతున్నాయి. ఆందోళనకారులు మేయర్ ఇంటిపైకి మండుతున్న కారుతో దూసుకువచ్చి, దాడికి యత్నించారు.

వివరాలు 6లో ▸




టైటానిక్ కంటే ఐదు రెట్లు పెద్దది

సముద్ర జలాల్లో ప్రయాణానికి ప్రపంచంలోనే అతి పెద్ద విలాస నౌక 'ఐకాన్ ఆఫ్ సీ' సిద్ధమైంది. ఇది టైటానిక్ కంటే 5 రెట్లు పెద్దది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

ఏపీ ఈసెట్ ఫలితాల విడుదల



పాలిటెక్నిక్, బీఎస్సీ(మ్యాథ్స్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు నేరుగా ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశించేందుకు నిర్వహించిన ఏపీ ఈసెట్–2023 ఫలితాలు విడుదలయ్యాయి. 34,503 మంది హాజరుకాగా 31,933 మంది ఉత్తీర్ణులయ్యారు.

వివరాలు 14లో ▸

వైభవంగా సింహ'గిరి' ప్రదక్షిణ



శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని ప్రసన్నం చేసుకునేందుకు సింహాచల గిరి ప్రదక్షిణకు లక్షలాది మంది భక్తులు పోటెత్తారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచే భక్తులు గిరి ప్రదక్షిణ ప్రారంభించారు.

వివరాలు 5లో ▸

మోదీ చేతిలో కేసీఆర్ రిమోట్



ప్రధాని మోదీ చేతిలో తెలంగాణ సీఎం కేసీఆర్ రిమోట్ కంట్రోల్ ఉందని.. అందుకే మోదీకి ఏం కావాలో కేసీఆర్ అదే చేస్తారని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. కర్ణాటకలో బీజేపీని ఓడించామని.. ఇక్కడ బీజేపీ బీ టీం అయిన బీఆర్‌ఎస్‌ను ఓడిస్తామన్నారు. ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురికి కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

వివరాలు 5లో ▸



ఎన్ని పార్టీలు చేరితే అన్ని ఇంజన్లు అన్నమాట!

ఈ రాష్ట్రంలో గుండె గుండెకూ తెలుసు

ఆరోగ్యశ్రీయే అండ

నాలుగేళ్లలో 40 లక్షల మందికి ఉచితంగా కార్పొరేట్ వైద్యం

- 2019 నుంచి ఏకంగా రూ.9,025 కోట్లు ఖర్చు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- 3,257 ప్రొసీజర్లు.. శస్త్ర చికిత్స అనంతరం 'వైఎస్సార్ ఆరోగ్య ఆసరా'
- రోగి ఇంటివద్ద కోలుకునే సమయంలో మందులతో పాటు డబ్బులు కూడా..
- దేశంలో తొలిసారిగా కరోనా చికిత్సను ఆరోగ్యశ్రీలో చేర్చిన ప్రభుత్వం ఇదే
- టీడీపీ హయాంలో అరకొరగా ప్రొసీజర్లు..
- ఇప్పటితో పోలిస్తే వ్యయం సగమే..

2లో





ఈ ఫొటోలో మంచంపై ఉన్న కృష్ణా జిల్లా కంకటావ గ్రామానికి చెందిన ఎస్.శివ ఆటో డ్రైవర్. అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరగా బ్లడ్ క్యాన్సర్‌గా వైద్యులు నిర్ధారించారు. సంపాదించే కుటుంబ పెద్ద మంచం పట్టడంతో ఇంట్లోవారు తల్లడిల్లారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా వైద్యం అందుతుందని తెలియడంతో శివ భార్య భ్రమరాంబ విజయవాడలోని హెచ్‌సీజీ క్యాన్సర్ ఆస్పత్రిని సంప్రదించింది. నాలుగు నెలలుగా శివకు అక్కడ ఉచితంగా వైద్యం అందుతోంది. ఇప్పటివరకు రూ.రెండు లక్షలకు పైగా ప్రభుత్వమే చెల్లించింది. కష్టకాలంలో ఆరోగ్యశ్రీ తమ కుటుంబాన్ని ఆదుకుందని భ్రమరాంబ చేతులు జోడిస్తోంది.

కరకట్ట సాక్షిగా


క్విడ్ ప్రో కో

అమరావతి భూకుంభకోణం ఏ-1 చంద్రబాబు నిర్వాకమే

టీడీపీ సర్కారు భూ కుంభకోణాలపై ఏసీబీ కోర్టు తీవ్ర వ్యాఖ్యలు

క్విడ్ ప్రో కోతోనే చంద్రబాబుకు కరకట్ట నివాసం

- సీఆర్‌డీఏ చైర్మన్‌గా రాజధాని మాస్టర్‌ప్లాన్ ఖరారు చేశారు
- ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌లో మూడుసార్లు మార్పులు
- ఏ–2 నారాయణకు అంతా తెలుసు.. ఆయనే కథ నడిపారు
- సీడ్ క్యాపిటల్‌లో నారాయణ బంధువులు భూములు కొన్నారు
- రింగ్‌రోడ్డును ఆనుకుని ఏ–3 లింగమనేని కుటుంబానికి 168 ఎకరాలు
- క్విడ్ ప్రోకోకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని స్పష్టం చేసిన కోర్టు
- క్విడ్‌ప్రోకో అభియోగాలను కొట్టివేయాలన్న లింగమనేని పిటిషన్ తిరస్కరణ



సాక్షి, అమరావతి: టీడీపీ హయాంలో రాజధాని ముసుగులో జరిగిన అమరావతి భూకుంభకోణం కచ్చితంగా క్విడ్‌ప్రోకోనే అన్నది స్పష్టమైంది. దీనికి కర్త, కర్మ, క్రియ అంతా నాటి సీఎం చంద్రబాబే అన్నది తేటతెల్లమైంది. లింగమనేని కుటుంబంతో క్విడ్‌ప్రోకోలో భాగంగానే ఏ–1 చంద్రబాబుకు కరకట్ట నివాసం, ఏ–2 పొంగూరు నారాయణకు సీడ్ క్యాపిటల్‌లో భూములు దక్కాయని తేలిపోయింది. సీడ్ క్యాపిటల్, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారులో ఏ–3 లింగమనేని రమేశ్ కుటుంబానికి నిబంధనలకు విరుద్ధంగా ప్రయోజనం చేకూర్చినందుకే వారిద్దరికీ ఆ ఆస్తులు దక్కాయనేందుకు ప్రాథమిక ఆధారాలున్నాయని

మిగతా 3వ పేజీలో ▶

'మహా'కుదుపు

నిలువునా చీలిన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ

సీనియర్ నాయకుడు అజిత్ పవార్ వేరు కుంపటి

శరద్ పవార్‌కు బిగ్ షాక్.. డిప్యూటీ సీఎంగా ప్రమాణం



డిప్యూటీ సీఎంగా ప్రమాణం చేస్తున్న అజిత్ పవార్


దేశ, రాష్ట్ర అభివృద్ధి కోసమే: అజిత్

నాలుగేళ్లలో 3 సార్లు డిప్యూటీ సీఎం

చర్యలు తప్పవు: శరద్ పవార్

మహారాష్ట్ర రాజకీయాల్లో మరో అలజడి. ఒక్కరోజులోనే రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోయాయి. ప్రతిపక్ష నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) నిట్టనిలువునా చీలిపోయింది. జాతీయ స్థాయిలో బీజేపీ వ్యతిరేక కూటమి కోసం జరుగుతున్న ప్రయత్నాల్లో చురుగ్గా వ్యవహరిస్తున్న ఆ పార్టీ అధినేత శరద్ పవార్‌కు పెద్ద షాక్ తగిలింది. ఆయన సోదరుడి కుమారుడు, ఎన్సీపీ సీనియర్ నాయకుడు అజిత్ పవార్ తన వర్గం ఎమ్మెల్యేలతో కలిసి వేరు కుంపటి పెట్టుకున్నారు. ఆదివారం బీజేపీ–శివసేన (షిండే వర్గం) ప్రభుత్వంలో చేరారు. ఏకంగా ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అజిత్ వర్గం ఎమ్మెల్యేల్లో ఎనిమిది మందికి మంత్రి పదవులు లభించాయి. కాగా, పార్టీని ధిక్కరించి, ప్రభుత్వంలో చేరినవారిపై చర్యలు తీసుకోవడం ఖాయమని ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ తేల్చిచెప్పారు. త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

- వివరాలు 6లో



నేడు పోలవరంపై

కీలక భేటీ..

నిధుల మంజూరుపై కేంద్ర కేబినెట్‌కు ప్రతిపాదన పంపడమే అజెండా

- ప్రతిపాదన ఖరారుతోపాటు పనుల పురోగతిని సమీక్షించనున్న కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి షెకావత్
- ఇప్పటికే రూ.12,911.15 కోట్ల విడుదలకు కేంద్ర ఆర్థికశాఖ అంగీకారం
- ఆ మేరకు కేంద్ర కేబినెట్‌కు ప్రతిపాదన పంపాలని సూచన
- కేబినెట్ ఆమోదిస్తే నిధులు విడుదల చేస్తామని వెల్లడి

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టుకు రూ.12,911.15 కోట్ల విడుదలకు సంబంధించి కేంద్ర మంత్రిమండలికి పంపాల్సిన ప్రతిపాదనను ఖరారు చేయడమే అజెండాగా సోమవారం ఢిల్లీలో కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటుచేశారు. కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్, కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరా, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈవో శివ్‌నందన్‌కుమార్, రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి తదితరులు ఈ భేటీలో పాల్గొననున్నారు. పోలవరం ప్రాజెక్టును


మిగతా 2వ పేజీలో ▶



ప్రకృతి ఉత్పత్తులతో 'వీక్లీ మార్కెట్లు'

ప్రకృతి వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఆ ఉత్పత్తులకు మరింతగా మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు 'వీక్లీ మార్కెట్ల'పై దృష్టి సారించింది. కలెక్టరేట్లు, సచివాలయాలు, ఆర్బీకేలు, మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రతి సోమవారం స్టాల్స్ ఏర్పాటు చేయబోతోంది. ఎన్టీఆర్ జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తోంది.


2లో



రాష్ట్రంలో బొమ్మల కొలువు

రాష్ట్రంలో టాయ్(బొమ్మల) మ్యూజియం కొలువుదీరనుంది. రూ.15 కోట్ల వ్యయంతో విజయనగరంలో ఏర్పాటు చేసేందుకు పురావస్తు శాఖ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందినవి, సంస్కృతి, సంప్రదాయాలు, నైపుణ్యాలను ప్రతిబింబించే బొమ్మలను ఇందులో ప్రదర్శించనున్నారు.

3లో



పర్యాటకానికి మహర్దశ

పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు రూ.3,016 కోట్ల విలువైన 13 పర్యాటక ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం పట్టాలెక్కిస్తోంది. 11 స్టార్ హోటళ్లతో పాటు రోప్‌వేల నిర్మాణాలు త్వరలో ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టింది. వీటి వల్ల వేలాది మందికి ఉపాధి లభించనుంది.

14లో

రోజుకు 2,000

శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి

దేశంలో నాలుగో స్థానంలో ఏపీ

టీడీపీ అడ్డంకులను అధిగమించి పేదల కల సాకారం

వాస్తవాలను కప్పిపుచ్చి ఈనాడు బురద రాతలు

ఫ్యాక్ట్ చెక్



సాక్షి, అమరావతి: ఒకేసారి 30 లక్షల మందికిపైగా మహిళలకు ఇళ్ల పట్టాలను అందించడం దేశ చరిత్రలోనే ఓ రికార్డు కాగా అడ్డంకులను అధిగమిస్తూ పేదల గృహ నిర్మాణాలను రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా సాకారం చేస్తోంది. పేదల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడంలో ఏపీ దేశంలో నాలుగో స్థానంలో ఉంది. అత్యధికంగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసిన రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్ (12.85 లక్షలు), గుజరాత్ (8.78 లక్షలు), మహారాష్ట్ర (8.10 లక్షలు) ఉండగా ఏపీలో 7.93 లక్షలు పూర్తైనట్లు కేంద్ర గృహ నిర్మాణ శాఖ గణాంకాల్లోనే స్పష్టంగా ఉంది. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా సీఎం జగన్ చేస్తున్న గృహ యజ్ఞంపై కేంద్ర మంత్రులు సైతం పలు సందర్భాల్లో ప్రశంసలు కురిపించారు. రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్న రామోజీ మాత్రం అట్టడుగున ఉందంటూ యథావిధిగా వక్రీకరణ కథనాలను ప్రచురించారు.

దేశంలోనే అత్యధిక ఇళ్లు

పేదలకు పక్కా గృహాల కల్పనలో ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. 30.6 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు రూ.75 వేల కోట్ల మార్కెట్ విలువ కలిగిన 71,811.49 ఎకరాల భూమిని వైఎస్ జగన్ ప్రభుత్వం

మిగతా 5వ పేజీలో ▶

రోజుకు రెండు వేలకు తగ్గకుండా

రాష్ట్రవ్యాప్తంగా పేదల ఇళ్ల నిర్మాణాలు ప్రస్తుతం చురుగ్గా కొనసాగుతున్నాయి. నిత్యం రెండు వేల ఇళ్లకు తగ్గకుండా నిర్మాణాలు పూర్తవుతున్నాయి. పనుల్లో వేగాన్ని పెంచేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పేదలకు ఉచితంగా స్థలాలను పంపిణీ చేయడంతో పాటు యూనిట్‌కు రూ.1.80 లక్షల చొప్పున ఇంటి నిర్మాణానికి అందచేస్తోంది. మరోవైపు పావలా వడ్డీకి రూ.35 వేలు చొప్పున బ్యాంకు రుణం ఇస్తున్నారు. దీంతోపాటు ఉచితంగా ఇసుక ఇవ్వడం ద్వారా రూ.15 వేలు, ఇతర నిర్మాణ సామగ్రిని సబ్సిడీపై అందించడంతో రూ.40 వేల మేర లబ్ధి చేకూరుస్తున్నారు.

క్లుప్తంగా...

సెలవు రోజునా కొనసాగిన పింఛన్ల పంపిణీ

- 58.60 లక్షల మందికి రూ.1,613.93 కోట్లు అందజేత
- 93.03 శాతం పంపిణీ పూర్తి

సాక్షి, అమరావతి: సెలవు రోజు అయినప్పటికీ ఆదివారం కూడా వలంటీర్లు లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేశారు. 58,60,163 మంది అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు, వివిధ చేతి వృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.1,613.93 కోట్లు పంపిణీ చేశారు. 93.03 శాతం మందికి పింఛన్ల పంపిణీ పూర్తయ్యిందని సెర్ప్ అధికారులు తెలిపారు. మిగిలిన లబ్ధిదారుల కోసం మరో 3 రోజుల పాటు పింఛన్ డబ్బుల పంపిణీ కొనసాగుతుందని చెప్పారు. చిత్తూరు, విజయనగరం, తిరుపతి జిల్లాల్లో అత్యధికంగా 95 శాతానికి పైగా పంపిణీ పూర్తయిందని అధికారులు వివరించారు.

వీధి దీపాల వ్యవస్థ మరింత పటిష్టం

- ప్రస్తుత పనితీరు అంచనాకు సర్వే
- సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: 'జగనన్న పల్లె వెలుగు' కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని ఎల్‌ఈడీ వీధి దీపాల వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు.. గ్రామాల్లోని ప్రతి విద్యుత్ స్తంభాన్ని గుర్తించేందుకు విస్తృత సర్వే నిర్వహించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) కేఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, కమిషనర్ ఎ.సూర్యకుమారి, ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్(ఈఈఎస్ఎల్) అధికారులతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వారం రోజుల్లోనే సర్వే పూర్తి చేయాలన్నారు. వీధి దీపాల ఏర్పాటు, వాటి భౌతిక స్థితి, సెంట్రలైజ్డ్ కంట్రోల్ మానిటరింగ్ సిస్టమ్‌లకు అనుసంధానం సహా సమగ్ర సమాచారాన్ని సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన వివరించారు. లోటుపాట్లను గుర్తించడం ద్వారా, వాటిని సరిచేసి.. వీధి దీపాల వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. దాదాపు 10,261 గ్రామ పంచాయతీల్లో 23.63 లక్షల ఎల్‌ఈడీ వీధి దీపాలను ఏర్పాటు చేసినట్లు ఈఈఎస్ఎల్ అధికారులు పేర్కొన్నారు. ఎల్‌ఈడీ వీధి దీపాల వల్ల గ్రామ పంచాయతీల్లో సుమారు 242.8 మిలియన్ యూనిట్ల వార్షిక విద్యుత్ పొదుపు ద్వారా రూ.170 కోట్లు ఆదా అవుతోందని చెప్పారు.

మూడురోజులు వానలు

సాక్షి, విశాఖపట్నం: దక్షిణ బంగాళాఖాతానికి ఆనుకుని ఉన్న మధ్య బంగాళాఖాతం మధ్య భాగాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. మరోవైపు రాష్ట్రంపైకి వాయవ్య గాలులు వీస్తున్నాయి. వీటి ప్రభావంతో సోమ, మంగళ, బుధవారాల్లో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల, ఉత్తర కోస్తాలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ ఆదివారం రాత్రి తెలిపింది. అదే సమయంలో దక్షిణ కోస్తా, సీమల్లో అక్కడక్కడ భారీ వర్షాలకు ఆస్కారం ఉందని వివరించింది. ఉత్తర కోస్తాలో మంగళ, బుధవారాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురవవచ్చని పేర్కొంది. ఈ వర్షాలతో పాటు ఉరుములు, మెరుపులు సంభవిస్తాయని, గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది.

నేడు పోలవరంపై కీలక భేటీ

▶ మొదటి పేజీ తరువాయి

సత్వరమే పూర్తిచేయడానికి రూ.పదివేల కోట్లను అడ్‌హక్ (ముందస్తు)గా విడుదల చేయాలని ప్రధాని నరేంద్రమోదీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలుమార్లు కోరారు. దీనికి స్పందించిన ప్రధాని నరేంద్రమోదీ పోలవరం ప్రాజెక్టుకు నిధుల సమస్య లేకుండా చూడాలని కేంద్ర ఆర్థికశాఖను ఆదేశించారు. దీంతో ప్రాజెక్టు తొలిదశను సత్వరమే పూర్తిచేయడానికి వీలుగా రూ.12,911.15 కోట్లు విడుదల చేసేందుకు జూన్ 5న కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ అంగీకరించారు. ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను దక్కించుకునే క్రమంలో 2013–14 ధరలతోనే ప్రాజెక్టును పూర్తిచేస్తామని 2016లో నాటి సీఎం చంద్రబాబు అంగీకరించారు. 2013–14 ధరల ప్రకారం ప్రాజెక్టు అంచనా వ్యయం కంటే ఇప్పటికే అధికంగా ఖర్చుచేసిన నేపథ్యంలో అదనంగా నిధుల విడుదలకు అడ్డంకిగా మారింది. అదనంగా నిధులు మంజూరు చేయాలంటే కేంద్ర మంత్రిమండలి ఆమోదం తప్పనిసరి. ఆ క్రమంలోనే రూ.12,911.15 కోట్లు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిమండలికి ప్రతిపాదన పంపాలని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర జల్‌శక్తి శాఖకు సూచించారు. మంత్రిమండలి ఆమోదముద్ర వేసిన వెంటనే నిధులు విడుదల చేస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుకు నిధులు విడుదలకు సంబంధించిన ప్రతిపాదనను పీపీఏ ద్వారా కేంద్ర జల్‌శక్తి శాఖకు రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు పంపారు. దీనిపై కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సమీక్షించి.. కేంద్ర మంత్రిమండలికి పంపాల్సిన ప్రతిపాదనను ఖరారు చేయనున్నారు. ప్రాజెక్టు పనుల పురోగతిని సమీక్షించి, సత్వరమే పూర్తిచేయడానికి చేపట్టాల్సిన చర్యలపై సీడబ్ల్యూసీ, పీపీఏ, రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు.



వైఎస్సార్ జిల్లా కడప నగరం ఊటుకూరులో బషీరున్‌కు పింఛను అందజేస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ రామాంజులు నాయక్



ఏలూరులో వినుకొండ సమాధానం అనే లబ్ధిదారుకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కుమారి



విజయవాడ వెటర్నరీ హాస్పిటల్ రోడ్డులో ఈగల శంకరరావుకు వృద్ధాప్య పింఛన్ అందిస్తున్న వలంటీర్ మహిత



గుంటూరు నగరంలో దివ్యాంగురాలు లిల్లీకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సాగర్



విజయనగరంలోని కుమ్మర వీధిలో కొండమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వాసవి



శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం మండలం పల్లిపాలెంలో పక్షవాతంతో బాధపడుతున్న బుజ్జమ్మకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ సురేఖ

ప్రకృతి ఉత్పత్తులతో 'వీక్లీ మార్కెట్లు'

- ప్రతీ సోమవారం నిర్వహణకు ఏర్పాట్లు
- కలెక్టరేట్లు, సచివాలయాలు, ఆర్బీకేలు ఇతర ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణాల్లో ప్రత్యేక స్టాల్స్
- ఇప్పటికే రైతుబజార్లలో కౌంటర్లు..
- ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆకుకూరలు, కాయగూరలు, బియ్యం, కందిపప్పు, ఇతర నిత్యావసరాలతో కిట్‌లు
- కరపత్రాల ద్వారా రైతు సాధికార సంస్థ విస్తృత ప్రచారం





ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఏర్పాటు చేసి స్టాల్. ఏపీ మార్క్ ఫెడ్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన స్టాల్

సాక్షి, అమరావతి : ప్రకృతి వ్యవసాయాన్ని పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని సంకల్పించింది. ఇందుకోసం ఇప్పటికే రైతుబజార్లలో ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటుచేస్తున్న ప్రభుత్వం.. తాజాగా మరో అడుగుముందుకేసి 'వీక్లీ మార్కెట్ల'పై దృష్టిసారించింది. రైతుల ద్వారా రసాయన రహిత ఉత్పత్తులను పండించడమేకాక, సమాజంలో ప్రతీ ఒక్కరికి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో వీటిని అందుబాటులోకి తెస్తోంది. సాధారణంగా కలెక్టరేట్లతో పాటు మండల, డివిజన్ స్థాయిలో ఉండే వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతీ సోమవారం అర్జీదారులు, ఇతర సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. వీరికి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులపై అవగాహన కల్పించడంతో పాటు వాటి వినియోగంపై చైతన్యం తీసుకొచ్చేలా కార్యక్రమాలు రూపొందించారు.

వారాంతపు సంతల మాదిరిగానే..

ఇక రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో 96 రైతుబజార్లు ఉండగా రైతు సాధికార సంస్థ ఇప్పటివరకు 22 రైతుబజార్లలో ప్రకృతి ఉత్పత్తుల విక్రయాల కోసం ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటుచేసింది. వీటికి అదనంగా ఎనిమిది జిల్లాల్లో కలెక్టర్ కార్యాలయ ప్రాంగణాల్లో కౌంటర్లను ఏర్పాటుచేశారు. తాజాగా.. విజయవాడ ఏపీ మార్క్‌ఫెడ్ కేంద్ర కార్యాలయంలో కూడా ఓ ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటుచేసింది. ఈ స్టాల్స్‌కు వస్తున్న స్పందన చూసి రైతు సాధికార సంస్థ దశల వారీగా వీక్లీ మార్కెట్‌లను విస్తరించాలని అధికారులు సంకల్పించారు. మారుమూల పల్లెలతో పాటు గిరిజన ప్రాంతాల్లో నేటికీ వారాంతపు సంతలు నిర్వహిస్తుంటారు. అదే రీతిలో వీక్లీ మార్కెట్లను తీసుకెళ్లాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కలెక్టరేట్లు, సచివాలయాలు, ఆర్బీకేలతో పాటు మండల కేంద్రాల్లోని ఇతర ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో కూడా ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటుచేయాలని నిర్ణయించారు.

కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం

మరోవైపు.. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులవల్ల కలిగే ప్రయోజనాల మీద ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలకు రైతు సాధికార సంస్థ శ్రీకారం చుట్టింది. ప్రకృతి ఉత్పత్తులవల్ల కలిగే ప్రయోజనాలపై ముద్రించిన కరపత్రాలను వీక్లీ మార్కెట్ల వద్ద పంపిణీ చేస్తోంది. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ సాధ్యమంటూ అవగాహన కల్పిస్తోంది. దశల వారీగా ఈ వీక్లీ మార్కెట్లను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. జిల్లా కేంద్రాల నుంచి గ్రామస్థాయి వరకు వీటిని తీసుకెళ్లాలని నిర్ణయించారు.

వారానికి సరిపడా కూరగాయల కిట్

ఎన్టీఆర్ జిల్లాలోని వివిధ మండల కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా వీక్లీ మార్కెట్లకు శ్రీకారం చుట్టింది. జిల్లాల వారీగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగుచేసే రైతులను గుర్తించి వారిని సమీపంలోని ప్రభుత్వ కార్యాలయాలకు మ్యాపింగ్ చేస్తున్నారు. వీరు తాము పండించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రతి సోమవారం ఆయా ప్రభుత్వ కార్యాలయాలకు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. సాధారణ ఉష్ణోగ్రతలలో కూడా 10 రోజుల పాటు తాజాగా ఉండటంతో పాటు వాటితో చేసే వంటకాలు రుచికరంగా ఉంటుండడంతో వినియోగదారులు సైతం కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన ఆకుకూరలు, కాయగూరలే కాకుండా.. బియ్యం, కందిపప్పు, వంటనూనె, పప్పు దినుసులు తదితర అన్ని రకాల ఉత్పత్తులను అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లుచేస్తున్నారు. వారానికి సరిపడే కాయగూరలతో పాటు ఒక కుటుంబానికి నెలకు అవసరమయ్యే అన్ని రకాల నిత్యావసరాలను ప్యాక్‌చేసి డిమాండ్ మేరకు నేరుగా ఇంటికి సరఫరా చేసేందుకు ఏర్పాట్లుచేస్తున్నారు. కొందరు రైతులు విజయవాడ నుంచి ఇతర జిల్లాలకూ ఈ ఉత్పత్తులను పంపుతున్నారు.

మార్కెటింగ్ సౌకర్యం కల్పించడమే లక్ష్యం



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా వీక్లీ మార్కెట్ల ఏర్పాటుపై దృష్టిసారించాం. రైతులకు, వినియోగదారులకు మధ్య దళారీల ప్రమేయం లేకుండా చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుని ముందుకెళ్తున్నాం.

– టి.విజయకుమార్, ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్, రైతు సాధికార సంస్థ

నేడు సీఎం చేతులమీదగా 108 అంబులెన్స్‌ల ప్రారంభం

- 108 సేవలు మరింత బలోపేతం
- 2020లోనే మండలానికో 108ను సమకూర్చిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: 108 అంబులెన్స్ సేవలను మరింత బలోపేతం చేసేలా సీఎం జగన్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 146 కొత్త అంబులెన్స్‌లను కొనుగోలు చేసింది. ఈ అంబులెన్స్‌లను సోమవారం సీఎం వైఎస్ జగన్ తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయం వద్ద ప్రారంభించనున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో నిర్వీర్యం అయిన 108 వ్యవస్థను బలోపేతం చేస్తూ 2020లోనే మండలానికి ఒక 108 అంబులెన్స్‌ను సమకూర్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అప్పట్లో రూ.96.50 కోట్లతో అధునాతన సౌకర్యాలతో 412 కొత్త అంబులెన్స్‌లు కొనుగోలు చేసి, అప్పటికే ఉన్నవాటికి మరమ్మతులు చేసి 748 అంబులెన్స్‌లతో సేవలను విస్తరించారు. గత అక్టోబర్‌లో రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల ప్రజల కోసం రూ.4.76 కోట్లతో ప్రత్యేకంగా 20 అదనపు అంబులెన్సులు కొనుగోలు చేశారు. దీంతో రాష్ట్రంలో అంబులెన్సుల సంఖ్య 768కి చేరింది. ఎక్కువకాలం ప్రయాణించి దెబ్బతిన్నస్థితిలో ఉన్న వాటి స్థానంలో కొత్త అంబులెన్సులను ప్రవేశపెట్టడం కోసం తాజాగా రూ.34.79 కోట్లతో 146 అంబులెన్స్‌లను ప్రభుత్వం కొనుగోలు చేసింది. మరోవైపు 108 సేవల కోసం ఏటా ప్రభుత్వం రూ.188.56 కోట్లు ఖర్చు చేస్తోంది. ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా గత టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుతం సేవలు ఎంతో మెరుగుపడ్డాయి. అప్పట్లో 1.19 లక్షల మందికి ఒక అంబులెన్స్ ఉండగా ప్రస్తుతం 74,609 మంది జనాభాకు ఒక అంబులెన్స్ ఉంది.

సేవలు వినియోగించుకున్న 33,35,670 మంది

ప్రస్తుతం రాష్ట్రంలో 108 అంబులెన్స్‌లు రోజుకు 3,089 కేసులకు అటెండ్ అవుతున్నాయి. ఇలా 2020 జూలై నుంచి ఇప్పటి వరకు 33,35,670 ఎమర్జెన్సీ కేసుల్లో అంబులెన్స్‌లు సేవలందించాయి. సేవలు వినియోగించుకున్నవారిలో అత్యధికంగా 23%మంది మహిళలే. అనంతరం 12% మంది కిడ్నీ సంబంధిత సమస్యలున్నవారు, 11% మంది రోడ్డు, ఇతర ప్రమాదాల బాధితులు ఉన్నారు.

ఆరోగ్యశ్రీయే అండ..

'వైఎస్సార్ ఆరోగ్యశ్రీ'తో రాష్ట్ర ప్రజలకు నిశ్చింత

- నాలుగేళ్లలో 40 లక్షల మందికి ఉచితంగా కార్పొరేట్ వైద్యం
- 2019 నుంచి ఏకంగా రూ.9,025 కోట్లు ఖర్చు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- 3,257 ప్రొసీజర్లు.. శస్త్ర చికిత్స అనంతరం 'వైఎస్సార్ ఆరోగ్య ఆసరా'



ఈ ఫొటోలో కనిపిస్తున్న కూరా సాహూ శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం అరకబద్ర గ్రామవాసి. రెక్కాడితే గానీ డొక్కాడని పేద కుటుంబం. ఇంటి వద్ద చిన్న కొట్టు నిర్వహిస్తున్నాడు. 2020 డిసెంబర్ 23 అర్ధరాత్రి సమయంలో ఛాతీ నొప్పి రావడంతో బరంపురం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వెంటనే గుండె ఆపరేషన్ చేయాలని చెప్పడంతో చేతిలో చిల్లి గవ్వలేని కుటుంబ సభ్యులకు దిక్కు తోచలేదు. కొందరు ఆరోగ్యశ్రీ గురించి చెప్పడంతో విశాఖ తరలించారు. అక్కడ ఉచితంగా గుండె ఆపరేషన్ తోపాటు ఇంటికి వెళ్లేప్పుడు ఉచితంగా మందులు, రూ.5 వేలు అందించారు. కోలుకున్న సాహూ యథావిధిగా షాప్ నిర్వహిస్తున్నాడు. ఆరోగ్యశ్రీ పథకం లేకుంటే తాను ప్రాణాలతో ఉండేవాడిని కాదేమో అని చెబుతున్నాడు.

సాక్షి, అమరావతి: ఆపద కాలంలో ఆపద్బాంధవిలా ఆదుకుంటూ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పునర్జన్మను ప్రసాదిస్తోంది. ఈ పథకం ద్వారా నాలుగేళ్లలో దాదాపు 40 లక్షల మందికి ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందించడం, నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఖ్య దాదాపు మూడు రెట్లు పెరగడమే ఇందుకు నిదర్శనం. అధికారంలోకి రాగానే ఆరోగ్యశ్రీకి ఊపిరిలూదుతూ చర్యలు చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత సర్కారు బకాయి పెట్టిన రూ.631 కోట్లను నెట్‌వర్క్ ఆస్పత్రులకు చెల్లించారు. ప్రొసీజర్ల సంఖ్యను ఏకంగా మూడు రెట్లకుపైగా పెంచారు. దీంతో ఎంత పెద్ద జబ్బుకైనా చేతి నుంచి చిల్లి గవ్వ ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్యం ఉచితంగా అందుతోంది. చికిత్స ఖర్చు రూ.వెయ్యి దాటితే ఉచితంగా వైద్యం అందించడంతోపాటు శస్త్ర చికిత్సల అనంతరం రోగి కోలుకునే సమయంలో ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలుస్తోంది. వైద్యులు సూచించిన మేరకు విశ్రాంతి సమయంలో 'డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య ఆసరా' ద్వారా సాయం అందిస్తున్నారు.

వైఎస్సార్ ఆరోగ్య ఆసరాకి వెయ్యి కోట్లు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ ఏడాది మే నెలాఖరు నాటికి ఆరోగ్యశ్రీ పథకం కింద 39,97,617 మంది ఉచితంగా వైద్యం అందుకున్నారు. వీరికి వైద్యం కోసం ప్రభుత్వం రూ.7,949.76 కోట్లు ఖర్చు చేసింది. ఇక వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కోసం రూ.1,074.69 కోట్లను వెచ్చించింది. ఇలా ఇప్పటి దాకా పథకం కోసం రూ.9,024.45 కోట్లు వ్యయం చేసింది. 2014–19 మధ్య టీడీపీ హయాంలో పథకం కోసం రూ.5,177.38 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఆరోగ్యశ్రీకి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో వెచ్చించిన మొత్తంతో పోలిస్తే ఐదేళ్లలో టీడీపీ సర్కారు 57.37 శాతం మాత్రమే ఖర్చు చేసింది.

కరోనాను పథకంలోకి తెచ్చిన తొలి ప్రభుత్వం

కోవిడ్ మహమ్మారిని సమర్థంగా ఎదుర్కొన్న రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా కరోనా చికిత్సను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చి ప్రజలకు ఊరట కల్పించింది. వైరస్ బారిన పడ్డ 2.06 లక్షల మందికి ఉచితంగా చికిత్స అందించి ఇప్పటివరకు రూ.743.75 కోట్లు ఖర్చు చేసింది.

అదనంగా 2,198 ప్రొసీజర్లు.. మొత్తం 3,257

ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిన ముఖ్యమంత్రి జగన్ వైద్యం ఖర్చు రూ.వెయ్యి దాటే ప్రతి చికిత్సకు ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపజేస్తామని 2019 ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. టీడీపీ హయాంలో కేవలం 1,059 ప్రొసీజర్లతో ఆరోగ్యశ్రీని నీరుగార్చగా సీఎం జగన్ అధికారంలోకి రాగానే 2020 జనవరిలో ప్రొసీజర్లను తొలుత 2,059కి పెంచారు. అదే ఏడాది జూలైలో 2,200కు ప్రొసీజర్లను పెంచి మరింత ప్రయోజనం చేకూర్చారు. తద్వారా 54 క్యాన్సర్ చికిత్సలు పథకం ద్వారా అందుబాటులోకి వచ్చాయి. 2020 నవంబర్‌లో బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ సహా 235 చికిత్సలతో ప్రొసీజర్ల సంఖ్యను 2,436కి పెంచారు. 2021 మే, జూన్ నెలల్లో పది రకాల కరోనా వైరస్ చికిత్సలను పథకంలో చేర్చడంతో 2446కు ప్రొసీజర్స్ పెరిగాయి. గతేడాది మరో 809 చేర్చడంతో ఆరోగ్యశ్రీ పథకంలో ప్రొసీజర్లు 3,255కి చేరుకున్నాయి. గర్భిణులకు ఉచితంగా 'టిఫా స్కాన్' సేవలు అందించడం కోసం మరో రెండు ప్రొసీజర్లను ఇటీవలే పథకంలో చేర్చారు. ఇలా 2019 నుంచి ఇప్పటిదాకా 2,198 ప్రొసీజర్లను పథకంలో అదనంగా చేర్చి మొత్తం 3,257 ప్రొసీజర్లతో ఆరోగ్యశ్రీ పథకాన్ని సమర్థంగా అమలు చేస్తున్నారు.

చికిత్సానంతరం అండగా

వైఎస్సార్ ఆరోగ్య ఆసరా ద్వారా 1,519 ప్రొసీజర్లకు వైద్యులు సూచించిన మేరకు విశ్రాంతి సమయంలో రోగులకు రోజుకు రూ.225 లేదా నెలకు గరిష్ఠంగా రూ.ఐదు వేలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం అందచేస్తోంది. రోగి ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన రోజే బ్యాంకు ఖాతాలో ఆసరా మొత్తాన్ని జమ చేస్తున్నారు. 2019 డిసెంబర్ 12వతేదీ నుంచి ఈ ఏడాది మే నెలాఖరు వరకూ 17,25,238 మందికి రూ.1,074.69 కోట్ల మేర ఆరోగ్య ఆసరా ద్వారా సాయం అందింది.

రోగి సంతృప్తే లక్ష్యం

ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందే రోగుల సంతృప్తే లక్ష్యంగా పథకాన్ని సీఎం జగన్ ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇందులో భాగంగా పలు కీలక సంస్కరణలు చేపట్టారు. చికిత్స అనంతరం రోగుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుని వారు సంతృప్తి చెందినట్టు తెలిపితేనే ఆస్పత్రులకు బిల్లుల చెల్లింపులు చేపడుతున్నారు. డిశ్చార్జి సమయంలో ప్రతి రోగి నుంచి కన్సెంట్ ఫామ్ తీసుకుంటున్నారు. అంతేకాకుండా రోగి ఖాతా నుంచి ఆస్పత్రులకు బిల్లుల చెల్లింపు విధానాన్ని ప్రవేశపెట్టారు. దీంతో పాటు సేవల్లో సమస్యలుంటే ఫిర్యాదు చేయడానికి 104 కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. డిశ్చార్జి అనంతరం ఏఎన్ఎంలు రోగుల ఇళ్లకు వెళ్లి యోగక్షేమాలను తెలుసుకుంటున్నారు. ఆరోగ్యంపై ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు.

ఆరోగ్యశ్రీ ఆదుకుంది ఇలా

సంవత్సరం	రోగులు	వ్యయం రూ.కోట్లలో
2019–2020	6,43,984	1,501.86
2020–2021	8,32,828	1,676.97
2021–2022	10,08,542	1,920.20
2022–2023	11,33,038	2,138.95
2023–2024	3,79,225	711.78

(ఈ ఏడాది మే నెలాఖరు వరకూ)

వైఎస్సార్ ఆరోగ్య ఆసరా వ్యయం

సంవత్సరం	రోగులు	రూ.కోట్లలో
2019–20	1,06,914	79.54
2020–21	2,70,133	194.31
2021–22	4,84,952	297.98
2022–23	7,29,548	432.41
2023–24	1,42,068	70.46

(ఈ ఏడాది మే నెలాఖరు వరకూ)

ఉచితంగా ఖరీదైన శస్త్ర చికిత్సలు (రూపాయల్లో)

వివరం	ఎంత ఖర్చు?
బైలాట్రల్ కాక్లియర్ ఇంప్లాంటేషన్	11,97,248
అల్లోజెనిక్ బోన్ మ్యారో స్టెమ్‌సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్(14ఏళ్లపైన)	11 లక్షలు
అల్లోజెనిక్ బోన్ మ్యారో స్టెమ్‌సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్(14ఏళ్ల లోపు)	10 లక్షలు
గుండె మార్పిడి	10,77,510
ఆటో ట్రాన్స్‌ప్లాంటేషన్ ఫర్ లింఫోమాస్	9,35,000
ఒక చెవికి కాక్లియర్ ఇంప్లాంట్	6,63,624
మైలోమా ఆటోలోగస్ హెచ్ఎస్‌సీటీ	6.50 లక్షలు
ట్రాన్స్‌ప్లాంట్ ఫర్ పీడియాట్రిక్ సాలిడ్ క్యాన్సర్	6.50 లక్షలు

అంశం	టీడీపీ హయాంలో	ప్రస్తుతం
పరిధిలోకి వచ్చే లబ్ధిదారులు	కేవలం తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలు	తెల్లరేషన్ కార్డు కలిగిన కుటుంబాలతో పాటు, రూ.5లక్షల లోపు ఆదాయం ఉన్న మధ్య తరగతి కుటుంబాలు (1.42 కోట్లకు పైగా కుటుంబాలకు ప్రస్తుతం వర్తింపు)
హెల్త్ కార్డు జారీకి టైమ్‌లైన్	ఉండేది కాదు	దరఖాస్తు చేసుకున్న 20 రోజుల్లో దరఖాస్తుదారుడి గుమ్మం వద్దకే స్మార్ట్ హెల్త్ కార్డు
ప్రొసీజర్స్	1,059	3,257
నెట్‌వర్క్ ఆస్పత్రులు	919	2,275
ఇతర రాష్ట్రాల్లో సేవలు	72 ఆస్పత్రుల్లో పీడియాట్రిక్ కార్డియాక్, క్యాన్సర్ కేర్ సేవలు	204 ఆస్పత్రుల్లో 17 సూపర్ స్పెషాలిటీల్లో వైద్య సేవలు
రోజుకు చికిత్స పొందే వ్యక్తులు	1,570	3,300
ప్రీ ఆథరైజేషన్‌కు సగటు సమయం	మూడు రోజుల వరకూ	24 గంటల్లోపు
క్లైమ్ ప్రాసెసింగ్‌కు సగటు సమయం	60 రోజులు పైనే	21 రోజుల్లోపు
ఖరీదైన ప్రొసీజర్స్	ఒక చెవికి కాక్లియర్, గుండె మార్పిడి	2 చెవులకు కాక్లియర్ ఇంప్లాంటేషన్, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి ఖరీదైన ప్రొసీజర్స్.. వైద్య ఖర్చుతో సంబంధం లేకుండా కాంప్రహెన్సివ్ క్యాన్సర్ కేర్ సేవలు

మా బాబు మాట్లాడుతున్నాడు..



ఐదేళ్ల వయసున్న మా బాబుకు పుట్టుకతోనే వినికిడి లోపం ఉంది. రూ.లక్షలు ఖర్చు చేసి శస్త్ర చికిత్స చేయించే స్తోమత మాకు లేదు. ఆరోగ్యశ్రీ పథకం కింద కడప ఆస్పత్రిలో కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీ ఉచితంగా చేశారు. రూ.10 లక్షలకు పైగా విలువైన సర్జరీని రూపాయి ఖర్చు లేకుండా చేశారు. ఈరోజు మా బాబు మాట్లాడటం చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉంది. సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

– వెంకటేశ్వర్లు, రేవతి, రాజంపేట, అన్నమయ్య జిల్లా

క్యాన్సర్‌కు ఉచితంగా చికిత్స



2020లో అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరగా బ్లాడర్ క్యాన్సర్‌గా నిర్ధారించారు. చికిత్సకు రూ.3 లక్షలకు పైనే ఖర్చవుతుందని ప్రైవేట్ ఆస్పత్రిలో చెప్పారు. ఆరోగ్యశ్రీ కింద క్యాన్సర్ చికిత్స అందించే ఆస్పత్రికి వెళ్లడంతో రూపాయి ఖర్చు లేకుండా కీమోథెరపీ, రేడియో థెరపీతో రెండు చికిత్సలు అందించి మందులు కూడా ఉచితంగా ఇచ్చారు. ఆసరా కింద ప్రభుత్వం రూ.ఏడు వేలు అందించింది. క్యాన్సర్ చికిత్స ఖర్చు తలచుకుని ఎంతో ఎంతో భయపడ్డా. రూపాయి ఖర్చు లేకుండా వైద్యం అందటాన్ని నమ్మలేకపోతున్నా.

– మారెన్న, బూదేడు గ్రామం, అనంతపురం జిల్లా

ఆలస్యం లేకుండా వైద్యం



భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేసే నాకు ఇటీవల గుండె పోటు రావడంతో కుటుంబ సభ్యులు కర్నూలులోని మెడికవర్ ఆసుపత్రిలో చేర్చారు. అదేరోజు వెంటనే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా బైపాస్ సర్జరీ చేశారు. డిశ్చార్జ్ అయ్యాక ఇంట్లో విశ్రాంతి తీసుకునే సమయంలో రూ.9,500 నా ఖాతాలో జమ అయింది. ఈ డబ్బులతో ప్రస్తుతం నా కుటుంబం జీవనం సాగిస్తోంది.

– మండల ఆంజనేయులు, ఆదోని, కర్నూలు జిల్లా

అత్యధిక ప్రాధాన్యం



ఆరోగ్యశ్రీ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. గ్రీన్ చానల్‌లో నెట్‌వర్క్ ఆస్పత్రులకు వేగంగా బిల్లులు చెల్లిస్తున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఏమాత్రం రాజీపడకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చర్యలు తీసుకున్నారు. ప్రొసీజర్ల సంఖ్యను భారీగా పెంచడంతో ప్రజలకు వైద్య ఖర్చుల భారం తగ్గింది.

– డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, ఏపీ ఆరోగ్యశ్రీ ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ అధ్యక్షుడు

క్లుప్తంగా...

కపర్థి థియేటర్‌ను ధ్వంసం చేసింది పవన్ అభిమానులే

• నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని కపర్థి థియేటర్‌ను ధ్వంసం చేసింది పవన్‌కళ్యాణ్ అభిమానులేనని నార్త్‌జోన్ ఏసీపీ సీహెచ్ రవికాంత్ తెలిపారు. సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్‌లో టాస్క్‌ఫోర్ ఏడీసీపీ రమణమూర్తితో కలసి ఆయన ఆదివారం మీడియాకు వివరాలు వెల్లడించారు. గత నెల 30వ తేదీ రాత్రి నగరంలోని కపర్థి థియేటర్‌లో పవన్‌కళ్యాణ్ నటించిన తొలిప్రేమ సినిమాను ప్రదర్శించారు. రెండో ఆట మొదలయ్యాక కొంతమంది పవన్ అభిమానులు స్క్రీన్‌ను చింపివేసి, కుర్చీలు, అద్దాలు పగులగొట్టి నానా హంగామా సృష్టించారు. థియేటర్ మేనేజర్ ఫిర్యాదు మేరకు ఎస్ఎన్‌పురం పోలీసులు కేసు నమోదు చేశారు. మూడు ప్రత్యేక బృందాలు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా థియేటర్‌లో విధ్వంసం సృష్టించింది మొగల్‌రాజపురానికి చెందిన గోలి సాయి, సీతారామపురానికి చెందిన కోడూరు మణీంద్ర, విశాలాంధ్రరోడ్డుకు చెందిన దేశం లక్ష్మీనరసింహా, దురిశెట్టి వెంకట్, మొగల్‌రాజపురానికి చెందిన కోచెర్ల ప్రసాద్, గులాబీతోటకు చెందిన పిన్నిశెట్టి గణేష్, మొగల్‌రాజపురానికి చెందిన మైలపల్లి సురేష్‌గా గుర్తించి అరెస్ట్ చేశారు. థియేటర్ ధ్వంసంలో రాజకీయకోణం, ఎవరి ప్రోద్బలం లేవని ఏసీపీ తెలిపారు.

టీడీపీ నేతకు రూ.10 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్

నర్సీపట్నం(అనకాపల్లి జిల్లా): టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న ఆ పార్టీ మాజీ కౌన్సిలర్ రెడ్డి అప్పలనాయుడు కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచింది. అప్పలనాయుడు నర్సీపట్నం మున్సిపాలిటీ మొదటి పాలకవర్గంలో కౌన్సిలర్‌గా పనిచేసి, గత మున్సిపల్ ఎన్నికల్లో మరోసారి పోటీ చేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మాకిరెడ్డి బుల్లిదొర చేతిలో ఓడిపోయారు. లివర్ వ్యాధి బారిన పడిన అప్పలనాయుడుకు అతడి భార్య లోవ కుమారి లివర్ దానం చేయడంతో ఇటీవల లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్నారు. టీడీపీకి చెందిన వీరికి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అండగా నిలిచారు. సీఎం సహాయ నిధి నుంచి ఆయనకు రూ.7 లక్షలు, ఆమెకు రూ.3 లక్షలు.. మొత్తం రూ.10 లక్షల చెక్కును ఎమ్మెల్యే ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ రాజకీయాలకతీతంగా అందరికీ అండగా నిలుస్తున్నారని కొనియాడారు. సీఎం వైఎస్ జగన్‌కు, ఎమ్మెల్యే గణేష్‌కు రుణపడి ఉంటామని అప్పలనాయుడు చెప్పారు. వీరితో పాటు కొత్తూరు శేషుబాబు, పి.సునీతకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం అందించారు.


అధికారంలోకి వస్తే బీసీలను ఆదుకుంటాం: నారా లోకేశ్

నెల్లూరు రూరల్: టీడీపీ అధికారంలోకి వస్తే బీసీలను ఆదుకుంటామని టీడీపీ నేత నారా లోకేశ్ అన్నారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లూరు రూరల్ పరిధిలోని కాకుపల్లి వద్ద నుంచి ఆదివారం సాయంత్రం యువగళం పాదయాత్రను ఆయన ప్రారంభించారు. మార్గ మధ్యలో వడ్డిపాళెం వద్ద పలువురు బీసీ నేతలు ఆయనను కలిసి బీసీల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. లోకేశ్ స్పందిస్తూ టీడీపీ అధికారంలోకి వచ్చినట్లయితే బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తామన్నారు.

'ఉమ్మడి పౌరస్మృతి రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం'

సాక్షి, అమరావతి: ఉమ్మడి పౌరస్మృతి భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఇండియన్ దళిత క్రిస్టియన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు పెరికె వరప్రసాదరావు ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇది దొడ్డిదారిన మరో రాజ్యాంగం ఏర్పాటుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ చేస్తున్న కుట్ర అని ఆరోపించారు. ఉమ్మడి పౌరస్మృతి తెస్తే క్రైస్తవులు, ముస్లింలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలు తమ ప్రయోజనాలు కోల్పోతారన్నారు.

ఎస్ఆర్ఎం పబ్లిక్ స్కూల్, స్పేస్ కిడ్స్ ఇండియా ఎంవోయూ



సాక్షి, చెన్నై: విద్యార్థులతో ఉపగ్రహాన్ని తయారుచేయించి అంతరిక్షంలోకి పంపేందుకు గుడువంచేరిలోని ఎస్ఆర్ఎం పబ్లిక్ స్కూల్.. స్పేస్ కిడ్స్ ఇండియాతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల సలహాదారు డాక్టర్ కె.ఆర్.మాలతి మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్సు మీద, అంతరిక్షం మీద మరింత ఆసక్తి పెంచేందుకు ఈ ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. స్పేస్ కిడ్స్ ఇండియా వ్యవస్థాపకురాలు, సీఈవో డాక్టర్ కేసన్ మాట్లాడుతూ ఈ పాఠశాలలో ఎనిమిది నుంచి పదోతరగతి వరకు 15 మంది విద్యార్థులను ఎంపికచేసి శిక్షణ ఇస్తామని చెప్పారు అనంతరం వారు రూపొందించిన ఉపగ్రహాన్ని ఇస్రో సహకారంతో శ్రీహరికోట నుంచి రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎం పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ ఎం.సుబ్రమణియన్, ప్రిన్సిపల్ భువనేశ్వరి పాల్గొన్నారు.

రాష్ట్రంలో బొమ్మల కొలువు

ఏపీలో టాయ్ మ్యూజియం ఏర్పాటుకు చర్యలు

- సమగ్ర ప్రాజెక్టు రిపోర్టును సిద్ధం చేస్తున్న పురావస్తు శాఖ
- విజయనగరంలో సుమారు రూ.15 కోట్లతో నిర్మాణానికి ప్రతిపాదన
- సుమారు లక్ష నుంచి 2 లక్షల వరకు బొమ్మల ప్రదర్శన
- దేశవ్యాప్తంగా అనేక రకాల బొమ్మల సేకరణ
- జాతీయ, స్థానిక సంస్కృతికి అద్దం పట్టేలా చర్యలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో టాయ్ (బొమ్మల) మ్యూజియం కొలువుదీరనుంది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన సంస్కృతి, సంప్రదాయాలు, నైపుణ్యాన్ని ప్రతిబింబించే బొమ్మలను ఇందులో ప్రదర్శించనున్నారు. చిన్నారుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన విజ్ఞానాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం టాయ్ మ్యూజియాలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు మూడేళ్ల కిందట తొలి దశలో గుజరాత్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌ల్లో ప్రతిపాదించింది. అయితే కరోనా మహమ్మారి కారణంగా ఈ ప్రాజెక్టు ఆలస్యమైంది. రెండేళ్ల క్రితం గుజరాత్‌లో తొలి బొమ్మల మ్యూజియం పనులు ప్రారంభమయ్యాయి. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో రూ.15 కోట్ల అంచనా వ్యయంతో విజయనగరంలో బొమ్మల మ్యూజియాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధమవుతోంది. ఇప్పటికే పురావస్తు, ప్రదర్శనశాలల శాఖ.. సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) తయారు చేసే పనిలో నిమగ్నమైంది.

దేశం నలుమూలల నుంచి..

మన రాష్ట్రంలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలతో పాటు జమ్మూకశ్మీర్ (పేపర్ బొమ్మలు) పంజాబ్ (ఫోక్), రాజస్థాన్ (గుడ్డ, స్టఫ్), గుజరాత్ (ఎర్ర మట్టి), మహారాష్ట్ర (చెక్క, వంట సామగ్రి), కర్ణాటక (చెన్నపట్న బొమ్మలు), తమిళనాడు (తంజావూరు), తెలంగాణ (నిర్మల్), పశ్చిమ బెంగాల్ (నాటుంగ్రాం), మధ్యప్రదేశ్ (తమలపాకుతో చేసేవి), బిహార్ (కన్యాపుత్రి), ఉత్తరప్రదేశ్ (చెక్కబొమ్మలు), అసోం (ఆషారికండి) తదితర సుమారు 50కిపైగా ప్రసిద్ధి చెందిన ప్రాంతాల నుంచి కొబ్బరి పీచు, రబ్బరు, ప్లాస్టిక్, మెటల్, పింగాణీలతో చేసిన కళాకృతులు, బొమ్మలను సేకరించి మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచనున్నారు. ఈ సాంప్రదాయ బొమ్మలతో పాటు నూతన సాంకేతిక విజ్ఞానాన్ని అందించేలా రోబోటిక్, ఎలక్ట్రానిక్ వంటి సుమారు లక్ష నుంచి రెండు లక్షల బొమ్మలను ప్రదర్శించనున్నారు. అంతేకాకుండా మ్యూజియం సందర్శనకు వచ్చే చిన్నారులు ఆడుకునేందుకు ప్రత్యేక గ్యాలరీలను కూడా ఏర్పాటు చేయనున్నారు. జాతీయ, స్థానిక సంస్కృతికి అద్దం పట్టడంతో పాటు శాస్త్రవేత్తలు, కళాకారులు, ప్రముఖ వ్యక్తుల గురించి బొమ్మల మ్యూజియం పరిచయం చేయనుంది. అలాగే పరిశోధన, సంస్కృతి, విజ్ఞాన శాస్త్రాన్ని ప్రోత్సహించనుంది.



గుజరాత్‌లో ప్రపంచంలోనే అతిపెద్దది..

కాగా గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద బొమ్మల మ్యూజియం రూపుదిద్దుకుంటోంది. చిల్డ్రన్స్ యూనివర్సిటీ ఈ ప్రాజెక్ట్ కోసం పనిచేస్తోంది. 30 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.1,500 కోట్ల అంచనా వ్యయంతో రతన్‌పూర్, షాపూర్ గ్రామాల మధ్యలో గిఫ్ట్ సిటీ సమీపంలో 11 లక్షలకు పైగా బొమ్మలతో దీన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో పురాతన కాలం నుంచి ఆధునిక యుగం వరకు అనేక రకాల బొమ్మలను ప్రదర్శించనున్నారు. ఇస్రో–డీఆర్‌డీవో సహాయంతో ఎలక్ట్రానిక్, బ్యాటరీ, సౌర ఆధారిత చిన్న అంతరిక్ష నౌక, పృథ్వీ, అగ్ని క్షిపణులు, ఉపగ్రహాల సాంకేతిక విజ్ఞానంపై అవగాహన కల్పించేలా బొమ్మలను తయారు చేయనున్నారు. ఇప్పటివరకు అమెరికాకు చెందిన మిస్సోరీ రాష్ట్రంలోని బ్రాన్సన్ టాయ్ మ్యూజియం 10 లక్షల బొమ్మలతో అతిపెద్ద మ్యూజియంగా గుర్తింపు పొందింది. ఇందులో మోడల్ రైళ్లు, విమానాలు, కార్లు, సూపర్ హీరో, డిస్నీ వరల్డ్ వంటి బొమ్మలు 1800 సంవత్సరం నుంచి తాజా టెక్నాలజీ వరకు ఉన్నాయి.

వారసత్వ, విజ్ఞాన, పరిశోధన కేంద్రంగా..



బొమ్మల మ్యూజియం చారిత్రక, వారసత్వ విజ్ఞానాన్ని భద్రపరుస్తుంది. సందర్శకులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకోవచ్చు. విద్యార్థులకు విజ్ఞానం, పరిశోధకులకు రీసెర్చ్ సెంటర్‌గా ఎంతో ఉపయోగపడుతుంది. విజయనగరంలో స్థలం అందుబాటులో ఉండటంతో బొమ్మల మ్యూజియాన్ని అక్కడ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించాం. త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి డీపీఆర్‌ను పంపించి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం చారిత్రక సంపదను కాపాడటంలో విశేష కృషి చేస్తోంది. అందుకే జిల్లాల్లో మ్యూజియాలను అభివృద్ధి చేస్తున్నాం.

– జి.వాణీమోహన్, కమిషనర్, పురావస్తు–ప్రదర్శనశాలల శాఖ

భవిష్యత్తు తరాలకు అందించడానికే..



భారతదేశం గొప్ప కళలకు ప్రసిద్ధి చెందింది. వాటిని మన భవిష్యత్తు తరాలకు అందించడమే టాయ్ మ్యూజియాల లక్ష్యం. అందుకే దేశ వ్యాప్తంగా రకరకాల బొమ్మలను సేకరించి ఇందులో ప్రదర్శిస్తాం. ఈ మ్యూజియాలే పెద్ద వర్క్‌షాపు సెంటర్లుగా మారనున్నాయి. బాల్యంలో స్నేహితులతో కలిసి బొమ్మలతో ఆడుకుంటే చిన్నారుల్లో మానసిక ఎదుగుదలతో పాటు సామాజిక స్పృహ, సృజనాత్మకత పెరుగుతుంది. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవు. టాయ్ మ్యూజియం ద్వారా కొంత వరకు దీన్ని అధిగమించవచ్చు.

– రజత్‌భార్గవ, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్‌డే చరిత్రాత్మకం

- సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక ఉత్తర్వులు ఇచ్చారు
- దీంతో ఎక్కడి సమస్యలకు అక్కడే పరిష్కారం
- గతంలో ఏ ప్రభుత్వం ఇలా చేయలేదు
- ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు



కాకినాడ సిటీ: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం గ్రీవెన్స్‌డే నిర్వహించడం చరిత్రాత్మకమని ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారని కొనియాడారు. కాకినాడ రెవెన్యూ భవన్‌లో ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీ జేఏసీ అమరావతి ఉద్యోగ సంఘ ప్రతినిధుల అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొప్పరాజు మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ డే నిర్వహించాలని జీవో ఇచ్చిన చరిత్ర గతంలో ఎప్పుడూ లేదన్నారు. గ్రీవెన్స్ డే వల్ల ఉద్యోగుల సమస్యలు సంబంధిత విభాగాధిపతికి, జిల్లా కలెక్టర్‌కు నేరుగా తెలియడంతో అక్కడికక్కడే పరిష్కరించేందుకు వీలుంటుందని చెప్పారు. గ్రీవెన్స్ డే ప్రవేశపెట్టి.. ఉద్యోగులకు మనోధైర్యం కల్పించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. గత నెల 23, 27, 30 తేదీల్లో గ్రీవెన్స్ డేను 70కి పైగా శాఖలు నిర్వహించాయని తెలిపారు. దీనివల్ల అనేక సమస్యలు పరిష్కారమవుతున్నాయని వెల్లడించారు. జిల్లా కలెక్టర్లు ప్రతి నెలా మూడో శుక్రవారం ఉద్యోగ సంఘాల నాయకులతో గ్రీవెన్స్ డే నిర్వహిస్తే చాలా సమస్యలు జిల్లా స్థాయిలోనే పరిష్కారమవుతాయన్నారు. ఉద్యోగుల అనేక సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించిందని తెలిపారు. టీఏ, డీఏలు, డీఆర్, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, సీపీఎస్ రద్దు తదితర సమస్యలపై అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని ప్రభుత్వం సూచించిందన్నారు. తమ 37 సమస్యలను ఒకే కేబినెట్ సమావేశంలో ప్రభుత్వం పరిష్కరించిందని కొనియాడారు. ఏపీ జేఏసీ అమరావతి కాకినాడ జిల్లా అధ్యక్షుడు పితాని త్రినాథరావు, రాష్ట్ర కార్యదర్శి పి.దామోదర్, అసోసియేట్ చైర్మన్ టీవీ ఫణి పేర్రాజు, కో చైర్మన్ సంసాని శ్రీనివాసరావు, రాష్ట్ర క్లాస్–4 ఎంప్లాయిస్ సంఘం అధ్యక్షుడు మల్లేశ్వరరావు, వీఆర్వోల సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.సాంబశివరావు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీపై బహిరంగ చర్చకు సిద్ధమా?

- ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టింది ఎవరు.. ఆ పేరు మీరు చెప్పగలరా?
- మీ ప్రభుత్వంలో ఎన్ని ఆరోగ్యశ్రీ ప్రొసీజర్లు పెంచారో సమాధానం ఇవ్వగలరా?
- రూ.631 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలను మిగిల్చింది మీరు కాదా?
- మీకు దమ్ముంటే నా ప్రశ్నలకు సమాధానం ఇవ్వండి
- చంద్రబాబు, లోకేశ్‌లకు మంత్రి విడదల రజిని సవాల్



గుంటూరు మెడికల్: ఆరోగ్యశ్రీ పథకంపై బహిరంగ చర్చకు సిద్ధమా.. అని టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు నారా లోకేశ్‌లకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని సవాల్ విసిరారు. గుంటూరులో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు, లోకేశ్ పదేపదే ఆరోగ్యశ్రీపై అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆరోగ్యశ్రీ ద్వారా లక్షలాది మంది నిరుపేదలు అత్యుత్తమ వైద్యం పొందుతున్నారని, ఇది తట్టుకోలేని తండ్రీకొడుకులు అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నారని నిప్పులు చెరిగారు. ఆరోగ్యశ్రీని పూర్తిగా వెంటిలేటర్ పైకి చేర్చింది చంద్రబాబేనని ఆరోపించారు. 14 ఏళ్లకు పైగా సీఎంగా ఉన్న ఆయన ఆరోగ్యశ్రీ లాంటి ఒక పథకాన్ని తీసుకురావాలనే కనీస ఆలోచనే చేయలేకపోయారన్నారు. చంద్రబాబుకు దమ్ముంటే ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టిన నాయకుడి పేరు చెప్పగలరా అని నిలదీశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో పదిలమైన స్థానాన్ని పొందారని తాము గర్వంగా చెప్పగలమని అన్నారు.

టీడీపీ బకాయిలూ మేమే చెల్లించాం..

లోకేశ్‌కు దమ్ముంటే టీడీపీ పాలనలో ఆరోగ్యశ్రీ ప్రొసీజర్లు ఎన్ని పెంచారో చెప్పాలని మంత్రి రజిని డిమాండ్ చేశారు. టీడీపీ ప్రభుత్వం ఆస్పత్రులకు పెట్టిన రూ.631 కోట్ల బకాయిలను కూడా తామే చెల్లించామన్నారు. టీడీపీ హయాంలో కేవలం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి మాత్రమే ఆరోగ్యశ్రీ సేవలు అందాయని గుర్తు చేశారు. జగనన్న అధికారంలోకి వచ్చిన వెంటనే వార్షిక ఆదాయం రూ.5లక్షల లోపు ఉన్న కుటుంబాలన్నింటికీ ఆరోగ్యశ్రీ అందేలా చేశారన్నారు. ఈ ఒక్క నిర్ణయం వల్ల రాష్ట్రంలో 85 శాతానికిపైగా... అంటే 1.42 కోట్ల కుటుంబాలు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యం పొందుతున్నాయని వెల్లడించారు. టీడీపీ ప్రభుత్వంలో కేవలం 919 ఆస్పత్రుల్లో మాత్రమే ఆరోగ్యశ్రీ సేవలు అందేవని మంత్రి గుర్తు చేశారు. రోజుకు కేవలం సగటున 1,570 మందికి మాత్రమే సేవలు అందేవన్నారు. అది కూడా 1,057 ప్రొసీజర్లకు మాత్రమే చికిత్స అందించారన్నారు. ఏడాదికి సగటున రూ.వెయ్యికోట్ల వరకు మాత్రమే ఖర్చు చేశారని విమర్శించారు. ఆ నిధులను కూడా ఆస్పత్రులకు అరకొరగా అందజేశారన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక ఆరోగ్యశ్రీ కింద చికిత్స అందించే ఆస్పత్రుల సంఖ్యను 2,275కు పెంచారని, రోజుకు సగటున ఏకంగా 3,400 మంది ఇప్పుడు రాష్ట్రంలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద ఈ ఒక్క ఏడాదే రూ.3,400 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఇక ఆరోగ్యశ్రీ ప్రొసీజర్లను ఏకంగా 3,257కు పెంచామన్నారు. ఈ నాలుగేళ్లలో 36 లక్షల మందికిపైగా రోగులకు ఉచితంగా వైద్య చికిత్స అందించామన్నారు. రూ.10,100 కోట్లు ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా ఖర్చు చేశామని వివరించారు. ఆరోగ్య ఆసరా కింద ఇప్పటివరకు రూ.1,074.69 కోట్లను బాధితులకు ప్రభుత్వం అందజేసిందన్నారు. ఈ పథకం కింద ఇప్పటివరకు 20,43,036 కేసులకు జీవనభృతి అందిందని తెలిపారు.

నారాయణ కళాశాలలో హౌస్‌సర్జన్ ఆత్మహత్య

భర్త వేధింపులే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ



మృతిచెందిన చైతన్య

నెల్లూరు రూరల్: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లూరు రూరల్ పరిధిలోని చింతారెడ్డిపాళెంలో ఉన్న నారాయణ వైద్య కళాశాలలో ఓ హౌస్‌సర్జన్ తన రూమ్‌లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి జరిగింది. నెల్లూరు రూరల్ పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యుల కథనం.. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన చైతన్య(24) నారాయణ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతోంది. మూడు నెలల కిందట శ్రీకాకుళం జిల్లాకు చెందిన శరత్‌చంద్రతో ఆమెకు వివాహమైంది. శరత్‌చంద్ర విజయనగరంలోని వైద్య కళాశాలలో ఆర్థో విభాగంలో పీజీ చదువుతున్నాడు. పెళ్లయిన నాటి నుంచి చైతన్యను భర్త వేధింపులకు గురిచేసేవాడని, నగదు, కారు ఇవ్వాల్సిందిగా ఒత్తిడి తెస్తుండేవాడని తెలుస్తోంది. భర్త నుంచి వేధింపులు అధికం కావడంతో మనస్తాపం చెందిన చైతన్య రూమ్‌లో తన చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. చైతన్యకు తల్లి జ్యోతికుమారి ఫోన్ చేయగా ఎంతకీ లిఫ్ట్ చేయకపోవడంతో హాస్టల్ వార్డెన్‌కు కాల్ చేసింది. హాస్టల్ సిబ్బంది చైతన్య గది వద్దకు వెళ్లి రూమ్ తలుపులు పగులగొట్టి చూడగా చైతన్య మృతదేహం ఫ్యాన్‌కు వేలాడుతూ ఉంది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంబేడ్కర్ ఆశయాలను ఏపీలో నిజం చేస్తున్నారు

సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి



కంచిలి: ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్యను ప్రవేశపెట్టి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను నిజం చేస్తున్నారని ప్రముఖ సినీనటుడు ఆర్.నారాయణమూర్తి అన్నారు. శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం బూరగాం గ్రామంలో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదలకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని అభినందించారు. కేంద్రంలోని బీజేపీ పాలకులు ప్రభుత్వ రంగ సంస్థలైన రోడ్లు, రైల్వేలు, విమాన సర్వీసులు, ఎల్ఐసీ, బ్యాంకింగ్ తదితర సెక్టార్లను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమని దుయ్యబట్టారు. చివరికి ఎన్నో ఉద్యమాలు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కూడా ప్రైవేటీకరణ చేయడానికి ఉపక్రమించడం దారుణమని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రజాకవి, సినీ గేయ రచయిత జయరాజు, విశ్రాంత ఐఏఎస్ పి.ఎస్.ఎన్. మూర్తి పాల్గొన్నారు.

నిరాశలో చంద్రబాబు

టైమ్స్ నౌ-నవభారత్ సర్వే ఎఫెక్ట్..

- ఆ ఫ్రస్టేషన్‌తోనే లోకేశ్ పిచ్చికూతలు
- వ్యవసాయశాఖ మంత్రి కాకాణి



నెల్లూరు (దర్గామిట్ట): టైమ్స్ నౌ, నవభారత్ సర్వేల్లో వైఎస్సార్‌సీపీ విజయదుందుభి మోగిస్తుందని ప్రకటించడంతో రాష్ట్రంలో టీడీపీ బలం బహిర్గతమైందని, చంద్రబాబు తీవ్ర నిరాశ, నిస్పృహల్లోకి వెళ్లిపోయారని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. లోకేశ్‌ను వదిలేసి చంద్రబాబు తన దత్తపుత్రుడిపై ఆశలు పెట్టుకున్నారని.. ఆ ఫ్రస్టేషన్‌లో లోకేశ్ పిచ్చికూతలు కూస్తున్నాడని, తండ్రిపై కోపాన్ని వైఎస్సార్‌సీపీ నేతలపై చూపుతున్నాడని ఆరోపించారు. అసలు లోకేశ్ పాదయాత్రను చంద్రబాబే లైట్‌గా తీసుకున్నారని.. దీంతో లోకేశ్ అభద్రతా భావంతో ఉన్నాడన్నారు. తన తాతకే వెన్నుపోటు పొడిచిన తండ్రికి తాను ఓ లెక్కా అని లోకేశ్ భయపడుతున్నట్లు అనిపిస్తోందన్నారు. తనకు ప్రజాదరణ లేదు కాబట్టే చంద్రబాబు దత్తపుత్రుడిపై ఆశలు పెట్టుకున్నాడన్న భయం లోకేశ్‌లో కనిపిస్తోందని చెప్పారు. దత్తపుత్రుడి సభలకు ప్రత్యక్ష ప్రసారాలు ఇవ్వాలని అనుకూల మీడియాకు చంద్రబాబు ఆదేశాలిస్తూ కొడుకును పట్టించుకోవడం లేదన్నారు. దీంతో.. ఏదో ఒకటి మాట్లాడితే మీడియాలో చూపిస్తారనే లోకేశ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నాడన్నారు.

ఇతర ప్రాంతాల నుంచి తరలింపు..

సర్వేపల్లి నియోజకవర్గంలో పాదయాత్రకు ఇతర నియోజకవర్గాల నుంచి జనాన్ని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని మంత్రి ఎద్దేవా చేశారు. కోట్లాది రూపాయల పసుపు కుంభకోణంలో ఇరుక్కున్న టీడీపీ నేతలు తప్పించుకోగా అధికారులు మాత్రమే బలయ్యారని ఆయన గుర్తుచేశారు. నాన్ ఫిషర్‌మ్యాన్ ప్యాకేజ్ కోర్టు వారికి సంబంధంలేదని.. కోర్టువారితో ఇప్పిస్తానని లోకేశ్ చెప్పడం ఆయన అవగాహనారాహిత్యమన్నారు. మత్స్యకారులు నిలదీస్తారనే వారితో సమావేశాన్ని రద్దుచేశారన్నారు. నాన్ ఫిషర్‌మ్యాన్ ప్యాకేజ్‌నువైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాకే అందించామని కాకాణి గుర్తుచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో ఏవైనా సమస్యలుంటే 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా వాటిని పరిష్కరిస్తున్నామని తెలిపారు. అలాగే, ముఖ్యమంత్రి సుపరిపాలనను చూసిన ప్రజలు.. చంద్రబాబును మరోసారి తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

కరకట్ట సాక్షిగా క్విడ్ ప్రో కో

▶ మొదటి పేజీ తరువాయి

న్యాయస్థానం పేర్కొంది. క్విడ్‌ప్రోకో అభియోగాలను కొట్టివేసేందుకు ఎలాంటి ఆధారాలు లేవని విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానం స్పష్టం చేసింది. చంద్రబాబు కరకట్ట నివాసం, నారాయణకు అమరావతిలో ఉన్న ప్లాట్లు, కౌలు, బ్యాంకులో ఉన్న నిధుల అటాచ్‌మెంట్‌కు అనుమతినిస్తూ తాజాగా ఇచ్చిన ఉత్తర్వులలో న్యాయస్థానం కీలక అంశాలను వెల్లడించింది. ఈ కుంభకోణంలో చంద్రబాబు, నారాయణ అంతా తామై నడిపిన వ్యవహారంపై తీవ్ర వ్యాఖ్యలు చేయడం ఆసక్తికరంగా మారింది.

అంతా ఏ–1 చంద్రబాబే

అమరావతి మాస్టర్‌ప్లాన్, ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ అంతా నాటి సీఎం, ఈ కేసులో ఏ–1 చంద్రబాబు కనుసన్నల్లోనే సాగింది. అమరావతిని రాజధానిగా ఎంపిక చేసిన సమయంలో సీఆర్‌డీఏ ఎక్స్ అఫీషియో చైర్మన్‌గా వ్యవహరించిన చంద్రబాబుకు మాస్టర్‌ప్లాన్ గురించి మొత్తం ముందే తెలుసని న్యాయస్థానం స్పష్టం చేసింది. మాస్టర్‌ప్లాన్‌పై తుది నిర్ణయం తీసుకుంది చంద్రబాబే అని పేర్కొంది. రాజధాని ఎంపిక, ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారు ప్రక్రియలో ఆయనకు పూర్తి భాగస్వామ్యం ఉందని తేల్చిచెప్పింది.

అలైన్‌మెంట్ మూడుసార్లు మార్పు

ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పుల ద్వారా లింగమనేని రమేశ్ కుటుంబంతో చంద్రబాబు, నారాయణ క్విడ్‌ప్రోకోకు పాల్పడటంపై న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. టీడీపీ ప్రభుత్వంలో ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మూడుసార్లు మార్చారనేందుకు ప్రాథమిక ఆధారాలున్నాయని స్పష్టంచేసింది. 2015 జూలై 22, 2017 ఏప్రిల్ 4, 2018 అక్టోబరు 31న ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు చేశారని న్యాయస్థానం వెల్లడించింది. కాగా, ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చడం ద్వారా లింగమనేని కుటుంబానికి టీడీపీ ప్రభుత్వం ప్రయోజనం కల్పించిందన్నది నిర్ధారణ అయ్యింది. ఈ కేసులో ఏ–3గా ఉన్న లింగమనేని రమేశ్ కుటుంబానికి ఇన్నర్‌రింగ్ రోడ్డు తుది అలైన్‌మెంట్‌ను ఆనుకునే 168.45 ఎకరాలు ఉన్నాయని న్యాయస్థానం పేర్కొంది. ఇన్నర్ రింగ్ రోడ్డును నిర్మించారా.. లేదా అన్నదానితో దీనికి సంబంధం లేదని న్యాయస్థానం వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సంతరించుకుంది. లింగమనేని కుటుంబానికిప్రయోజనం కల్పించే రీతిలోనే అలైన్‌మెంట్‌ను ఖరారు చేసినట్లు న్యాయస్థానం వ్యాఖ్యల ద్వారా తేటతెల్లమైంది. టీడీపీ 2019లో అధికారంలోకి వచ్చి ఉంటే అదే అలైన్‌మెంట్ ప్రకారం ఇన్నర్‌రింగ్ రోడ్డును నిర్మించి లింగమనేని కుటుంబానికి భారీగా లబ్ధి కలిగించేదన్నది స్పష్టం.

కరకట్ట కట్టడం.. క్విడ్‌ప్రోకో కిందే

చంద్రబాబు ఉంటున్న కరకట్ట నివాసాన్ని నిబంధనలకు విరుద్ధంగా కృష్ణానది భూముల్లో నిర్మించారని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఏ–3గా ఉన్న లింగమనేని రమేశ్ ఆ ఇంటికి టైటిల్‌దారుగా ఉన్నప్పటికీ చంద్రబాబు ఏడేళ్లుగా నివసిస్తున్న విషయాన్ని ప్రస్తావించింది. సీఎం హోదాలోనూ, ప్రతిపక్ష నేత హోదాలోనూ అదే నివాసంలో చంద్రబాబు నివసిస్తున్నారు. ఆ నివాసం గురించి ప్రభుత్వంతో లింగమనేని అధికారికంగా ఎలాంటి వ్యవహారాలు నెరపలేదని న్యాయస్థానం వెల్లడించడం గమనార్హం. అంటే ఆ నివాసాన్ని లింగమనేని రమేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వలేదన్నది స్పష్టం. కరకట్ట నివాసాన్ని లింగమనేని రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చారంటూ టీడీపీ చేస్తున్న వాదన పూర్తిగా అవాస్తవం అని దీంతో తేలిపోయింది. ఆ నివాసాన్ని చంద్రబాబుకు లింగమనేని రమేశ్ వ్యక్తిగతంగానే ఇచ్చారు. రాజధాని మాస్టర్‌ప్లాన్, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లలో కుంభకోణం ద్వారా భారీగా ప్రయోజనం కల్పించినందున క్విడ్ ప్రోకోలో భాగంగానే కరకట్ట నివాసాన్ని చంద్రబాబుకు ఇచ్చినట్టు స్పష్టమవుతోంది.

హెరిటేజ్ భూముల లావాదేవీలు గోప్యం

లింగమనేని కుటుంబం నుంచి హెరిటేజ్ ఫుడ్స్ కొనుగోలు చేస్తున్నట్టు చూపిస్తున్న భూముల బాగోతమూ బట్టబయలైంది. చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ సంస్థకు లింగమనేని కుటుంబం భూములు అమ్మినట్టు ఎలాంటి లావాదేవీలను చూపించలేదని న్యాయస్థానం పేర్కొంది. రాజధానిలో లింగమనేని కుటుంబం నుంచి హెరిటేజ్ ఫుడ్స్ కొన్న భూములకు సంబంధించి లావాదేవీలను చంద్రబాబు వెల్లడించలేదని వ్యాఖ్యానించింది.

లోకేశ్‌ది కీలక పాత్రే...

క్విడ్ ప్రోకో కింద అమరావతిలో లింగమనేని కుటుంబం భూములను హెరిటేజ్‌కు బదలాయించడంలో లోకేశ్ కీలక పాత్ర పోషించారన్నది బట్టబయలైంది. లింగమనేని కుటుంబం నుంచి భూములు తీసుకునేందుకు హెరిటేజ్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో తీర్మానించారు. హెరిటేజ్ డైరెక్టర్‌గా లోకేశ్ ఆ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మంత్రిగా ఉంటూ చంద్రబాబుతో కరకట్ట నివాసంలోనే నివసించారు. అంటే లింగమనేని కుటుంబానికి భారీగా ప్రయోజనం కల్పించి క్విడ్ ప్రోకో కింద హెరిటేజ్ భూములు, కరకట్ట నివాసాన్ని సొంతం చేసుకోవడంలోనూ లోకేశ్ క్రియాశీల పాత్ర పోషించారన్నది స్పష్టమైంది.

కథ నడిపిన ఏ-2 నారాయణ

అమరావతి మాస్టర్‌ప్లాన్, ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పుల ద్వారా నారాయణ కుటుంబం నిబంధనలకు విరుద్ధంగా ప్రయోజనం పొందినట్లు స్పష్టమైంది. మాస్టర్‌ప్లాన్, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పుల వ్యవహారాలన్నీ నారాయణకు పూర్తిగా తెలుసని, అంతా ఆయన ఆధ్వర్యంలోనే సాగిందని న్యాయస్థానం వెల్లడించింది. నారాయణ కుటుంబ సభ్యులు, సమీప బంధువులు సీడ్ క్యాపిటల్‌లో భూములు కొనుగోలు చేశారనడానికి ప్రాథమిక ఆధారాలున్నాయని తెలిపింది. వారు తన కుటుంబ సభ్యులు, బంధువులు అనే విషయాన్ని నారాయణ గోప్యంగా ఉంచారని వ్యాఖ్యానించడం గమనార్హం. తద్వారా సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో కొనుగోలు చేసిన భూములు సీఆర్‌డీఏకే భూసమీకరణ కింద ఇచ్చి 75,888 చ.గజాల ప్లాట్లు పొందారని తెలిపింది. ఆ భూములపై కౌలు కింద రూ.1.92కోట్లు కూడా పొందారని పేర్కొంది.

అంతా క్విడ్ ప్రోకోనే..

అమరావతి మాస్టర్‌ప్లాన్, ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పుల ద్వారా చంద్రబాబు, నారాయణ.. లింగమనేని రమేశ్‌తో క్విడ్‌ప్రోకోకు పాల్పడ్డారనడానికి ప్రాథమిక ఆధారాలున్నాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ కేసులో క్విడ్‌ప్రోకోకు పాల్పడలేదంటూ లింగమనేని రమేశ్ చేసిన వాదనను తోసిపుచ్చింది. ఈ కేసును కొట్టి వేయాలన్న ఆయన వాదనను తిరస్కరించింది. చంద్రబాబు కరకట్ట నివాసం, సీడ్ క్యాపిటల్‌లో నారాయణ కుటుంబ సభ్యులకు కేటాయించిన 75,888 చ.గజాల ప్లాట్లు, కౌలు మొత్తంగా పొందిన రూ.1.92 కోట్లను అటాచ్ చేసేందుకు అనుమతినిచ్చింది.



మన పిల్లల్ని సరైనవాటిని కోరుకొమ్మని బోధించడమే విద్య.

– ప్లేటో

సాక్షి

సోమవారం, 3 జూలై 2023

అవార్డులూ.. బహుమతులూను

'అవార్డులు రావు. కష్టపడి సంపాదించుకోవాలి' అని అబ్బూరి వరద రాజేశ్వరరావు ఒకసారి అన్నారు.

సాహిత్యం, ఆ మాటకొస్తే ఏ కళైనా ప్రచారం కోరుకుంటుంది. ప్రచారం దేనికి? కీర్తి కోసం అనుకునేవారు కొందరు. కళ నిర్వర్తించాల్సిన పరమార్థం కోసం అనుకునేవారు కొందరు. ఉత్కృష్టమైన కళ మబ్బుల చాటు సూరీడు వలే ఎల్లకాలం దాగి ఉండదు. జనులకు తెలిసే తీరుతుంది. ఆదరణ పొందుతుంది. కాని బంగారు చేటకు కూడా గోడచేర్పు అవసరం అన్నట్టు కొన్నిసార్లు కళ ప్రచారం కావడానికి, ఫలానా కళాకారుడి కృషి చూడండహో అని తెలుపడానికి అవార్డులూ, బహుమతులూ ఉపయోగపడతాయి. అయితే కాలక్రమంలో ఇడ్లీ కంటే చట్నీకి విలువెక్కువైనట్టు కళ కంటే ఈ అవార్డులకు విలువ ఎక్కువై అవార్డు వచ్చినవారు 'గొప్పవారేమో' అనే భావన జన సామాన్యులలో ఏర్పడే పరిస్థితి వచ్చింది.

ముళ్లపూడి వెంకటరమణ 'ఎన్ని ఫ్యాన్లున్నా ఒక్క ఏసీకి సమానం కావు గందా' అని ఏదో పాత్ర చేత అనిపిస్తారు. చచ్చు పుచ్చు పుస్తకాలు ఎన్ని రాసినా ఒక సరైన అవార్డు కొడితే తల ఎగరేస్తూ తిరగొచ్చు కదా అనుకునే స్త్రీ పురుష సాహితీకారులు నేడు ఇరు రాష్ట్రాలలో తగు మోతాదులో మేట వేశారనే వాస్తవిక అపోహ ఉంది. జోకులు చలామణీలో ఉన్నాయి. ఒక ప్రఖ్యాత కవికి సరస్వతీదేవి ప్రత్యక్షమై 'వత్సా! కవిత్వం కావలెనా? న్యూఢిల్లీ వారి ఫలానా సాహితీ అవార్డు కావలెనా?' అని అడిగితే ఆ కవి సెకను తొట్రుపడకుండా 'కవిత్వమే దయచేయి తల్లీ! అవార్డును ఎలాగోలా మేనేజ్ చేసుకుంటాను' అన్నాట్ట!

మనుషులంటూ ఉన్న ప్రతిచోటా తప్పులు, పొరపాట్లు ఉన్నట్టే అవార్డు అనే మాట ఉన్న చోటల్లా తప్పులూ, పొరపాట్లూ, రాజకీయాలూ, బానిసలకు వరాలూ ఉంటాయి. సాహిత్యంలో సర్వోన్నతమైనదిగా భావించే నోబెల్ పురస్కారం టాల్‌స్టాయ్‌కి రాలేదు. ఆయనకు కాకుండా ఆ తర్వాత దాదాపు 39 మంది నవలాకారులకు నోబెల్ ఇచ్చారు. వారంతా 'మేము టాల్‌స్టాయ్‌కి వారసులం మొర్రోయ్' అన్నారు. గాంధీకి నోబెల్ శాంతి ఇవ్వలేదుగాని ఆయన ద్వారా స్ఫూర్తి పొందిన మార్టిన్ లూథర్ కింగ్‌కు ఇచ్చారు. చైతన్య స్రవంతికి ఆద్యుడైన జేమ్స్ జాయిస్‌కి నోబెల్ రాలేదు. కథా చక్రవర్తయిన సోమర్‌సెట్ మామ్‌కు ఎందుకివ్వలేదయ్యా అనంటే 'అతడు అక్కరకు మించిన ప్రచారం పొందాడు' అని సాకు చెప్పారు. మన దగ్గర రవీంద్రనాథ్ టాగోర్‌కి సరే, ప్రేమ్‌చంద్, శరత్‌లు నోబెల్‌కు ఏం తక్కువ అని తూకం వేసి నిరూపిస్తే సదరు అవార్డు కమిటీ ఏం చెబుతుందో ఏమో!

భారతదేశం వంటి దేశంలో రచయితలు, కవులు కేవలం తన రచనలతో బతికే పరిస్థితులు లేవు. ఎంతో గొప్ప అంకితభావం, ప్రతిభ, రచనాశక్తి, జనహిత అభిలాష కలిగిన రచయితలైనా బతుకు బాదరబందీలకు అవస్థలు పడుతూ కవిత్వమో, కథో రాయాలి. అప్పోసప్పో చేసి పుస్తకాలు వేసుకోవాలి. అవి అమ్ముడు పోకపోతే అటక మీద గుడ్డ కప్పి దాచుకోవాలి. ఇలాంటి సందర్భాలలో వీరికి తృణమో పణమో ఇచ్చి అవార్డు చేతపెట్టి గౌరవించుకుందాం అనే సదుద్దేశ సాహితీ సంస్థలు అనేకమే వచ్చాయి. ఇవి తమ తమ అభిరుచి, అభిలాషల మేర అవార్డులు ఇచ్చి ప్రోత్సహించినా, వాటిలో ప్రతిష్ఠాత్మకస్థాయి కలిగినవి బహు స్వల్పం కావడంతో ప్రభుత్వపరంగా వచ్చే రాష్ట్ర అవార్డులు, కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డులు ప్రతిష్ఠాత్మకమై కూచున్నాయి.

'షేక్‌స్పియర్‌కు ఏ అవార్డు వచ్చిందని నేటికీ చదువుతున్నారు', 'వేమనకు ఎవరు అవార్డిచ్చారని ప్రతి నాలుక మీద పలుకుతున్నాడు' అని ఎవరు ఎన్ని కబుర్లు చెప్పినా యోగ్యులైన సాహితీకారులకు యోగ్యమైన అవార్డు వచ్చి తీరాలి. లేకుంటే అయోగ్యులు ఆ అవార్డులు పొందుతూ అవార్డుకు అయోగ్యతను తెచ్చి పెడతారు. అసలు సాహితీకారులు తమ వల్ల అవార్డుకు గౌరవం రావాలని కోరుకోవాలేగాని అవార్డు వల్ల తమకు గౌరవం రావాలనుకుంటున్నారంటేనే వీరెంత నిరుపేదలో అర్థం చేసుకోవచ్చు. ఇందుకై ఏళ్ల తరబడి పి.ఆర్ చేయుట, పెద్దలను మచ్చిక చేసుకొనుట, పథకాలు రచించుట, దొంగ పద్ధతిలో షార్ట్‌లిస్ట్‌లో చేరుట, కుల సమీకరణలు, ప్రాంతీయ సెంటిమెంట్లు.. ఇన్ని పతన సోపానాల మీద నడిచి అవార్డు తెచ్చుకుని అల్మారాలో పెట్టుకుని పొద్దున్నే అద్దంలో ముఖం ఎలా చూసుకుంటారో వీరు! నలుగురూ తిరిగే చోట తమ పుస్తకం పెట్టి, దాని మీద డబ్బు పెడితే ఆ డబ్బు కోసమైనా ఎవరూ పుస్తకాన్ని తీసుకెళ్లని నాసిరకం రచయితలు, కవులు కూడా ఫలానా అవార్డు కోసం పైరవీ చేసేవారే! వీరికి ఊ కొట్టే దిక్కుమాలిన జ్యూరీలు!

'అవార్డు వస్తే ఏమవుతుంది' అనంటే 'నోరు మూతబడుతుంది' అనేది ఒక జవాబు. ప్రభుత్వానికి ప్రత్యర్థిగా ఉండాల్సిన కవులు, రచయితలు ప్రభుత్వపరమైన అవార్డులు తీసుకున్నాక ప్రభుత్వానికి ములాజా అవుతారు. ఈ కారణం చేత కూడా ప్రభుత్వాలు అవార్డులను సృష్టిస్తాయి, ఇచ్చి ప్రోత్సహిస్తాయి. తమిళ రచయిత జయమోహన్ తనకొచ్చిన 'పద్మశ్రీ' పురస్కారాన్ని ఈ కారణం చేతనే తిరస్కరించాడు. అయితే సరైన రచయితలు తమకు అవార్డుల వల్ల వచ్చిన అదనపు గుర్తింపును జనం కోసం ఉపయోగించడం మంచి స్ట్రాటజీనే!

ప్రస్తుతం తెలుగునాట అవార్డుల దుమారం రేగి ఉంది. అవార్డు ఇస్తాం అనంటే గౌరవప్రదమైన సాహితీకారులు పరిగెత్తి పారిపోయే స్థితి ఉంది. నాణ్యమైన రచనల పట్ల తెలుగు పాఠకలోకం ఉదాసీనత మాని, వాటిని అక్కున జేర్చుకుంటూ, ఆ రచనలకు సముచిత స్థానం కల్పిస్తూ వెళ్లడమే దీనికి విరుగుడు. పాఠకుడి అవార్డులు, బహుమతులే ఇప్పుడు తెలుగు సాహిత్యానికి శ్రీ సరస్వతీ రక్ష.

నెహ్రూకు నచ్చింది మోదీ చేతికొచ్చింది!

కామెంట్



కరణ్ థాపర్

అమెరికా పర్యటనలో మన ప్రధానమంత్రికి బైడెన్ దంపతులు ఇచ్చిన కానుకలలో 'కలెక్టెడ్ పొయెమ్స్ ఆఫ్ రాబర్ట్ ఫ్రాస్ట్' తొలి ముద్రణ ప్రతి ఉంది. ఫ్రాస్ట్ బహుశా నెహ్రూకు నచ్చిన కవి. ఆ సంకలనంలోని ఒక కవిత '... బట్ ఐ హ్యావ్ ప్రామిసెస్ టు కీప్, అండ్ మైల్స్ టు గో బిఫోర్ ఐ స్లీప్' అనే భావోద్వేగమైన వాక్యాలతో ముగుస్తుంది. అందరికీ తెలిసిన విషయం ఏమిటంటే, మోదీకి నెహ్రూ 'మన ప్రియతమ' పూర్వపు ప్రధాని కాదని! ఆ సంగతిని ఆయన అనేక పర్యాయాలు స్పష్టం చేశారు. దీనిని బట్టి బైడెన్ నుంచి మోదీకి ఆ పుస్తకం కానుకగా అందడం వింతగా లేదూ?

మనసు వింతైనది. విచిత్రంగా పని చేస్తుంది. ఎక్కడి నుంచి ఎక్కడికో ఆలోచనల్ని కలుపుకొంటుంది. మరచిపోయిన జ్ఞాపకాలను రేపుకొంటుంది. అందులో తర్కం ఉండదు. అలా జరుగుతుండంతే. ఫలితం హాయినిగొల్పేది అయివుండొచ్చు, కలవర పరచేదీ కావచ్చు. గతవారం నాకు ఇలాగే జరిగింది. మీకెప్పుడైనా ఇలా అయిందా?

జో బైడెన్ దంపతులు మన ప్రధాన మంత్రికి ఇచ్చిన కానుకలలో 'కలెక్టెడ్ పొయెమ్స్ ఆఫ్ రాబర్ట్ ఫ్రాస్ట్' తొలి ముద్రణ ప్రతి కూడా ఒకటని చదివినప్పుడు నాకు ఇలా అవడం మొదలైంది. ఫ్రాస్ట్‌ని కానుకగా ఇవ్వడంలో అసాధారణత ఏమీ కనిపించలేదు. ఫ్రాస్ట్ బహుశా అమెరికా దేశపు అత్యంత ప్రసిద్ధుడైన కవి. నాలుగుసార్లు పులిట్జర్ అవార్డు పొందిన వ్యక్తి ఆయన ఒక్కరే. కనుక అమెరికా అధ్యక్షుడు ఒక భారతీయ ప్రధానికి ఫ్రాస్ట్ కవితల తొలి ముద్రణ ప్రతిని ఇవ్వడం సముచితమైన కానుకే అవుతుంది.

అయితే ఇక్కడొక చిక్కు ఉంది. లేదా నా ఉద్దేశంలో ఆక్షేపణ. ఫ్రాస్ట్ బహుశా జవహర్‌లాల్ నెహ్రూకు నచ్చిన కవి. మోదీకి బైడెన్ కానుకగా ఇచ్చిన ఈ కవితా సంకలనంలోని ఒక కవిత 'స్టాపింగ్ బై ఉడ్స్ ఆన్ ఎ స్నోవీ ఈవెనింగ్'. ఆ కవిత భావోద్వేగభరితమైన ఈ వాక్యాలతో ముగుస్తుంది: 'ది ఉడ్స్ ఆర్ లౌలీ, డార్క్ అండ్ డీప్, బట్ ఐ హ్యావ్ ప్రామిసెస్ టు కీప్, అండ్ మైల్స్ టు గో బిఫోర్ ఐ స్లీప్, అండ్ మైల్స్ టు గో బిఫోర్ ఐ స్లీప్.'

నెహ్రూ ఈ వాక్యాలలో లోతైన అర్థాన్ని చూశారు. వాటిని ఆయన ఉన్నవి ఉన్నట్లుగా చేత్తో తిరగ రాసుకుని ఆ కాగితాన్ని బల్లపైన ఉన్న గాజు పలక కింద... పైకి కనిపించేలా పెట్టుకున్నారని ఎవరి ద్వారానో నేను విన్నాను. మరికొందరు నెహ్రూ ఆ కాగితం ముక్కకు పటం కట్టించి బల్లపై ఉంచుకున్నారని అంటారు. నెహ్రూకు తను సేకరించిన అమూల్యమైన వస్తువులను తన పడక పక్కన అమర్చుకునే అలవాటు ఉందనీ, వాటిల్లో ఈ వాక్యాలు ప్రముఖ స్థానం పొందాయనీ కూడా కొందరు అంటారు. నిజం ఏదైనప్పటికీ అదొక కవిత. నెహ్రూకు ఎంతో అమూల్యమైనది.

అయితే ఇదేమీ కొత్త కథ కాదు. 50లు, 60లు, 70లలో పెరిగి పెద్దవాళ్లయిన అనేకమంది భారతీయులకు ఈ సంగతి తెలుసు.



బైడెన్‌తో మోదీ



నెహ్రూ

నెహ్రూ జీవిత చరిత్రను రాసినవారు ఈ విషయం గురించి కూడా రాశారు. నెహ్రూ చుట్టూ అల్లుకుని ఉన్న నమ్మకాలలో ఇదొక భాగం.

అటువంటిదే ఒక వాస్తవం... అందరికీ తెలిసిన విషయం ఏమిటంటే, మోదీకి నెహ్రూ 'మన ప్రియతమ' పూర్వపు ప్రధాని కాదని! ఆ సంగతిని ఆయన అనేకానేక పర్యాయాలు స్పష్టం చేశారు. దీనిని బట్టి బైడెన్ నుంచి మోదీకి ఆ పుస్తకం కానుకగా అందడం వింతగా అనిపించడం లేదూ?

బైడెన్‌కు ఈ సంగతి ఆయనకై ఆయనకు తెలియకపోవచ్చు. లేదా ఇదే పుస్తకాన్ని మోదీకి కానుకగా ఇవ్వాలన్న నిర్ణయం ఆయనది కాకపోనూవచ్చు. కానీ ఆయనకు ఎల్లవేళలా సలహాలు ఇచ్చేవారు ఉంటారన్నది మాత్రం నిస్సందేహం. వారు ఇండియా గురించి బాగా తెలిసినవారై, మరీ ముఖ్యంగా... మోదీని సంతోషపరిచే కానుకను జాగ్రత్తగా ఎంపిక చేయగలవారై ఉండొచ్చు. వారైతే నెహ్రూ–ఫ్రాస్ట్ లేదా మోదీ–నెహ్రూల మధ్య ఎలాంటి సంబంధం ఉన్నదో తెలియని వారంటే నమ్మడం కష్టం!

కనుక ఇది నిజంగా యాదృచ్ఛికమేనా, లేక ఇవ్వకనే ఇచ్చిన సూక్ష్మమైన సందేశమా అన్న ఆలోచన నా బుర్రను ఒక గమ్మత్తయిన, అనియంత్రిత దిశలోకి నడిపించింది. అదేమిటో తెలిసేలోపు నేను 1976లోకి వెళ్లిపోయాను. ఆ ఏడాది నేను నా 21వ జన్మదినాన్ని కేంబ్రిడ్జిలో... కొంచెం ఎక్కువ చేసి చెప్పుకోవాలంటే... మత్తుపానీయాల ఆతిథ్యంతో వేడుకగా జరుపుకొన్నాను.

ఆ సందర్భంగా... డఫ్నీ, ఆమె ప్రియ స్నేహితుడు హంఫ్రీ నాకు ఆకుపచ్చ, ఎరుపు చారల 'టై'ని కానుకగా ఇచ్చారు. అది నేను కట్టుకునే రకం టై వంటిది కాదు కాబట్టి సొరుగులో పెట్టి, దానిని నాకు ఎవరిచ్చారో కూడా మర్చిపోయాను. తర్వాత ఎనిమిది నెలలకు హంఫ్రీ పుట్టినరోజు వచ్చింది. అతడి కోసం డఫ్నీ ముందేమీ చెప్పకుండా ఒక్కసారిగా ఆశ్చర్యపరిచేలా బర్త్‌డే పార్టీని ఏర్పాటు చేసింది. నేనొక మతిమరుపు గల బుద్ధిహీనుడిని కనుక నా సొరుగులో కనిపించిన టైని హంఫ్రీకి ఇవ్వదగిన బహుమతి అని భావించాను. దానినొక ఖరీదైన కాగితంలో చుట్టి, దానికి సరిపోయే బర్త్‌డే కార్డును జతపరచి రయ్యిన పార్టీకి లంఘించాను.

నేనిచ్చిన కానుకను తెరచి చూడగానే హంఫ్రీ ముఖం ఎలా మారిపోయిందో నేను ఎప్పటికీ మర్చిపోలేను. విషయం అతడికి అర్థమైన క్షణం అది. తను ఇచ్చిన అదే టై తిరిగి తనకు కానుకగా వెళ్లింది! హంఫ్రీ పెద్దగా నవ్వాడు. నా ముఖం ఎర్రబడింది. ''మనం ఏదైతే చేస్తామో తిరిగి అదే మనకు జరుగుతుందని నేను ఊహించగలను'' అని మాత్రం అన్నాడు హంఫ్రీ గొప్ప దయతో.

బైడెన్ పుస్తకానికీ, నా టైకీ మధ్య మీకేదైనా ప్రత్యక్ష, లేదంటే పరోక్ష సంబంధం కనిపిస్తోందా? రెండింటినీ మీరు అనుచితమైన కానుకలుగా పిలవొచ్చు, లేదంటే తగని ఎంపికలు అనవచ్చు. కానీ బైడెన్ అసంకల్ప కానుక... నేను ఇబ్బంది పడ్డంతగా... ఆయన్ని ఏ విధం గానూ ఇబ్బంది పెట్టేదైతే కాదు. హంఫ్రీకి నాపై మనసులో ఏమీ లేదు. డఫ్నీతో అతడు విడిపోయినా, మేమిద్దరం ఇప్పటికీ స్నేహితులుగానే ఉన్నాం. నన్నెప్పుడైనా అతడు టైతో చూస్తే, 'ఆ' టైని గుర్తు చేయడం మాత్రం మర్చిపోడు.

బైడెన్ తనకు ఆ పుస్తకాన్ని కానుకగా ఇవ్వడం గురించి నరేంద్ర మోదీ ఏం ఆలోచిస్తున్నారో తెలుసుకోవాలని నాకు మహా ఆరాటంగా ఉంది. నేను అనుకోవడం... అమెరికా అధ్యక్షుడి అప్రమేయ కానుక మోదీకి ముసిముసి నవ్వులు తెప్పిస్తుందని. మోదీ ఎప్పుడైనా తన జ్ఞాపకాలను పుస్తకంగా రాస్తే అందులో ఈ చిన్న కథ కోసం ఎదురు చూడవచ్చు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



తప్పు మీదే!



టొమాటోల ధరలు ఎలా తగ్గించాలో ప్రజల నుంచి సలహాలు కోరుతుంది ప్రభుత్వం. తర్వాత టొమాటోల ధరలు తగ్గించడంలో ప్రజలు విఫలమయ్యారని ప్రకటిస్తుంది.

– ఉర్వీశ్ కొఠారీ, వ్యంగ్య రచయిత

కొత్త క్రమం



బహుళ సంస్కృతి అనేది కలుపుకొని పోవడానికి సంబంధించినది అయి వుండాలి : కానీ 'పొలిటికల్ కరెక్ట్‌నెస్' ద్వారా సమర్థన అందుకుంటూ అది అరాచకత్వానికి లైసెన్సుగా మారిపోయింది. నూతన ప్రపంచ క్రమానికి(న్యూ వరల్డ్ ఆర్డర్) స్వాగతం!

– సుశాంత్ సరీన్, ఫెలో

ఉపవాస శక్తి



మధ్యంతర ఉపవాసాలు పాటించడం వల్ల ఎంత బాగుందో, దానివల్ల ఎలా శక్తి పెరిగిందో, ఎలా బరువు తగ్గిందో, ఇలా చేయడానికి నేను వాళ్లకు ఎలా ప్రేరణ ఇచ్చానో అని నేను ఎక్కడికి వెళ్లినా జనాలు ఒకటే చెబుతున్నారు. ఇప్పటికీ ప్రయత్నించకపోతే ఉపవాసాలు చేయండి. అవి పనిచేస్తాయి. ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండటానికి ఉపవాసం శక్తిమంతమైన సాధనం.

– అహ్మద్ మాలిక్, సర్జన్

తగని సలహా



'పట్టించుకోకండి' అంటారు! ఎలా పట్టించుకోకుండా ఉంటాం? ఏదైనా అసాధారణ సంఘటన జరిగినప్పుడు, అసహనానికి లోను చేసే అనుభవం ఎదురైనప్పుడు ప్రతిస్పందించడం మానవ స్వభావమే కదా.

– ప్రాప్తి, ట్విటిజెన్

పుస్తకమే కావాలి



చాలామంది పీజీలు (వైద్యులు) పాఠ్యపుస్తకాలను ఐప్యాడ్ మీద చదవడం చూస్తుంటాను. నాకైతే ఎలక్ట్రానిక్ డివైసుల మీద కొన్ని పేజీలు చదవడం కూడా కష్టంగా ఉంటుంది. నావరకూ పుస్తకాలకు ప్రత్యామ్నాయం లేదు. ఇది తరాల అంతరమా లేక కేవలం వ్యక్తిగత అభిరుచా?

– కార్తీక్, ఎండోక్రైనాలజిస్ట్

ఒక్కటి చాలు...



ఒక అంశం మీద ఉద్వేగాన్ని పెట్టుబడిగా పెట్టడం అనేది ఒకరి ఎంపిక, అంతేగానీ అది నిర్బంధం కాదు. కొందరు మణిపుర్ మీద పెడితే, ఇంకొందరు ఫ్రాన్స్ మీద పెడుతున్నారు. ఉన్న ప్రతి అంశాన్నీ లేవనెత్తగలిగే స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ ఉంది. కానీ అది ఆచరణీయం కాదు.

– అమిత్ షాండీలియా, కాలమిస్ట్

విధ్వంసం వెనుక...



ఒకరి చరిత్రనూ, సంస్కృతి, నాగరికతల సారాన్నీ తుడిచి పెట్టడానికీ ; వారిమీద ఆధిక్యతను స్థాపించడం ద్వారా కొత్త కథనాన్ని నెలకొల్పడానికీ– జ్ఞానాన్ని ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేయడం అనేది చరిత్ర పొడవునా స్థిరంగా ఉపయోగిస్తూ వచ్చిన ప్రాథమిక ఎత్తుగడ. (ఫ్రాన్స్‌లోని మార్సెల్ గ్రంథాలయ దహనం నేపథ్యంలో.)

– జెబా జోరియా, కామెంటేటర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

మణిపూర్ మంటలు ఆరేదెన్నడు?

సందర్భం



సి. రామచంద్రయ్య

ప్రకృతి అందాలకు ఆలవాలమైన మణిపూర్ దాదాపు 2 నెలలుగా అగ్నికీలల్లో దహించుకుపోతోంది. తాము చేయని తప్పుకు అమాయకులు 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. అన్నదమ్ముల్లా, అక్క చెల్లెళ్లుగా కలిసి మెలిసి జీవిస్తున్న ప్రజల మధ్య విద్వేషం రగిలింది. 4,000లకు పైగా గృహాలు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వేలాది మంది కట్టుబట్టలతో సురక్షిత ప్రాంతాలు వెతుక్కుంటూ పారిపోతున్నారు. అక్కడ ఉన్నది ప్రజా ప్రభుత్వమే. పోలీసులు పహారా కాస్తున్నారు. కేంద్ర బలగాలు కవాతు నిర్వహిస్తున్నాయి. అయినా హింస ఆగడం లేదు.

ఒకపక్క మణిపూర్ మండిపోతుండగానే, ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటన జరిగింది. రక్షణరంగంలో కీలక ఒప్పందాలు కుదిరాయి. ప్రముఖ దిగ్గజ కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ తాను నరేంద్ర మోదీకి అభిమానినని చాటుకొన్నాడు. తన 'టెస్లా' భారత్‌లో రంగ ప్రవేశం చేస్తుందని చెప్పాడు. ఇదంతా చూపినపుడు, 'ఇంట్లో ఈగల మోత, బయట పల్లకీల మోత' అనే సామెత గుర్తు రాక మానదు. మణిపూర్ సమస్యకు పరిష్కారం చూప కుండానే ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలు చేస్తూ భారతదేశం గొప్పతనాన్ని గురించి చాటిచెప్పడం ఎబ్బెట్టు గానే ఉంది.

భౌగోళికంగా మణిపూర్‌కు అనేక ప్రతికూలతలు ఉన్నాయి. మణిపూర్‌కు సరిహద్దుగా ఉన్న మయన్మార్ నుంచి పెద్దఎత్తున గిరిజన అక్రమ వలసదారులు చొచ్చుకొనివచ్చి ఎప్పటికప్పుడు ఘర్షణలకు కారణం అవుతున్నారు. వారికి చైనా దన్నుగా నిలుస్తోంది. అయితే, ఇప్పుడు మణిపూర్‌ది మాత్రం పూర్తిగా స్థానిక సమస్యే!

మణిపూర్‌లో ఉన్న ప్రధాన తెగలైన మైతేయ్‌లు, కుకీలు, నాగాల మధ్య చాలా కాలంగా ఘర్షణ వాతావరణం నెలకొంది. సంఖ్యాపరంగా అధికంగా ఉన్న మైతేయ్ తెగను ఎస్టీల్లో చేర్చేందుకు వీలుగా కేంద్రానికి సిఫార్సు చేయాలని మణిపూర్ హైకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడానికి సిద్ధపడకుండా వెంటనే సుప్రీం కోర్టుకు నివేదించి ఉన్నట్లయితే పరిస్థితి దిగజారేది కాదు. దాంతో మైతేయ్ తెగకు చెందిన రాష్ట్ర ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ చిత్తశుద్ధి మీద కుకీలకు, ఇతర గిరిజన తెగలకు అపనమ్మకం ఏర్పడింది.

సామాజికంగా, రాజకీయంగా శక్తి సంపన్నులైన మైతేయ్‌లు గనుక ఎస్టీ జాబితాలో వచ్చి చేరితే తమ అస్తిత్వానికి ప్రమాదం ఏర్పడుతుందని, తాము ఇంత కాలం సాగు చేసుకొంటున్న భూములను వారు హస్తగతం చేసుకొంటారనీ భయం వారిలో ఏర్పడింది. అలాగే రిజర్వేషన్లు, ఇతర రాయితీలను వారితో కలిసి పంచుకోవలసి వస్తుందనే ఆగ్రహమూ వారిలో ఏర్పడింది. దానికి తోడు, కొండ ప్రాంతాల్లోని రక్షిత అటవీస్థలాల్లో నివసిస్తున్న వారిని బయటకి తరలించేందుకు బీజేపీ నేతృత్వంలోని బీరేంద్రసింగ్ ప్రభుత్వం తీసుకొన్న బలవంతపు చర్యలు గిరిజనుల్లో అభద్రతాభావం నింపాయి. దాంతో, నిరసనల స్థాయి నుంచి ప్రారంభమైన కార్యక్రమాలు క్రమంగా ఆందోళనలుగా, ఉద్యమాలుగా, హింసాత్మక ఘటనలుగా రూపు దిద్దుకొన్నాయి.

కొండ ప్రాంతాలలో కుకీ, నాగా తెగలవారు గంజాయి సాగు చేస్తున్నారనే సాకుతో వారిని అక్కడి నుంచి బలవంతంగా ఖాళీ చేయించాలని ప్రభుత్వం ప్రయత్నించడంతో.. అది కుకీల అస్తిత్వ సమస్యగా మారింది. కొత్తగా పలు ప్రాంతాలను అభయారణ్యాలుగా, రక్షిత అటవీ ప్రాంతాలుగా ప్రకటించి అక్కడి అటవీ ఫలసాయం పొందకుండా గిరిజన తెగలను అడ్డుకోవడం కక్షసాధింపు చర్యగా వారు భావించారు. రాష్ట్ర భూభాగంలో 90 శాతం కొండ ప్రాంతాలతో నిండి ఉంది. అనాదిగా తమ జీవనానికి కొండల్నే ఉపాధి కేంద్రాలుగా మార్చుకొన్న గిరిజన తెగలను కొండల్నుంచి ఖాళీ చేయిస్తామంటే ఎలా? స్థానికంగా ఉండే చెట్టు, పుట్ట, నదీ నదాలు అన్నీ గిరిజన ఆచార సంప్రదాయాలతో



ముడి వడి ఉంటాయి. మరి వారిని వాటి నుంచి ఎలా దూరం చేస్తారు?

నిజానికి, భారత రాజ్యాంగం ప్రకారం షెడ్యూల్ తెగల జాబితాలోకి ఒక వర్గాన్ని చేర్చాలన్నా, తొలగించాలన్నా ఆ అధికారం ఒక్క రాష్ట్రపతికి మాత్రమే ఉంది తప్ప ఏ కోర్టుకూ, ఏ ప్రభుత్వానికీ లేదు. చివరకు పార్లమెంట్‌కు కూడా! గిరిజన తెగలు అన్నింటికీ రాజ్యాంగ రక్షణ ఉందన్న భరోసా ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందింది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మణిపూర్‌లో పర్యటించి అన్ని వర్గాలతో చర్చలు జరపడం ద్వారా సమస్యను పరిష్కరించాలని చేసిన కృషి ఎక్కువ రోజులు నిలవలేదు. అక్కడ హింసను కేవలం శాంతి భద్రతల సమస్యగానే పరిగణిస్తే ఒనగూడే ఫలితాలు దీర్ఘకాలంపాటు ఉండవు.

అక్కడ ఎవరైతే తమ అస్తిత్వం కోసం ప్రాణాలకు తెగించి పోరాడుతున్నారో.. వారు ఈ దేశంలో భాగమేననీ, పరాయివారు కాదనీ వారిలో నమ్మకం కలిగించే చర్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాలి. హింసను అరికట్టడంలో విఫలమైన బీరెన్ సింగ్‌ను సీఎం పదవి నుంచి తప్పించి వేరొకర్ని ఆ స్థానంలో నియమించాల్సింది. కానీ, బీజేపీ అధిష్ఠానం ఆ దిశగా ఆలోచించడం లేదు.

జమ్మూ కశ్మీర్ రాష్ట్రాన్ని 2 కేంద్రపాలిత ప్రాంతాలుగా మార్చడానికి అక్కడి ప్రజల స్థానికత, అస్తిత్వం అంశాలే దోహదం చేసిన విషయాన్ని ఎన్డీఏ మర్చిపోతే ఎలా? 'కశ్మీర్ ఫైల్స్' వంటి చలన చిత్రాలలో స్థానికంగా ఉండే పండిట్లు ఎందుకు తమ స్వస్థలాలను వీడి ఇతర ప్రాంతాలకు తరలిపోయారో చూపించారు. పండిట్లు తిరిగి తమ స్వస్థలాలకు తిరిగిరావాలని కేంద్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోంది.


బీజేపీ అనుసరిస్తున్న ద్వంద్వ విధానానికి ఇదొక మచ్చుతునక. మణిపూర్‌లోని కుకీలు, ఇతర గిరిజన తెగలవారు తమ అస్తిత్వాన్ని కాపాడుకోవాలని తమ ప్రాంతాన్ని, భాషను, సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని అందుకు ప్రాణత్యాగాలకైనా సిద్ధపడాలని చూస్తున్నారు. సమస్య పరిష్కరించాలంటే దాని మూలాల్లోకి వెళ్లాలి. అంతేకాదు, రాజకీయంగా లాభనష్టాల గురించి ఆలోచించకుండా చిత్తశుద్ధితో ప్రజల మధ్య ఏర్పడిన అగాధాన్ని పూడ్చాలి. ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటివరకు మణిపూర్‌పై నోరు విప్పలేదు. ఇంకా ఆలస్యం చేస్తే అక్కడ పరిస్థితులు మరింత దిగజారతాయి.

వ్యాసకర్త ఏపీ శాసన మండలి సభ్యులు

అణోరణీయాన్

'అణీయాన్' అంటే అణువులా అతి చిన్నదైనది. 'అణోరణీయాన్' అంటే అణువుల లాంటి చిన్నవాటికంటే కూడా అతి చిన్నది. 'మహీయాన్' అంటే పెద్దది. 'మహతో ర్మహీయాన్' అంటే మహత్తరమైన ఈ పృథ్వీ, ఈ బ్రహ్మాండం లాంటి పెద్దవాటి కంటే కూడా పెద్దది. అణోరణీయాన్, మహతోర్మహీయాన్ /ఆత్మా–అస్య జన్తోః నిహితః గుహా యామ్ – ఆత్మ అనేది అణువులలో అణువు, మహత్తులలో మహత్తు. అతి చిన్న వాటికంటే చిన్నది, అతి పెద్దవాటికంటే పెద్దది. అది ప్రాణి (హృదయ) గుహలో నిక్షిప్తమై ఉంటుంది, అని కఠోపనిషత్తు చెబుతుంది.

ఆ ఆత్మ పిపీలికాది బ్రహ్మ పర్యంతం సర్వ ప్రాణులలోనూ నిహితమై, అధిష్ఠానమై ఉంటుంది అనేందుకు గుర్తు, ఆ ప్రాణులకు దర్శన, శ్రవణ, మననాది జ్ఞానం ఉండటమే. ఆత్మ అనేది భౌతిక ఇంద్రియాలకూ, ప్రమాణాలకూ, కొలమానాలకూ సాక్షాత్కరించేది కాదు. అది అశాశ్వతమైన శరీరంలో ఉండే శాశ్వత తత్త్వం. శరీరం నుంచి అది నిష్క్రమిస్తే శరీరం చైతన్యరహితమైన కళేబరం అయిపోతుంది.



జ్యోతిర్మయం

ప్రాణిని చైతన్యవంతం చేసే ఈ ఆత్మకు జననమూ లేదు, మృత్యువూ లేదు. జ్ఞానమే దాని స్వరూపం. న జాయతే, మ్రియతే వా, విపశ్చిత్. అది శాశ్వతం, లేక నిత్యం లేక సనాతనం. దాన్ని 'అక్రతువు' అయిన వాడే చూడగలడు. తం అక్రతుః పశ్యతి, వీత శోకః, ధాతు ప్రసాదాత్, మహిమానం ఆత్మనః. 'అక్రతువు' అంటే ప్రాపంచికమైన కోరికలు లేని నిష్కాముడు. కనిపించే, వినిపించే ప్రాపంచిక విషయాల నుంచి బుద్ధిని మరలించుకోగలిగిన ఘనుడు. ఇంద్రియాల నిగ్రహం లేక 'ప్రశమనం' (లేక 'ప్రసాదం' వల్ల) అతగాడు తనలో ఉన్న ఆత్మ గొప్పతనాన్ని (శాశ్వ తత్త్వం, సర్వవ్యాపిత్వం, ఇత్యాది గొప్పతనాలను) సాక్షాత్కరింపజేసుకోగలడు. ఆత్మ అనేది కేవలం వేద శాస్త్ర అధ్యయనం వల్ల, మేధాశక్తి వల్ల, వేదాంత ఉపదేశాల బహు శ్రవణం వల్ల లభ్యమయ్యేది కాదు. ఆత్మ సాక్షాత్కార కాంక్ష తప్ప మరే కోరికా లేనివాడికి మాత్రమే ఆత్మ సాక్షాత్కారమౌతుంది. కోరికలతో నిండిన వారికి ఆత్మదుర్ జ్ఞేయం. పట్టుబడదు.

అంత దుర్ జ్ఞేయమయిన దాన్ని తెలుసుకోకపోతే నష్టమేమిటి? తెలుసుకొంటే లాభమేమిటి? తెలుసుకొన్నవాడు 'వీత శోకు'డౌతాడు. అన్ని సాంసారిక దుఃఖాలను అధిగమించి, దుఃఖ స్పర్శ లేని బ్రహ్మానంద స్థితిని అనుభవిస్తాడు అని ఉపనిషత్తు బోధిస్తున్నది.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, శైశాఖ మాసం, **తిథి:** పౌర్ణమి సా 5.29 వరకు, తదుపరి పాడ్యమి, **నక్షత్రం:** మూల ఉ.11.38 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ఉ.10.07 నుండి 11.38 తిరిగి, రా. 8.43 నుండి 10.14 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.31 నుండి 1.23 వరకు, తదుపరి ప.3.07 నుండి 3.57 వరకు, **అమృతఘడియలు:** తె.5.49 నుండి 7.20 వరకు (తెల్లవారితే మంగళవారం), గురుపౌర్ణమి, వ్యాసపౌర్ణమి ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.33, **సూర్యాస్తమయం:** 6.35.

క్లుప్తంగా...

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి


ఆలయం వెలుపల జస్టిస్ శ్యామ్‌సుందర్

తిరుమల: తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్‌సుందర్, ఎంపీ సంజీవ్‌కుమార్, ఉడిపికి చెందిన శిరూర్ మఠం వేద వర్ధనతీర్థ స్వామీజీ తదితరులు ఆదివారం దర్శించుకున్నారు. వీరికి రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు
తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శనివారం అర్ధరాత్రి వరకు 82,999 మంది స్వామివారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.4.27 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పోటీని తట్టుకుని నిలబడాలి

- వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ శ్యామ్‌ప్రసాద్


నీట్ ర్యాంకర్స్‌కు నగదు, స్టైఫండ్ అందజేస్తున్న డాక్టర్ శ్యామ్‌ప్రసాద్

గుంటూరు మెడికల్: మన దేశంలో మాదిరిగా ఆరోగ్య సంరక్షణ మరెక్కడా ఉండదని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ పి.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఏపీ బీసీ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం గుంటూరులో నీట్–2023 బెస్ట్ ర్యాంకర్స్‌కు అభినందన సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ వైద్య విద్యలో చేరినవారు భారతీయ రచయితల పాఠ్యపుస్తకాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. దేశంలో 600 మెడికల్ కాలేజీలు ఉన్నాయని, ఏటా 1.20 లక్షల మంది వైద్యులు బయటకు వస్తున్నారని చెప్పారు. ప్రస్తుత పోటీని తట్టుకుని నిలిచేందుకు ప్రతి విద్యార్థి నూరు శాతం పాఠ్యాంశాలను నేర్చుకోవాలన్నారు. నీట్‌లో 2,500లోపు ర్యాంకులు సాధించిన 20 మంది విద్యార్థులకు రూ.10వేలు, స్టైఫండ్‌ను ఏపీ బీసీ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అందించారు. విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ సీతారామ్‌ప్రసాద్, డాక్టర్ అంది వెంకటేశ్వరావు, డాక్టర్ అవినాష్, ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సంతాన గోమాత

- ఒకే ఈతలో మూడు దూడల జననం



పెదగంట్యాడ: విశాఖపట్నం జిల్లా, పెదగంట్యాడ మండలం పాలవలస గ్రామంలో రైతు గొందేశి పెంటయ్యకు చెందిన ఆవు ఆదివారం ఒకే ఈతలో మూడు దూడలకు జన్మనిచ్చింది. ఇందులో రెండు దూడలు, ఒక పెయ్యి ఉన్నాయి. ప్రస్తుతం ఆవు, దూడలు ఆరోగ్యంగా ఉన్నాయి.

ఇద్దరు పిల్లలతో తల్లి ఆత్మహత్య

ముదిగుబ్బ: కుటుంబ కలహాలతో ఓ మహిళ తన ఇద్దరు పిల్లలను చెరువులోకి విసిరేసి.. తనూ దూకింది. ఈ ఘటనలో ముగ్గురూ చనిపోయారు. ఈ విషాదకర ఘటన శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. టీచర్స్ కాలనీలో టైలర్ వృత్తి చేసుకుంటూ జీవిస్తున్న గంగాధర్‌రెడ్డి అలియాస్ గంగిరెడ్డి, సుకన్య దంపతులకు దేవయాని(8) జస్మిత(5) కుమార్తెలు. భార్యాభర్త తరచూ గొడవలు పడుతుండే వారు. ఇదే క్రమంలో సుకన్య ఆదివారం ఉదయం భర్తతో గొడవపడి.. తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఇంట్లోంచి వెళ్లిపోయింది. ముదిగుబ్బ సమీపంలోని చెరువు వద్దకు వెళ్లింది. ముందుగా చిన్న కుమార్తెను చెరువులోకి విసిరేసింది. ఇది గమనించిన పెద్ద కుమార్తె అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా.. పెద్ద కుమార్తెను కూడా సుకన్య పట్టుకుని చెరువులోకి విసిరింది. తర్వాత తనూ దూకింది. ముగ్గురు మృతి చెందారు.

16న విశాఖలో బీసీల మహా గర్జన

హైదరాబాద్: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16వ తేదీన విశాఖలో బీసీ మహా గర్జన సదస్సును నిర్వహించనున్నట్టు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. సభకు జాతీయ బీసీ అధికార ప్రతినిధి, ఢిల్లీ ఇన్‌చార్జి కర్రి వేణుమాధవ్, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణలు అధ్యక్ష వర్గంగా ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా సదస్సు పోస్టర్‌ను ఆదివారం ఆయన విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆయన ఆవిష్కరించారు.

మోదీ చేతిలో కేసీఆర్ రిమోట్

- అందుకే ప్రధానికి ఏం కావాలో అదే చేస్తారు
- ఖమ్మం జనగర్జన సభలో రాహుల్ గాంధీ
- బీఆర్‌ఎస్ అంటే బీజేపీ రిస్తేదార్ సమితి
- కర్ణాటకలో బీజేపీని ఓడించాం.. ఇక్కడ ఆ పార్టీ బీ టీం బీఆర్‌ఎస్‌ను ఓడించబోతున్నాం
- తెలంగాణలో బీజేపీ ఖతం.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్యే పోటీ
- మేం అధికారంలోకి రాగానే వితంతువులు, వృద్ధులకు రూ.4 వేల పింఛన్
- ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటికి కాంగ్రెస్‌లోకి ఆహ్వానం


పొంగులేటిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాహుల్ గాంధీ

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ప్రధాని మోదీ చేతిలో తెలంగాణ సీఎం కేసీఆర్ రిమోట్ కంట్రోల్ ఉందని, అందుకే మోదీకి ఏం కావాలో కేసీఆర్ అదే చేస్తారని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. బీఆర్‌ఎస్ అంటే బీజేపీ రిస్తేదార్ సమితి అని చెప్పారు. కర్ణాటకలో ఏం జరిగిందో తెలంగాణలోనూ అదే జరగబోతోందని, అక్కడ బీజేపీని ఓడిస్తే.. ఇక్కడ బీజేపీ బీ టీం అయిన బీఆర్‌ఎస్‌ను ఓడించబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఆయన బృందం కాంగ్రెస్‌లో చేరిక, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ముగింపు సందర్భంగా ఆదివారం ఖమ్మంలోని వైరా రోడ్‌లో జనగర్జన పేరిట నిర్వహించిన భారీ బహిరంగ సభలో రాహుల్ మాట్లాడారు. అధికారంలోకి వచ్చాక చేయూత పేరుతో వితంతువులు, వృద్ధులకు నెలకు రూ.4 వేల పింఛన్ అందజేస్తామని హామీ ఇచ్చారు. రాహుల్ ఇంకా ఏమన్నారంటే..

అది బీజేపీ బంధువుల పార్టీ..

- దేశ వ్యాప్తంగా జోడో యాత్ర చేసి బీజేపీ విద్వేష సిద్ధాంతాన్ని విచ్ఛిన్నం చేశాం. ఖమ్మం కాంగ్రెస్ పార్టీకి ఇల్లు లాంటిది. ఇక్కడి ప్రజలు ప్రతిసారీ కాంగ్రెస్‌కు అండగా ఉన్నారు. మీ మనసు, మీ హృదయంలో కాంగ్రెస్ పార్టీ ఉంది. కష్టసమయాల్లో కూడా ఇక్కడి ప్రజలు మా ఆలోచనలు, పార్టీని వీడనందుకు ధన్యవాదాలు.
- తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఇక్కడి ప్రజల కల. పేదల స్వప్నం. రైతులు, కార్మికులు తెలంగాణ రాష్ట్రాన్ని కాంక్షించారు. కానీ తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలన ఆ కలలను ఛిద్రం చేసింది. మీరు కన్న కలలన్నీ కల్లలయ్యాయి. టీఆర్‌ఎస్‌గా ఆవిర్భవించిన ఆ పార్టీ పేరు మార్చుకుని ఇప్పుడు బీఆర్‌ఎస్‌గా మారింది. బీఆర్‌ఎస్ అంటే 'బీజేపీ రిస్తేదార్ సమితి'. అది బీజేపీ బంధువుల పార్టీ. ఆ పార్టీకి బీ టీంగా పనిచేస్తోంది.
- పార్లమెంట్‌లో మేం బీజేపీకి వ్యతిరేకంగా పోరాడాం. కానీ బీఆర్‌ఎస్, సీఎం కేసీఆర్ మాత్రం బీజేపీకి బీ టీంగా పనిచేశారు. మేం రైతు వ్యతిరేక చట్టాలను వ్యతిరేకిస్తే బీజేపీకి బీఆర్‌ఎస్ మద్దతునిచ్చింది.
- ఈ మధ్య ఢిల్లీలో ప్రతిపక్ష పార్టీలన్నీ భేటీ అయ్యాయి. బీఆర్‌ఎస్‌ను పిలవాలని కొందరు ప్రతిపక్ష నేతలు కాంగ్రెస్ పార్టీని కోరారు. కానీ బీఆర్‌ఎస్ వస్తే ఆ మీటింగ్‌కు మేం రాబోమని కాంగ్రెస్ పార్టీ పక్షాన స్పష్టంగా చెప్పా. కాంగ్రెస్ పార్టీని వదిలివెళ్లిన వాళ్లకు ఓ మాట చెబుతున్నా. మీ కోసం మా తలుపులు తెరిచే ఉంటాయి.

కేసీఆర్ రాజు అనుకుంటున్నారు..

- సీఎం కేసీఆర్ తాను తెలంగాణకు రాజు అనుకుంటున్నారు. ఈ నేల ఆయన జాగీరు అనుకుంటున్నారు. అందుకే ఇందిరమ్మ హయాంలో కాంగ్రెస్ పార్టీ ఆదివాసీలు, దళితులు, పేదలకు ఇచ్చిన భూములను కేసీఆర్ ప్రభుత్వం లాక్కుంటోంది. ఆ భూమి మీది. అది మీ హక్కు. ఆ భూమిపై మీకు హక్కులను కల్పించిన కాంగ్రెస్ పార్టీ ఆ హక్కులను కాపాడుతుంది.
- అవినీతి విషయంలో సీఎం కేసీఆర్ ఏ ఒక్కదాన్నీ విడిచిపెట్టలేదు. కేసీఆర్ అందరినీ దోచుకుంటున్నారు. లిక్కర్ కుంభకోణం జరిగిందని అన్ని దర్యాప్తు సంస్థలకూ తెలుసు. కానీ ఎలాంటి చర్యలూ తీసుకోరు. అందుకే బీఆర్‌ఎస్ అనేది బీజేపీకి బీ టీం అని చెబుతున్నాం.
- మొన్నటి వరకు తెలంగాణలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య పోటీ ఉందని భావించారు. కానీ ఇప్పుడు తెలంగాణలో బీజేపీ లేదు. ఖతం అయిపోయింది. కాంగ్రెస్, బీజేపీ బీ టీం(బీఆర్‌ఎస్) మధ్యే పోటీ ఉంటుంది. బీజేపీది విద్వేషం అయితే, కాంగ్రెస్ పార్టీది ప్రేమ సిద్ధాంతం. విద్వేషపు దారిలో ప్రేమ కుటీరం తెరిచాం' అంటూ రాహుల్ గాంధీ తన ప్రసంగాన్ని ముగించారు. కాగా, ఖమ్మం సభలో పాల్గొనేందుకు ఆయన ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి వచ్చారు. పలువురు నేతలు ఆయనకు స్వాగతం పలికారు.

శ్రీశారదాపీఠం ఆశ్రమంలో భండారా

- నేటి నుంచి పీఠాధిపతుల చాతుర్మాస్య దీక్ష
- 27వసారి దీక్ష చేపడుతున్న పీఠాధిపతులు


భండారా నిర్వహిస్తున్న శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర, చిత్రంలో స్వాత్మానందేంద్ర

సింహాచలం: హైందవ సంప్రదాయాన్ని అనుసరించి సోమవారం నుంచి చాతుర్మాస్య దీక్ష చేపట్టనున్న నేపథ్యంలో విశాఖ శ్రీశారదా పీఠాధిపతులు రుషికేష్‌లోని ఆశ్రమంలో ఆదివారం భండారా (అన్న, వస్త్ర సంతర్పణ, దక్షిణ ఇవ్వడం) నిర్వహించారు. రుషులు, సాధువులు, సన్యాసులు, దండీస్వాములు, వేద విద్యార్థులు, మహిళా సాధువులు పెద్ద ఎత్తున హాజరై స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి స్వాముల నుంచి భండారా స్వీకరించారు. అంతకుముందు పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర.. భరత్ మందిరాన్ని సందర్శించారు. అక్కడి వేద విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందజేశారు. వేద పోషణార్థం భరత్ మందిరానికి విరాళం ఇచ్చారు. చాతుర్మాస్య దీక్షాకాలంలో రుషికేష్ ఆశ్రమంలో భండారా నిర్వహించడం విశాఖ శ్రీశారదాపీఠానికి ఆనవాయితీ. అలాగే అక్కడి వీరభద్ర మందిరాన్ని సందర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. సోమవారం నుంచి పీఠాధిపతులు చాతుర్మాస్య దీక్షకు అంకురార్పణ చేయనున్నారు. సన్యాసాశ్రమ జీవితంలో ప్రతి ఒక్కరూ విధిగా దీక్షను ఆచరించాలి. 2009 నుంచి స్వరూపానందేంద్ర స్వామి రుషికేష్ వేదికగానే చాతుర్మాస్య దీక్ష చేపడుతున్నారు. ఆయనకు ఇది 27వ చాతుర్మాస్య దీక్ష కాగా, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రస్వామి 5వ సారి దీక్ష చేపడుతున్నారు.

స్వాముల ఆశీస్సులు తీసుకున్న దేవదాయ కమిషనర్
శారదా పీఠాధిపతులు చాతుర్మాస్య దీక్ష చేపడుతున్న నేపథ్యంలో రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ రుషికేష్ వెళ్లారు. స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతిలను సతీసమేతంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. శాఖాపరంగా ఇటీవల తీసుకున్న నిర్ణయాలను స్వరూపానందేంద్ర సరస్వతికి కమిషనర్ వివరించారు. ఢిల్లీ కేడర్ ఐపీఎస్ అధికారి రామ్‌గోపాల్‌నాయక్ కూడా భండారాలో పాల్గొని సాధువులకు వస్త్రాలను అందజేశారు.

ఆర్యవైశ్యులకు రాజకీయంగా సీఎం పెద్దపీట

- వైఎస్ జగన్ పాలనలోనే ఆ వర్గానికి అన్ని విధాలా న్యాయం
- రోశయ్య జయంతి సభలో అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ 'కోలగట్ల'


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కోలగట్ల, వెలంపల్లి, మద్దాళి తదితరులు

భవానీపురం (విజయవాడ పశ్చిమ)/వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): ఆర్యవైశ్యులకు రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య జయంతిని పురస్కరించుకుని విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎన్టీఆర్, వైఎస్సార్ తరువాత అంతటి కీర్తిని పొందిన వ్యక్తి రోశయ్య అని కొనియాడారు. పొట్టి శ్రీరాములు సాధించిన ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నవంబర్ ఒకటిన జరుపుకునేలా చర్యలు తీసుకున్న సీఎం జగన్‌కు కోలగట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్యులకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే అన్ని విధాలా న్యాయం జరిగిందన్నారు.

ప్రతీ పదవికి ఆయన వన్నె తెచ్చారు : వెలంపల్లి
విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రోశయ్య నిర్వర్తించిన ప్రతి పదవికీ వన్నె తెచ్చారని కొనియాడారు. పదవులు రోశయ్యను వెతుక్కుంటూ వచ్చాయే తప్ప ఆయన ఏనాడూ వాటి కోసం వెంపర్లాడ లేదన్నారు. అటువంటి రోశయ్య విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటుచేయటం ఆనందంగా ఉందన్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులకు దశ, దిశ చూపిన మహానుభావుడు రోశయ్య అని కొనియాడారు. శాసనసభలో 16సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత ఆయనది మాత్రమేనని గుర్తుచేశారు. విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పల్లపోతు మురళీకృష్ణ (కొండపల్లి బుజ్జి), విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభలో రోశయ్య కుమారుడు శివసుబ్బారావు, అల్లుడు పైడా కృష్ణప్రసాద్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, ఆర్టీఐ కమిషనర్ రేపాల శ్రీనివాసరావు, ఎన్విరాన్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బా చంద్రశేఖర్, ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ పాల్గొన్నారు.

రోశయ్య కాంస్య విగ్రహం ఆవిష్కరణ
విజయవాడ నగరపాలక సంస్థ కార్యాలయం సమీపంలో విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆయన తనయుడు కొణిజేటి శివసుబ్బారావు ఆదివారం ఆవిష్కరించారు.

వైభవంగా సింహ'గిరి' ప్రదక్షిణ

- హాజరైన లక్షలాది మంది ప్రజలు
- ప్రభుత్వ ఏర్పాట్లతో భక్తుల సంతృప్తి
- 32 కిలోమీటర్ల ప్రదక్షిణ చేసి సింహాచలం స్వామిని దర్శించుకుంటున్న భక్తజనం


సింహాచలం నుంచి రథయాత్ర

సాక్షి, విశాఖపట్నం: మహావిశాఖ నగరం.. భక్తజన సంద్రంగా మారింది. శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని ప్రసన్నం చేసుకునేందుకు సింహాచల గిరి ప్రదక్షిణకు లక్షలాది మంది భక్తులు పోటెత్తారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి భక్తులు గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. మధ్యాహ్నానికి భక్తుల సంఖ్య లక్షలకు చేరింది. సంప్రదాయం ప్రకారం సింహగిరి దిగువన ఉన్న తొలి పావంచా వద్ద మధ్యాహ్నం 2.40 గంటలకు సింహాచలం దేవస్థానం ఈవో త్రినాథ్, నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమవర్మ కొబ్బరికాయ కొట్టి ప్రచార రథయాత్రని ప్రారంభించారు. సింహాచలం నుంచి బీఆర్‌టీఎస్ రోడ్డు మీదుగా హనుమంతవాక జంక్షన్, తెన్నేటి పార్కు, ఎంవీపీ డబుల్ రోడ్డు, సీతమ్మధార, మాధవధార, ఎన్ఏడీ జంక్షన్, గోపాలపట్నం, బుచ్చిరాజుపాలెం, ప్రహ్లాదపురం మీదుగా భక్తులు తిరిగి సింహాచలం దేవస్థానానికి చేరుకున్నారు. మొత్తం 32 కిలోమీటర్ల మేర ప్రదక్షిణ చేసిన అనంతరం.. వరాహ లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకుంటున్నారు. విశాఖ వాసులతో పాటు చుట్టుపక్కల జిల్లాలు, ఒడిశా రాష్ట్రం నుంచి కూడా భక్తులు అధికసంఖ్యలో గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు. ఏటా గిరి ప్రదక్షిణ రోజు నగరంలో వర్షం కురవడం ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం సాయంత్రం కూడా వర్షం కురవడంతో సింహాద్రి అప్పన్న మహిమ అంటూ.. భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, సీపీతో కలిసి గిరి ప్రదక్షిణ మార్గాల్లో భక్తులకు ఏర్పాటు చేసిన సౌకర్యాల్ని పరిశీలించారు. సముద్రస్నానం చేసే భక్తులకు అప్పూఘర్ వద్ద ఏర్పాట్లు చేశారు. అనేకమంది భక్తులు సముద్రస్నానం ఆచరించి మళ్లీ ప్రదక్షిణ కొనసాగించి.. స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు సీపీ త్రివిక్రమవర్మ ఆధ్వర్యంలో 2,100 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం ప్రభుత్వం నిషేధించిన నేపథ్యంలో భక్తులు గిరిప్రదక్షిణ సమయంలోను, స్వామి దర్శన సమయంలోను ప్లాస్టిక్ వస్తువులు వినియోగించకుండా జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ చర్యలు చేపట్టారు. జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఎస్ఈ వేణుగోపాల్ ఆధ్వర్యంలో మొత్తం 102 పాయింట్లలో 7.34 లక్షల మందికి మంచినీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించారు. భక్తులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు 31 వైద్య శిబిరాలను వైద్యారోగ్య శాఖ ఏర్పాటు చేసింది. 20కి పైగా ప్రైవేట్ ఆస్పత్రులు కూడా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి భక్తులకు సేవలందించాయి. ప్రతి రెండు కిలోమీటర్లకు ఒక అంబులెన్స్ వంతున మొత్తం 16 అంబులెన్స్‌లను ఉంచారు. గిరి ప్రదక్షిణ మార్గములో పలు స్వచ్ఛంద సేవాసంస్థలు స్టాల్స్ ఏర్పాటు చేసి భక్తులకు ఉచితంగా తాగునీరు, శీతలపానీయాలు, మజ్జిగ, టీ, బాదంపాలు, అన్న ప్రసాదాలు పంపిణీ చేశాయి.

నేడు ఆషాఢ పౌర్ణమి
గిరి ప్రదక్షిణ అనంతరం సోమవారం ఆషాఢ పౌర్ణమి సందర్భంగా సింహాద్రి అప్పన్నని లక్షలాది మంది దర్శించుకోనున్నారు. స్వామి దర్శనం సులభంగా జరిగేందుకు వీలుగా ప్రస్తుతం ఉన్న క్యూ లైన్లకు అదనంగా క్యూ లైన్లను కొండపైన ఉన్న బస్టాండ్ నుంచి ప్రారంభమయ్యేలా ఏర్పాటు చేశారు. సోమవారం ఆర్జితసేవల్ని రద్దుచేసిన దేవస్థానం.. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు స్వామి దర్శనానికి అనుమతి వేళలుగా నిర్ణయించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు నిత్యాన్నదానం చేయనున్నారు.

దుర్గమ్మకు తెలంగాణ బంగారు బోనం

- సమర్పించిన 'శ్రీమహంకాళి ఉత్సవాల' ఊరేగింపు కమిటీ
- రెండో రోజూ వైభవంగా శాకంబరీదేవి ఉత్సవాలు


దుర్గమ్మకు తెలంగాణ నుంచి బంగారు బోనం తీసుకొస్తున్న జోగుల శ్యామల, చిత్రంలో దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న దుర్గమ్మకు హైదరాబాద్ భాగ్యనగర్ శ్రీమహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆదివారం బంగారు బోనం సమర్పించింది. 11 రకాల బోనాలు, పట్టుచీర, పసుపు, కుంకుమ, పూజా సామగ్రి బంగారు బోనంతో పాటు అందజేసింది. బ్రాహ్మణ వీధిలోని జమ్మిదొడ్డి వద్ద అమ్మవారి ఉత్సవ విగ్రహానికి కమిటీ ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీన్‌మార్ డప్పులు, కోలాట నృత్యాలు, పోతురాజుల విన్యాసాల మధ్య ఇంద్రకీలాద్రికి చేరిన ఊరేగింపునకు దుర్గగుడి చైర్మన్ రాంబాబు, ఈవో భ్రమరాంబ, ఆలయ అర్చకులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయ అర్చకులకు బంగారు బోనం అందజేశారు. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న శాకంబరీదేవి ఉత్సవాలు ఆదివారం రెండో రోజూ వైభవంగా కొనసాగాయి. రికార్డు స్థాయిలో సుమారు 70 వేల పైచిలుకు భక్తులు అమ్మవారిని శాకంబరీదేవిగా దర్శించుకున్నారు. కాగా, దుర్గమ్మను శాకంబరీదేవి అలంకారంలో రాష్ట్ర శాసన సభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆదివారం దర్శించుకున్నారు.

చంద్రబాబు అండ్ కోకు బుద్ధిచెప్పే రోజు దగ్గర్లోనే..

- 1,008వ రోజు రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు


రిలే దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: బహుజనులకు మేలు జరుగుతుంటే కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్న బాబు అండ్ కోకు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని బహుజన పరిరక్షణ సమితి నేతలు హెచ్చరించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1008వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో ఆదివారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. రాజధాని ప్రాంతంలో పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేస్తే వీరికి వచ్చిన నష్టమేంటో చెప్పాలని కోరారు. ఓ వైపు ప్రజా రాజధాని అంటూ మరోవైపు తమ సామాజికవర్గానికి పెద్దపీట వేసిన చంద్రబాబు ఈ ప్రాంతంలో ఇతరులకు చోటు లేకుండా చేయాలని పన్నిన కుట్రలు భగ్నం అవుతుండటంతో తట్టుకోలేక తప్పుడు ప్రచారాలకు దిగుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం అడ్డుపెట్టుకుని ఎల్లో మీడియాకు దోచిపెట్టిన బాబుకు ఇప్పుడు ఎల్లో మీడియా భజన చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రజలు అన్నీ గమనిస్తున్నారని.. రానున్న ఎన్నికల్లో కులవాదులకు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నేతలు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పులి దాసు, పల్లె బాబు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ

టాపర్లంతా ముంబై ఐఐటీ వైపే

- ఎక్కువ మంది కంప్యూటర్ సైన్స్‌కే
- టాప్ 100లో 89 మంది ఇదే బాట

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో ఎక్కువ మంది టాపర్లు కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌కే ప్రాధాన్యతనిచ్చారు. తాజాగా వెల్లడించిన తొలి దశ సీట్ల కేటాయింపులో ఈ విషయం స్పష్టమైంది. ఐఐటీల్లో ఎక్కువ మంది టాపర్లు ముంబై ఐఐటీకే మొదటి ప్రాధాన్యతనిచ్చి ఎక్కువ మంది అక్కడే సీట్లు పొందారు. ఇక్కడ పోటీ తీవ్రంగా ఉండటంతో 66వ ర్యాంకు వరకే సీట్లు వచ్చాయి. అడ్వాన్స్‌డ్‌లో టాప్ వందలో ర్యాంకులు పొందిన 89 మంది తొలి ప్రాధాన్యతగా ముంబై ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌ను ఎంచుకున్నారు. గత ఏడాది టాప్ 100లో 93 మంది ఐఐటీ ముంబైలో కంప్యూటర్ సైన్స్ కోర్సుకు ఆప్షన్ ఇచ్చారు.

రోజుకు 2,000

▶ మొదటి పేజీ తరువాయి

పంపిణీ చేసింది. కులం, మతం, ప్రాంతం, రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హత ఒక్కటే ప్రామాణికంగా పారదర్శకంగా ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. దీంతో ఏపీలో అత్యధిక ఇళ్ల నిర్మాణానికి అనుమతులు వచ్చాయి. మంజూరైన ఇళ్ల పనులను మొదలు పెట్టడంలో ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. వేగంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి అవసరమైన వనరులను వైఎస్సార్ జగనన్న కాలనీల్లో కల్పించడం, లబ్ధిదారులకు సబ్సిడీపై నిర్మాణ సామాగ్రి సరఫరా చేయడం వంటి చర్యలను ప్రభుత్వం తీసుకుంది. పేదల ఇళ్ల నిర్మాణాల పట్ల ప్రభుత్వం కనబరుస్తున్న చిత్తశుద్ధిని చూసి ఇటీవలే సీఆర్‌డీఏ పరిధిలో 47వేల ఇళ్ల నిర్మాణాలకు కేంద్ర గృహ నిర్మాణ శాఖ అనుమతులు ఇచ్చింది.


కుట్రలను అధిగమించి
నిరుపేదలకు ఇళ్ల పట్టాల పంపిణీని అడ్డుకునేందుకు టీడీపీ విశ్వ ప్రయత్నాలు చేసింది. కోర్టులను ఆశ్రయించి న్యాయ వివాదాలు సృష్టించేందుకు ప్రయత్నించింది. ఈ అవరోధాలను అధిగమించి 2020 డిసెంబర్‌లో 30.6 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ప్రభుత్వం ఇళ్ల పట్టాలను పంపిణీ చేసింది. రిజిస్ట్రేషన్, జియో ట్యాగింగ్ పూర్తి చేసి ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించే సమయంలో కోవిడ్ రెండో విడత ప్రారంభం అయింది. దీంతో కొన్ని నెలల పాటు కార్యకలాపాలు నిలిచిపోయాయి. 2021 జూలైలో మెగా గ్రౌండింగ్ మేళా నిర్వహించి తొలి దశలో 15.6 లక్షల గృహ నిర్మాణాలను ప్రారంభించారు. నిర్మాణాలు చురుగ్గా సాగుతున్న సమయంలో మరోమారు టీడీపీ కోర్టుల్లో కేసులు వేయడంతో కొద్ది నెలలు పనులు నిలిచిపోయాయి. విశాఖ, సీఆర్‌డీఏ పరిధిలో ఇళ్ల పట్టాల పంపిణీని కూడా కోర్టుల ద్వారా అడ్డుకోవాలని ప్రయత్నించారు. విశాఖ కేసులో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు రావడంతో గత ఏడాది ఏప్రిల్ నెలలో 1.24 లక్షల ఇళ్ల పట్టాలను పంపిణీ చేసి నిర్మాణాలు ప్రారంభించారు.

వైఎస్సార్ జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల వ్యయం ఇలా

సదుపాయం	వ్యయం రూ.కోట్లలో
తాత్కాలిక మౌలిక సదుపాయాలు	3,117
నీటి సరఫరా	4,128
విద్యుత్, ఇంటర్నెట్	7,989
డ్రైనేజీ, సీవరేజ్	7,227
రోడ్లు, ఆర్చ్‌లు	10,251
పట్టణ ప్రాంత లేఅవుట్లలో వసతుల కల్పన	3,314
మొత్తం వ్యయం	రూ.36,026 కోట్లు

అమెరికాలో అద్దంకి వాసి మృతి

- నీళ్లలో మునుగుతున్న కుమారుడిని రక్షించి ప్రాణాలు విడిచిన తండ్రి


రాజేశ్ కుమార్ (ఫైల్)

అద్దంకి: ఉద్యోగ రీత్యా అమెరికాలో నివసిస్తున్న బాపట్ల జిల్లా అద్దంకి వాసి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందిన ఘటన భారత కాలమానం ప్రకారం శనివారం జరిగింది. అందిన సమాచారం మేరకు పట్టణానికి చెందిన పొట్టి రాజేశ్ కుమార్(42) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఫ్లోరిడాలో పనిచేస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి బీచ్‌కు వెళ్లాడు. బీచ్‌లో స్నానం చేస్తున్న కుమారుడు మునిగిపోతుండటంతో నీళ్లలోకి వెళ్లి కుమారుడిని రక్షించి తాను ప్రమాదవశాత్తు నీళ్లలో మునిగి మృతిచెందాడు. ప్రజాప్రతినిధులు, అధికారులు మృతదేహాన్ని పట్టణానికి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

స్టే సేఫ్ ఆన్‌లైన్ క్విజ్

- ఆన్‌లైన్ మోసాలపై అవగాహనకు..
- పోటీల గడువు ఈనెల 31

సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా అవగాహన పెంచేందుకు కేంద్ర హోంశాఖ వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా 'స్టే సేఫ్ ఆన్‌లైన్..' నేపథ్యంతో ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తోంది. పోటీలకు ఈనెల 31 వరకు గడువుందని అధికారులు పేర్కొన్నారు. ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనదలచిన వారు https://www.mygov.in/staysafeonline లింక్ పై క్లిక్ చేస్తే అదనపు వివరాలు తెలుస్తాయని వెల్లడించారు. టెలిగ్రామ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, https://t.me/ssoindia లింక్ ద్వారా గ్రూప్‌లో చేరొచ్చు. ఈ ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనే వారికి ఒక్కొక్కరికి 10 ప్రశ్నలు ఇస్తారు.. 5 నిమిషాల వ్యవధిలో వీటికి సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. క్విజ్‌లో టాప్ 10లో నిలిచే విజేతలకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున నగదు పురస్కారం ఇవ్వనున్నారు. క్విజ్‌లో పాల్గొని 50 శాతానికి పైగా మార్కులు సాధించిన వారికి డిజిటల్ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు జారీ చేస్తారు.

క్లుప్తంగా...

ట్వీట్లకు పరిమితులు

ట్విట్టర్ వినియోగదారులకు ఎలన్ మస్క్ షాక్


శాన్ ఫ్రాన్సిస్కో: సామాజిక మాధ్యమం ట్విట్టర్ వినియోగదారులకు ఆ సంస్థ యజమాని ఎలాన్ మస్క్ గట్టి షాక్ ఇచ్చారు. ప్రతీరోజూ ట్వీట్లను చూడడానికి పరిమితి విధించారు. వెరిఫైడ్, అన్‌వెరిఫైడ్ అకౌంట్లకు వేర్వేరు పరిమితులు విధించారు. అన్‌వెరిఫైడ్ అకౌంట్ యూజర్లు రోజుకి 600 పోస్టులు మాత్రమే చూడగలరని, వెరిఫైడ్ ఖాతాదారులు రోజుకి 6 వేల పోస్టులు చూడగలరని శనివారం ఒక ట్వీట్ ద్వారా వెల్లడించారు. త్వరలో ఈ ట్వీట్ల సంఖ్యను అన్‌వెరిఫైడ్ అకౌంట్లకు 800కి వెరిఫైడ్ అకౌంట్లకి 8 వేలకు పెంచుతామని చెప్పారు. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా ట్విట్టర్ వినియోగదారులకి శనివారం ట్విట్టర్ యాక్సెస్‌లోకి రాలేదు. కొందరు ట్వీట్లు చేస్తుంటే కెనాట్ రిట్రైవ్ ట్వీట్స్, లిమిట్ ఎక్సీడెడ్ అన్న మెసేజీలు వచ్చాయి. దీంతో ట్విట్టర్ డౌన్ హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్‌లోకి వచ్చింది. ట్విట్టర్ డేటాను చాట్‌జీపీటీ వంటి కృత్రిమ మేధతో పని చేసే వ్యవస్థలకి శిక్షణ ఇవ్వడానికి దుర్వినియోగం చేస్తున్నారని, అందుకే ఈ పరిమితులు వచ్చాయని చెప్పారు.

పనితీరులో సింగపూర్ టాప్



బెర్లిన్: అంతర్జాతీయంగా అగ్రరాజ్యాలైన బ్రిటన్, అమెరికా ప్రభ మరింతగా దిగజారిపోతున్నట్టుగా కనిపిస్తోంది. బ్రిటన్‌ను అత్యుత్తమ దేశంగా అక్కడ ప్రజలు అనుకుంటారేమో కానీ జర్మనీకి చెందిన వర్జ్‌బర్గ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు చేసిన అధ్యయనంలో టాప్ -10 దేశాల్లో బ్రిటన్‌కు చోటు లభించలేదు. అత్యంత సమర్థంగా పని చేస్తున్న దేశాల జాబితాలో ఫిన్‌లాండ్ వంటి దేశాల తర్వాత 13వ స్థానంలో బ్రిటన్ నిలిస్తే, అగ్రరాజ్యం అమెరికా 23వ స్థానంలో ఉంది. నిఫ్టీ పొలిటికల్ టూల్ సాయంతో 173 దేశాల్లో రోడ్లు, నీళ్లు, విద్యుత్, స్కూళ్లు, ఆస్పత్రులు, పోలీసులు వంటివన్నీ పరిగణనలోకి తీసుకుని ర్యాంకులు ఇచ్చారు. డాక్టర్ దగ్గర వేచి చూసే సమయం దగ్గర్నుంచి విద్యుత్ సదుపాయం వరకు ప్రతీ రంగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఇక అత్యుత్తమ పని తీరు కనబరిచిన దేశంగా సింగపూర్ అగ్రభాగంలో ఉంటే లిబియా అట్టడుగున నిలిచింది. సింగపూర్, ఆస్ట్రేలియా, డెన్మార్క్, నెదర్లాండ్స్, ఎస్తోనియా అగ్రభాగంలో ఉన్నాయి. భారత్ 110వ స్థానంలో ఉంది.

'మహా' కుదుపు



డెప్యూటీ సీఎంగా ప్రమాణం చేశాక సంతకం చేస్తున్న అజిత్

మహారాష్ట్రలో రెండుగా చీలిపోయిన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ

- శరద్ పవార్‌కు షాకిస్తూ షిండే సర్కార్‌లో చేరిన అజిత్ పవార్
- ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం
- ఎనిమిది మంది ఎన్సీపీ ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు
- ఎన్నికల్లో ఎన్సీపీ పేరు, గుర్తుపైనే పోటీ చేస్తామన్న అజిత్
- మద్దతు కోసం ప్రజల్లోకి వెళ్తానన్న శరద్ పవార్

ముంబై/పుణే/న్యూఢిల్లీ: మహారాష్ట్ర రాజకీయాల్లో మరో అలజడి. జాతీయ స్థాయిలో బీజేపీ వ్యతిరేక కూటమి కోసం జరుగుతున్న ప్రయత్నాల్లో చురుగ్గా వ్యవహరిస్తున్న నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) అధినేత శరద్ పవార్‌కు పెద్ద షాక్ తగిలింది. ఆయన సోదరుడి కుమారుడు, ఎన్సీపీ సీనియర్ నాయకుడు అజిత్ పవార్ తన వర్గం ఎమ్మెల్యేలతో కలిసి వేరు కుంపటి పెట్టుకున్నారు. ఆదివారం బీజేపీ-శివసేన(షిండే వర్గం) ప్రభుత్వంలో చేరారు. ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అజిత్ వర్గం ఎమ్మెల్యేల్లో ఎనిమిది మందికి మంత్రి పదవులు లభించాయి. మహారాష్ట్రలో ఒక్కరోజులోనే పరిణామాలు వేగంగా మారిపోయాయి. అజిత్ పవార్‌తో ఉప ముఖ్యమంత్రిగా, ఛగన్ భుజ్‌బల్, దిలీప్ వాల్సే పాటిల్, హసన్ ముష్రీఫ్, ధనుంజయ్ ముండే, ఆదితీ తట్కారే, ధర్మారావు , అనిల్ పాటిల్, సంజయ్ బాంసోడేతో మంత్రులుగా రాష్ట్ర గవర్నర్ రమేశ్ రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారోత్సవంలో స్పీకర్ తోపాటు డిప్యూటీ స్పీకర్ నరహరి, ఎన్సీపీ కార్య నిర్వాహక అధ్యక్షుడు ప్రఫుల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

విపక్ష నేత పదవికి అజిత్ రాజీనామా

అజిత్ పవార్ తొలుత ముంబైలోని తన అధికారిక నివాసం 'దేవగిరి'లో ఎన్సీపీ ఎమ్మెల్యేలతో, కొందరు నాయకులతో సమావేశమయ్యారు. భేటీ అనంతరం శాసనసభలో ప్రతిపక్ష నేత పదవికి అజిత్ రాజీనామా చేశారు. ఈ రాజీనామాను ఆమోదించినట్లు అసెంబ్లీ స్పీకర్ ప్రకటించారు. ఆ తర్వాత అజిత్ తన ఎమ్మెల్యేలలో కలిసి రాజ్‌భవన్‌కు చేరుకొని, ప్రమాణ స్వీకారం చేశారు. మహారాష్ట్రలో ఎన్సీపీకి 53 మంది ఎమ్మెల్యేలు ఉండగా, వీరిలో 40 మంది తమ ప్రభుత్వానికి మద్దతిస్తున్నారని మహారాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ బవాంకులే స్పష్టం చేశారు. అయితే, అజిత్ పవార్‌కు 36 మంది ఎన్సీపీ ఎమ్మెల్యేలు మద్దతు ప్రకటించారని ఆయన సన్నిహితుడొకరు చెప్పారు.

దేశ, రాష్ట్ర అభివృద్ధి కోసమే చేరాం: అజిత్

దేశ, రాష్ట్ర అభివృద్ధి కోసమే ప్రభుత్వంలో చేరామని అజిత్ చెప్పారు. ప్రభుత్వంలో చేరాలన్న నిర్ణయానికి పార్టీ ప్రజాప్రతినిధులందరూ మద్దతునిచ్చారని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తమ పార్టీలో ఎలాంటి చీలిక లేదని, భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో ఎన్సీపీ పేరుతో, ఎన్సీపీ గుర్తుపైనే పోటీ చేస్తామని అన్నారు. పరిపాలనలో తమకు ఎంతో అనుభవం ఉందని, ప్రజలకు మేలు చేయడానికి ఈ అనుభవాన్ని ఉపయోగించుకుంటామని వ్యాఖ్యానించారు. తనతోపాటు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన ఎనిమిది మందికి త్వరలోనే శాఖలు కేటాయించనున్నట్లు అజిత్ వెల్లడించారు. ఎన్సీపీ ఎమ్మెల్యేలంతా తమ వెంటే ఉన్నారన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంపై అజిత్ ప్రశంసల వర్షం కురిపించారు. కాగా, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఇప్పుడు ట్రిబుల్ ఇంజన్ ప్రభుత్వంగా మారిందని మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే అన్నారు. ఒక ముఖ్యమంత్రి, ఇద్దరు ఉప ముఖ్యమంత్రులతో అభివృద్ధి ఇక వేగం పుంజుకుటుందని ధీమా వ్యక్తం చేశారు.

అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా జితేంద్ర అవద్

మహారాష్ట్ర శాసనసభలో ప్రతిపక్ష నేతగా ఎన్సీపీ ఎమ్మెల్యే జితేంద్ర అవద్ నియమితులయ్యారు. ఈ విషయాన్ని ఎన్సీపీ ప్రకటించింది. ఇప్పటిదాకా ప్రతిపక్ష నేతగా పనిచేసిన అజిత్ పవార్ రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో జితేంద్రను నియమించినట్లు పేర్కొంది. పార్టీ ఎమ్మెల్యేలంతా తాను చేసే విప్‌నకు కట్టుబడి ఉండాలని జితేంద్ర అవద్ పేర్కొన్నారు.

బీజేపీ వాషింగ్ మెషీన్..: కాంగ్రెస్

మహారాష్ట్ర రాజకీయ వ్యవహారాలపై కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ వ్యంగ్యంగా స్పందించారు. బీజేపీ వాషింగ్ మెషిన్ మళ్లీ పని ప్రారంభించిందని అన్నారు. తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎన్సీపీ నాయకులు మహారాష్ట్ర ప్రభుత్వంలో చేరారని, ఇక వారందరికీ క్లీన్ చిట్ వస్తుందని చెప్పారు. బీజేపీ కబంధ హస్తాల నుంచి మహారాష్ట్రకు విముక్తి కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు.

శరద్‌కు ఖర్గే, రాహుల్ గాంధీ మద్దతు

ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌కు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీనియర్ నేత రాహుల్ గాంధీ మద్దతు ప్రకటించారు. ఇద్దరు నేతలు పవార్‌తో ఫోన్‌లో మాట్లాడి తాజా పరిస్థితి తెల్సుకున్నారు.

పార్టీని ధిక్కరించినవారిపై చర్యలు తప్పవు: శరద్ పవార్

పార్టీని ధిక్కరించి, ప్రభుత్వంలో చేరిన వారిపై చర్యలు తీసుకోవడం ఖాయమని ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ తేల్చిచెప్పారు. త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఆయన ఆదివారం పుణేలో మీడియాతో మాట్లాడారు. పార్టీలో చోటుచేసుకున్న తాజా పరిణామాలపై స్పందిస్తూ.. ఇలాంటివి చూడడం తనకు కొత్తేమీ కాదన్నారు. బీజేపీ-శివసేన ప్రభుత్వం చేరాలన్నది తమ పార్టీ నిర్ణయం ఎంతమాత్రం కాదన్నారు. కొందరు నాయకులు కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులకు భయపడి ప్రభుత్వంలో చేరినట్లున్నారని అభిప్రాయపడ్డారు. ఇది తన ఇంటి సమస్య కాదని, ప్రజల సమస్య అని చెప్పారు. మద్దతు కోసం సోమవారం నుంచే ప్రజల్లోకి వెళ్తానని, పార్టీని పునర్నిర్మిస్తానని శరద్ పవార్ పేర్కొన్నారు. త్వరలో తమ పార్టీ నాయకులతో సమావేశమవుతానని, పార్టీకి సంబంధించిన నిర్ణయాలపై చర్చిస్తామని తెలిపారు. జాతీయ స్థాయిలో త్వరలో జరిగే విపక్షాల సమావేశంలో తాను పాల్గొంటానని ఉద్ఘాటించారు.

రాష్ట్రంలో నాలుగేళ్లుగా అస్థిరతే

నాలుగేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో బీజేపీతో కలిసి పోటీ చేసిన శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే ఎన్నికల తర్వాత ఆ పార్టీతో తెగతెంపులు చేసుకున్నారు. ముఖ్యమంత్రి పదవి కోసం ఉద్ధవ్ ఠాక్రే పట్టుబట్టగా బీజేపీ అంగీకరించకపోవడమే ఇందుకు కారణం. దాంతో కొన్నాళ్లు రాష్ట్రపతి పాలన కొనసాగింది. తర్వాత బీజేపీకి అజిత్ అండగా నిలిచారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బీజేపీ నేత ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రిగా అజిత్ ప్రమాణం చేశారు. ఆ ప్రభుత్వం కేవలం 80 గంటలపాటు మనుగడ సాగించింది. ఉద్ధవ్ ఠాక్రే ఎన్సీపీ, కాంగ్రెస్‌తో చేతులు కలిపారు. ఎన్సీపీ, కాంగ్రెస్, శివసేన కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. గత ఏడాది జూన్‌లో శివసేన నేత షిండే తిరుగుబాటు చేశారు. శివసేనలో చీలిక ఏర్పడింది. ఎంవీఏ ప్రభుత్వం కూలింది. బీజేపీతో మద్దతుతో షిండే గత ఏడాది జూన్ 30న ముఖ్యమంత్రి అయ్యారు. సరిగ్గా ఏడాది తర్వాత ప్రభుత్వంలో అజిత్ చేరడం ఆసక్తికరంగా మారింది.

నాలుగేళ్లలో మూడుసార్లు డిప్యూటీ సీఎం

అజిత్ పవార్.. ఎన్సీపీని నిట్ట నిలువుగా చీల్చి మరోసారి మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పదవిని చేజిక్కించుకున్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో హంగ్ అసెంబ్లీ వచ్చినప్పుడు బీజేపీ ప్రభుత్వానికి మద్దతునిచ్చి కొద్ది రోజులు ఉప ముఖ్యమంత్రి పదవిలో ఉన్న ఆయన ఇప్పుడు అధినేత శరద్ పవార్‌కు షాక్ ఇస్తూ పార్టీని చీల్చారు. 2019 నవంబర్ నుంచి 2022 జూన్ వరకు ఉద్ధవ్ ఠాక్రే ముఖ్యమంత్రిగా మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా పని చేశారు. అజిత్ 2019 తర్వాత ముచ్చటగా మూడోసారి ఉప ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. గతంలో కూడా కాంగ్రెస్-ఎన్సీపీ కలిసి 15 ఏళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన సమయంలో అశోక్ చవాన్, పృథ్వీరాజ్ చవాన్ హయాంలో డిప్యూటీ సీఎంగా చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీలో గట్టి పట్టున్న నాయకుడు. ప్రస్తుతం అజిత్ పవార్ సన్నిహితులు, కుటుంబ సభ్యులు వారి వారి చక్కెర సహకార సంఘాల్లో అవినీతి ఆరోపణల్ని, ఈడీ కేసుల్ని ఎదుర్కొంటున్నారు. అజిత్ పవార్ పార్టీని చీల్చడానికి ఈ కేసులు కూడా ఒక

అజిత్ పవార్ పొలిటికల్ పవర్ ఇదీ!

కారణమన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అజిత్ పవార్ రాష్ట్రంలో నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు 70 వేల కోట్ల కుంభకోణం చేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ ఏడాది మేలో ఎన్సీపీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి, కార్యకర్తల ఒత్తిడితో శరద్ పవార్ వెనక్కి తీసుకున్న సమయంలో అజిత్ పవార్ ఢిల్లీలో బీజేపీ పెద్దల్ని కలుసుకున్నారు. ఇక శరద్ పవార్ తన కుమార్తె సుప్రియా సూలేకి పార్టీ రాష్ట్ర అధ్యక్ష పగ్గాలు అప్పజెప్పడం అజిత్ పవార్‌కు మింగుడు పడలేదని, అందుకే ఆయ పార్టీని చీల్చారన్నది బహిరంగ రహస్యమే.

మహారాష్ట్రలో పార్టీల బలాబలాలు

2019 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు

పార్టీ	స్థానాలు
బీజేపీ	105
శివసేన	56
ఎన్సీపీ	54
కాంగ్రెస్	44
ఇతర పార్టీలు+స్వతంత్రులు	29
★ మొత్తం అసెంబ్లీ స్థానాలు	288

ప్రస్తుతం పార్టీల బలాబలాలు

పార్టీ	స్థానాలు
బీజేపీ	105
శివసేన(ఉద్ధవ్ ఠాక్రే)	16
శివసేన(షిండే)	40
ఎన్సీపీ(శరద్ పవార్)	18
ఎన్సీపీ(అజిత్ పవార్)	36
కాంగ్రెస్	44
ఇతర పార్టీలు+స్వతంత్రులు	29

బీజేపీ వ్యతిరేక కూటమి యత్నాలకు దెబ్బ!

న్యూఢిల్లీ: ఎన్సీపీలో అనూహ్య చీలిక మహారాష్ట్రలోనేకాదు జాతీయ స్థాయిలో ప్రకంపనలు కలిగిస్తోంది. ఎక్కువ మంది ఎమ్మెల్యేలను అజిత్ తనవెంట తీసుకెళ్లడంతో శరద్ పవర్‌కు సొంత పార్టీలో బలం తగ్గింది. ఇలాంటి పరిస్థితుల్లో విపక్షాల ఐక్యతకు తనవంతు బలం ఇచ్చే స్థాయిలో శరద్ ప్రస్తుతం లేరనే చెప్పాలి. దీంతో గత నెలలో పట్నాలో 15 ప్రతిపక్ష పార్టీల ఐక్యత చేసిన యత్నానికి జోరు కాస్తంత తగ్గంది. ఇప్పటికే ఢిల్లీ రాష్ట్రంలో పాలనపై సర్వాధికారం విషయంలో ఆర్డినెన్స్‌కు సంబంధించి ఆప్, కాంగ్రెస్ మధ్య పొసగలేదు. అటు పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్ మధ్య బాహాటంగా మాటల తూటాలు పేలాయి. కేరళలోనూ కాంగ్రెస్, సీపీఎంలకూ కుదరట్లేదు. తాజాగా అజిత్ ఇచ్చిన షాక్‌తో 2024 ఎన్నికల్లో బీజేపీ మోదీ ప్రభుత్వాన్ని ఐక్యంగా ఢీకొట్టాలన్న ప్రయత్నాలకు కాస్తంత బ్రేక్ పడినట్లయింది. విపక్షాలను ఏకం చేయడంలో ఇప్పటి వరకు కీలకంగా ఉన్న శరద్ పవార్ ముందుముందు ఎలా స్పందిస్తారనే దానిపై ఆధారపడి ఉంది.

మహారాష్ట్రలో బీజేపీకి ఊపు

మహారాష్ట్ర రాజకీయాల్లో కొద్దికాలంగా బీజేపీకి పెద్దగా ప్రాధాన్యం దక్కలేదు. షిండే ప్రభుత్వంలో చేరాలన్న అజిత్ నిర్ణయంతో ఆ పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. రాష్ట్రంలో బీజేపీ మళ్లీ కీలకంగా మారే సమయం వచ్చింది. లోక్‌సభ ఎన్నికల సమయానికి తన స్థానాన్ని పదిలం చేసుకునేందుకు అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం మహారాష్ట్ర ప్రభుత్వంలోని మూడు పార్టీలు మూడు శక్తివంతమైన వర్గాలకు నాయకత్వం సాధించే స్థాయిలో ఉన్నాయి. మహావికాస్ అఘాడి(ఎంవీఏ)పై బీజేపీ పైచేయి సాధించేందుకు అవకాశం చిక్కింది.




మొసలిని ముద్దాడుతున్న ఈయన మెక్సికోలోని శాన్ పెడ్రో హువామెలులా పట్టణ మేయర్ విక్టర్ హ్యూగో సోసా. విషయమేంటంటే ఈ మొసలిని ఈయన పెళ్లి చేసుకున్నారు. ఇక్కడ గత 230 ఏళ్లుగా ఈ ఆచారం కొనసాగుతోంది. చొంటల్, హువే జాతుల మధ్య విద్వేషం తొలగిపోయి శాంతి నెలకొనేందుకు సూచికగా ఇలా పెళ్లితంతు జరుపుతారు.

సూర్యకాంతిని అడ్డుకుందాం

కొత్త పరిశోధన ప్రారంభించిన అమెరికా

వాషింగ్టన్: ఆధునిక యుగంలో మానవాళిని బెంబేలెత్తిస్తున్న అతిపెద్ద సమస్య వాతావరణ మార్పులు. వేడెక్కుతున్న భూగోళం, ఒకవైపు ముంచెత్తుతున్న వరదలు, మరోవైపు తీవ్రమైన కరువులు, పడిపోతున్న పంటల దిగుబడి.. ఇవన్నీ వాతావరణ మార్పుల సంభవిస్తున్న ప్రతికూల ప్రభావాలే. కాలుష్యానికి తోడు నానాటికీ పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలు వాతావరణ మార్పులకు కారణమవుతున్నాయి. రక్షణ కవచంగా ఉన్న ఓజోన్ పొర క్షీణిస్తుండడంతో ప్రమాదకరమైన అతినీలలోహిత కిరణాలు నేరుగా భూమిని తాకుతున్నాయి. సూర్యుడి నుంచి వెలువడుతున్న తీవ్రమైన వేడికి భూమి అగ్నిగుండంగా మారిపోతోంది. అలాంటప్పుడు ఈ సమస్య పరిష్కారానికి సూర్యకాంతి భూమిపై పడకుండా అడ్డుకుంటే ఎలా ఉంటుందన్న ఆలోచన అమెరికా ప్రభుత్వానికి వచ్చింది. దీనిపై పరిశోధనకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు 'వైట్‌హౌస్ ఆఫీస్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పాలసీ' ఓ నివేదిక విడుదల చేసింది. వాతావరణ మార్పుల నుంచి భూమిని కాపాడుకోవాలన్నదే ఈ పరిశోధన ఉద్దేశం. జియో ఇంజనీరింగ్ విధానంతో సూర్యకాంతి భూమిపై పడకుండా అడ్డుకోవడం ఎలా అన్నదానిపై పరిశోధన చేస్తున్నట్లు తెలియజేసింది. సూర్యుడి నుంచి వెలువడే తీవ్రమైన ఉష్ణోగ్రతలను ఆకాశంలోని మేఘాలను మరింత మందంగా మార్చడం ద్వారా అడ్డుకోవచ్చని సైంటిస్టులు చెబుతున్నారు. ఈ పద్ధతిని సిరస్ క్లౌడ్ థిన్నింగ్ అంటారు. జియో ఇంజనీరింగ్ అమలు చేయడం సులభమేనని వారి వాదన. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు అధికం. ఆ సమయంలో క్లౌడ్ థిన్నింగ్ చేయాలన్న యోచనలో ఉన్నారు.



మోదీ అధ్యక్షతన నేడు కేబినెట్ భేటీ

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సోమవారం కేంద్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఉంటుందని వార్తలు ఊపందుకుంటున్న వేళ జరుగుతున్న ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. తాజాగా, ఎన్సీపీ నుంచి వేరు కుంపటి పెట్టుకుని బీజేపీ-శివసేన ప్రభుత్వంలో అజిత్ పవార్ వర్గం చేరికపైనా చర్చించే అవకాశాలున్నాయి. ప్రగతి మైదాన్‌లో కొత్తగా నిర్మించిన కన్వెన్షన్ సెంటర్‌లో సమావేశం ఉంటుందని సమాచారం. హోంమంత్రి అమిత్ షా, బీజేపీ చీఫ్ జేపీ నడ్డా తదితర అగ్రనేతలు ఇటీవలి కాలంలో పలుదఫాలుగా అంతర్గత చర్చలు జరపడంతో మంతివర్గ పునర్వ్యవస్థీకరణ చేపడతారనే ఊహాగానాలకు బలం చేకూరింది. తాజాగా శరద్ పవార్‌ను వీడి అజిత్ పవార్ వెంట బయటకు వచ్చిన సీనియర్ ఎన్సీపీ ఎంపీ ప్రఫుల్ పటేల్‌కూ ఇందులో అవకాశం ఇవ్వొచ్చని తెలుస్తోంది. ఈ ఏడాదిలోనే కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీలకు ఎన్నికలు, వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన సంస్థాగతమైన మార్పులపైనా చర్చిస్తారని తెలుస్తోంది.

ఫ్రాన్స్‌లో ఐదో రోజూ అల్లర్లు

పారిస్: ఫ్రాన్స్‌లో అల్లర్లు ఐదో రోజూ కొనసాగాయి. ఆందోళనకారులు మేయర్ నివాసంపైకి మండుతున్న కారుతో దూసుకువచ్చి దాడికి యత్నించారు. పోలీసులతో ఆందోళనకారులు పలు చోట్ల బాహాబాహీకి దిగారు. అయితే, గత నాలుగు రోజులతో పోలిస్తే అల్లర్ల తీవ్రత తగ్గింది. దేశవ్యాప్తంగా భారీ సంఖ్యలో మోహరించిన పోలీసులు శనివారం రాత్రి మరో 719 మంది నిరసనకారులను అరెస్ట్ చేశారు. మంగళవారం పారిస్ శివారులోని నాంటెర్రెలో ట్రాఫిక్ పోలీసులు నేహల్ అనే యువకుడిని కాల్చి చంపడంతో ఆగ్రహజ్వాలలు చెలరేగిన విషయం తెలిసిందే. నేహల్ అంత్యక్రియలు శనివారం ముస్లిం సంప్రదాయం ప్రకారం నిర్వహించారు. శనివారం రాత్రి పారిస్‌లో చాంప్స్ ఎలిసీస్ వద్ద గుమికూడిన యువకుల గుంపును పోలీసులు లాఠీచార్జితో చెదరగొట్టారు. ఫ్రెంచి గుయానాలో తుపాకీ బుల్లెట్ తగిలి 54 ఏళ్ల వ్యక్తి మృతి చెందారు. పారిస్ ఉత్తర ప్రాంతంలో నిరసనకారులు బాణసంచా కాల్చుతూ, రోడ్లపై అడ్డంకులు పెట్టారు. టియర్ గ్యాస్, స్టన్ గ్రెనేడ్లను ప్రయోగించి వారిని పోలీసులు చెదరగొట్టారు.

అమెరికాలో కాల్పులు.. ఇద్దరు మృతి

బాల్టిమోర్: అమెరికాలో మళ్లీ కాల్పుల మోత మోగింది. తాజాగా జరిగిన రెండు కాల్పుల ఘటనల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. 37 మంది గాయాలపాలయ్యారు. బాల్టిమోర్‌లోని బ్రూక్లిన్ హోమ్స్‌లో ఆదివారం ఓ పార్టీ జరుగుతున్న సమయంలో అక్కడ చేరిన యువతపైకి గుర్తు తెలియని వ్యక్తులు యథేచ్ఛగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఇద్దరు చనిపోయారు. మరో 28 మంది గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కాల్పులకు కారణం తెలియరాలేదని పోలీసులు తెలిపారు. సమాచారం తెలిసిన వారు తమకు తెలపాలని పోలీసు విభాగం పౌరులను కోరింది. ఇలా ఉండగా, కాన్సాస్‌లో ఆదివారం ఉదయం జరిగిన మరో కాల్పుల ఘటనలో ఏడుగురు గాయపడ్డారు.

మా ఆర్మీకి శిక్షణ ఇవ్వండి

వాగ్నర్ గ్రూప్‌నకు బెలారస్ అధ్యక్షుడు లుకషెంకో ఆహ్వానం

మిన్‌స్క్: రష్యాలో స్వల్పకాలిక తిరుగుబాటు విఫలయత్నం అనంతరం తమ దేశానికి చేరుకున్న వాగ్నర్ గ్రూప్‌నకు బెలారస్ అధ్యక్షుడు ఓ ఆఫర్ ఇచ్చారు. తమ దేశ మిలటరీకి శిక్షణ ఇవ్వాలంటూ ప్రైవేట్ సైన్యం వాగ్నర్ గ్రూప్‌ను అధ్యక్షుడు లుకషెంకో కోరారు. 'ఇక్కడికి వచ్చి మన సైన్యానికి యుద్ధ నైపుణ్యంలో శిక్షణ ఇవ్వాలని వాగ్నర్ గ్రూప్‌ను కోరాం. వారి అనుభవం మాకెంతో అవసరం'అని ఆయన అన్నట్లు అధికార వార్తా సంస్థ బెల్టా వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా పోరాడుతూ సాధారణ పరిస్థితులను నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్న వాగ్నర్ గ్రూప్‌ను పశ్చిమదేశాలు ద్వేషిస్తున్నాయన్నారు. చరిత్రలోనే ఎన్నడూ లేనంతటి స్థాయిలో ప్రపంచ సైనిక-రాజకీయ సంక్షోభం ఏర్పడబోతోందని హెచ్చరించారు. దీనిని పరిష్కరించడానికి చర్చల అవసరాన్ని పశ్చిమదేశాలు గుర్తించడం లేదని విమర్శించారు. పోలెండ్ మరో ఉక్రెయిన్ మాదిరిగా మారబోతోందని, ఆ దేశానికి ఈయూ, అమెరికా ఆయుధాలు అందిస్తున్నాయని ఆరోపించారు.

కేజ్రీవాల్‌కు దుబాయ్‌లో 3 అపార్ట్‌మెంట్లు

సంచలన ఆరోపణలతో సుఖేశ్ చంద్రశేఖర్ మరో లేఖ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలోని మండావలి జైలులో గడుపుతున్న ఆర్థిక నేరగాడు సుఖేశ్ చంద్రశేఖర్ సంచలన ఆరోపణలు చేశాడు. ఆప్ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు దుబాయ్‌లో మూడు ఫ్లాట్లు ఉన్నాయని, హైదరాబాద్‌లోని ఒక ఫార్మా కాంట్రాక్టర్ నుంచి 2020లో అందిన ముడుపులతో వీటిని కొనుగోలు చేశారని ఆరోపించాడు. ఈ మేరకు మండావలి జైలు నుంచి మీడియాకు సుఖేష్ తన న్యాయవాది అనంత మాలిక్ ద్వారా తాజాగా మరో లేఖను విడుదల చేశారు. దుబాయ్‌లోని జుమైరా పామ్స్‌లోని మూడు అపార్ట్‌మెంట్లను అత్యవసరంగా 65 మిలియన్ దిర్హామ్స్ (ఏఈడీ)కు అమ్మాలని వారం క్రితం దుబాయ్‌లోని తన సహచరుడు మనోజ్ జైన్‌ను కేజ్రీవాల్ కోరారని సుఖేశ్ ఆ లేఖలో ఆరోపించాడు. తనకు, సత్యేందర్ జైన్‌కు మధ్య జరిగిన వాట్సాప్ చాట్‌లో దుబాయ్‌లో మూడు అపార్ట్‌మెంట్ల కొనుగోలు లావాదేవీల వివరాలున్నాయని, ఆ చాట్‌ను విడుదల చేస్తానని సుఖేశ్ పేర్కొన్నాడు. వారం రోజుల్లో ఈడీ, అవినీతి నిరోధక విజిలెన్స్‌కి ఆధారాలు పంపిస్తానని కూడా వెల్లడించాడు. సీఎంకు వ్యతిరేకంగా మాట్లాడటం ఆపకపోతే హతమారుస్తామని బెదిరించారని పేర్కొన్నాడు. త్వరలో కేజ్రీవాల్ తిహార్ జైలుకు చేరుతారన్న విషయాన్ని మరిచిపోవద్దన్నారు.

వరదలకు గుజరాత్ అతలాకుతలం

అహ్మదాబాద్: గుజరాత్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వరదలతో అతలాకుతలమవుతున్న పలు గ్రామాలతో ఇతర ప్రాంతాలకు సంబంధాలు తెగిపోయాయి. వల్సాద్ ప్రాంతంలోని ధర్మపూర్‌లో గత 24 గంటల్లో ఏకంగా 23.4 సెంటీమీటర్ల వర్షం కురిసింది. వరదల్లో చిక్కుకుపోయిన వారిని కాపాడడానికి జాతీయ, రాష్ట్ర విపత్తు నిర్వహణ దళాలు రంగంలోకి దిగాయి. రాష్ట్రంలో జామ్‌నగర్‌లో వరద పరిస్థితి భయంకరంగా ఉంది. ఈ ఒక్క జిల్లాలోనే గత రెండు రోజుల్లో 11 మంది మరణించారు. సురేంద్ర నగర్ జిల్లాలో పలు గ్రామాలకు వెళ్లే రహదారులు ధ్వంసం కావడంతో ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయి. తాజా వరద పరిస్థితులపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్రతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో పరిస్థితుల్ని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆపదలో ఉన్న ప్రజలకి సాధ్యమైనంతవరకు సాయం అందిస్తోందని షా ట్వీట్‌చేశారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్‌తో పాటు స్థానియ యంత్రాంగం కూడా వరద ప్రాంతాల్లో సహాయ చర్యల్లో మునిగిపోయిందని అమిత్ తెలిపారు.

టైటానిక్ కంటే ఐదు రెట్లు పెద్దది

ప్రపంచంలో అతి పెద్ద నౌక నిర్మాణం పూర్తి ● 2024 జనవరి నుంచి ప్రయాణాలు షురూ





సముద్ర అలలతో పోటీపడేలా ఆశలు ఉప్పొంగేవారికి ఇదో అద్భుతమైన అవకాశం. సముద్ర జలాల్లో ప్రయాణానికి ప్రపంచంలోనే అతి పెద్ద నౌక సిద్ధమైంది. టైటానిక్ కంటే ఇది ఐదు రెట్లు పెద్దది. ఈ నౌకలోనే సకల సదుపాయాలు ఉన్నాయి. ప్రపంచంలోని నౌకల్లో స్వర్గధామంగా మారిన 'ఐకాన్ ఆఫ్ ది సీస్' ఇప్పటికే ట్రయల్ రన్ పూర్తి చేసుకుంది. రకరకాల ధరల శ్రేణుల్లో ఈ విలాసనౌకలో అద్భుత ప్రయాణానికి ఏర్పాట్లున్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

ప్రత్యేకతలివీ..

- ఫిన్లాండ్‌లో మెయర్ తుర్కు షిప్‌యార్డ్ ఈ నౌకని నిర్మించింది
- రాయల్ కరేబియన్ ఇంటర్నేషనల్ సంస్థకు చెందిన ఈ నౌక పేరు 'ఐకాన్ ఆఫ్ ది సీస్'.
- నౌక పొడవు 1200 అడుగులు, బరువు 2,50,800 టన్నులు,
- ఈ నౌకలో 2,350 మంది సిబ్బంది ఉంటారు. 5,610 మంది ప్రయాణించగలరు
- ప్రపంచ వ్యాప్తంగా 40 ప్రాంతాలకు చెందిన విభిన్న ఆహార పదార్థాలు ఈ షిప్‌లో లభిస్తాయి.
- నౌకలో వాటర్‌పార్క్‌లు, స్విమ్మింగ్‌పూల్‌లు, ఫ్యామిలీలు ఎంజాయ్ చేసే సకల సదుపాయాలున్నాయి.
- వచ్చే ఏడాది జనవరిలో మియామి నుంచి బయల్దేరే ఈ నౌక కరేబియన్ సముద్ర జలాల్లో ప్రయాణిస్తుంది.
- ఈ నౌకలో ప్రపంచంలోనే అతి పెద్ద వాటర్ పార్క్ ఉంది. దీనికి కేటగిరీ 6 అని పిలుస్తారు. ఈ వాటర్ పార్కులో ఆరు స్లైడ్‌లు ఉన్నాయి.
- ఒక వాటర్ స్లయిడ్ నుంచి నేరుగా సముద్రంలోకి డైవ్ చేసేలా పెట్టారు. కానీ ప్రయాణికుల భద్రత రీత్యా దీనిని వారికి అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశాల్లేవు.
- జూన్ 22న ఈ నౌక విజయవంతంగా మొదటి ట్రయల్ రన్ పూర్తి చేసుకుంది.
- నౌకలో ఉద్యానవనాలు ఉన్నాయి. పార్కుల్లోనూ ప్రయాణికులు సేద తీరవచ్చు.
- కాలుష్య నివారణ కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో లిక్విఫైడ్ నేచరల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ)ను ఇంధనంగా వాడుకుంటూ ఈ నౌక ప్రయాణం కొనసాగిస్తుంది.
- వచ్చే ఏడాది జనవరిలో మియామి నుంచి ప్రారంభమయ్యే ఈ నౌకలో ప్రయాణం కోసం ఇప్పటికే రికార్డు స్థాయిలో టిక్కెట్లు అమ్ముడుపోతున్నాయి.
- వివిధ రకాల ప్యాకేజీల కింద ధరలున్నాయి. అన్నింటికంటే తక్కువగా ఏడు రాత్రులు ఓడలో గడపాలంటే 3 వేల పౌండ్ల (రూ. 3 లక్షలకు పైన) వరకు ఖర్చు పెట్టాల్సి వస్తుంది.
- కరేబియన్‌లో అత్యంత అందమైన దీవులైన బహామాస్, కొజుమెల్, ఫిలిప్స్‌బర్గ్, సెయింట్ మార్టెన్, రోటన్, హోండురస్ వంటి వాటి మీదుగా ఈ నౌక ప్రయాణిస్తుంది.
- వినోదమే ప్రధానంగా రూపొందించిన ఈ షిప్‌లో జర్నీకి సర్వత్రా ఆసక్తి నెలకొంది.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
సోమవారం । 3 । జూలై । 2023

మూడోసారి సమన్లు

సాక్షి, చెన్నై: మంత్రి సెంథిల్ బాలాజి సోదరుడు అశోక్‌కుమార్‌కు మూడోసారిగా ఆదివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వర్గాలు సమన్లు జారీ చేశాయి. మనీలాండరింగ్ కేసులో సెంథిల్ బాలాజీని ఈడీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆయన సోదరుడిని సైతం ఈడీ టార్గెట్ చేసింది. ఆయన ఇల్లు, కార్యాలయాలలో ఇప్పటికే సోదాలు జరిగాయి. ఆయన్ను కూడా విచారణ వలయంలోకి తెచ్చేందుకు ఈడీ సిద్ధమైంది. ఇప్పటికే ఆయనకు రెండుసార్లు నోటీసులు జారీ చేసింది. అయితే, ఆయన ఏదో ఒక కారనం చెబుతూ డుమ్మా కొడుతూ వచ్చారు. మూడో సారిగా ఆయనకు సమన్లు జారీ అయ్యాయి. ఈ సారైనా ఆయన విచారణకు వెళ్లేనా లేదా, కోర్టు ద్వారా ఆయన్ను ఇరకాటంలో ఈడీ వర్గాలు పెట్టేనా అన్నది వేచిచూడాల్సిందే.

న్యూస్‌రీల్

కోవై వైపు కమల్ చూపు

- లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి సమాయత్తం



సాక్షి, చెన్నై: మక్కల్ నీదిమయ్యం నేత, విశ్వనటుడు కమలహాసన్ కోయంబత్తూరు లోక్‌సభ నుంచి పోటీకి సమాయత్తం అవుతున్నట్టు సమాచారం. ఆయన ఆ నియోజకవర్గంపై ఇక ప్రత్యేక దృష్టి పెట్టబోతున్నట్టు మక్కల్ నీదిమయ్యం వర్గాలు సైతం పేర్కొంటున్నాయి. గత లోక్‌సభ ఎన్నికలకు ముందుగా పార్టీని ప్రకటించిన కమల్ తన అభ్యర్థులను నిలబెట్టారు. అయితే, ఆయన పోటీ చేయలేదు. అభ్యర్థులు ఓటమి పాలైనా ఓటు బ్యాంక్‌ను సాధించారు. అసెంబ్లీ ఎన్నికలలో కోయంబత్తూరు దక్షిణం నియోజకవర్గం నుంచి కమల్ పోటీ చేశారు. స్వల్ప ఓట్లతో బీజేపీ అభ్యర్థి వానతీ శ్రీనివాసన్ చేతిలో ఓటమి పాలయ్యారు. ఈ పరిస్థితులలో తనకంటూ కోయంబత్తూరులో బలం ఉండడంతో ఈసారి లోక్‌సభ ఎన్నికలలో పోటీ చేయడానికి సమాయత్తం అవుతున్నట్టు తెలిసింది. డీఎంకే కూటమిలో ఈ సీటును తన ఖాతాలో వేసుకునే విధంగా కమల్ వ్యూహరచనలో ఉన్నట్టు సమాచారం. అసెంబ్లీలో అడుగుపెట్టలేని పరిస్థితులలో ఈసారి లోక్‌సభలోనైనా అడుగు పెట్టాలన్న కాంక్షతో ఆయన మరికొద్ది రోజుల్లో కోయంబత్తూరుపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్టు తెలిసింది. కోయంబత్తూరులోనే తిష్టవేసి పార్టీ కార్యక్రమాలు సాగించబోతునట్టు మక్కల్ నీది మయ్యం వర్గాలు పేర్కొంటున్నాయి.

నెలాఖరులో ఇంజినీరింగ్ కౌన్సెలింగ్

సాక్షి, చెన్నై: ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ఈనెలాఖరులో ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లపై సాంకేతిక విద్యాశాఖ దృష్టి పెట్టింది. రాష్ట్రంలో 430 ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్న విషయం తెలిసిందే. ఇందులో రెండు లక్షల సీట్లు ప్రభుత్వ కోటా పరిధిలో ఉన్నాయి. ప్లస్‌టూ మార్కుల ఆధారంగా ఈ సీట్ల భర్తీకి సాంకేతిక విద్యా డైరెక్టరేట్ చర్యలు తీసుకుంది. 2 లక్షల 21 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ విద్యార్థులకు ఇప్పటికే కౌన్సెలింగ్ నిమిత్తం ర్యాండం నంబర్లను ప్రకటించారు. ర్యాంకుల జాబితాను ప్రకటించారు. కటాఫ్ మార్కుల వివరాలను వెల్లడించారు. ఈనెల 2వ తేదీ నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం కావాల్సి ఉండగా, వైద్య సీట్ల భర్తీలో జాప్యం నెలకొనడంతో వాయిదా వేసుకున్నారు. ఇంజినీరింగ్‌లో సీట్లు సంపాదించుకున్న వారు, మెడిసిన్‌లో సీటు దక్కగానే వెళ్లిపోతున్నారు. దీంతో ఆ సీట్లు ఖాళీగా దర్శనం ఇస్తున్నాయి. దీంతో వైద్య కౌన్సెలింగ్ తర్వాత ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌కు నిర్ణయించారు. ఈనెల మూడో వారంలో వైద్య కౌన్సెలింగ్, చివరి వారంలో ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌కు అధికారులు చర్యలు చేపట్టారు.

మెడికల్ రెప్ ఇంట్లో పేలుడు

సాక్షి, చెన్నై : మదురైలో శనివారం అర్ధరాత్రి ఓ మెడికల్ రెప్ ఇంట్లో భారీ పేలుడు సంభవించడంతో స్థానికులు ఉలిక్కి పడ్డారు. పోలీసులు విచారిస్తున్నారు. మదురై కరిమేడు విశ్వపురం మొదటి వీధిలో అజిత్‌కుమార్ అనే మెడికల్ రెప్ నివాసం ఉంటున్నాడు. శనివారం అర్ధరాత్రి ఇతడి ఇంటి నుంచి భారీ శబ్దం వచ్చింది. దీంతో పరిసరవాసులు భయాందోళన చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వచ్చేలోపు పేలుడు ఆనవాళ్లను చెరిపి వేసి మెడికల్ రెప్ అజ్ఞాతంలోకి వెళ్లాడు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. భారీ శబ్దం వచ్చేంతగా ఏ వస్తువు పేలిందో అని ఆరా తీస్తున్నారు. మెడికల్ రెప్ కోసం గాలిస్తున్నారు.

వైద్యుల నిర్లక్ష్యం

- బిడ్డ చేయి తొలగింపు
- విచారణకు మంత్రి ఆదేశం

సాక్షి, చెన్నై: చెన్నై ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా బిడ్డ చేయి తొలగించినట్టుగా తెలిసింది. ఈ ఘటనపై విచారణకు ఆరోగ్యశాఖా మంత్రి ఎం సుబ్రమణియన్ ఆదేశించారు. చెన్నైకు చెందిన తల్లి తనకు నెలల తక్కువగా పుట్టిన కుమారుడు మహ్మద్ మాహిర్‌ను అనారోగ్య సమస్యలతో ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించింది. నెలలు తక్కువగా పుట్టిన ఈ బిడ్డకు చిన్నప్పటి నుంచి ఉన్న సమస్యకు చికిత్స కోసం వస్తే వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించి కుడి చేతిని తొలగించినట్టు సమాచారం. బాధితురాలు ఫిర్యాదుతో ఆరోగ్యశాఖా మంత్రి ఎం.సుబ్రమణియన్ స్పందించారు. విచారణకు ఆదేశించారు. ముగ్గురు అధికారులతో కమిటీని నియమించారు.

పుదుచ్చేరిలో భారీ వర్షం

కొరుక్కుపేట: పుదుచ్చేరిలో శనివారం రాత్రి 11 గంటల సమయంలో ఉరుములు, మెరుపులు, పెనుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. పెనుగాలులు, వర్షం కారణంగా పలుచోట్ల వందకు పైగా చెట్లు నేలకూలాయి. అసెంబ్లీ ఎదురుగా ఉన్న చెట్టు కూలి సభా ప్రాంగణంలోని గోడకు ఒరిగిపోయింది. దీంతో చుట్టు పక్కల గోడ దెబ్బతింది. అక్కడ ఉన్న నేమ్ బోర్డు కూడా ధ్వంసమైంది. దీంతో అసెంబ్లీ క్యాంపస్ రోడ్డును బారికేడ్లతో మూసివేశారు.

వీడని మేఘదాతు!

- చిచ్చురేపుతున్న శివకుమార్
- పళని, పన్నీరు ఫైర్
- తమిళ రైతుల పక్షానే మా గళం: కాంగ్రెస్
- తమ నిర్ణయంలో మార్పులేదన్న డీఎంకే
- నీటి కోసం రైతుల ఎదురుచూపులు



పళనిస్వామి



సెల్వ పెరుంతొగై



కావేరి తీరంలోని మేఘదాతు

సాక్షి, చెన్నై: మేఘదాతులో జలాశయం నిర్మాణంపై కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్ తగ్గడం లేదు. ఆయన తీరుపై అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి, సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరుసెల్వం తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కర్ణాటక కాంగ్రెస్ పాలకుల తీరు ఎలాఉన్నా, తమ దారి మాత్రం తమిళ రైతుల సంక్షేమం కోసమే అని రాష్ట్ర కాంగ్రెస్ శాసన సభా పక్షనేత సెల్వ పెరుంతొగై స్పష్టం చేశారు. కావేరి వ్యవహారంలో తమ నిర్ణయంలో మార్పులేదని డీఎంకే సీనియర్ నేత టీకేఎస్ ఇలంగోవన్ స్పష్టం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో కావేరి జలాల కోసం డెల్టా రైతుల్లో ఎదురుచూపులు పెరిగాయి. డెల్టా వరప్రదాయిని మెట్టూరు జలాశయంలో నీటి మట్టం తగ్గుతుండడం ఆందోళన రేపుతోంది. కర్ణాటక, తమిళనాడు మధ్య కావేరి నదీ జలవివాదం గురించి తెలిసిందే. ప్రతిఏటా కర్ణాటక సర్కారు తమిళనాడుకు 177.25 టీఎంసీల కావేరి నీటిని పంపిణీ చేయాల్సి ఉంది. అయితే, ఈ ఏడాది ఇంత వరకు చుక్క నీరు కానరాలేదు. మూడేళ్లుగా కర్ణాటకలో కురిసిన భారీ వర్షాలకు తమిళనాడు వైపు కావేరి ఉధృతంగా ప్రవహించింది. ఉబరి నీరు పరవళ్లు తొక్కింది. అయితే, ఈ ఏడాది కర్ణాటక నుంచి ఇంత వరకు ఆ నీటి జాడ కానరావడం లేదు. మెట్టూరు జలాశయం నుంచి నిర్ణీత సమయానికి సాగుకు నీళ్లు విడుదల చేసినా, కురువై సాగుకు సమృద్ధిగా నీళ్లు దక్కేనా అనే ఆందోళన డెల్టా రైతుల్లో మొదలైంది. ఈ సమయంలో మేఘదాతులో డ్యాం నిర్మించి తీరుతామని కర్ణాటక డెప్యూటీ సీఎం శివకుమార్ పదే పదే వ్యాఖ్యలు చేయడం తమిళ రైతుల్లో మరింత ఆగ్రహాన్ని, ఆందోళనను రేపుతోంది. కర్ణాటకలో అధికారం మారినా, కావేరి వ్యవహారంలో పాలకుల తీరు మారకపోవడం రెండు రాష్ట్రాల మధ్య వివాదానికి ఆజ్యం పోసే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. డీఎంకే మిత్ర పక్షం కాంగ్రెస్ ప్రస్తుతం అధికారంలోకి వచ్చినా పరిస్థితి మారకపోవడం విమర్శలకు దారితీసింది. ఇప్పటికే మేఘదాతు వ్యవహారంపై శివకుమార్ తన నిర్ణయాన్ని స్పష్టం చేశారు. ప్రస్తుతం కేంద్ర జలశక్తి శాఖా మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు కర్ణాటక డెప్యూటీ సీఎం శివకుమార్ మేఘదాతులో డ్యాం నిర్మాణ విషయంగా స్పష్టమైన లేఖ రాయడం తమిళ పార్టీలలో మరింత ఆగ్రహాన్ని రేపింది.

పళని ఫైర్..

కర్ణాటక డెప్యూటీ సీఎం శివకుమార్ వ్యవహరిస్తున్న తీరుపై అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి ఓ ప్రకటనలో ఆదివారం స్పందించారు. కావేరి హక్కులను కాలరాసే విధంగా ఆ తీరంలో డ్యాం నిర్మాణానికి జరుగుతున్న ప్రయత్నాలను ఆదిలోనే డీఎంకే పాలకులు అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. తమిళనాడు ప్రజల సంక్షేమానికి విరుద్ధంగా కేంద్రమంత్రికి, కర్ణాటక డిప్యూటీ సీఎం లేఖ రాశారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ వ్యవహారంలో సీఎం స్టాలిన్ తన గళాన్ని విప్పాలని, కాంగ్రెస్ పాలకుల తీరును ఖండించాలన్నారు. తక్షణం రాష్ట్రంలోని 38 మంది ఎంపీలతో బృందాన్ని ఢిల్లీకి పంపించాలని, మేఘదాతు డ్యాం నిర్మాణ కోసం జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరారు. తమిళనాడులోని డెల్టా ప్రాంతాన్ని కరువు సీమగా మార్చే ప్రయత్నం చేస్తే, చూస్తు ఊరుకోమని హెచ్చరించారు. కర్ణాటక తీరును ఖండిస్తూ, తమిళనాడు హక్కులను పరిరక్షించే విధంగా పోరాటాలకు అన్నాడీఎంకే సిద్ధంగా ఉందన్నారు. ఆ పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్, మాజీ సీఎం పన్నీరుసెల్వం స్పందిస్తూ, తమిళనాడుకు రావాల్సిన కావేరి జలాలలను యుద్ధప్రాతిపదికన పంపిణీ చేయించుకునేందుకు సీఎం స్టాలిన్ వెంటనే ప్రయత్నాలు చేపట్టాలని డిమాండ్‌చేశారు. ఇప్పటికే మెట్టూరు జలాశయంలో నీటి మట్టం తగ్గుతోందని, ఇది కొనసాగిన పక్షంలో డెల్టా రైతుల కంట కన్నీరు తప్పదని ఆందోళన వ్యక్తంచేశారు. కురువై సాగుకు సమృద్ధిగా నీళ్లు దక్కాలని రైతుల్లో ప్రస్తుతం తీవ్ర కలవరం ఉందన్నారు. కర్ణాటక చర్యలు ఓ వైపు, కావేరి జాడ కానరాక మరో వైపు రైతులు కన్నీటి మడుగులో మునిగే పరిస్థితి ఉందన్నారు. కర్ణాటకలో మిత్రపక్షంతో మాట్లాడి తక్షణం నీటి విడుదలకు సీఎం స్టాలిన్ చర్యలు తీసుకోవాలని సూచించారు.

రైతుల పక్షానే గళం..

కావేరి వ్యవహారంలో తమ గలం తమిళ రైతు వైపే అని రాష్ట్ర కాంగ్రెస్ శాసన సభా పక్షనేత సెల్వ పెరుంతొగై స్పష్టం చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, తమకు తమిళ ప్రజల సంక్షేమమే ముఖ్యమని స్పష్టంచేశారు. మేఘదాతు వ్యవహారం కోర్టులో ఉందని, కోర్టు అనుమతిలేకుండా ఎలాంటి నిర్ణయాలు జరిగే పరిస్థితి లేదన్నారు. ఈ వ్యవహారంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కర్ణాటక డ్యాం నిర్మించి తీరుతామని పట్టుబడితే, తాము అడ్డుకుని తీరుతామని స్పష్టం చేశారు. తమిళ ప్రజల జీవనాధారంపై ప్రభావాన్ని చూపించే విధంగా పరిస్థితులు కల్పిస్తే సహించబోమన్నారు. అన్ని పార్టీలు ఈ వ్యవహారంలో కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డీఎంకే సీనియర్ నేత టీకేఎస్ ఇలంగోవన్ పేర్కొంటూ, రైతు సంక్షేమం తమకు ముఖ్యం అని స్పష్టంచేశారు. కావేరి యాజమాన్య సంస్థ అనుమతి లేకుండా డ్యాం నిర్మించేందుకు అవకాశాలు లేవన్నారు. ఇందులోనూ ప్రధానంగా తమిళనాడు అనుమతి మరీ తప్పనిసరి అని, ఇలాంటి పరిస్థితుల్లో ఎలా డ్యాం నిర్మిస్తారని ప్రశ్నించారు.

తగ్గని టమాట ధర

- చౌక దుకాణాల ద్వారా విక్రయానికి చర్యలు

సాక్షి, చెన్నై: బయట మార్కెట్‌లో టమాట ధర అమాంతంగా పెరుగుతోంది. దీంతో చౌక దుకాణాల ద్వారా టమాట విక్రయాలకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సోమవారం సహకార మంత్రి పెరియకరుప్పన్ నేతృత్వంలో జరిగే సమావేశంలో నిర్ణయాన్ని ప్రకటించనున్నారు. రాష్ట్రంలో వారం రోజులుగా టమాట ధరలు పెరుగుతూ వచ్చాయి. ప్రభుత్వ జోక్యం, ప్రభుత్వ ఉద్యాన వనాల పరిధిలోని తోట, పచ్చదనం దుకాణాలలో టమాట విక్రయాలు జరగడంతో బయట మార్కెట్‌లో రెండు రోజులపాటు ధర కాస్త దిగి వచ్చినట్టు కనిపించింది. అయితే, మళ్లీ ధరకు రెక్కలు వచ్చాయి. ఆదివారం కిలో టమాట బయటి మార్కెట్‌లో రూ.120 నుంచి రూ.130 వరకు పలికింది. అయితే, తోట పచ్చదనం దుకాణాలలో మాత్రం రూ. 60కు విక్రయించడం విశేషం. ఈ ధర కట్టడి చేయలేని పరిస్థితి ఉండడంతో ప్రభుత్వ నేతృత్వంలో రాష్ట్రంలో ఉన్న 35 వేల చౌక దుకాణాల ద్వారా టమాట విక్రయాలపై సహకార శాఖ దృష్టి పెట్టింది. సోమవారం అధికారులతో అత్యవసర సమావేశానికి మంత్రి పెరియకరుప్పన్ నిర్ణయించారు. సమావేశానంతరం చౌకదుకాణాల్లో టమాట విక్రయాల ప్రకటన వెలువడే అవకాశాలు ఉన్నాయి.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

తిరువొత్తియూరు: నామక్కల్‌లో జిల్లాలో బావిలో మునిగి మృతిచెందిన నలుగురు బాధిత కుటుంబాలకు తలా రూ.2లక్షలు ఆర్థికసాయం అందజేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదేశించారు. నామక్కల్ జిల్లాలో రాసిపురం మండలం ఆయిల్‌పట్టి సమీపంలో ద్విచక్రవాహనం బావిలోకి దూసుకెళ్లిన ఘటనలో విద్యార్థి విగ్నేష్, రక్షించడానికి వెళ్లిన వాయిపట్టికి చెందిన కుప్పస్వామి(45), అశోక్‌కుమార్ (35), శరవణన్ (35) మృతిచెందారు. ఈ క్రమంలో మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలుపుతూ బాధిత కుటుంబాలకు తలా రూ.2 లక్షలు, గాయపడిన విద్యార్థులు నితీష్‌కుమార్ (15), అభిషేక్(15)లకు రూ.50 వేలు అందజేయాలని ముఖ్యమంత్రి స్టాలిన్ అధికారులను ఆదేశించారు.

తిరుత్తణిలో భక్తుల కిటకిట



తిరుత్తణి కొండ ఆలయంలో భక్తుల రద్దీ, (ఇన్‌సెట్) అలంకరణలో ఉత్సవర్ సుబ్రహ్మణ్యస్వామి

తిరుత్తణి: తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సర్వదర్శనానికి క్యూలో భక్తులు మూడు గంటల పాటు వేచివుండి స్వామిని దర్శించుకున్నారు. సుబ్రహ్మణ్యస్వామి కొలువైన ఆరు పుణ్యక్షేత్రాల్లో ఐదవ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామికి ఆదివారం వేకువజామున ప్రత్యేక అభిషేక ఆరాధన పూజలు చేశారు. ఆదివారం సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కొండ ఆలయం చేరుకున్నారు. శరవణ పుష్కరిణి వద్ద తలనీలాలు సమర్పించి పుష్కరిణిలో స్నానాలు ఆచరించి తొలిమెట్టుకు కర్పూర హారతులచ్చి కొబ్బరికాయలు కొట్టి మెట్లమార్గంలో కొండ ఆలయం చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు.

భక్తుల రద్దీతో కొండ ఆలయంలో సందడి నెలకొంది. సర్వదర్శనం క్యూలు నిండగా, రూ.100 ప్రత్యేక దర్శనానికి సైతం భక్తులు క్యూకట్టారు. ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు 60 వేల మంది భక్తులు స్వామివారి దర్శనభాగ్యం పొందినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

తమిళ నేల నుంచి చరిత్ర లిఖిద్దాం

- సీఎం స్టాలిన్ వ్యాఖ్య
- ఘనంగా ఉత్తర అమెరికా తమిళ సంఘం వేడుకలు





మాట్లాడుతున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: తమిళ నేల నుంచే దేశ చరిత్ర లిఖిద్దామని సీఎం ఎంకే స్టాలిన్ వ్యాఖ్యానించారు. తమిళం భాష కాదని, ప్రతి తమిళుడి శరీరంలో రక్తం అని పేర్కొన్నారు. ఉత్తర అమెరికా తమిళ సంఘం సదస్సు ఆదివారం జరిగింది. ఉత్తర అమెరికన్ కౌన్సిల్ ఆఫ్ తమిళ్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బాలస్వామినాథన్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సీఎం స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. ఈ సంఘం 36వ సదస్సులో తాను ప్రసంగించడం ఆనందంగా ఉందని వ్యాఖ్యలు చేశారు. తల్లి తమిళనాడులో ద్రావిడ సుపరిపాలన జరుగుతున్న సమయంలో ఈ వేడుక జరగడం మరో ఆనందంగా పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా నివసిస్తున్న తమిళులు మాతృభూమిలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వివిధ సంస్థల్లో అధికారులు, ఉన్నత స్థాయిలో పనిచేస్తున్న వారంతా ఈ విషయాన్ని వారి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అమెరికాలో నివసిస్తున్న తమిళులే కాదు వివిధ దేశాల్లో నివసిస్తున్న వారు సైతం సంఘంగా ఏర్పడి కార్యక్రమాలు నిర్వహిస్తుండడం ఆహ్వానించ దగ్గ విషయంగా పేర్కొన్నారు.

ఇది తమిళ పండుగ..

ఇది తమిళ పండుగ అని, తమిళం ఎప్పటికీ సజీవం అని వ్యాఖ్యానించారు. తమిళం మన భాష మాత్రమే కాదని, ప్రతి ఒక్కరి శరీరంలో రక్తం అని పేర్కొన్నారు. సజీవంగా మనల్ని బతికించే మట్టిగా, మాధుర్యాన్ని ఇచ్చే పరిమళంగా, యవ్వనానికి ఔషధంగా, యుద్ధభూమికి కత్తిలా వేల తమిళుల నరనరాల్లో జీర్ణించుకుపోయి ఉన్నట్టు వివరించారు. ఎక్కడున్నా మాతృభాషను మరవద్దు అని, తమ పిల్లలకు నేర్పించాలని సూచించారు. సాగరాన్ని దాటిన తర్వాత కూడా ఇలాంటి వేడుకతో మాతృభాషా పరిరక్షణలో నిమగ్నమై ఉన్న ప్రతి ఒక్కరిని అభినందిస్తున్నట్టు పేర్కొన్నారు. తమిళం మూలం అపురూపమైన ప్రాచీన చరిత్ర అని పేర్కొంటూ, దేశ చరిత్రను తమిళ నేల నుంచి లిఖిద్దామన్నారు. ఈసందర్భంగా పురావస్తు పరిశోధనలను సీఎం వివరించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన పురావస్తు ఎగ్జిబిషన్లను, తమిళ సంస్కృతిని చాటే ప్రదర్శనలు, కార్యక్రమాలను వీక్షించేందుకు విదేశాలలో ఉన్న ప్రతి తమిళుడు తమిళనాడుకు ఒక్కసారైనా వచ్చి వెళ్లాలని పిలుపునిచ్చారు. వైగై తీరం చుట్టూ తమిళుల సంస్కృతి, ప్రాముఖ్యత ఉన్నట్టు వివరించారు. దీనిని పురావస్తు తవ్వకాలు స్పష్టం చేస్తున్నాయన్నారు. జాతి, మత బేధాలకు అతీతంగా అందరం ముందుకెళ్దామన్నారు.

తాతయ్య అన్న పిలుపుతో..

తాతయ్య అని ఓ బాలిక ఇచ్చిన పిలుపుతో సీఎం స్టాలిన్ పరవశించిపోయారు. సేలంకు చెందిన డీఎంకే కార్యకర్త గోకుల కుమార్, భార్య దేవి, రెండో తరగతి చదువుతున్న కుమార్తెతో చెన్నైకు వచ్చారు. సీఎం స్టాలిన్‌ను చూడాలని తేనంపేటలోని డీఎంకే కార్యాలయం బయట ఎదురు చూశారు. తమిళ సంఘం సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించేందుకు సీఎం అటు వైపుగా వచ్చారు. పార్టీ కార్యాలయం వైపుగా కార్యకర్తలు దూసుకెళ్లారు. ముఖ్యనేతలు చుట్టుముట్టడంతో సీఎంను చూడలేని పరిస్థితి. ఈ సమయంలో ఆ బాలిక తాతయ్యా...తాతయ్యా అని పిలిచిన పలుకు సీఎం చెవిన పడింది. ఆ బాలిక పిలుపుతో పరవశించిన సీఎం తక్షణం తన వద్దకు తీసుకురావాలని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. ఆ బాలికను, తల్లిదండ్రులను సీఎం వద్దకు భద్రతా సిబ్బంది తీసుకొచ్చారు. సీఎం స్టాలిన్‌ను చూడగానే వారి ఆనందానికి అవధులు లేవు. ఆ బాలికను, తల్లిదండ్రులను సీఎం పరామర్శించి కార్యాలయంలోకి వెళ్లారు. దూరం నుంచి సీఎంను చూసి వెళ్దామని వచ్చిన తమకు ఆయన్ను కలిసి మాట్లాడే భాగ్యం తమ బిడ్డ పలుకుతో రావడం ఆనందంగా ఉందని ఆ కార్యకర్త పేర్కొన్నాడు.

కనులపండువగా నెల్లయ్యప్పర్ రథోత్సవం



రథోత్సవంలో స్పీకర్ అప్పావు, మంత్రి శేఖర్‌బాబు



రథోత్సవంలో భక్త జనం

- భక్త జనసంద్రంలో తిరునల్వేలి
- స్పీకర్, మంత్రి హాజరు

సాక్షి, చెన్నై: తిరునల్వేలిలో ప్రసిద్ధి చెందిన నెల్లయ్యప్పర్ ఆలయంలో ఆదివారం రథోత్సవం కనులపండువగా జరిగింది. లక్షలాదిగా భక్తజనం తరలి రావడంతో ఆధ్యాత్మిక వాతావరణంలో నెల్లై పట్టణం మునిగింది. తిరునల్వేలి (నెల్లై) నగర నడిబొడ్డున నెల్లయ్యప్పర్, గాంధీ మది అమ్మన్ పేరిట శివ, పార్వతులు కొలువై ఉన్నారు. ఇక్కడ గత నెల 24వ తేదీ నుంచి ఆణి బ్రహ్మోత్సవాలు అత్యంత వేడుకగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో ముఖ్య ఘట్టం రథోత్సవం ఆదివారం జరిగింది. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తజనం శనివారం రాత్రే నెల్లైకు చేరుకున్నారు. హరహర మహాదేవ నామస్మరణ మార్మోగింది. వేకువజామున రెండు గంటల నుంచే ఆలయంలో వేడుక మొదలైంది. 1.55 గంటలకు వినాయకుడు, సుబ్రమణ్యస్వామి రథాలు ముందుకు కదిలాయి. 3 నుంచి 4 గంటల మధ్య స్వామి, అమ్మవారు రథంపై ఆశీనులై భక్తులను కటాక్షించారు. హరహర మహాదేవా..శంభోశంకర నామస్మరణ నడుమ స్వామివారి రథం కదిలింది. దేవదాయశాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, స్పీకర్ అప్పావు, ఎంపీ జ్ఞానద్రవ్యం, ఎమ్మెల్యేలు అబ్దుల్ వహాబ్, నయనార్ నాగేంద్రన్, రూబి, మనోహరన్, కలెక్టర్ కార్తికేయన్ రథాన్ని లాగారు. భక్త జనుల జయ జయ ధ్వానాలు, మేళ తాళాల నడుమ కనులపండువగా రథోత్సవం జరిగింది. రథం మార్గమధ్యలో ఓ చోట భక్తుల వేగానికి తారురోడ్డు నుంచి దిగేసింది. అర గంట పాటు రథం ఆగింది. చివరకు అతి పెద్ద ఇనుప ప్లేట్లను తీసుకొచ్చి రోడ్డుపైకి రథాన్ని ఎక్కించారు. లక్షల్లో భక్తులు తరలి రావడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు యంత్రాంగం గట్టి భద్రతా ఏర్పాట్లు చేసింది.

ఎగసిన కెరటాలు

- మహాబలిపురం తీరంలో ఆందోళన



మహాబలిపురం తీరంలో ఎగసిపడుతున్న అలలు

సాక్షి, చెన్నై : కోవలం, మహాబలిపురం తీరాల్లో ఆదివారం నుంచి కెరటాలు ఎగసి పడుతున్నాయి. పర్యాటకులు, సందర్శకులకు వాతావరణం ఆహ్లాదకరంగా ఉన్నా, కెరటాలు పది అడుగులకు పైగా ఉవ్వెత్తున ఎగసి పడడంతో ఆందోళన తప్పలేదు. ఈ తీరం వెంబడి ఉన్న జాలర్ల గ్రామాల్లో నీరు చొచ్చుకు వస్తుండడంతో ప్రజలు అప్రమత్తమయ్యారు. ఆకాశం మేఘావృతంగా ఉండడమే కాకుండా, చలి గాలులతో సముద్రపు అలల తాకిడి పెరగడంతో ఆందోళన పెరిగింది. సమాచారం అందుకున్న అధికారులు ఆ పరిసరాలను పరిశీలించారు. చెన్నై శివారులోని కోవలం నుంచి మహాబలిపురం దాటి కొన్ని గ్రామాల వరకు ఈ కెరటాల అలజడి ఉండడం గమనార్హం.

క్లుప్తంగా

అవుట్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు



చిన్నమ్మపేటలో అవుట్ పోలీస్‌స్టేషన్ ప్రారంభిస్తున్న డీఎస్పీ విఘ్నేష్

తిరుత్తణి: తిరువలంగాడు పరిసర ప్రాంతాల్లో నేరాలు అదుపు చేసేందుకు అవుట్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు డీఎస్పీ విఘ్నేష్ తెలిపారు. తిరువలంగాడు యూనియన్‌లోని తిరువలంగాడు, చిన్నమ్మపేట రైల్వేస్టేషన్ల ప్రాంతాల్లో నిత్యం ప్రయాణికులతో రద్దీ ఉంటుంది. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు నేరాలకు పాల్పడుతున్న సంఘటనలు ఎక్కువవుతున్నాయి. నేరాలు అదుపుచేసేందుకు చిన్నమ్మపేటలో అవుట్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని సర్పంచ్ శరణ్య, తిరుత్తణి డీఎస్పీ విఘ్నేష్‌కు ఇచ్చిన వినతిపత్రం మేరకు స్పందించిన డీఎస్పీ అవుట్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు అనుమతించారు. ఇందులో సీసీటీవీలు ఏర్పాటు చేసి తనిఖీ చేసేందుకు వీలుగా పంచాయతీ సర్పంచ్ రూ. లక్ష విలువగల కెమెరాలతో పాటు సీసీటీవీలను అందజేశారు. డీఎస్పీ అవుట్ పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించి సేవలకు శ్రీకారం చుట్టారు. ప్రతిరోజూ నలుగురు పోలీసులు అవుట్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తారని తెలిపారు.

శాస్త్రోక్తంగా మహాకుంభాభిషేకం



పళ్లిపట్టు: కొళ్లాపురమ్మ ఆలయ మహాకుంభాభిషేకం ఆదివారం ఉదయం శాస్త్రోక్తంగా జరిగింది. పళ్లిపట్టు సమీపం నగరి రోడ్డులోని నెడియం గ్రామంలో కొళ్లాపుమ్మ ఆలయం జీర్ణోద్ధరణ పనులు పూర్తి చేసి రెండు రోజుల పాటు మహాకుంభాభిషేకం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో యాగశాలలు ఏర్పాటు చేసి నిత్యహోమ పూజలు చేశారు. ఆదివారం ఉదయం మహాపూర్ణాహుతి యాగపూజలు అనంతరం మంగళ వాయిద్యాల నడుమ పవిత్ర పుణ్యతీర్థాలు తరలించి అమ్మవారి విగ్రహానికి మహాకుంభాభిషేకం పూజలు చేసి భక్తులపై పుణ్యతీర్థాలు వెదజెల్లారు. మహాకుంభాభిషేకంలో గ్రామీణులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా శివాలయాల్లో ప్రదోష పూజలు

వేలూరు: వేలూరు, తిరువణ్ణామలై జిల్లాల్లోని శివాలయాల్లో ప్రదోష దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం సాయంత్రం నంది భగవాన్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలోని పెద్ద నంది భగవాన్‌కు శివాచార్యులు వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి వివిధ కాయగూరలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం శివాచార్యులు కర్పూర హారతి పట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నందీశ్వరుడిని అలంకరించిన బంగారు వృషభవాహనంలో ఉంచి ఆలయ మూడవ ప్రాకారం నుంచి మాడ వీధుల్లో భక్తుల దర్శనార్థం ఊరేగించారు. భక్తులు మాడ వీధుల్లో కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా వేలూరు కోట మైదానంలోని జలకంఠేశ్వరాలయంలోని నంది భగవాన్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అదేవిధంగా వాలాజలోని ధన్వంతరి ఆరోగ్యపీఠంలో స్వామి వారికి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని నంది భగవాన్‌ను దర్శించుకున్నారు. ప్రదోష దినోత్సవాన్ని పురస్కరించుకుని వేలూరు, తిరువణ్ణామలై జిల్లాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



అరుణాచలేశ్వరాలయంలో నంది భగవాన్‌కు అభిషేకం చేస్తున్న శివాచార్యులు

నీలగిరికి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు



ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు

అరక్కోణం: నీలగిరి జిల్లాకు వాతావరణ శాఖ భారీ వర్షం హెచ్చరిక నేపథ్యంలో అరక్కోణం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు ఆదివారం నీలగిరికి బయల్దేరి వెళ్లారు. రాష్ట్రంలోని నీలగిరి సహా 18 జిల్లాల్లో సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రాష్ట్ర పెనువిపత్తుల నిర్వహణ శాఖ వినతితో అరక్కోణంలోని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందానికి చెందిన 40 మంది రెండు బృందాలుగా నీలగిరికి వెళ్లారు.

టెక్నాలజీతో పోటీపడే విద్యను అందించాలి

తిరువళ్లూరు: టెక్నాలజీతో పోటీపడే విద్యను విద్యార్థులకు అందించినప్పుడే దేశాభివృద్ధి వేగంగా జరుగుతుందని అన్నావర్సిటీ మాజీ వీసీ బాలగురుస్వామి తెలిపారు. తిరువళ్లూరు జిల్లా ఉలుందై గ్రామంలో స్వామి వివేకానంద గ్రామ అభివృద్ధి సంస్థను నిర్వహిస్తున్నారు. ఈ సంస్థ ద్వారా తిరువళ్లూరు, చెంగల్‌పట్టు, కాంచీపురం, వేలూరు జిల్లాల్లో 2,500 సింగిల్ టీచర్ పాఠశాలను ఏర్పాటు చేసి విద్యాబోధన అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంస్థ ద్వారా 6,7,8 తదితర విద్యార్థులకు గణితం, సైన్స్, ఇంగ్లిష్, కంప్యూటర్ సబ్జెక్టలలో నైపుణ్యం పెంపొందించడానికి ప్రయోగశాలలు, తరగతి గదులను నిర్మించనున్నారు. కార్యక్రమానికి గాయత్రీ శీనుమణి అనే స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు ఐడీఆర్‌ఎఫ్ అనే అమెరికా స్వచ్ఛంద సంస్థ ద్వారా రూ.20 లక్షలు అందజేశారు. ఈ శిక్షణ ప్రారంభోత్సవం ఆదివారం ఉలుందైలోని సంస్థ కార్యాలయంలో జరిగింది. సంస్థ ఉపాధ్యక్షుడు కృష్ణన్, బాలగురుస్వామి హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యావ్యవస్థను సమూలంగా మార్చి ప్రపంచ స్థాయి పోటీని తట్టుకుని నిలబడే వ్యవస్థ రావాలన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు వారిలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయాలని చెప్పారు. సేవాభావం, దేశభక్తిని ప్రాథమిక దశ నుంచే నేర్పించాలన్నారు. అనంతరం మదురైలోని ట్రస్ట్‌కు సంస్థ కార్యదర్శి కృష్ణమాచారి రూ.50 లక్షల చెక్కును అందజేశారు. సంస్థ కోశాధికారి తనికాచలం, మాజీ అధ్యక్షుడు కృష్ణమూర్తి, టర్బో ఎనర్జీ లిమిటెడ్ ఫ్యాక్టరీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దాశరథి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వచ్ఛంద సంస్థకు చెక్కును అందజేస్తున్న బాలగురుస్వామి

పర్వతమలైపై భక్తుల రద్దీ



పర్వత మలై ఎక్కుతున్న భక్తులు

తిరువొత్తియూరు: కలసపాక్కం సమీపంలో 4,560 అడుగుల ఎత్తైన కొండపై స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తిరువణ్ణామలై జిల్లా కలసపాక్కం సమీపంలో 4,560 అడుగుల ఎత్తైన పర్వతమలైపై 2000 సంవత్సరాల పురాతన భ్రమరాంబికా సమేత మల్లికార్జునేశ్వర స్వామి ఆలయం ఉంది. పౌర్ణమి రోజున స్వామివారి దర్శనం కోసం తమిళనాడు నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఇక్కడికి వస్తుంటారు. వారు స్వామివారికి స్వహస్తాలతో అభిషేకం చేస్తారు. ఈ క్రమంలో శనివారం ప్రదోష మాసం గురు పౌర్ణమి కావడంతో పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. కోయిల్ మతిమంగళంలోని కరైకన్‌దేశ్వరర్ ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. కదలాడి పట్టియాంతల్, వేదపులి, ఈశ్వర్ సుమారు 23 కిలోమీటర్లు పర్వతమలై గిరి ప్రదక్షిణ చేశారు. మూలాధారం వద్ద ఉన్న వీరభద్రార్ స్వామి ఆలయంలో దర్శనం తర్వాత, భక్తులు తాడు కట్టుకుని పర్వతాన్ని అధిరోహించారు. వారు శిఖరం వద్దకు వెళ్లి మల్లికార్జున స్వామిని దర్శనం చేసుకున్నారు.

రాణిపేటలో కరుణానిధి జయంతి వేడుకలు



జయంతి వేడుకలను ప్రారంభిస్తున్న మంత్రి ఆర్ గాంధీ

వేలూరు: రాణిపేటలో డీఎంకే పార్టీ ఆధ్వర్యంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి జయంతి వేడుకలను మంత్రి ఆర్ గాంధీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుపేదల సంక్షేమం కోసం పలు పథకాలను తీసుకొచ్చిన వ్యక్తి కరుణానిధి అన్నారు. అటువంటి మహావ్యక్తి జయంతి వేడుకలను రాణిపేటలో జరుపుకోవడం అభినందనీయమన్నారు. రాణిపేటలో మాత్రం కాదని జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లోనూ ఈ వేడుకలను జరుపుకునేందుకు కార్యకర్తలు ముందుకు రావాలన్నారు. వేడుకల సమయంలో నిరుపేదలకు అవసరమైన సంక్షేమ పథకాలను ఉంచితంగా అందజేయాలని చెప్పారు. రాష్ట్ర పర్యావరణ విభాగం కార్యదర్శి వినోద్, ఎమ్మెల్యే ఈశ్వరప్పన్, జెడ్పీ చైర్మన్ జయంతి, మున్సిపల్ చైర్మన్ సుజాత, వెంకట్రామన్, వడివేలు, పట్టణ కార్యదర్శి పూంగావనం పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి పెంచడమే లక్ష్యం

కొరుక్కుపేట: అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తిని పెంచడమే లక్ష్యంగా ఎస్ఆర్ఎం పబ్లిక్ స్కూల్‌తో స్పేస్ కిడ్జ్ ఇండియా ఒప్పందం చేసుకుంది. భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రయోగ వాహనాల్లో ఒకదాని ద్వారా కక్ష్యలోకి పంపబడే ఉపగ్రహాన్ని రూపొందించడానికి, అభివృద్ధి చేయడానికి ఆసక్తి చూపే విద్యార్థుల కోసం స్థానిక గూడువాంచేరి లోని పాఠశాల ప్రాంగణంలో ఎస్ఆర్ఎం పబ్లిక్ స్కూల్, స్పేస్ కిడ్జ్ ఇండియా మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఎస్ఆర్ఎం పబ్లిక్ స్కూల్ సలహాదారు డాక్టర్ కె.ఆర్.మాలతి, స్పేస్ కిడ్జ్ ఇండియా వ్యవస్థాపకులు, సీఈఓ డాక్టర్ శ్రీమతి కేసన్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. మాలతి మాట్లాడుతూ సైంటిఫిక్ స్ఫూర్తిని, సైన్స్ పట్ల పిల్లల్లో ఆసక్తిని పెంపొందించడం, స్పేస్ కిడ్జ్ ఇండియాతో జతకట్టాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. కేసన్ మాట్లాడుతూ 8 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 15 మంది విద్యార్థులు ఈ మిషన్ కోసం ఎంపికయ్యారని చెప్పారు.



ఒప్పందం చేసుకుంటున్న మాలతి, శ్రీమతి కేసన్

నడిచి వచ్చిన గర్భిణికి అంబులెన్స్ వసతి

వేలూరు: నిండు గర్భిణికి పురిటినొప్పులు రావడంతో రోడ్డు వసతి లేక అటవీ ప్రాంతం నుంచి 15 కిమీ నడిచి ఆస్పత్రికి వచ్చిన మహిళకు ఇంటికి వెళ్లేందుకు అంబులెన్స్ వసతిని ఏర్పాటు చేశారు. వేలూరు జిల్లా అనకట్టు నియోజక వర్గంలోని జార్దాన్ కొల్లై పంచాయతీ పరిధిలోని ముత్తన్ గుడిసె గ్రామానికి చెందిన సేట్టు భార్య శివగామి(22)కి రెండు రోజుల క్రితం పురిటి నొప్పులు రావడంతో రోడ్డు వసతి లేక పోవడంతో తల్లితో కలిసి కాలినడకన కొండ కిందకు 15 కిమీ నడిచి ఆస్పత్రికి వచ్చిన విషయం సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం తెలిసిందే. బాగాయంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేరిన ఆమెకు సుఖ ప్రసవంతో ఆడ శిశువు జన్మించింది. దీంతో ఆస్పత్రి నిర్వాహకులు ఆమెను డిశ్చార్జ్ చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వేండా, బీడీఓ దురైరాజ్, శిశు సంక్షేమ శాఖ అధికారులు శివగామిని పరామర్శించి అంబులెన్స్‌లో ఇంటికి వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. అంబులెన్స్ ద్వారా అనకట్టు కీల్ కొత్తూరు మీదుగా పీంజిమండై, జార్దాన్‌కొల్లై సమీపంలో ఉన్న శివగామి ఇంటికి అంబులెన్స్ సిబ్బంది సురక్షితంగా చేర్చారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శివగామిని పరామర్శిస్తున్న వైద్య సిబ్బంది

కోలీవుడ్ టాక్స్

జో బైడన్‌గా మారాలనుకుంటా!



హన్సిక

తమిళసినిమా: పెళ్లై ఏడు నెలలే అయ్యింది. ఒక పక్క వైవాహిక జీవితాన్ని ఎంజాయ్ చేస్తూనే మరో పక్క నటిగా బిజీగా ఉన్న నటి హన్సిక. హిందీ, తమిళం, తెలుగు భాషల్లో నటిస్తూ కథానాయకిగా అర్ధ సెంచరీ దాటేశారు. కాగా హన్సిక నటుడు ఆదిపినిశెట్టితో కలిసి నటించిన పార్టనర్ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్ర ప్రమోషన్ కార్యక్రమాలు పాల్గొనడానికి చెన్నైకి వచ్చిన ఈ ముంబై బ్యూటీ ఆదివారం మీడియాతో ముచ్చటించారు. ఆమె మాట్లాడుతూ వివాహ జీవితం చాలా హ్యాపీగా సాగుతోందని, తన నట జీవితానికి తన భర్త ఎంతగానో సపోర్ట్ చేస్తున్నారని చెప్పారు. అంతకుమించి తన తల్లి అండగా ఉంటున్నారని పేర్కొన్నారు. తనకు నటించడం చాలా ఇష్టమని చెప్పారు. నటిగా చాలా డ్రీమ్స్ ఉన్నాయని చెప్పారు. లక్ష్యం అంటూ ఏమీలేదని మంచి నటిగా అందరి మనసుల్లో నిలిచిపోవాలన్నదే తన ఆశ అని చెప్పారు. పలు భాషల్లో 50కి పైగా చిత్రాల్లో నటించడం ఆనందంగా ఉందన్నారు. ఆ అనుభవం చాలా నేర్పిందన్నారు. 50వ చిత్రం మహాలో కథానాయకి ప్రాధాన్యత ఉన్న పాత్రలో నటించడంతో ఆ తరహా పాత్రలోనే నటించాలని కోరుకోవడం లేదని, పాత్ర నచ్చితే ఎలాంటి చిత్రంలోనైనా నటించడానికి రెడీ అని చెప్పారు. జయాపజయాలు అన్నవి గ్యాంబ్లింగ్ అని సీనియర్ దర్శకుడు అయిన వర్ధమాన దర్శకులైన కథ నచ్చితే నటించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. పార్టనర్ చిత్రంలో పురుషుడిగా మారే పాత్రను పోషించానని, ఇది పూర్తిగా విలువైన కథా చిత్రంగా ఉంటుందన్నారు. తాను ఎప్పుడు చాలా జాలీగా ఉంటానని, అందుకే పార్టనర్ చిత్రంలో నటించానని చెప్పారు. మీరు నిజజీవితంలో ఎవరుగా మారాలనుకుంటున్నారన్న ప్రశ్నకు అమెరికా అధ్యక్షుడు జో బైడన్‌గా మారాలని కోరుకుంటానన్నారు. భవిష్యత్తులో చిత్ర నిర్మాణం చేపట్టే అవకాశం ఉందా అన్న ప్రశ్నకు అందుకు అవకాశమే లేదని, అదేవిధంగా దర్శకత్వం వహించే ఆలోచన కూడా లేదని స్పష్టం చేశారు. నటిగా చాలా హ్యాపీగా ఉన్నట్లు హన్సిక పేర్కొన్నారు.



దర్శకుడు మారిసెల్వరాజ్‌కు కారును కానుకగా ఇస్తున్న దృశ్యం

మామన్నన్ దర్శకుడికి ఖరీదైన కానుక

తమిళసినిమా: నటుడు, నిర్మాత, మంత్రి ఉదయనిధి స్టాలిన్ కథానాయకుడుగా నటించిన చివరి చిత్రం మామన్నన్. నటి కీర్తిసురేష్ నాయకిగా నటించిన ఇందులో ఫాహద్ ఫాజిల్, వడివేలు ముఖ్యపాత్రలు పోషించారు. ఏఆర్ రెహ్మాన్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రానికి మారిసెల్వరాజ్ దర్శకుడు. రెడ్ జెయింట్ మూవీస్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం గత నెల 29న విడుదలై పాజిటివ్ టాక్‌తో సక్సెస్‌ఫుల్‌గా ప్రదర్శింపబడుతూ మంచి వసూళ్లు రాబడుతోంది. దీంతో చిత్ర దర్శకుడు నిర్మాణ సంస్థ రెడ్ జెయింట్ మూవీస్ రూ.50 లక్షల ఖరీదైన మినీ కూపర్ కారును బహుమతిగా అందించింది. ఈ సందర్భంగా ఉదయనిధి స్టాలిన్ ట్విట్టర్లో పేర్కొంటూ మామన్నన్ చిత్రం గురించి ఒక్కొక్కరు ఒక్కోవిధంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారని, ఈ చిత్రం ప్రపంచ తమిళనాడు మధ్య చర్చ వేదికగా మారిందని అన్నారు. అంబేడ్కర్, పెరియార్, అన్నాదురై, కళైంజర్ వంటి నాయకులు నాటిన స్వతంత్ర భావాలు, సామాజిక ఆలోచనలను ఈ చిత్రం యువతలోకి తీసుకెళ్లింది అన్నారు అదేవిధంగా వాణిజ్యపరంగాను చాలా పెద్ద విజయాన్ని సాధించింది అన్నారు. ఈ ఆనంద సమయంలో చిత్ర దర్శకుడు మారి సెల్వరాజ్‌కు మినీ కూపర్ కారును బహుమతిగా అందించారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా విహరించడానికి మామన్నన్ చిత్రానికి రెక్కలు తొడిగిన దర్శకుడు మారి సెల్వరాజ్‌కు ధన్యవాదాలు అని ఉదయనిధి స్టాలిన్ అందులో పేర్కొన్నారు.

పీ2కు సంగీతమే అదనపు బలం

తమిళసినిమా: తెలుగు, కన్నడం భాషల్లో పది చిత్రాలకు పైగా నటించిన నటుడు మనోజ్ తమిళంలో హీరోగా పరిచయం అవుతున్న చిత్రం పీ2. యాత్తిశై చిత్రం ఫేమ్ సిద్ధు కుమరేశన్ నాయకిగా నటిస్తున్న ఇందులో నటుడు ఇళవరసు, రాజసిమ్మన్, సంపత్ రామ్, దీప ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. అరమ్ ప్రొడక్షన్స్ పతాకంపై ఆర్.రామలింగం నిర్మిస్తున్న ఈ చిత్రానికి శివం కథ, కథనం, మాటలు అందిస్తూ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. దేవా సంగీతాన్ని ఎస్ఆర్. వెట్రి ఛాయాగ్రహణం అందిస్తున్న ఈ చిత్రం శనివారం చెన్నైలోని సంగీత దర్శకుడు దేవా రికార్డింగ్ స్టూడియోలో పాటల రికార్డింగ్‌తో ప్రారంభమైంది. చిత్ర వివరాలను మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో దర్శకుడు పేర్కొంటూ హర్రర్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిస్తున్న వైవిధ్యభరిత కథా చిత్రంగా పీ2 ఉంటుందన్నారు. నమ్మకద్రోహం ప్రధాన ఇతివృత్తంగా సాగుతుందని తెలిపారు. చిత్ర షూటింగ్‌ను చెన్నై పరిసర ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. చిత్రానికి దేవా సంగీతం అదనపు బలం అవుతుందనే అభిప్రాయాన్ని దర్శకుడు వ్యక్తం చేశారు.



పీ2 చిత్ర పూజా కార్యక్రమం

సినీ నిర్మాతగా శాస్త్రవేత్త



కాడప్పురా కళైకుళు చిత్ర యూనిట్

తమిళసినిమా: అన్ని వర్గాల వారిని ప్రభావితం చేసే ఏకైక మాధ్యమం సినిమా. వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు, చివరికి వైద్యులు కూడా ఈ రంగంపై ఆసక్తి చూపుతున్నారు. అలా తాజాగా ప్రముఖ శాస్త్రవేత్తలైన డాక్టర్ మురుగానందం వీరరాఘవన్, డాక్టర్ షణ్ముఖప్రియ సినీ నిర్మాతలుగా అవతారం ఎత్తారు వీరు సాక్షి సిని ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై నిర్మిస్తున్న తొలి చిత్రం కాడప్పురా కళైకుళు. నటుడు మునిష్కాంత్, కాళీ వెంకట్, హరికృష్ణ ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రం ద్వారా రాజా గురుస్వామి దర్శకుడుగా పరిచయం అవుతున్నారు. హెంద్రి సంగీతాన్ని అందించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తిచేసుకుని త్వరలో తెరపైకి రావడానికి ముస్తాబవుతుంది. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. నిర్మాత మురుగానందం వీరరాఘవన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన తాను అక్కడే హైస్కూల్‌లో చదివి ఆ తర్వాత ప్రైవేట్ కళాశాలలో చేరి శాస్త్రవేత్తగా ఎదిగానని చెప్పారు. అయితే చిన్నతనం నుంచే సినిమాపై ఉన్న ఆసక్తే తనని ఈ రోజున నిర్మాతగా మార్చిందని తెలిపారు. వీధి కళాకారుల జీవితాలను ఆవిష్కరించే కథాచిత్రంగా కాడప్పురా కళైకుళు ఉంటుందన్నారు. నానాటికి కనుమరుగవుతున్న ఈ కళను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతోనే ఈ చిత్రాన్ని నిర్మించినట్లు చెప్పారు. చిత్రంలో ప్రేక్షకులను అలరించే జనరంజకమైన అన్ని అంశాలు ఉంటాయని చెప్పారు. ఈ చిత్రం ఆదరిస్తే మరి మంచి చిత్రాలను చేస్తామని చెప్పారు. ఈ చిత్రాన్ని ఎంతో కష్టపడి ఇష్టంగా చేశామని నటుడు మునీష్కాంత్ పేర్కొన్నారు. దర్శకుడుగా అవకాశం కల్పించిన నిర్మాతకు దర్శకుడు రాజాగురుస్వామి కృతజ్ఞతలు తెలిపారు.

ఆశలన్నీ 75 పైనే!



నయనతార

తమిళసినిమా: సంచలనాలకు బ్రాండ్ అంబాసిడర్ నయనతార. ఈమె నట జీవితం అంతా వివాదాలు, వినోదాలతోనే సాగుతుందని చెప్పవచ్చు. మొదట్లో నటుడు శింబును గాఢంగా ప్రేమించిన నయనతార అది పెళ్లికి దారి తీస్తుందని నమ్మారు అయితే ఆ ప్రేమ బెడిసికొట్టింది. ఆ తర్వాత నృత్య దర్శకుడు, నటుడు ప్రభుదేవాతో ప్రేమ ఇక ఏడడుగులు వేయడమే ఆలస్యం అన్నంత వరకు వెళ్లింది. అయితే ఆ ప్రేమ కథ అడ్డం తిరిగింది. ఇక ఇటీవల దర్శకుడు విగ్నేష్‌శివన్‌తో కొంతకాలం సహజీవనం చేసి ఇటీవలే పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత సరోగసి ద్వారా ఇద్దరు కవల పిల్లలకు తల్లి కూడా అయ్యారు. అయినా ఇప్పటికీ నటనకు మాత్రం దూరం కాలేదు. అయితే పెళ్లి అయిన తరువాత కెరీర్ మాత్రం ఆశించిన స్థాయిలో సాగడం లేదనే మాట వినిపిస్తోంది. భారీ చిత్రాల అవకాశాలు రావడం, నటించిన చిత్రాలు కూడా ఆశించిన విధంగా ఆడడం లేదు. ఇక్కడ చెప్పుకోవాల్సిన విషయం ఏమిటంటే బాలీవుడ్ ఎంట్రీ.. షారుక్ ఖాన్ జంటగా జవాన్ చిత్రంలో నటించడం ఒక్కటే ప్లస్ పాయింట్ అని చెప్పక తప్పదు. లేడీస్ సూపర్‌స్టార్ స్థానాన్ని అనుభవించిన నయనతార ఇప్పుడు దాన్ని నిలుపుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం ఎందుకు నయనతార తన 75వ చిత్రాన్నే నమ్ముకున్నారు. ఇది లేడీ ఓరియెంటెడ్ కథా చిత్రం. ఇందులో జై కథానాయకుడిగా నటిస్తున్నారు. రాజారాణి చిత్రం తర్వాత వీళ్లు కలిసి నటిస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రం ద్వారా శంకర్ శిష్యులు నీలేష్ కృష్ణ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇది తిరుచ్చి, చెన్నైలలో జరిగే కథా చిత్రంగా ఉంటుందని, ఇందులో నయన మధ్య తరగతి కుటుంబానికి చెందిన యువతిగా నటిస్తున్నట్లు సమాచారం. ఒకే చోట పనిచేసే నయనతార, జై మధ్య ప్రేమను దర్శకుడు కొత్త కోణంలో ఆవిష్కరిస్తున్నట్లు తెలిసింది.

క్లుప్తంగా

వ్యాపారిపై దాడి

• రూ.6లక్షల నగదు చోరీ

తిరువొత్తియూరు: సేలం సమీపంలో భార్యతో కలిసి ద్విచక్రవాహనంలో వెళ్తున్న వ్యాపారిపై దాడి చేసి రూ 6.లక్షలు, 8 కిలోల వెండిని దుండగులు దోపిడీ చేశారు. దాడిలో దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. సేలం శివతపురంలోని కట్టూర్ ప్రాంతానికి చెందిన సురేష్ (45). ఇతను శివతపురంలో వెండి ఆభరణాల దుకాణం నడుపుతున్నాడు. శనివారం రాత్రి దుకాణం మూసివేసి సురేష్ భార్య విశాలాక్షితో ద్విచక్రవాహనంలో ఇంటికి బయలుదేరారు. ఆ సమయంలో నలుగురు వ్యక్తులు ఒక్కసారిగా సురేష్ బైక్‌ను అడ్డగించి వారిపై దాడి చేశారు. వారి నుంచి రూ.6 లక్షల నగదు, 8 కిలోల దోచుకుని పరారయ్యారు. దాడిలో సురేష్, విశాలాక్షి గాయపడ్డారు. గాయపడ్డ వీరిని స్థానికులు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. విషయం తెలిసి మున్సిపల్ సౌత్ డిప్యూటీ కమిషనర్ లావణ్య, పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి విచారణ జరిపారు.

రికార్డులు లేని 45 వాహనాల సీజ్

తిరువళ్లూరు: రికార్డులు సరిగ్గా లేని 45 వాహనాలను తిరువళ్లూరు టౌన్ పోలీసులు సీజ్ చేసి కేసు నమోదు చేశారు. తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీని ముమ్మరం చేయాలని ఎస్పీ ఫకెర్లా సెఫాస్ కల్యాణ్ పోలీసులను ఆదేశించారు. ఇందులో భాగంగా తిరువళ్లూరు టౌన్ ఇన్‌స్పెక్టర్ ఆంథోనిస్టాలిన్ నేతృత్వంలోని పోలీసులు ఆదివారం ఉదయం నుంచి రెండు బృందాలుగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సరైన రికార్డులు లేని 45 వాహనాలను సీజ్ చేశారు. 45 మందిపై కేసు నమోదు చేశారు.

రూ.45 లక్షల బంగారం స్వాధీనం

తిరువొత్తియూరు: తిరుచ్చి విమానాశ్రయ కస్టమ్స్ అధికారులు శనివారం కోవై విమానాశ్రయంలో రూ.45 లక్షల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. సింగపూర్ నుంచి రహస్యంగా బంగారు తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో తిరుచ్చి విమానాశ్రయ కస్టమ్స్ అధికారులు శనివారం కోవై విమానాశ్రయంలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. సింగపూర్ నుంచి కోవైకి వచ్చిన టైగర్ ఎయిర్‌వేస్ విమాన ప్రయాణికుడి బ్యాగులో 395 గ్రాముల బంగారు, మరొక ప్రయాణికుని వద్ద 354 గ్రాముల బంగారును స్వాధీనం చేసుకున్నారు. మొత్తం బంగారు విలువ రూ.45.31 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఇద్దరు ప్రయాణికులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

భార్యను కడతేర్చిన భర్త అరెస్ట్

కొరుక్కుపేట: శ్రీవైకుంఠం సమీపంలో భార్యను గొంతు కోసి హత్య చేసిన భర్తను పోలీసులు అరెస్ట్ చేశారు. తూత్తుకుడి జిల్లా శ్రీవైకుంఠం సమీపంలోని నార్త్ ప్రాంతానికి చెందిన బాలసుబ్రమణ్యం కుమారుడు పూల్ పాండియన్ (28) కూలీ. అత్త కూతురు ముత్తురాణి (25)ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి కదిర్ (5), ఉదయబాల (2) పిల్లలు ఉన్నారు. దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. దీంతో పాండియన్ భార్య ముత్తురాణిని గొంతు సులిమి హతమార్చి పరారయ్యాడు. అక్కడి నుంచి పరారైన శ్రీవైకుంఠం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు అతడిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి కేసులో ఇంజినీర్..

తిరువొత్తియూరు: గంజాయి విక్రయిస్తున్న ఓ ఇంజినీర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. తంజావూరు జిల్లా, ఒరతనాడు సమీపంలోని కాకరై ఫోర్ట్ శ్మశాన వాటికలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు ఒరతనాడు పోలీసులకు ఆదివారం సమాచారం అందింది. సమాచారం మేరకు అక్కడికి వెళ్లిన పోలీసులను చూసి కొందరు పారిపోయారు. గంజాయి మత్తులో అక్కడ పడి ఉన్న యువకుడిని పట్టుకున్నారు. విచారణలో అతడు తెక్కూర్‌కు చెందిన ఇంజినీర్ శరవణకుమార్ (22) అని తెలిసింది. పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. విచారణలో సంజీవి (21), భారతి (21) అతనితో కలిసి గంజాయి తీసుకుంటున్నట్లు తెలిసింది. ఈ ముగ్గురు కోవైలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో ముగ్గురూ కలిసి చదువుకున్నారు. ఒరత్తకరై కోటకు చెందిన కవియన్ (20)తో పాటు. అతని స్నేహితుల ద్వారా కోయంబత్తూరు నుంచి ఒరత్తనాడుకు గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు విచారణలో తెలిసింది. శరవణన్‌ను పోలీసులు కోర్టులో హాజరుపరిచి తంజావూరు జైలుకు తరలించారు.

డిజిటల్ సర్టిఫికెట్లు

సాక్షి, చెన్నై : పిల్లలకు ఏయే సమయాల్లో ఏ టీకాలు వేయాలన్న విషయం తెలియజేసే విధంగా డిజిటల్ సర్టిఫికెట్ల పంపిణీకి ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది. పుట్టిన పిల్లలకు ఏయే సమయాల్లో ఎలాంటి టీకాలు వేయాలన్న వివరాలను ప్రస్తుతం పుస్తకం లేదా కార్డు రూపంలో తెలుపుతున్నారు. రోగాల బారిన పడకుండా పిల్లలకు ఏయే కాలాలలో, ఏఏ నెలలలో ఏ టీకాలు వేయాలి, పిల్లలు రోగాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఇకమీదట తల్లిదండ్రులకు ఆరోగ్య శాఖ అధికారులు డిజిటల్ విధానంలో తెలియజేయనున్నారు. ఇందు కోసం కేంద్రం ప్రభుత్వ సూచన మేరకు యూ విన్‌యాప్ ద్వారా సమాచారాన్ని చేరవేయనున్నారు. అలాగే తల్లిదండ్రులకు పిల్లలకు వేసిన టీకాల వివరాలతో సర్టిఫికెట్లను సైతం డిజిటల్ తరహాలో అందించేందుకు రాష్ట్ర ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది.

ది బెస్ట్‌గా 'బర్డ్'

• అందుబాటులో అత్యుత్తమ వైద్యసేవలు
• టీటీడీ జేఈఓ సదా భార్గవి
• ముగిసిన ఆర్థో ప్లాస్టీ జాతీయ సదస్సు

తిరుపతి తుడా: తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రిని బెస్ట్‌గా తీర్చిదిద్దినట్లు టీటీడీ జేఈఓ సదాభార్గవి తెలిపారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మూడు రోజులపాటు నిర్వహించిన జాతీయస్థాయి ఆర్థో ప్లాస్టీ సదస్సు ఆదివారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన జేఈఓ మాట్లాడుతూ బర్డ్ ఆస్పత్రిలో ప్రపంచ స్థాయి వైద్య ప్రమాణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆర్థోపెడిక్ సమస్యలతో బాధపడుతున్న రోగులు బర్డ్‌లో మెరుగైన చికిత్స పొందాలని సూచించారు. మోకీలు, తుంటి మార్పిడికి సంబంధించి అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్నారని వెల్లడించారు. ప్రముఖ వైద్యులతో 22 మంది పేద రోగులకు క్లిష్టమైన సర్జరీలను లైవ్‌లో చేశారని తెలిపారు. దేశవ్యాప్తంగా దాదాపు 200 మంది యువ సర్జన్లు ఈ సదస్సులో పాల్గొని లైవ్ ఆపరేషన్లను వీక్షించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారన్నారు. మూడు రోజుల్లో 22 క్లిష్టమైన ఆపరేషన్లు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ సదస్సును విజయవంతంగా నిర్వహించిన బర్డ్ ప్రత్యేకాధికారి డాక్టర్ రాచపల్లి రెడ్డెప్పరెడ్డి, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ దీపక్ బృందానికి జేఈఓ అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని జాతీయ సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇంత చక్కటి సదస్సును నిర్వహించేందుకు ఆమోదం తెలిపిన టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బర్డ్ ప్రత్యేకాధికారి డాక్టర్ రాచపల్లి రెడ్డెప్పరెడ్డి మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది వైద్య నిపుణులు బర్డ్‌కు వచ్చి పేదలకు ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నారన్నారు. సేవ చేయడానికి ముందుకొచ్చే డాక్టర్లకు వసతి, రవాణా, భోజనం, తిరుమల శ్రీవారి దర్శనం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా హిప్ రీప్లేస్‌మెంట్ నిపుణుడు, హైదరాబాద్ మెడికవర్ ఆస్పత్రి హెచ్‌ఓడీ డాక్టర్ కృష్ణకిరణ్ మాట్లాడుతూ సదస్సులో యువ వైద్యులకు సందేహాలను తీర్చడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఇండియన్ ఆర్థో ప్లాస్టీ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ రాజ్ కుమార్ నటేశన్, ఏపీ ఆర్థోపెడిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ సునందకుమార్ రెడ్డి, మెడికల్ కౌన్సిల్ అబ్జర్వర్ డాక్టర్ సుబ్బారెడ్డి, బర్డ్ వైద్యులు ప్రదీప్, వేణుగోపాల్, దీపక్, మెరిల్ సంస్థ ప్రతినిధి డాక్టర్ వివేక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేఈఓ సదాభార్గవి

ఆ మహిళను విడుదల చేయండి

• జైలు అధికారులకు హైకోర్టు ఆదేశాలు

తిరువొత్తియూరు: గంజాయి కేసులో బెయిలు మంజూరైన మహిళను వెంటనే విడుదల చేయాలని మద్రాసు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తిరునింద్రవూరుకు చెందిన కాంచన (55)ను గంజాయి విక్రయం కేసులో 2019 మే 22న పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో బెయిల్‌పై బయటకు వచ్చి విచారణకు హాజరుకాకపోవడంతో ఆమెకు అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆమె కోర్టుకు హాజరై అరెస్ట్ వారెంట్ రద్దు చేసుకున్నారు. ఇదిలా ఉండగా ఆమె మరో కేసులో 2022 ఆగస్ట్ 13 అరెస్ట్ అయ్యింది. ఆ కేసులో ఆమెకు బెయిల్ వచ్చింది. ఆమెపై పెండింగ్ వారెంట్ ఉందని పేర్కొంటూ అధికారులు పులల్ జైలు నుంచి విడుదల చేసేందుకు నిరాకరించారు. ఈ నేపథ్యంలో కాంచన తనను జైలు నుంచి విడుదల చేయాలని కోరుతూ మాదకద్రవ్యాల నిరోధక కేసుల విచారణ ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటీషన్‌ను న్యాయమూర్తి సి.తిరుమగల్ విచారించారు. వెంటనే కాంచనను జైలు నుంచి విడుదల చేయాలని ఆదేశించారు.

రూ.2 లక్షలు లంచం తీసుకున్న పోలీస్ సస్పెన్షన్

తిరువొత్తియూరు: రూ.2 లక్షలను లంచంగా తీసుకున్న పోలీసును అధికారులు సస్పెండ్ చేశారు. చెంగల్పట్టు సమీపంలోని ఇరుంగున్రంపల్లికి చెందిన తమిళ్ మణి ఫిబ్రవరిలో తన ఇంటి ప్రొక్లైన్ యంత్రంతో కూల్చేశారరని తాలూకా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసు స్టేషన్ రైటర్ షణ్ముముగం ప్రత్యర్థిపై కేసు నమోదు చేసేందుకు తమిళ్ మణి వద్ద రూ.2 లక్షల లంచం తీసుకున్నాడు. లంచం తీసుకుంటూ అతనిపైనే కేసు నమోదు చేశాడు. దీంతో దిగ్భ్రాంతి చెందిన తమిళ్ మణి తాను లంచంగా ఇచ్చిన నగదును తిరిగి ఇవ్వాలని పోలీసును కోరాడు. వారు ఇద్దరి ఫోన్ సంభాషణ వీడియో సామాజిక మాధ్యమంలో వైరల్ అయింది. దీనిపై సమాచారం అందుకున్న చెంగల్పట్టు జిల్లా ఎస్పీ సాయిప్రణీత్ విచారణ జరిపి షణ్ముగంను సస్పెండ్ చేస్తూ ఆదేశించారు. షణ్ముగంపై వచ్చిన పలు ఫిర్యాదులు నిజమేనని తెలిసింది. రెండు నెలల క్రితం మేలరిపాక్కంలో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ సమయంలో వారి నుంచి తుపాకీని మాత్రమే స్వాధీనం చేసుకుని, రూ.లక్ష లంచం తీసుకున్నట్టు తెలిసింది. చెంగల్పట్టు వద్ద అర్ధరాత్రి బండి వ్యాపారుల వద్ద లంచం తీసుకున్నట్లు తేలింది. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడానికి వచ్చే వారి నుంచి కూడా షణ్ముగం లంచం తీసుకుంటున్నట్టు గుర్తించారు.

ఆయుధాలతో ఇరువర్గాల ఘర్షణ

అన్నానగర్ : తండయార్ పేట వవుసినగర్ ప్రాంతంలో ఇరువర్గాల వారు ఆయుధాలతో ఘర్షణకు దిగారు. వవుసినగర్‌కు చెందిన ఎడ్విన్ డేనియల్ (19), అతని స్నేహితుడు 16 ఏళ్ల బాలుడికి, అదే ప్రాంతానికి చెందిన సూర్య (19)కు 6 నెలల క్రితం గొడవ జరిగింది. శనివారం రాత్రి ఎడ్విన్ డేనియల్, బాలుడు ఇంటి సమీపంలో నిలబడి ఉన్నారు. ఆ సమయంలో సూర్య, అతని స్నేహితులు అజయ్ (22), ఆకాష్ (22), అమ్ము (22) కత్తులు, ఇనుప రాడ్‌తో దాడికి దిగారు. గమనించిన ఎడ్విన్ డేనియల్ తండ్రి అలెక్స్ పాండియన్ (45), తల్లి నళిని (32), ఆమె స్నేహితుడు జాన్సన్ (22) వారిని అడ్డుకున్నారు. ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు తీవ్రంగా దాడులు చేసుకున్నారు. అందులో అలెక్స్ పాండియన్, నళిని, జాన్సన్‌కు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు స్టాన్లీ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు.

అదేవిధంగా గాయపడిన సూర్య, అజయ్, ఆకాష్, అమ్ము కూడా అదే ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నారు. పోలీసులు రెండు వర్గాల మధ్య వివాదానికి సంబంధించి ఎడ్విన్ డేనియల్, 16 ఏళ్ల బాలుడిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారు.

వాటర్ బాటిల్‌లో విషం కలిపిన ఇద్దరు విద్యార్థులపై కేసు

అన్నానగర్: సంగగిరి సమీపంలో హోమ్ వర్క్ చేయడం లేదంటూ టీచర్‌కు ఫిర్యాదు చేసిన విద్యార్థిపై కక్షతో వాటర్ బాటిల్‌లో విషం కలిపిన ఇద్దరు విద్యార్థులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సేలం జిల్లా సంగకిరి పక్కనే ఉన్న మోరూర్ తూర్పు పంచాయతీ నారప్ప చావడికి చెందిన బాలుడు(12) నట్టువం పాళయం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. దాసనాయకన్‌పాళయం హౌసింగ్ బోర్డు ప్రాంతానికి చెందిన ఇద్దరు బాలురు కూడా అదే పాఠశాలలో చదువుతున్నారు. నారప్పంచవాడికి చెందిన విద్యార్థి క్లాస్ లీడర్. ఈ క్రమంలో మరో ఇద్దరు విద్యార్థులు హోమ్ వర్క్ చేయకుండా పాఠశాలకు వచ్చారు. దీనికి సంబంధించి క్లాస్ లీడర్ టీచర్‌కి ఫిర్యాదు చేశాడు. దీంతో ఇద్దరూ క్లాస్ లీడర్‌పై ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకున్నారు. శనివారం మధ్యాహ్నం క్లాస్ లీడర్ తన స్నేహితుడితో కలిసి భోజనం చేసి బాటిల్‌లోని నీళ్లు తాగేందుకు ప్రయత్నించాడు. మందు వాసన రావడంతో నీటిని కింద పోసి క్లాస్ టీచర్‌కు సమాచారం అందించారు. విద్యార్థిని వెంటనే సంగకిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి తిరుచెంగోడ్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ అతనికి తీవ్ర చికిత్స అందిస్తున్నారు.

బాధితుడు తండ్రి సంగగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు విద్యార్థులతో విచారణ చేపట్టారు. హోంవర్క్ చెయ్యలేదని టీచర్‌కు చెప్పడంతో ఆగ్రహించిన ఇద్దరు విద్యార్థులు క్లాస్ లీడర్ తాగే వాటర్ బాటిల్‌లో విషం కలిపినట్లు తేలింది. అనంతరం పోలీసులు ఇద్దరి విద్యార్థులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

తలపై రాయి వేసి మత్స్యకారుడి హత్య

అన్నానగర్: తలపై రాయివేసి మత్స్యకారుడిని హత్య చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎన్నూర్‌లోని నెడుకుప్పం ప్రాంతానికి చెందిన రంజిత్ కుమార్ (35) చేపల వ్యాపారం చేసేవాడు. ఇతనికి భార్య సుకన్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సుకన్యకు రంజిత్‌తో మనస్పర్థలు రావడంతో 8 ఏళ్లుగా విడివిడిగా జీవిస్తున్నారు. ఈ స్థితిలో ఆదివారం ఉదయం నెడుకుప్పం బీచ్‌లో రంజిత్ కుమార్ తల నుజ్జును జ్జయి శవమై కనిపించాడు. దీన్ని చూసి దిగ్భ్రాంతి చెందిన మత్స్యకారులు ఎన్నూర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా రంజిత్ కుమార్, అతని స్నేహితుడు అదే ప్రాంతానికి చెందిన గోవిందరాజ్ (57) తెల్లవారుజామున ఎన్నూర్ ప్రాంతానికి చేరుకున్నారని తెలిసింది. మద్యం మత్తులో వాగ్వాదం జరిగిందని, కోపోద్రిక్తుడైన గోవిందరాజ్ పెద్ద రాయిని రంజిత్ కుమార్ తలపై వేసి హత్య చేసినట్లు తేలింది. గోవిందరాజును పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యదర్శికి సమన్లు

కొరుక్కుపేట: చిదంబరం నటరాజన్ కోయిల్ సభలో జరిగిన ఘటనపై సోషల్ మీడియాలో పోస్ట్ చేసినందుకు బీజేపీ రాష్ట్ర కార్యదర్శితో పాటు చెన్నైకి చెందిన ఓ వ్యక్తికి చిదంబరం నటరాజ దేవాలయం నగర పోలీసులు సమన్లు జారీ చేశారు. చిదంబరం నటరాజ దేవాలయం కనక సభ వ్యవహారంపై సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ ది కమ్యూన్‌లో పరువు నష్టం కలిగించేలా పోస్ట్ చేసిన వ్యక్తిపై చిదంబరం విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ షేక్ సిరాజుద్దీన్ చిదంబరం సిటీ పోలీస్ స్టేషన్‌లో గత నెల 29వ తేదీన ఫిర్యాదు చేశారు. దీని ప్రకారం సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వ్యక్తిపై పోలీసులు 3 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ నెల 4వ తేదీ ఉదయం 10 గంటలలోపు చిదంబరం నగర పోలీస్ స్టేషన్‌లో వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశించారు. నటరాజ ఆలయ సమస్యకు సంబంధించి చిదంబరం పోలీసులు బీజేపీ రాష్ట్ర కార్యదర్శిని పిలిపించిన విషయం రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది.

పెయింట్ డబ్బాలో చిక్కుకున్న పాము

• వీడియో వైరల్


డబ్బాలో పాము

కొరుక్కుపేట: మైలాడుదురై బి జిల్లా కొల్లిడం సమీపంలో ఒక పాము పెయింట్ డబ్బాలో తల చిక్కుకుని తీవ్ర ఇబ్బంది పడింది. ఈ వీడియో వైరల్ అయింది. అలక్కుడి తోనితురకు చెందిన ఇందుమతి (30) ఇంటికి ఎదురుగా ఉన్న ముళ్ల కంచె పక్కన పాము తిరుగుతోంది. అది దానంతట అదే వెళ్లిపోతుందని అందరూ భావించారు. ఈ క్రమంలో పాము మూడు రోజుల క్రితం పెయింట్ డబ్బాలోకి దూరేందుకు ప్రయత్నించింది. డబ్బా మూతలో తల ఇరుక్కుపోవడంతో అది లోపలికి వెళ్లలేక, బయటకు రాలేక అలాగే విలవిలలాడుతూ ఉండిపోయింది. పాము వెళ్లిపోతుందని భావించిన ఇందుమతి కుటుంబ సభ్యులు ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించింది. ఆ సమయంలో దినేష్ అనే వ్యక్తి చిన్న పెయింట్ డబ్బాను పాము తలపై పెట్టడంతో అది అక్కడి నుంచి వెళ్లిపోయింది. పాము ప్రాణాలతో పోరాడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

బస్సు ఢీకొని యువకుడి దుర్మరణం

కొరుక్కుపేట: ద్విచక్రవాహనాన్ని బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. చెన్నై కాట్టుపాక్కం పిల్లియార్ కోయిల్ వీధికి చెందిన శక్తివేల్ (36). కోవూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగి. తిరువణ్ణామలై జిల్లా సేతుపట్టు ప్రాంతానికి చెందిన శక్తివేల్ స్నేహితుడు శనివారం మృతిచెందాడు. అతని అంత్యక్రియలకు హాజరయ్యేందుకు శక్తివేల్ ద్విచక్రవాహనంలో సేతుపట్టుకు వెళ్లాడు. అంత్యక్రియలు ముగిసిన అనంతరం రాత్రి ద్విచక్రవాహనంలో ఇంటికి తిరిగి బయలుదేరాడు. ధర్మచత్రం సమీపంలో వెళుతుండగా ప్రభుత్వ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో శక్తివేల్ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలిసి దూషి పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాంచీపురం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు నెలల్లో ఒకటిన్నర టీఎంసీల నీరు చేరిక

• పెరుగుతున్న పూండి నీటి మట్టం

తిరువళ్లూరు: చెన్నై ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండు నెలల క్రితం నీటిని విడుదల చేసింది. ఇప్పటి వరకు ఒకటిన్నర టీఎంసీల నీరు రిజర్వాయర్‌కు చేరినట్టు అధికారులు వెల్లడించారు. కృష్ణా జలాలు వేగంగా వస్తున్న నేపథ్యంలో పూండి రిజర్వాయర్ నీటి మట్టం పెరిగింది. తిరువళ్లూరు జిల్లా పూండిలో చెన్నై ప్రజలకు తాగునీటిని అందించే సత్యమూర్తి సాగర్ రిజర్వాయర్ వుంది. ఈ రిజర్వాయర్ మొత్తం నీటి మట్టం 35 అడుగులు. ఇక్కడ 3.50 టీఎంసీల నీటిని నిల్వ చేసుకోవచ్చు. రిజర్వాయర్‌కు ఆంధ్రప్రదేశ్‌లోని కండలేరు రిజర్వాయర్ నీటితో పాటు సమీప ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరే ఆధారం. పూండి రిజర్వాయర్‌లో నీటిని నిల్వ వుంచి చెమరంబాక్కం, చోళవరం, రెడ్‌హిల్స్ రిజర్వాయర్లకు తరలించి చెన్నై ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం ఉపయోగిస్తున్నారు. కాగా ప్రతి ఏటా చెన్నై ప్రజలకు తాగునీటి అవసరాల నిమిత్తం 12 టీఎంసీల నీటిని ఏపీ ప్రభుత్వం విడతల వారీగా విడుదల చేస్తోంది. ఇందులో భాగంగానే గత మే 1న కండలేరు నుంచి సెకనుకు 2,450 క్యూసెక్‌ల నీటిని విడుదల చేశారు. ఈ నీరు మే 4న పూండికి చేరింది. ప్రస్తుతం రిజర్వాయర్‌కు సెకనుకు 480 ఘనపుటడుగుల నీరు వస్తోంది. ఇప్పటి వరకు 1.477 టీఎంసీల నీరు పూండికి చేరినట్టు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం 29.82 అడుగుల నీరు నిల్వ వుంది. ఆశించిన స్థాయిలో నీటినిల్వ వుండడంతో చెన్నై ప్రజలకు తాగునీటి ఎద్దడి ఉండదని అధికారులు వివరించారు.


పూండి రిజర్వాయర్

సరికొత్తగా రైల్వే సిగ్నలింగ్


నగరిలో డంప్ చేసిన సిగ్నల్ కేబుళ్లు


సిగ్నల్ ఏర్పాటు పనుల్లో కూలీలు

• అరక్కోణం నుంచి రేణిగుంట వరకు కేబుల్ పనులు
• 70 కిలోమీటర్ల మేరకు నూతన కేబుల్ అమరిక

నగరి : రైళ్ల రాకపోకలను రైల్వేస్టేషన్ల వద్ద సిగ్నలింగ్ వ్యవస్థ నిర్దేశిస్తుంది. పట్టాలపై రైలు ఉన్నట్లు సిగ్నల్ స్టేషన్‌కు అందితేనే మరో రైలు ఆ పట్టాలపై రానీయకుండా చేయవచ్చు. సిగ్నల్స్ అందకుంటే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ. ఇటీవల ఒడిశాలో ఒకే ట్రాక్‌పై రైళ్లు రావడంతో భారీ ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. అలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదని రైల్వేశాఖ పటిష్ట చర్యలను చేపట్టింది. రేణిగుంట, అరక్కోణం స్టేషన్ల మధ్య సిగ్నల్స్ ఏర్పాటుచేసి సుమారు 20 ఏళ్లకు పైగా అవుతోంది. ఈ కేబుళ్లకు కాలం చెల్లిపోవడంతో సిగ్నల్స్ అందడంలో సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం సిగ్నలింగ్ వ్యవస్థను పునరుద్ధరించే ప్రక్రియకు రైల్వేశాఖ శ్రీకారం చుట్టింది. ఈ పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయి. వీటికి కావలసిన వివిధ రకాల కేబుళ్లు, జంక్షన్ బాక్సులు పెద్ద ఎత్తున నగరి పట్టణంలోని కాకవేడు రోడ్డులో ఇప్పటికే డంప్‌చేశారు. అరక్కోణం నుంచి, రేణిగుంట స్టేషన్ వరకూ రెండు వైపులా పనులు ప్రారంభమయ్యాయి. ఈ కేబుల్ పనులు ప్రస్తుతం నగరి, పుత్తూరు పట్టణాల మధ్య ముమ్మరంగా సాగుతున్నాయి. గతంలో ఉన్న కేబుళ్లతో సంబంధం లేకుండా నూతన కేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనుల్లో భాగంగా ట్రాక్ సమీపం ఒక మీటరు వరకు భూమిని తవ్వి కేబుళ్లను ఏర్పాటుచేయడంతో పాటు నిర్ణీత ప్రాంతాల్లో సిగ్నల్ కంట్రోల్ రూమ్‌లు నిర్మిస్తున్నారు.

కొనసాగుతున్న పనులు

కేబుల్ లేయింగ్, పవర్ సప్లయ్, రిలే ఇంటర్‌లాకింగ్, ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్, భూకంపాలు, మెరుపుల నుంచి రక్షణ చర్యలు, కంట్రోల్ రూమ్ నిర్మాణం, అవుట్‌డోర్ సిగ్నల్, టెలికాం పనులు వరుస క్రమంలో కేబుళ్ల అమరిక ప్రక్రియ జరగనుంది.

పలువురికి ఉపాధి

సిగ్నల్ కేబుళ్ల పనుల్లో భాగంగా ఒక్కో గుంత తవ్వకానికి నలుగురు, పిల్లర్లు వేయడానికి 16 మందికి, బాక్సులు వేయడానికి 8 మందికి, పెయింటింగ్‌కు నలుగురికి, పైపుల అమరికకు 18 నుంచి 20 మందికి చొప్పున ఒక రోజుకు 50 మందికి పనిదొరుకుతోంది. 10 కిలోమీటర్లకు 3 నెలలు పడుతుండడంతో ఈ ప్రాంతం వారికి 3 నెలల పాటు ఉపాధి లభిస్తోంది. ప్రస్తుతం దిమ్మెలు ఏర్పాటు చేయడం వరకు పూర్తయింది. బాక్సుల అమరిక మొదలుకానుంది. ఐదు నెలల్లో పనులు పూర్తవుతాయని రైల్వే అధికారులు చెబుతున్నారు.

నగలు, నగదు దోపిడీ కేసులో నలుగురి అరెస్ట్

తిరువొత్తియూరు: కోయంబత్తూరులో యాప్ ద్వారా స్వలింగ సంపర్కుడితో డేటింగ్ చేసి నగలు, డబ్బు దోచుకున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. తెన్‌కాశి జిల్లాకు చెందిన యువకుడు(28) కోయంబత్తూరులోని శరవణంపట్టిలోని ఓ నిర్మాణ సంస్థలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. అతను స్వలింగ సంపర్కుడు. అతనికి కేరళ రాష్ట్రం ఇడుక్కికి చెందిన సూర్య (23) మొబైల్ యాప్ ద్వారా పరిచయమయ్యాడు. సూర్య శరవణంపట్టిలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇద్దరూ తరచుగా మాట్లాడుకునేవారు. ఈ క్రమంలో తెన్‌కాశి జిల్లాకు చెందిన యువకుడు ఫోన్‌లో సూర్యతో మాట్లాడి చిరునామా తీసుకున్నాడు. తర్వాత సూర్య వున్న కాలనీకి వెళ్లాడు. అక్కడ సూర్యతో పాటు మరో ముగ్గురు ఉన్నారు. వారు తెన్‌కాశి యువకుడిని బెదిరించి అతని మెడలో ఉన్న 1.5 సవర్ల గొలుసు, సెల్‌ఫోన్‌ను లాక్కున్నారు. గూగుల్ పే ద్వారా బ్యాంకు ఖాతాకు రూ.7,800 పంపుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శరవణంపట్టి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యువకుడిని బెదిరించి డబ్బులు, బంగారు దోచుకున్న కేరళ ఇడుక్కికి చెందిన గాడ్విన్ (24), సంజయ్ వర్గీస్ (23), మనోవా (23), సూర్య (23)ను అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

రెండో పెళ్లి చేసుకున్న వ్యక్తిపై కేసు నమోదు

అన్నానగర్: మార్తాండంలో మొదటి భార్యకి తెలియకుండా మరో యువతిని రెండో వివాహం చేసుకున్న భర్త, పాస్టర్ సహా నలుగురిపై మహిళా పోలీసులు కేసు నమోదు చేశారు. కన్యాకుమారి జిల్లా మార్తాండం సమీపంలోని కొడుంగులం ప్రాంతానికి చెందిన విజిన్ కుమార్ (36) ఆటో నడుపుతున్నాడు. అతనికి సంధ్య(34)తో వివాహమైంది. ముగ్గురు పిల్లలు ఉన్నారు. సంధ్య కరుంగల్ ప్రాంతంలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో పనిచేస్తోంది. భర్తతో విభేదాల కారణంగా ముగ్గురు పిల్లలతో ముకలవిలై ప్రాంతంలోని తన తల్లిదండ్రుల ఇంట్లో నివసిస్తోంది. ఈ స్థితిలో విజిన్ కుమార్ విడాకులు తీసుకోకుండానే యువతిని తన బంధువులు, స్నేహితుల సహకారంతో జూన్ 12న వివాహం చేసుకున్నాడు. ఈ విషయంపై సంధ్య భర్తను నిలదీసింది. కట్నంగా ఆస్తి లేదా రూ.10 లక్షలు తీసుకురమ్మని చెప్పినా వినలేదు కాబట్టి తాను మరో పెళ్లి చేసుకున్నానని పేర్కొన్నాడు. దీంతో సంధ్య మార్తాండం ఆల్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీని ప్రకారం స్పెషల్ సబ్ ఇన్‌స్పెక్టర్ విజయరాణి విచారించారు. విజిన్‌కుమార్, పాస్టర్ ప్రిన్స్‌పై 6 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైస్తవులపై దాడులు పెరిగాయ్

కొరుక్కుపేట: ప్రధాని నరేంద్ర మోదీ 9 ఏళ్ల పాలనలో క్రైస్తవులపై దాడులు పెరిగాయని అఖిల భారత క్రైస్తవ సంఘాల కూటమి (ఏఐసీసీసీ) రాష్ట్ర అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ దయాపాత్ర ఆరోపించారు. మణిపూర్ రాష్ట్రంలో 56 రోజులుగా క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఏఐసీసీసీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం చెన్నై హార్బర్ నియోజకవర్గంలోని కలెక్టర్ కార్యాలయం సమీపంలో ధర్నా చేశారు. ఏఐసీసీసీ అధ్యక్షుడు బిషప్ బి.మోహన్‌దాస్ అధ్యక్షత వహించారు. సుమారు 3 వేల మందికి పైగా పాల్గొని మణిపూర్‌ను కాపాడాలని, అక్కడ క్రైస్తవులపై జరుగుతున్న దాడులు ఆపేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ క్రైస్తవులను ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అణిచివేస్తున్నారని ఆరోపించారు. మణిపూర్ సహా పలు రాష్ట్రాల్లో మైనారిటీలపై దమన కాండకు అంతులేకుండా పోయింది విమర్శించారు. ప్రజా స్వామ్య దేశంలో రాజ్యాంగాన్ని పరిరక్షిస్తూ అన్ని మతాలు, కులాలను సమానంగా చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. మైనారిటీలకు న్యాయం చేకూర్చేలా రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ధర్నాలో డాక్టర్ చల్లగాలి యాకోబు, జాన్ మెస్సయ్య, డాక్టర్ జి సుందర్‌రాజు, పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.



ధర్నాలో ప్రసంగిస్తున్న రెవరెండ్ డాక్టర్ దయాపాత్ర

అనారోగ్యంతో ఇద్దరు బాలికల మృతి

తిరువళ్లూరు: అనారోగ్యం కారణంగా ఊత్తుకోట ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ వేర్వేరు గ్రామాలకు చెందిన ఇద్దరు చిన్నారులు మృతి చెందిన సంఘటన విషాదాన్ని నింపింది. తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోట తాలుకా సెన్నన్‌కారణి గ్రామానికి చెందిన ప్రభాకరన్. ఇతడికి రేణుక అనే భార్య, ప్రియదర్శిని(08) కుమార్తె, కుమారుడు దక్షణ్ ఉన్నారు. గత 30న పాఠశాలకు వెళ్లిన ప్రియదర్శిని రాత్రి భోజనం చేసిన తరువాత ఇంట్లో నిద్రించింది. అయితే హఠాత్తుగా రాత్రి 1.30 గంటలకు అస్వస్థతకు గురికావడంతో బాలిక తల్లిదండ్రులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స అందించి పెరంబూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందిన తరువాత శనివారం రాత్రి తిరుగు వస్తుండగా మళ్లీ అస్వస్థతకు గురికావడంతో ఊత్తుకోట వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బాలిక మృతిచెందింది. మరో సంఘటనలో ఊత్తుకోట తాలుకా పాలవాక్కం గ్రామానికి చెందిన నజీమ్ ఉద్దీన్. ఇతడి భార్య ఇమ్రాన్‌బేగం. వీరికి నహీత్ ఆఫ్రీన్(11) కుమార్తె ఉన్నారు. గత నెల29న ఆఫ్రీన్ అనారోగ్యంతో ఊత్తుకోటలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఆరోగ్యం క్షీణించడంతో శనివారం ఊత్తుకోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందింది.

రూ.3 కోట్ల గంజాయి స్వాధీనం

తిరువొత్తియూరు: రాష్ట్రం నుంచి తరలిస్తున్న రూ.3 కోట్ల విలువ చేసే గంజాయిని శ్రీలంక నౌకాదళం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శ్రీలంక తలైమన్నారు సముద్ర ప్రాంతంలో శుక్రవారం రాత్రి శ్రీలంక నౌకాదళం పోలీసులు గస్తీ తిరుగుతున్నారు. సముద్ర తీరం ప్రాంతంలో గస్తీ తిరుగుతుండగా పొదల్లో దాచి ఉన్న మూడు గోనె సంచులను తనిఖీ చేశారు. వాటిలో 92 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.3 కోట్ల విలువ అని తెలిసింది.

జాతరలా తాతగారి పుట్టినరోజు

- 103వ జన్మదిన వేడుక జరుపుకున్న సత్యం
- తరలివచ్చిన మనువలు, మునిమనువలు


కుటుంబ సభ్యుల నడుమ జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న శతాధిక వృద్ధుడు సత్యం

మండపేట: శతాధిక వృద్ధుని జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. విందు వినోదాలతో కుటుంబ సభ్యులు అందరూ కలసి సందడిగా వేడుకను జరిపించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఇతర ప్రముఖులు హాజరై తాతగారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం కేశవరంలో ఆదివారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఈ వేడుక వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పసుపులేటి సత్యం 103వ పుట్టిన రోజును పురస్కరించుకుని అతని చిన్న కుమారుడు వెంకన్న ఆధ్వర్యంలో గ్రామంలో వేడుకలు నిర్వహించారు. సత్యంనకు నలుగురు కుమారులు కాగా అందరూ వ్యవసాయం చేస్తారు. వారి పిల్లలు, ముని మనువలు 70 మంది వరకు ఉన్నారు. 103 ఏళ్ల వయసు వచ్చినా ఇప్పటికీ తన పనులు తానే చేసుకుంటారని, నాటి సంగతులు ఆసక్తిగా చెబుతుంటారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆర్కెస్ట్రా, విందు భోజనాలతో పుట్టిన రోజు వేడుక నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట ముఖ్య అతిథిగా హాజరై సత్యంతో కేక్ కట్ చేయించి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. కుటుంబ సభ్యులతో పాటు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణమూర్తి, మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, ఎంపీటీసీ సభ్యులు అన్నందేవుల కృష్ణారావు, చంద్రమళ్ల పోతురాజు, గ్రామ ప్రముఖులు పెదపాటి ఉమామహేశ్వరరావు, కొప్పిరెడ్డి ప్రసాద్, తుపాకుల ప్రసన్నకుమార్, అబ్బిరెడ్డి వీర్రాజు పాల్గొన్నారు.

కుటుంబాలు కూలిపోయి..
బంధాలు కాలిపోయి!



29.05.2023

మెడికల్ షాపు నిర్వహణతో భార్యాభర్తలు ఏ లోటు లేకుండా జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. బాగా చదివించారు.. ఉద్యోగం రావడం.. పెళ్లి చేయడంతో రెక్కలొచ్చి ఎవరి దారిని వాళ్లు ఎగిరిపోయారు. కుటుంబ యజమాని మంచం పట్టడంతో ఆయన బాగోగులు చూసుకోవడంతో ఆమె మానసికంగా కుంగిపోయింది. చివరకు భర్త మరణం ఆమెను కలచివేసింది. ఇంట్లో ఓదార్చే దిక్కులేదు.. ధైర్యం చెప్పే మనుషుల్లేరు. కొడుకులు వస్తారంటే ఒకరు సప్త సముద్రాల అవల.. మరొకరు వందల కిలోమీటర్ల దూరం.. ఎవరికీ చెప్పుకోలేక ఇంట్లోనే దహన సంస్కారాలు పూర్తి చేసింది.

.. పత్తికొండలో చోటు చేసుకున్న ఈ ఘటన మాయమవుతున్న బంధాలకు అద్దం పట్టింది.

ఒంటరి పయనం

- తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లలు
- ఉనికి కోల్పోతున్న మానవత్వం
- ఒకే ఇంట్లో ఉంటున్నా ఎవరికి వారే..
- కలసి భోజనం చేయడం కలే
- ఆస్తి కోసం పెరిగిన గెంటివేతలు
- 'చివరి మజిలీ'లో కన్నీటి జీవనం

నేను బాగుంటే చాలు అనుకోవడంతోనే రోజు మొదలవుతోంది. తోడబుట్టిన వాళ్లు.. బంధువులు కూడా డబ్బు ముందు కానివారవుతున్నారు. ఆస్తులు అంతస్తులు.. పిల్లలు సాధించిన విజయాలు.. గడుపుతున్న విలాసవంతమైన జీవితం.. ఏ నలుగురు కలిసినా ఇదే చర్చ. వ్యక్తిత్వం ఎక్కడో ఒక మూలన మాత్రమే కనిపిస్తుంది. ఆప్యాయత కరువవుతోంది. బంధాలు పలుచన కాగా.. అసూయ పెరిగిపోతుంది. తనకు కష్టం వచ్చినా, ఇతరులు బాధపడినా కన్నీళ్లే వస్తాయనే విషయం బోధపడితే కానీ తెలియని పరిస్థితి. పెద్దగా ఆస్తులు లేకపోయినా.. ఆదాయ వనరులు అంతంత మాత్రమే ఉన్నా.. అప్పట్లో ఉమ్మడి కుటుంబం కష్టసుఖాల్లో తోడు నిలిచింది. ఒకరికొకరు చేదోడువాదోడుగా ఉండటం.. అరమరికలు లేని జీవనం ఉన్నంతలో సంతృప్తి నిచ్చింది. కానీ ఆధునిక ప్రపంచం గుండెలో గోడలు కట్టుకోవడం బంధాలను పలుచన చేస్తోంది.

– సాక్షి, కర్నూలు డెస్క్



ప్రపంచం వేగంగా అడుగులు వేస్తుండటంతో ఎవరికి వారు జీవితంలో స్థిరపడాలనే ఉరుకులు పరుగుల జీవనానికి అలవాటుపడ్డారు. చదువు.. ఉద్యోగం.. ఈ రెండింటికి ప్రాధాన్యత పెరుగుతోంది. ఆ తర్వాత ఇల్లు, పిల్లలు వీటితోనే జీవితం గడిచిపోతుంది. డబ్బు.. డబ్బు.. ఈ కరెన్సీ నోట్ల మధ్య సమయం నలిగిపోతుంది. మానవత్వం ఎప్పుడో కానీ ఉనికి చాటుకోలేకపోతుంది. సౌకర్యాలు.. విలాసాలు పెరిగిపోవడంతో వీటి ముందు వ్యక్తిత్వం చిన్నబోతుంది. కుటుంబం అన్న మాటే కానీ.. ఎవరికి వారుగా జీవిస్తున్నారు. చాలా కుటుంబాలు ఇప్పటికే బాగా పలుచబడ్డాయి. విద్య.. ఉద్యోగం.. ఉపాధి.. కారణం ఏదైనా ఇంటికి దూరంగా బతకడం అలవాటైపోయింది. ఇక అక్కడో ఇక్కడో కొంతమంది కలసిమెలసి ఉంటున్నా.. అరమరికలతో తుమ్మితే ఊడిపోయే బంధంగా మారుతోంది. పెద్దల పట్ల గౌరవం తగ్గిపోతుండటంతో ఒకే ఇంట్లో జీవిస్తున్నా ఆత్మీయతలు కనుమరుగవుతున్నాయి. రాక, పోక ఇష్టానుసారం కాగా.. విలువలు గాలికి కొట్టుకుపోయి బంధాలు ఒంటరిగా మిగిలిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది.

ఎవరికి వారే భోజనం

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల నేపథ్యంలో అందరూ కలసి భోజనం చేయడం పరిపాటి. ఆ తర్వాత సంఖ్య కాస్త పలుచబడినా రోజులో ఏదో ఒక పూట భోజనం చేయనిదే తృప్తి కలగని పరిస్థితి. ఇప్పుడు ఎవరు ఏ సమయంలో తింటారో తెలియదు, ఏం తింటున్నారో కూడా అడిగేందుకు సమయం ఉండకపోవడం కుటుంబంలో అనారోగ్య వాతావరణానికి కారణమవుతోంది. అందరూ కలసి కూర్చొని భోజనం చేయడం ద్వారా కష్టసుఖాలు పొల్పంచుకునే అవకాశం ఉంటుంది. దీని వెనుక ఉద్దేశం మారిపోయి.. ఆకలి అయినప్పుడు తింటామనో, బయట తిని వచ్చామనే మాటలు వినిపించడం సర్వసాధారణమైంది.

కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో మానసిక రోగుల చికిత్స వివరాలు

సంవత్సరం	ఔట్ పేషెంట్లు	ఇన్ పేషెంట్లు
2021	15,942	92
2022	19,475	175
2023	9,706	283

హాస్టళ్లలో చదువు

ఇది పోటీ ప్రపంచం. మా పిల్లాడు అందరికంటే ముందుండాలనే భావన ప్రతి ఒక్క తల్లిదండ్రిలో కనిపిస్తుంది. ఈ కారణంగా పిల్లలను ఇంట్లో ఉంచుకోకుండా కార్పొరేట్ హాస్టళ్లలో ఉంచి చదివించడం ఫ్యాషన్ అయిపోయింది. అగ్గి పెట్టెల్లాంటి రూముల్లో.. మంచిచెడు తెలియకుండా రోజులు గడిచిపోతున్నాయి. అమ్మానాన్నల ఆప్యాయతకు దూరమవుతూ.. బంధాల విలువ తెలియకుండా ర్యాంకుల వెంట పరుగులు తీయడంతోనే బాల్యం దాటిపోతుంది, యవ్వనం చేజారిపోతుంది. ఆ తర్వాత కూడా ఇంటికి చుట్టపుచూపుగానే వస్తుండటంతో విలువలు వీధిపాలవుతున్నాయి.

పండగలూ పబ్బాలకే..

గతంలో శుభకార్యమైనా, చావుకైనా పది మంది కలిసేవాళ్లు. మంచీచెడు చెప్పి వెళ్లేవాళ్లు. రాత్రి పూట ఆరుబయట మంచాలు వేసుకొని పొద్దుపోయే దాకా కబుర్లు చెప్పుకుంటూ కష్టసుఖాలు పంచుకునేవాళ్లు. ఇప్పుడు ఎవరైనా చనిపోతే కనీసం ఖర్మకాండలు ఎలా చేయాలనే విషయం కూడా తెలియక తికమకపడుతున్నారు. పెళ్లిళ్లు.. శుభకార్యాలంటే ప్రతి ఒక్కరి అడుగు 'బ్రాహ్మణుల' ఇంటి వైపునకే పడుతోంది తప్పితే ఒక్కటంటే ఒక్కటీ సొంతంగా చేసుకోలేకపోవడం ఆధునికత ఏ పరిస్థితికి దారితీస్తుందో అర్థమవుతోంది. ఆహ్వానాలు, హాజరు కూడా మొక్కుబడిగానే ఉండటం చూస్తే మనిషికి, బంధాలకు మధ్య దూరం ఏ స్థాయిలో పెరుగుతుందో తెలుస్తోంది.

సెల్‌ఫోన్లతో సరి..

సర్దుబాటు ధోరణి మచ్చుకైనా కనిపించడం లేదు. పక్కోడి నీడను కూడా సహించలేని పరిస్థితి. వయస్సు పెరిగే కొద్దీ సహనం, ఓర్పు కనిపించాల్సి ఉండగా.. అసూయ ద్వేషాలకు పెద్దపీట వేస్తున్నారు. చిన్న చిన్న మాటలకు పట్టింపులకు పోయి బంధాలనే వదులుకోవడం, అసలు వాళ్లతో ఏమి అవసరం ఉందనే భావన అధికమైంది. ఇందుకు సెల్‌ఫోన్లతో కాలం గడపటం, గంటల కొద్దీ వాటితోనే సావాసం చేయడం ప్రధాన కారణం. ఇంట్లోనే ఉంటున్నా ఎవరూ మాట్లాడుకోకుండా సెల్‌ఫోన్‌పై చేతులు కదుపుతున్నారు. ఫ్రెండ్స్ కలిశామన్న మాటే కానీ చూపంతా సెల్‌ఫోన్ పైనే ఉంటోంది.

ఒక్కరు మరణించినా..

పిల్లలు మంచి హోదాలో ఉండాలని తల్లిదండ్రులు ఎంతగానో తపిస్తున్నారు. ఇందుకోసం తమ జీవితాలను ఫణంగా పెడుతున్నారు. పైసాపైసా కూడబెట్టి మరీ భవితకు బాటలు వేస్తున్నారు. తీరా లక్ష్యం చేరుకోగానే.. పిల్లలు తల్లిదండ్రులకు దూరంగా బతుకుతున్నారు. పిల్లోడు బాగుపడితే చాలనుకొని కొంత కాలం దంపతులు ఇద్దరూ నెట్టుకొస్తున్నా.. వృద్ధాప్యంలో మనోవేదనతో మంచం పడుతున్నారు. ఈ సమయంలో ఇద్దరిలో ఒకరు మరణించిన మరొకరి జీవనం దుర్భరంగా మారుతోంది. మరీ ముఖ్యంగా భార్య మరణిస్తే.. ఆ వెంటనే భర్త కన్ను మూయడం చూస్తే.. పిల్లదు దూరమైతే ఎలాంటి పరిస్థితి ఉంటుందో అర్థమవుతుంది.

పిల్లలకు సమయం కేటాయించాలి



తల్లిదండ్రులు పిల్లల పట్ల బాధ్యతగా మెలగాలి. మరీ ముఖ్యంగా వారితో గడిపేందుకు సమయం కేటాయించాలి. ప్రతి ఒక్కరూ ఐదు టీలు(టైం, టాక్, ట్రీట్, టచ్, ట్రస్ట్) పాటించాలి. అప్పుడే పిల్లలతో బంధం బలపడుతుంది. తల్లిదండ్రుల స్పర్శ పిల్లలకు సరికొత్త అనుభూతితో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందిస్తుంది. నమ్మకం పెంపొందినప్పుడే కుటుంబ వ్యవస్థ బలపడుతుంది.

– సి.జ్యోతిర్మయి, ఫ్యామిలీ కౌన్సిలర్, బిహేవియర్ థెరపిస్ట్, కర్నూలు

దేవుడే దిగివచ్చెనా..!

స్వామి, అమ్మవార్ల అలంకరణలో తరిస్తున్న పిరాట్ల రఘుస్వామి

- అర్ధ శతాబ్దంగా ఇదే సేవ
- శాకంబరి ఉత్సవాలకు అన్నవరం దేవస్థానంలో అలంకరణ

అన్నవరం: మాంస నేత్రాలతో భగవంతుడిని దర్శించడం ఎంతో దుర్లభం. కానీ, ఆ దేవదేవుడిని కనులారా ఒక్కసారైనా దర్శించాలని ప్రతి ఒక్కరూ ఎంతో ఆశ పడుతూంటారు. అటువంటి దేవదేవుడే సాక్షాత్తూ దిగివచ్చాడా అన్నట్టుగా తన అలంకరణ కళానైపుణ్యంతో భక్తుల్ని సమ్మోహితుల్ని చేస్తున్నారు పిరాట్ల రఘుస్వామి. ఈ కళను నమ్ముకుని గత 50 సంవత్సరాలుగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పలు దేవస్థానాల్లో దేవతామూర్తులకు వివిధ రకాలుగా అలంకారం చేస్తూ అందరి మన్ననలూ పొందుతున్నారు ఆయన.

తొలి ఏకాదశి నుంచి ఆషాఢ పౌర్ణమి వరకూ రత్నగిరిపై దర్బారు మండపంలో శ్రీమహావిష్ణువు, లక్ష్మీదేవి మూర్తులకు వివిధ అలంకారాలు చేసేందుకు వచ్చారు. తొలి ఏకాదశి నాడు శ్రీమహావిష్ణువును నాలుగు భుజాలతో శంఖచక్రాలు, గద, పద్మాలు, వక్షస్థలంలో లక్ష్మీదేవితో అలంకరించి అందరి ప్రశంసలూ పొందారు. మహాలక్ష్మి అమ్మవారిని శనివారం వివిధ పుష్పాలతో అలంకరించారు. ఆదివారం గాజులతో అలంకరించారు. ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారిని సోమవారం శాకంబరిగా అలంకరిస్తున్నారు. ఈ సందర్భంగా దేవతా మూర్తుల అలంకరణ గురించి రఘుస్వామి 'సాక్షి'తో ముచ్చటించారు.


సంగంలో డ్రైఫ్రూట్స్ అలంకరణలో గంగాలమ్మ తల్లి


రత్నగిరిపై మహాలక్ష్మీ అమ్మవారికి గాజుల అలంకరణ చేస్తున్న రఘుస్వామి

నెల్లూరు జిల్లా సంగం పట్టణానికి చెందిన రఘుస్వామి తండ్రి వేంకట శేషయ్య పౌరోహిత్యంతో పాటు దేవతామూర్తుల అలంకరణ కూడా చేసేవారు. ఆయనకు రఘుస్వామి సహాయం చేస్తూ ఉండేవారు. అలా ఈ విద్య నేర్చుకున్నారు. తొమ్మిదేళ్ల వయస్సు నుంచే ఆయన దేవతామూర్తుల అలంకరణ చేస్తున్నారు. నెల్లూరు, హైదరాబాద్, చెన్నై, అన్నవరం, శ్రీకాళహస్తి, ఇంకా అనేక దేవాలయాల్లో జరిగిన ఉత్సవాల్లో దేవతా మూర్తులను అలంకారం చేసి పలువురి ప్రశంసలు అందుకున్నారు. చాలా మంది కేవలం దేవతామూర్తుల విగ్రహాలకు మాత్రమే అలంకారం చేస్తారు. రఘుస్వామి మాత్రం విగ్రహాలతో పాటు వాటిని మోసే నంది, రావణబ్రహ్మ, నెమలి తదితర వాహనాలకు కూడా అలంకారం చేస్తారు. సుమారు 12 అడుగుల ఎత్తు ఉన్న దేవతామూర్తులకు కూడా అలంకారం చేస్తానని ఆయన చెప్పారు. దేవతామూర్తులకు కేవలం పువ్వులతోనే కాదు.. చెర్రీ తదితర వివిధ రకాల పండ్లు, జీడిపప్పు, బాదం, యాలకులు, పిస్తా, దోస గింజలు, కిస్మిస్ తదితర డ్రైఫ్రూట్స్.. రంగురంగుల ముత్యాలు, లేసులు, వెన్నపూసతో కూడా దేవతామూర్తులను రఘుస్వామి ఎంతో అందంగా అలంకరిస్తారు. డ్రైఫ్రూట్స్ అలంకారం ఐదు రోజులు, చెర్రీస్‌తో నాలుగు రోజులు, పండ్లతో రెండు రోజులు, వెన్నపూసతో అలంకరణ వారం రోజులు ఉంటాయని అన్నారు. ముత్యాలు, లేసులతో చేసే అలంకరణ ఎన్ని రోజులైనా ఉంచుకోవచ్చని చెప్పారు.

దైవకళ ఉట్టిపడాలి

అలంకారం చేస్తే సాక్షాత్తూ దేవుళ్లే కళ్ల ముందుకు వచ్చినట్టు దైవకళ ఉట్టిపడాలి. గర్భాలయంలో స్వామి, అమ్మవార్లకు కానీ.. ఊరేగింపుల్లో ఉత్సవమూర్తులకు కానీ చేసే అలంకారంలో ఏ మాత్రం తేడా వచ్చినా ఇబ్బందే. అందుకే ఈ కళను నమ్ముకున్నందుకు చాలా నిష్ఠగా ఉంటాను. అలంకారం పూర్తయ్యే వరకూ పచ్చి మంచినీరు కూడా ముట్టను. ఉపవాసంతోనే అలంకారం పూర్తి చేస్తాను. అలంకారంలో ఉన్న స్వామి, అమ్మవార్లకు నీరాజనం సమర్పించాక మాత్రమే టీ తాగినా, ఫలహారం స్వీకరించినా. దేవతామూర్తుల అలంకరణ చాలా ఖర్చుతో కూడిన పని. దీనికి అవసరమైన సామగ్రి అంతా ముందే కొనుగోలు చేసుకుని ఉంచుకోవాలి. ఈ వృత్తి అంత ఆదాయం వచ్చేది కాదు. అలాగని ఏమీ రాదనీ చెప్పలేం. పెద్దపెద్ద దేవస్థానాలు అలంకరణ అవకాశాలు ఇచ్చి ఆదుకోవాలి.

– పిరాట్ల రఘుస్వామి

బోనం.. ధూం ధాం

దుర్గమ్మకు తెలంగాణ బంగారు బోనం సమర్పణ

- ఉత్సవంలా సాగిన ఊరేగింపు
- శాకంబరీదేవి దర్శనానికి పోటెత్తిన భక్తజనం
- రికార్డు స్థాయిలో 70 వేల పైబడి దర్శనాలు
- నేటితో ముగియనున్న శాకంబరీదేవి ఉత్సవాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): చూసిన కనులదే భాగ్యం అన్న రీతిలో ఇంద్రగిరిపై ఆషాఢ సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. శాకంబరీదేవిగా కొలువుదీరిన దుర్గమ్మను దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు. ఆదివారం తెలంగాణ నుంచి బంగారు బోనం సమర్పణ కార్యక్రమం ధూంధాంగా సాగింది. మరోవైపు భక్త బృందాల సారె సమర్పణలు కూడా ఉత్సాహంగా కొనసాగాయి. ఆలయ అధికారులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

'బోన'భాగ్యం..

రెండు తెలుగు రాష్ట్రాలలో పాడి పంటలతో రైతులు, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో క్షేమంగా ఉండాలని కోరుతూ హైదరాబాద్ పాతబస్తీకి చెందిన మహంకాళీ జాతర ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆదివారం దుర్గమ్మకు బంగారు బోనాన్ని సమర్పించింది. ఆషాఢ మాసోత్సవాలలో ఏటా మహంకాళీ జాతర కమిటీ దుర్గమ్మకు బంగారు బోనం సమర్పించడం ఆనవాయితీ. బ్రాహ్మణవీధిలోని జమ్మిదొడ్డి వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఊరేగింపుగా దుర్గగుడికి బయలుదేరారు. బోనాలకు దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, దుర్గగుడి ఈవో భ్రమరాంబ, పాలక మండలి సభ్యులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు ఆలే భాస్కర్ రాజ్ ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు పూజా కార్యక్రమాల అనంతరం బంగారు బోనంతో జాతర కమిటీ ఇంద్రకీలాద్రికి బయలుదేరింది. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, తీన్‌మార్ డప్పులు పోతురాజుల విన్యాసాలు, బేతాళ నృత్యాల మధ్య ఊరేగింపు కనకదుర్గనగర్, దుర్గాఘాట్, ఘాట్‌రోడ్డు మీదగా ఆలయానికి చేరుకుంది. ఈ ఏడాది ఊరేగింపులో అమ్మవారి విగ్రహంతో ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనం ఎంతో ఆకట్టుకుంది. బంగారు బోనం ధరించి ఆలయానికి చేరుకున్న జోగిని శ్యామలను ఈవో భ్రమరాంబ, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. బోనాలను తీసుకుని ఇంద్రకీలాద్రికి చేరుకున్న సుమారు 6 వందల మందికి దేవస్థానం ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనం కల్పించింది. అనంతరం ఆలయ అధికారులకు పట్టుచీర, పసుపు, కుంకుమ, పూజా సామగ్రితో పాటు 11 రకాల బోనాలను ఉమ్మడి దేవాలయాల కమిటీ ప్రతినిధులు సమర్పించారు.

ప్రకృతిమాతా పాహిమాం..

దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శాకంబరీదేవి ఉత్సవాలు రెండో రోజు వైభవంగా కొనసాగాయి. రెండో రోజున అమ్మవారిని ఆకుకూరలు, కాయలు, పండ్లతో అలంకరించారు. శాకంబరీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారికి భక్తులు కూరగాయలు, పండ్లు సమర్పించిన మొక్కులు చెల్లించుకున్నారు. ఇంద్రకీలాద్రిపై అన్ని ఉపాలయాల్లోనూ దేవతా మూర్తులను కూరగాయలతో అలంకరించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు దేవస్థానం కదంబ ప్రసాదం పంపిణీ చేశారు. ఇక ఉత్సవాలలో మూడో రోజైన సోమవారం అమ్మవారికి వివిధ రకాల పండ్లు, డ్రై ఫ్రూట్స్‌తో అలంకరించనున్నారు.

భక్తజన కీలాద్రి

శాకంబరీదేవిగా దుర్గమ్మను దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. కనకదుర్గనగర్, మహామండపం మీదగా కొండపైకి చేరుకున్న భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం 6 గంటల నుంచే భక్తుల రద్దీ ప్రారంభం కాగా, మధ్యాహ్నం 3 గంటల వరకు ఒకే రీతిన రద్దీ కొనసాగింది. అన్ని క్యూలైన్‌లోకి భక్తులను ఉచితంగా అనుమతించారు. చిన్న పిల్లలతో ఉన్న తల్లిదండ్రులు, వృద్ధులు, వికలాంగులకు రూ. 500 క్యూలైన్‌లోకి ఉచితంగా అనుమతించారు. రద్దీ నేపథ్యంలో నాలుగు గంటల పాటు అంతరాలయ దర్శనం నిలిపివేసి, ముఖ మండప దర్శనానికి అనుమతించారు. సాయంత్రం ఆరు గంటల తర్వాత భక్తుల రద్దీ మళ్లీ కనిపించడంతో వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీతో లిఫ్టు ద్వారా వచ్చే భక్తులను మహా మండపం 5వ అంతస్తు వరకే అనుమతించారు. అక్కడి నుంచి క్యూలైన్‌లోకి అనుసంధానం చేశారు. ఉదయం 11 గంటల సమయంలో రద్దీ అధికం కావడం, లిఫ్టు కోసం ఎదురు చూసే భక్తుల క్యూ భారీగా పెరగడంతో భక్తుల మధ్య తోపులాట జరిగింది.

నేడు పూర్ణాహుతితో ముగింపు

ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న శాకంబరీదేవి ఉత్సవాలు సోమవారంతో ముగియనున్నాయి. ఉదయం 10 గంటలకు మహా పూర్ణాహుతితో ఉత్సవాలు లాంఛనంగా ముగుస్తాయని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. పూర్ణాహుతి కార్యక్రమంలో చైర్మన్, ఈవోలతో పాటు పాలక మండలి సభ్యులు, దేవస్థాన వైదిక కమిటీ సభ్యులు పాల్గొననున్నారు.

గాజుల గలగలలు.. అమ్మవారి మెరుపులు

అన్నవరం: రంగురంగుల్లో తయారైన వేలాది గాజుల అలంకరణలో శ్రీమహాలక్ష్మి అమ్మవారు మెరిసిపోయారు. ఆ తల్లిని దర్శించిన భక్తులు భక్తి పారవశ్యంలో ఓలలాడారు. రత్నగిరి దర్బారు మండపంలో సత్యదేవుని ఉత్సవమూర్తుల చెంత కొలువు తీరిన శ్రీమహావిష్ణువు దేవేరి శ్రీమహాలక్ష్మీ దేవిని ఆషాఢ శుద్ధ చతుర్దశి సందర్భంగా ఆదివారం రకరకాల గాజులతో అలంకరించారు. శ్రీమహావిష్ణువును సుగంధభరిత పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించి, పూజించారు. ఈ సందర్భంగా అమ్మవారికి వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, చిట్టి శివ, గంగాధరభట్ల గంగబాబు, ప్రధానార్చకుడు ఇంద్రగంటి నరసింహమూర్తి, వేంకటేశ్వర్లు, అర్చకులు సుధీర్, రామ్ కుమార్, దత్తాత్రేయశర్మ తదితరులు పూజలు చేశారు. దర్బారు మండపంలో స్వామి, అమ్మవారిని దర్శించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసే క్యూ గతంలో సగం మాత్రమే ఉండేది. దీని వలన తొలి ఏకాదశి నాడు భక్తులు ప్రసాదాల కోసం ఎగబడటంతో తోపులాట జరిగింది. ఇప్పుడు ఈ క్యూను చివరి వరకూ పొడిగించారు. దీంతో ప్రసాదాల పంపిణీ సులభతరమైంది. ఆషాఢ పౌర్ణమి సందర్భంగా శ్రీమహాలక్ష్మీదేవిని, రత్నగిరి దుర్గామాతలు వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లను, గ్రామ దేవత నేరేళ్లమ్మను ఆకుకూరలు, కూరగాయలు, పండ్లతో శాకంబరిగా అలంకరించనున్నారు. ఈ అలంకరణలో అమ్మవార్లు ఉదయం 5 గంటల నుంచి రాత్రి వరకూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆయా ఆలయాలను కూడా ఆకుకూరలు, కూరగాయలతో సర్వాంగసుందరంగా అలంకరించనున్నారు.


ప్రత్యేక పుష్పాలంకరణలో విష్ణుమూర్తి, మహాలక్ష్మి అమ్మవారు

సాంకేతిక విద్యకు దిక్సూచి జేఎన్‌టీయూకే

ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రాష్ట్రంలో సాంకేతిక విద్యకు దిక్సూచిగా జేఎన్‌టీయూ కాకినాడ నిలుస్తుందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి పేర్కొన్నారు. జేఎన్‌టీయూ కాకినాడ పరిధిలో ఉన్న యూనివర్సిటీల వీసీలతో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా ప్రణాళిక బోర్డు ఐదవ సమావేశం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా చైర్మన్ హేమచంద్రారెడ్డి ఉన్నత విద్యారంగం అభివృద్ధికి సమష్టిగా కృషిచేయాలని వీసీలకు పిలుపునిస్తూ రెండు రోజుల పాటు జరిగిన సదస్సులో ఎన్నో నూతన ఆవిష్కరణలకు, ఆలోచనలకు స్థానం లభించిందన్నారు. మహారాష్ట్ర నాలెడ్జ్ కార్పొరేషన్ లిమిటెడ్ చీఫ్ మెంటార్ వివేక్ సావంత్ మల్టీ డిసిప్లినరీ ఎడ్యుకేషన్ ఫెసిలిటేటింగ్ త్రూ ఇంటర్-ఇనిస్టిట్యూట్ కనెక్ట్ అంశంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. మల్టీ డిసిప్లినరీ ఎడ్యుకేషన్ గురించి వివరిస్తూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, మార్కెట్లో అభివృద్ధి చెందుతున్న ధోరణులపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు జాబ్ మార్కెట్‌లో అభివృద్ధి చెందుతున్న పోకడలను గ్రహించాల్సిన అవశ్యకత ఉందన్నారు. 2035 నాటికి అధిక సంఖ్యలో మల్టీ డిసిప్లినరీ ఇనిస్టిట్యూట్‌లు ఏర్పాటవుతాయన్నారు. ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బి.శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ పరిశ్రమలకు అనుగుణంగా బీటెక్ ఇంజినీరింగ్ సైన్స్ కోర్సులు రూపొందించాలని, పరిశ్రమలలో చేసే సాంకేతిక ఉద్యోగుల కోసం ఎంటెక్ ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవకాశం కల్పించేందుకు సాయంకాలం తరగతులు నిర్వహించాలన్నారు. మల్టీ డిసిప్లినరీ ప్రాజెక్టులు చేపట్టేలా దృష్టి సారించాలని కోరారు. అనంతరం సదస్సులో పాల్గొన్న వివిధ వర్సిటీల వీసీలను సత్కరించి, సదస్సు విజయవంతం చేసిన జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజును సత్కరించారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ , రిజిస్ట్రార్ సుమలత, డీఈ బాలకృష్ణ, స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.


జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ ప్రసాదరాజును సత్కరిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి

సాక్షి ఫ్యామిలీ
చెన్నై
సోమవారం ॥ 3-7-2023

సన్నిధి

మంచి మాట



కదిలించే కాంతి గురువు

'గు' అంటే చీకటి. 'రు' అంటే కాంతి. అజ్ఞానపు చీకటిని నిర్మూలించేది గురు. కాంతి లేకపోతే మనకు ఏదీ తెలియరాదు. గురువులు కాంతిని ఇస్తారు. జీవనం అనే చీకటిని ఛేదించడానికి ప్రతి మనిషికి కాంతిని ఇచ్చే గురువు ఎంతో అవసరం.

వ్యాసుడు కీలకమైన గురువుకాగా ఆది శంకరాచార్య భారతీయతకు మహోన్నతమైన గురువు అయ్యారు. శంకరాచార్యే ఉండి ఉండకపోతే ఒక దశలో భారతీయత చిందరవందరైపోయేది. గౌతమ బుద్ధుడు, మహావీరుడు, రామానుజుడు, అరవిందుడు వంటి పలువురు మేలైన గురువులు మన మట్టికి, మనకు మేలు చేశారు.

శంకరుల తరువాత స్వామి వివేకానందవల్ల ఒకదశలో భారతీయతకు రావాల్సిన చలనం, జ్వలనం వచ్చాయి. భారతీయ తత్త్వానికి, సత్త్వానికి విశ్వవ్యాప్తిని కలిగించారు వివేకానందులు. మనదేశానికి రాజకీయ స్వాతంత్ర్యం రావడానికి వివేకానందులు పరోక్ష కారణం. వారు వెలిగించిన భారతీయ స్ఫూర్తి పలువురిని జాతీయ ఉద్యమంవైపు నడిపించింది. వైదికత్వం కోసం, జాతి కోసం తన ఆత్మానుభూతిని సైతం త్యాగం చేసిన అత్యున్నత మైన యోగి–గురువు వారు. ఒక దశలో శంకరులు, ఒక దశలో వివేకానందులు అందివచ్చిన గురువులై మనల్ని కదిలించే కాంతులు అయ్యారు.

> మనకు అత్యవసరమైన గురువులుగా ఆది శంకరాచార్యను, స్వామి వివేకానందను మనం ఇకపై సంభావించి స్వీకరించాలి. ఈ ఇరు గురువుల ఉపదేశాల్ని అందుకుని భారతీయులమైన మనం దేశ సంక్షేమం కోసం, సౌభాగ్యం కోసం, ప్రగతి కోసం పనిచెయ్యాలి; మనమూ పరిఢవిల్లాలి.

'కృష్ణం వందే జగద్గురుం' అన్నది మన మట్టిలో మెరుస్తూ ఉండే మాట. కృష్ణుడు చెప్పిన పాఠం భగవద్గీత ప్రపంచం అంతా విలసిల్లుతోంది. 'తుచ్ఛమైన హృదయ దౌర్బల్యాన్ని విడిచి పైకిలే' అంటూ కృష్ణుడు మనల్ని ఉన్ముఖుల్ని చేస్తూనే ఉన్నాడు. 'భగవద్గీత సందేశం అంతా ఈ మాటల్లో ఇమిడి ఉంది' అని చెప్పారు వివేకానందులు. ఈ మాటల స్ఫూర్తితో వారు 'లే, జాగృతి పొందు, లక్ష్యాన్ని చేరే వరకూ ఆగకు' అని అన్నారు. 'పనిలో నేర్పరితనమే యోగం' అనీ, 'హీనమైన పనిని దూరంగా వదిలెయ్యి' అనీ, 'నిర్ణయించబడిన పనిని చెయ్యి' అనీ, 'శ్రద్ధ ఉన్నవాడికి జ్ఞానం లభిస్తుంది' అనీ, 'అనుమానస్తుడికి సుఖం లేదు' అనీ కృష్ణుడు చెప్పినవి మన జీవితాలకు కాంతిని ఇచ్చేవి. 'మానవ విజ్ఞానంలో సాటిలేనివాడు, అద్వితీయమైన వ్యక్తిత్వం ఉన్నవాడు కృష్ణుడు' అని వివేకానందులు చెప్పిందాన్ని అర్థం చేసుకుందాం.

ఏది అన్నిటికన్నా ప్రయోజనకరమైంది? అన్న సంశయానికి 'ధర్మం' అని చెప్పి శంకరాచార్య సంశయ నివృత్తి చేశారు. ఏది వాంఛింపదగింది? అన్న సంశయానికి 'స్వ, పర హితం' అనీ, శత్రువు ఎవరు? అన్న సంశయానికి 'సోమరితనం' అనీ, ఏది దుఃఖం? అన్న సంశయానికి 'ఉత్సాహం లేకపోవడం' అనీ, ఏది జాడ్యం? అన్న సంశయానికి 'నేర్చుకున్నది ఆచరించకపోవడం' అనీ, ఎవరు స్నేహితులు? అన్న సంశయానికి 'పాపాన్ని నివారించే వాళ్లు' అనీ, ఏది పాతకం? అన్న సంశయానికి 'హింస' అనీ, ఎవరు ఎదుగుతారు? అన్న సంశయానికి 'వినయం ఉన్నవాళ్లు' అనీ, ఎవరు ప్రత్యక్ష దేవత? అన్న సంశయానికి 'అమ్మ' అనీ, వేటిని మనుషులు సంపాదించాలి? అన్న సంశయానికి 'విద్య, ధనం, బలం, కీర్తి, పుణ్యం' అనీ, ఎవరి చేత ప్రపంచం జయించబడుతుంది? అన్న సంశయానికి 'సత్యం, ఓర్పు ఉన్న వ్యక్తి చేత' అనీ తెలియజెప్పి మనకు దిశానిర్దేశం చేశారు శంకరాచార్య. 'మీరు అపారమైన ఓర్పు కలిగి ఉన్నారా, అయితే విజయం మీదే' అని శంకరుల స్ఫూర్తితో వివేకానందులు ఉవాచించారు.

'సత్యం, నిగ్రహం, తపస్సు, శుచి, సంతోషం, సిగ్గు, ఓర్పు, నిజాయితీ, జ్ఞానం, శాంతి, దయ, ధ్యానం కలిగి ఉండాలి; ఇదే సనాతన ధర్మం' అన్న వ్యాసుడి ఉపదేశాన్ని వ్యక్తిత్వంలో నింపుకుని ప్రతి వ్యక్తీ ఉదాత్తంగా బతకాలి.

– రోచిష్మాన్



బౌద్ధవాణి

ధర్మచక్ర ప్రవర్తనా పూర్ణిమ

ఆషాఢ మాసం. శుక్లపక్షం. చతుర్దశి చంద్రుడు పశ్చిమ ఆకాశంలోంచి కిందికి వాలిపోయాడు. అది ఒక విశాల వనంలోని పచ్చికబయలు. దానిమధ్య పెద్ద మర్రిచెట్టు. దానికింద ఎత్తైన దిబ్బ. దాని మీద కూర్చుని ఉన్నారు ఐదుగురు తాపసులు. తెల్లవారకముందే సమీప గంగానదిలో స్నానం చేసి వచ్చి తపోసాధన గురించి తర్కించుకుంటున్నారు. తెల్లని నార వస్త్రాలు ధరించారు. వారిలో పెద్దవాడు కొండణ్ణ. అతని చూపు పాదలమాటున లేచి తత్తర పడుతున్న జింకకేసి పడింది. అందరూ అటుకేసి చూశారు. ఎవరో కాషాయ చీవరం ధరించిన ఒక వ్యక్తి వారికేసి వస్తూ కనిపించాడు.

"మిత్రులారా! అలా నడిచేది ఎవరు? గుర్తించారా? శాక్య గౌతముడే!" అన్నాడు అశ్వజిత్తు.

"మిత్రమా! నీవన్నది నిజమే. అతను తపోభ్రష్టుడు. అతను రాగానే మనం గౌరవించకూడదు. లేచి నిలబడకూడదు" అన్నాడు బద్దియుడు.

"కూర్చోమని ఆసనం ఇవ్వకూడదు" అన్నాడు మహానామ!

"ప్రత్యేక గౌరవ వందనాలు చేయొద్దు. ఆసనం ఇద్దాం" అన్నాడు పెద్దవాడైన కొండణ్ణ.

"కానీ... ఆ తేజోమూర్తి వారి దగ్గరకు రాగానే.. ఆ ముఖంలోని జ్ఞానతేజస్సుని చూసి.... ఒకరికొకరు అప్రయత్నంగానే లేచి నిలబడ్డారు. నమస్కరిస్తూ ఎదురు వెళ్లారు. ఆహ్వానించారు. ఉచితాసనం ఇచ్చారు. కాళ్ళకు నీళ్ళిచ్చారు.

"మిత్రమా! శాక్య గౌతమా!" అన్నారు.

"భిక్షువులారా! నేను ఇప్పుడు గౌతముణ్ణి కాను. జ్ఞానోదయం అయిన బుద్ధుణ్ణి తథాగతుణ్ణి భదంతను. కాబట్టి నన్ను భదంతా (భంతే) అని సంబోధించాలి" అన్నాడు.

బుద్ధత్వం అనే పదం వినగానే వారి మనస్సు వికసించింది. గౌరవంతో వంగి నమస్కరించారు.

ఆకాశంలో నల్లని మేఘాల బారు మెల్లగా జింకలవనం మీదుగా నైరుతి దిక్కుకేసి కదలిపోతోంది...!

అప్పటికి ఆరేళ్ళ క్రితం... జ్ఞాన సాధన కోసం దుఃఖ నివారణి మార్గం కోసం అన్వేషిస్తూ తన రాజ్యాన్నీ పదవినీ, రాజభోగాల్నీ వదిలి వచ్చేశాడు సిద్ధార్థుడు. అతనితోపాటే ఆస్థాన పురోహితుడు కొండణ్ణ కూడా వచ్చాడు. సిద్ధార్థుడు పుట్టినప్పుడు "మహారుషి అవుతాడు" అని చెప్పింది ఈ కొండణ్ణే. ఇంకా వారితో పాటు నలుగురు పురోహిత పుత్రులూ వచ్చేశారు. సిద్ధార్థుడు ఆరేళ్ళు అనేకమంది, రుషుల దగ్గరకూ, తాత్వికుల దగ్గరకూ, గురువుల దగ్గరకూ తిరిగాడు. చివరికి ఈ ఐదుగురు మిత్రులతో కలిసి నిరంజనా నదీ తీరంలో కఠోర తపోసాధనకు దిగాడు. తిండి మానాడు, నీరసించి పడిపోయాడు. "ఇది సరైన సాధన కాదు" అని కొద్దిగా ఆహారం తీసుకోసాగాడు. దానితో "అతను తపో భ్రష్టుడయ్యాడు" అని కోపగించి, మిగిలిన ఐదుగురూ అతణ్ణి వదిలి వచ్చేశారు. ఆ తర్వాత బుద్ధగయలో జ్ఞానోదయం పొంది సిద్ధార్థుడు బుద్ధుడయ్యాడు. దుఃఖ నివారణా మార్గాన్ని తెలుసుకున్నాడు. దాన్ని బోధించడానికి, తనని దూషించి వెళ్లిన వారిని వెతుక్కుంటూ వచ్చాడు.

ఆరోజు.... నాల్గు ఆర్య సత్యాల్ని, అష్టాంగ మార్గాన్నీ, మధ్యమ మార్గాన్నీ వివరించాడు. విన్న వెంటనే కొండణ్ణ అర్థం చేసుకున్నాడు. దుఃఖ విముక్తి పొందాడు. ఆ తర్వాత మిగిలిన వారు ఆ మార్గాన్ని దర్శించారు. వారితో బౌద్ధ సంఘం ఏర్పడింది. కాబట్టి ఈ ఆషాఢ పున్నమి "సంఘం పుట్టిన రోజుగా" ప్రసిద్ధి పొందింది. తాము తెలుసుకున్న ధర్మాన్ని (దుఃఖ నివారణీ మార్గాన్ని) ప్రపంచానికి చాటాలనుకున్నారు. కాబట్టి దీన్ని "ధర్మ చక్ర ప్రవర్తనా దినం" అని పిలుస్తారు. బుద్ధుడు వారికి చేసిన మొదటి ప్రవచనం ధర్మ చక్ర ప్రవర్తనా సూత్రంగా, రెండవ ప్రవచనం 'అనాత్మక లక్షణ సూత్రం'గా బౌద్ధ సాహిత్యంలో ప్రసిద్ధి.

విముఖుల్ని సుముఖులుగా చేసిన గురువు కాబట్టి 'గురుపూర్ణిమగా' ఈ ఆషాఢ పున్నమిని ప్రపంచ బౌద్ధులు జరుపుకుంటారు.

– డా. బొర్రా గోవర్ధన్

దిద్దుబాటు

గురువాణి



జీవితంలో కొన్ని వదిలించుకుని తీరవలసినవి, ఎన్ని సర్దుబాట్లుచేసుకుని అయినా వదలకూడనివి కొన్ని ఉంటాయి... వాటిని ఎప్పటికప్పుడు తెలుసుకుని తదనుగుణంగా దిద్దుకోకపోతే పచ్చటి జీవితాలు పాడయిపోతాయి, మోడయిపోతాయి. అందులో మొదటగా స్నేహితుడు.. అదీ ఆత్మీయుడు, ప్రాణసముడు.. అని నమ్మి మనం మన కష్టం, సుఖం, బాధలు, ఇబ్బందులు, బలహీనతలు అన్నీ మనసు విప్పి ఏవీ దాచుకోకుండా చెప్పేసుకుంటాం. ఇవన్నీ తెలుసుకుని మనల్ని మోసం చేయడానికి అతను కనిపెట్టుకుని ఉన్నాడు... అని తెలిసినప్పుడు మీరెంత ప్రమాదంలో ఉన్నారో ఊహించుకోండి. మీరు వెంటనే అప్రమత్తం కావాలి. దిద్దుబాటు చర్యలు చేపట్టాలి... సాధ్యం కానప్పుడు దూరంగా పెట్టడానికి సందేహించకూడదు.

అలాగే భృత్యుడు... సేవకుడికి వినయం ఉండాలి. యజమాని పట్ల గౌరవభావం ఉండాలి. ఆయన చెప్పిన ఆదేశాలను పాటించడం తన విధిగా అనుకోవాలి. తనసేవలతో యజమానిని మెప్పించడానికి ప్రయత్నం చేస్తుండాలి. అలా కాక యజమానికన్నా తాను ఎక్కువ చదువుకున్నవాడిననీ, దేనిలోకూడా ఆయనకేమీ తాను తీసిపోననీ, ఆయన మాటలు నేను వినేదేమిటనే సేవకుడు... యజమానిని ఎప్పుడూ తిరస్కార భావంతోనే చూస్తుంటాడు. అటువంటి భృత్యుడిని సంస్కరించగల శక్తి ఉంటే సంస్కరించగలగాలి... అది సాధ్యంకానప్పుడు వదిలించుకోవాలి. కపటి అయిన మిత్రుడు, అహంకారి అయిన భృత్యుడు మృత్యువుతో సమానం. ఇంట్లో పెద్ద తాచుపాము దూరింది.. ఇంట్లోనే ఎక్కడో ఉంది.. రోజుకు నాలుగైదు సార్లు కనిపిస్తున్నది. ఏదో దానిమానాన అది ఉందని ప్రశాంతంగా, నిబ్బరంగా ఇంట్లో ఉండగలమా... ఇవి కూడా అంతే...

ఇక ... ఒకసారి అనుబంధం ఏర్పడిన తరువాత ఎన్ని అవాంతరాలు, ఎంత మానసిక క్లేశం ఎదురవుతున్నా సర్దుబాటు చేసుకుంటూ, చివరి దాకా కొనసాగించాల్సిన బంధం – దాంపత్య బంధం. ఇద్దరూ కలిసి చెయ్యిచెయ్యిపట్టుకుని ప్రస్థానం చేయాలి. ఎవరు ఎవరి చేయి పట్టుకున్నారు, ఎవరు ఎవరిని కాపాడుకోవాలి.. అనేది ఆయా సందర్భాలను బట్టి ఉంటుంది. ఉదాహరణకు... ఒక చిన్న పిల్లను తీసుకుని తండ్రి నడిచి వెడుతున్నాడు. 'అమ్మా! మనం నడుస్తున్న ప్రదేశం అంత మంచిది కాదు. కొండ మీద నడుస్తున్నాం. జారితే ప్రమాదం. నా చేయి గట్టిగా పట్టుకో..' అన్నాడు. దానికి ఆ పిల్ల .. "వద్దు నాన్నగారూ, నేను మీ చేయి పట్టుకున్నాననుకోండి. జారిపోవడం ఎంత ప్రమాదకరమో, మీ చేయి విడిచి పెట్టేయడం కూడా అంతే ప్రమాదకరం కావచ్చు. అందుకని నేను మీ చేయి పట్టుకోను. మీరే నా చేయి పట్టుకోండి. అప్పుడు ఎంత ప్రమాదం వచ్చినా మీరు నా చేయి వదలరు.. అది నా నమ్మకం" అన్నది. ఆ నమ్మకం ఎంత గొప్పది. ఇది భార్యాభర్తలమధ్య జీవితాంతం అలాగే ఉండాలి... ఒకరికొకరు బాసటగా. అంతే తప్ప ఎవరి చేయి ఎవరు ఎప్పుడు పట్టుకోవాలో వాళ్ళకే తెలియకపోతే... వాళ్ల మధ్యే అభిజాత్యాలు, అహంకారాలు పుడితే, ఆ దాంపత్యం ఏం వర్ధిల్లుతుంది, దానివల్ల ఏ ప్రయోజనం సిద్ధిస్తుంది...

ఇవి చిన్న చిన్న విషయాల్లాగానే కనిపిస్తాయి. తరువాత చూసుకోవచ్చులే అని కాక .. సమస్య మొదలయిందని గుర్తించిన మరుక్షణం దృష్టి పెట్టి దిద్దుకుని జీవితాన్ని సుసంపన్నం చేసుకోవాలి.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సినిమా

ఒక్కటి గుర్తు పెట్టుకోండి!



● 'యాత్ర 2' పోస్టర్

'నేనెవరో ఈ ప్రపంచానికి ఇంకా తెలియకపోవచ్చు.. కానీ, ఒక్కటి గుర్తు పెట్టుకోండి.. నేను వైఎస్ రాజశేఖర రెడ్డి కొడుకుని' అంటూ 'యాత్ర 2' సినిమా పోస్టర్‌ని విడుదల చేసింది చిత్రయూనిట్. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి బయోపిక్‌గా డైరెక్టర్ మహీ వి. రాఘవ్ తెరకెక్కించిన 'యాత్ర' (2019) సినిమా మంచి విజయం అందుకుంది. 'యాత్ర'కి సీక్వెల్‌గా ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బయోపిక్‌తో 'యాత్ర 2' ఉంటుందని మహీ వి.రాఘవ్ గతంలోనే ప్రకటించారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ నెల 8న వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా 'యాత్ర 2' అప్‌డేట్ ఉంటుందని అందరూ అనుకున్నారు. అయితే వారం ముందే అప్‌డేట్ ఇచ్చి సర్‌ప్రైజ్ చేసింది చిత్రయూనిట్. మహీ వి.రాఘవ్ దర్శకత్వంలో వి.సెల్యులాయిడ్‌పై శివ మేక నిర్మించనున్న ఈ సినిమాని 2024 ఫిబ్రవరిలో రిలీజ్ చేయనున్నట్లు ఓ పోస్టర్‌ని విడుదల చేశారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జీవితంలో 2009 నుంచి 2019 వరకు జరిగిన ఘటనల నేపథ్యంలో 'యాత్ర 2' కథ సాగుతుంది. ఇందులో జగన్ పాత్రలో 'రంగం' మూవీ ఫేమ్ జీవా నటించనున్నారు. ఆగస్టు 3 నుంచి 'యాత్ర 2' షూటింగ్ మొదలవుతుంది.

యాక్షన్ థ్రిల్లర్

'ఓదెల రైల్వేస్టేషన్' చిత్ర దర్శకుడు అశోక్ తేజ ఓ యాక్షన్ థ్రిల్లర్‌కి శ్రీకారం చుట్టారు. ఇందులో 'జార్జిరెడ్డి', 'వంగవీటి' చిత్రాల ఫేమ్ సందీప్ మాధవ్ హీరోగా, కేథరిన్ త్రెసా హీరోయిన్‌గా నటించనున్నారు. కేసీఆర్ ఫిల్మ్స్, శ్రీ మహావిష్ణు మూవీస్ బ్యానర్లపై దావులూరి జగదీష్, పల్లి కేశవరావు నిర్మించనున్న ఈ చిత్రాన్ని ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా దావులూరి జగదీష్, పల్లి కేశవరావు మాట్లాడుతూ– "యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందనున్న చిత్రమిది. ఈ నెల చివరి వారంలో పూజా కార్యక్రమాలతో ఈ చిత్రాన్ని ప్రారంభిస్తాం. 'ఓదెల రైల్వే స్టేషన్' చిత్రాన్ని చివరి వరకూ సస్పెన్స్ రివీల్ చేయకుండా ఎంతో గ్రిప్పింగ్‌గా రూపొందించిన అశోక్ తేజ.. ఈ యాక్షన్ థ్రిల్లర్‌ను అంతకుమించి తీస్తారనే నమ్మకం ఉంది. త్వరలోనే ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు వెల్లడిస్తాం" అన్నారు.



● కేథరిన్ త్రెసా, సందీప్ మాధవ్, అశోక్ తేజ

డిసెంబరులో యానిమల్?



● రణ్‌బీర్ కపూర్

'యానిమల్' చిత్రం అనుకున్న సమయాని కన్నా కాస్త ఆలస్యంగా థియేటర్స్‌కు రానుంది. రణ్‌బీర్ కపూర్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'యానిమల్'. ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్, మురాద్ ఖేతని, అశ్విన్ వార్దే, ప్రణయ్ రెడ్డి నిర్మిస్తున్నారు. యాక్షన్, రొమాన్స్, ప్రతీకారం అంశాలతో తండ్రీకొడుకుల నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని తెలిసింది. ఈ సినిమాను ఆగస్టు 11న విడుదల చేయాలనుకున్నారు మేకర్స్. కానీ ఈ సినిమా ఆగస్టులో రిలీజ్ కావడం లేదని, కొన్ని కారణాల వల్ల డిసెంబరులో రిలీజ్ చేసే యోచనలో చిత్రయూనిట్ ఉన్నారని బాలీవుడ్ సమాచారం. ఈ చిత్రంలో అనిల్‌కపూర్, బాబీ డియోల్, శక్తికపూర్ కీలక పాత్రలు పోషించారు.

రంగబలితో బ్లాక్‌బస్టర్ కొడుతున్నాం

– నాగశౌర్య



● పవన్ బాసంశెట్టి, యుక్తి తరేజ, నాగశౌర్య, సుధాకర్ చెరుకూరి

"సుధాకర్‌గారు, నేను ఎప్పటి నుంచో ఓ సినిమా చేయాలనుకున్నాం. పవన్ చెప్పిన 'రంగబలి' కథ మా ఇద్దరికీ నచ్చడంతో ఈ మూవీ చేశాం. చాలా నమ్మకంగా చెబుతున్నాను.. 'రంగబలి'తో కచ్చితంగా బ్లాక్‌బస్టర్ కొడుతున్నాం" అని హీరో నాగశౌర్య అన్నారు. పవన్ బాసంశెట్టి దర్శకత్వంలో నాగశౌర్య, యుక్తి తరేజ జంటగా నటించిన చిత్రం 'రంగబలి'. ఎస్ఎల్‌వీ సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 7న విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి యాంకర్ సుమ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాగశౌర్య మాట్లాడుతూ–"ఇప్పటి వరకూ సుధాకర్‌గారికి వచ్చిన లాభాల కంటే 'రంగబలి' కి వచ్చే లాభాలు ఎక్కువగా ఉంటాయి. 'రంగబలి'తో పవన్ చాలా పెద్ద డైరెక్టర్ అవుతారు" అన్నారు. "ఈ సినిమాలో నాగశౌర్య హీరోయిజం, ఎమోషన్ కొత్తగా చూస్తారు. సుధాకర్‌గారు ఎక్కడ రాజీపడకుండా తీశారు" అన్నారు పవన్ బాసంశెట్టి. "'రంగబలి' టీమ్‌తో పని చేయడాన్ని చాలా ఎంజాయ్ చేశాను" అన్నారు యుక్తి తరేజ. "'రంగబలి' పెద్ద విజయం సాధించాలి" అన్నారు డైరెక్టర్స్ కిషోర్ తిరుమల, శ్రీకాంత్ ఓదెల.


మనసుకు హత్తుకునే ప్రేమకథ



● విజయ్ దేవరకొండ, చైతన్య, లావణ్య

'నేడే చూడండి.. మీ అభిమాన థియేటర్లలో 'అన్నపూర్ణ ఫోటో స్టూడియో' అనే డైలాగ్‌తో మొదలవుతుంది 'అన్నపూర్ణ ఫోటో స్టూడియో' సినిమా ట్రైలర్. చైతన్య రావ్, లావణ్య జంటగా చెందు ముద్దు దర్శకత్వం వహించిన పీరియాడికల్ లవ్‌స్టోరీ 'అన్నపూర్ణ ఫోటో స్టూడియో'. 'ఇచ్చట ఫోటోలు అందంగా తీయబడును' అనేది క్యాప్షన్. బిగ్ బెన్ సినిమాస్ పతాకంపై యష్ రంగినేని నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను హీరో విజయ్ దేవరకొండ విడుదల చేసి, మాట్లాడుతూ– "ట్రైలర్ బాగుంది. ఈ సినిమాను థియేటర్స్‌లో చూడండి. యూనిట్‌కు ఆల్ ది బెస్ట్" అన్నారు. "1980–1990 నేపథ్యాన్ని మళ్లీ గుర్తు చేసేలా ఈ సినిమా ఉంటుంది" అన్నారు చైతన్య రావ్. "ఫస్టాఫ్ ఫన్నీగా, సెకండాఫ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ సినిమా కథనం సాగుతుంది" అన్నారు చెందు ముద్దు, యష్ రంగినేని. 'మనసుకు హత్తుకునే అందమైన ప్రేమకథ', 'చంటి జాతకంలో ప్రాణగండం ఉంది', 'ఇప్పుడు నేనున్న పరిస్థితుల్లో చావు తప్ప నాకు వేరే దారి లేదు' వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి.

నటుడు హరీశ్ మాగోన్ మృతి



● హరీశ్ మాగోన్

హిందీ చిత్ర పరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ బాలీవుడ్ సీనియర్ నటుడు హరీశ్ మాగోన్(76) ఆదివారం ముంబైలో కన్నుమూశారు. ఈ విషయాన్ని సినీ, టీవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (సీఐఎన్‌టీఏఏ) ట్విట్టర్ వేదికగా వెల్లడించింది. 'గోల్ మాల్, చుప్కే చుప్కే, షహెన్‌షా, నమక్ హలాల్, ఇంకార్, ముఖద్దర్ కా సికందర్, ఖుష్బూ ' వంటి పలు బాలీవుడ్ చిత్రాల్లో నటించారు హరీశ్ మాగోన్. ఆయన చివరిగా నటించిన 'ఉఫ్ యే మొహబ్బత్' చిత్రం 1997లో విడుదలైంది. ముంబైలో హరీష్ మాగోన్ యాక్టింగ్ ఇన్‌స్టిట్యూట్ కూడా నడిపారాయన. హరీష్‌కు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతిపట్ల పలువురు బాలీవుడ్ సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

జెండా కాదు.. ఆత్మగౌరవం



● విరాట్ కర్ణ

విరాట్‌కర్ణ హీరోగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో రూపొందుతున్న న్యూ ఏజ్ పొలిటికల్ డ్రామా 'పెద్ద కాపు'. ప్రగతి శ్రీవాస్తవ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మిర్యాల సత్యనారాయణ రెడ్డి సమర్పణలో మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ సినిమా తొలిభాగం 'పెద్ద కాపు–1' టీజర్‌ను ఆదివారం విడుదల చేసి, ఈ సినిమాను ఆగస్టు 18న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. 'ఇది కేవలం జెండా కాదురా.. మన ఆత్మగౌరవం' వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. "అణచివేత, ఘర్షణల నేపథ్యంలో సాగే సినిమా ఇది. ఇద్దరు వ్యక్తుల ఆధిపత్యం ఉన్న ఓ గ్రామంలో ఒక సాధారణ వ్యక్తి పాలనను చేపట్టడం అనేది ఈ చిత్ర కథాంశం. విరాట్‌కర్ణలో మంచి ఇంటెన్సిటీ కనిపిస్తుంది' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: మిక్కీ జె మేయర్.

డిఫరెంట్ రన్నర్



● జానీ మాస్టర్

ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ హీరోగా, విజయ్ చౌదరి దర్శకుడిగా పరిచయమవుతున్న సినిమాకు 'రన్నర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఢమరుక ఆర్ట్స్ పతాకంపై విజయ భాస్కర్, జి. ఫణీంద్ర, ఎం. శ్రీహరి విజయ ఈ సినిమాను నిర్మించనున్నారు. జూలై 2న (ఆదివారం) జానీ మాస్టర్ బర్త్ డే. ఈ సందర్భంగా టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్స్‌ను విడుదల చేశారు మేకర్స్. విజయ్ చౌదరి మాట్లాడుతూ– "ఇదొక డిఫరెంట్ థ్రిల్లర్ మూవీ. తండ్రీకుమారుల మధ్య వచ్చే సెంటిమెంట్ ఈ సినిమాకు హైలెట్" అన్నారు. "హైదరాబాద్‌లో జరిగిన వాస్తవ ఘటనలతో ఈ సినిమాను తెరకెక్కించనున్నాం. పోలీస్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందనున్న ఈ చిత్రం షూటింగ్‌ని ఈ నెల 20 నుంచి ప్రారంభిస్తాం" అన్నారు నిర్మాతలు. ఈ సినిమాకు సంగీతం: మణిశర్మ, కెమెరా: పీజీ విందా.

హారర్ నేపథ్యంలో...



● 'ఇంసిడియోస్' లో ఓ దృశ్యం

టై సింప్కిన్స్, పాట్రిక్ విల్సన్, హియామ్ అబ్బాస్, సింక్లెర్ డేనియల్, ఆండ్రూ ఆస్టర్, రోజ్ బైర్న్ కీలక పాత్రల్లో పాట్రిక్ విల్సన్ దర్శకత్వం వహించిన చిత్రం 'ఇంసిడియోస్: ది రెడ్ డోర్'. స్క్రీన్ జెమ్స్, స్టేజ్ 6 ఫిల్మ్స్, బ్లమ్ హౌస్ ప్రొడక్షన్స్‌పై రూపొందిన ఈ హాలీవుడ్ సినిమా ఈ నెల 6న సోనీ పిక్చర్స్ ద్వారా తెలుగు, ఇంగ్లిష్, తమిళ్, హిందీ భాషల్లో విడుదలకానుంది. "'ఇంసిడియోస్' హారర్ ఫ్రాంచైజీలో రూపొందిన 5వ భాగం 'ఇంసిడియోస్: ది రెడ్ డోర్'. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది" అని చిత్రయూనిట్ పేర్కొంది.

వినోదం.. సందేశం



● ప్రియ

కమల్ తేజ నార్ల, ప్రియా శ్రీనివాస్, సూర్య తేజ కోట, విజయ్ కృష్ణ, హరి తేజ ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'గోవిందా భజగోవిందా'. కార్తికేయ దర్శకత్వంలో ఉపేంద్ర, సూర్య కార్తికేయ నిర్మించిన ఈ చిత్రం ట్రైలర్‌ని దర్శకుడు త్రినాథ రావు నక్కిన విడుదల చేసి, "ట్రైలర్లో మంచి ఫన్ ఉంది" అన్నారు. "వినోదంతో పాటు మంచి సందేశం ఉన్న చిత్రమిది. నిజ జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కొంటారో కామెడీగా చూపించాం. ఈ నెల మొదటి వారంలోనే చిత్రాన్ని విడుదల చేస్తాం" అని సూర్య కార్తికేయ అన్నారు.

స్పోర్ట్స్



అవినాశ్ సబ్లేకు ఐదో స్థానం

ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ అథ్లెటిక్స్ 3000 మీటర్ల స్టీపుల్ ఛేజ్‌లో భారత ఆటగాడు అవినాశ్ సబ్లే ఐదో స్థానంతో ముగించాడు. స్వీడన్‌లోని స్టాక్‌హోమ్‌లో ఈ ఈవెంట్ జరుగుతోంది. రేస్‌ను అవినాశ్ 8 నిమిషాల 21.88 సెకన్లలో ముగించాడు. మొరాకోకు చెందిన ఎల్ బకాలి సూఫియాన్ (8 నిమిషాల 9.84 సెకన్లు) మొదటి స్థానంలో నిలవగా...వేల్ గెట్‌నెట్ (ఇథియోపియా - 8 నిమిషాల 12.27 సెకన్లు) రెండు, సిమి అబ్రహామ్ (8 నిమిషాల 16.82 సెకన్లు) మూడు స్థానాల్లో నిలిచారు. వర్షం కారణంగా అథ్లెటిక్స్ ట్రాక్ చిత్తడిగా ఉండటంతో ఆటగాళ్లంతా తమ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వలేకపోయారు.

'పతనం ఎప్పుడో మొదలైంది'

వరల్డ్‌కప్‌కు వెస్టిండీస్ దూరం కావడం తననేమీ ఆశ్చర్యపర్చలేదని విండీస్ మాజీ పేసర్ ఇయాన్ బిషప్ వ్యాఖ్యానించాడు. గత కొన్నేళ్లుగా జట్టు మెలమెల్లగా పతనం అవుతూ వచ్చిందని, ప్రస్తుత బృందంకంటే కూడా ముందు ఆడిన జట్లలోనే ఇది కనిపించిందన్న బిషప్... వన్డేల్లో తమ జట్టు గత దశాబ్దకాలం నుంచే పేలవ ప్రదర్శన కనబర్చిందని అభిప్రాయ పడ్డాడు.



స్టోక్స్ బెదరగొట్టినా...



బెన్ స్టోక్స్‌ను అవుట్ చేసిన ఆనందంలో హాజల్‌వుడ్

- ఆస్ట్రేలియాదే రెండో టెస్టు
- 43 పరుగులతో ఓడిన ఇంగ్లండ్
- బెన్ స్టోక్స్ అద్భుత శతకం వృథా

'యాషెస్'లో బెన్ స్టోక్స్ మరో చిరస్మరణీయ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు... 2019లో హెడింగ్లీ మైదానంలో జరిగిన మ్యాచ్ తరహాలో ఒంటి చేత్తో జట్టును గెలిపించేలా కనిపించాడు... ఓటమికి చేరువవుతున్న స్థితిలో ఆస్ట్రేలియా శిబిరంలో ఆందోళన కనిపించింది...అయితే గెలుపు కోసం ఇంగ్లండ్ మరో 70 పరుగులు చేయాల్సిన స్థితిలో అతడిని పడగొట్టడంలో ఆసీస్ సఫలమైంది. లార్డ్స్‌లో గెలుపు జెండా ఎగరేసి 2-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఏ స్థితిలోనైనా 'బజ్‌బాల్'ను కొనసాగిస్తానంటూ పట్టుదలగా నిలిచి సిక్సర్లతో చెలరేగినా... చివరకు జట్టును మాత్రం స్టోక్స్ గెలిపించలేకపోయాడు.

లండన్: ఆస్ట్రేలియా జట్టు యాషెస్ సిరీస్‌పై తమ ఆధిపత్యాన్ని మరింత పెంచుకుంది. లార్డ్స్ మైదానంలో ఆదివారం ముగిసిన రెండో టెస్టులో ఆసీస్ 43 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై విజయం సాధించింది. 371 పరుగులను ఛేదించే ప్రయత్నంలో ఓవర్‌నైట్ స్కోరు 114/4తో ఆట కొనసాగించిన ఇంగ్లండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 327 పరుగులకు ఆలౌటైంది. బెన్ స్టోక్స్ (214 బంతుల్లో 155; 9 ఫోర్లు, 9 సిక్స్‌లు) చెలరేగగా... బెన్ డకెట్ (112 బంతుల్లో 83; 9 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కమిన్స్, స్టార్క్, హాజల్‌వుడ్ తలా 3 వికెట్లు పడగొట్టారు. గాయంతో ఉన్న స్పిన్నర్ లయన్ బౌలింగ్ చేయకుండానే ఆసీస్ ఈ విజయాన్ని అందుకోగలిగింది. స్టీవ్ స్మిత్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలవగా, మూడో టెస్టు గురువారంనుంచి లీడ్స్‌లో జరుగుతుంది.

విజయం కోసం చివరి రోజు చేతిలో 6 వికెట్లతో 257 పరుగులు సాధించాల్సిన స్థితిలో ఇంగ్లండ్ బరిలోకి దిగింది. డకెట్, స్టోక్స్ భారీ భాగస్వామ్యంతో జట్టును ముందుకు నడిపించారు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 132 పరుగులు జోడించారు. డకెట్‌తో పాటు బెయిర్‌స్టో (10) తక్కువ వ్యవధిలో వెనుదిరిగారు. విజయం కోసం మరో 178 పరుగులు చేయాల్సిన ఈ స్థితిలో స్టోక్స్ బాధ్యత తీసుకొని భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. గ్రీన్ ఓవర్లో 3 ఫోర్లు కొట్టిన అతను...గ్రీన్ తర్వాతి ఓవర్లో ఒక ఫోర్ కొట్టి 82 పరుగులకు చేరుకున్నాడు. అదే ఓవర్లో వరుస బంతుల్లో 6, 6, 6 బాది అతను సెంచరీని పూర్తి చేసుకోవడం విశేషం. హాజల్‌వుడ్ ఓవర్లోనూ మరో 2 సిక్సర్లు బాదిన స్టోక్స్... స్టార్క్ ఓవర్లోనూ వరుసగా రెండు సిక్స్‌లు కొట్టి 150కు చేరుకున్నాడు. ఏడో వికెట్‌కు బ్రాడ్ (11)తో కలిసి స్టోక్స్ 20.2 ఓవర్లలోనే 108 పరుగులు జోడించాడు. ఆసీస్ మూడు క్యాచ్‌లు వదిలేయడం కూడా స్టోక్స్‌కు కలిసొచ్చింది. ఇంగ్లండ్ గెలుపు దిశగా వెళుతున్నట్లు అనిపించింది. అయితే హాజల్‌వుడ్ బౌలింగ్‌లో స్టోక్స్ మరో భారీ షాట్‌కు ప్రయత్నించాడు. అంచనా తప్పడంతో ఎడ్జ్ తీసుకున్న బంతి గాల్లోకి లేవగా బ్యాక్‌వర్డ్ పాయింట్ వరకు పరుగెత్తుతూ వెళ్లి కీపర్ క్యారీ అందుకోవడంతో అద్భుత ఇన్నింగ్స్ ముగిసింది. ఆ తర్వాత మిగిలిన 3 వికెట్లు తీసేందుకు ఆసీస్‌కు ఎక్కువ సమయం పట్టలేదు.

బెయిర్‌స్టో స్టంపౌట్ వివాదం

లార్డ్స్ టెస్టు చివరి రోజు ఆటలో బెయిర్‌స్టోను స్టంపౌట్ చేసిన తీరు వివాదాన్ని రేపి తీవ్ర చర్చకు దారి తీసింది. లంచ్ ముందు ఈ ఘటన జరిగింది. గ్రీన్ వేసిన బంతిని ఆడకుండా కిందకు వంగిన బెయిర్‌స్టో ఆ తర్వాత సహచరుడు స్టోక్స్‌తో మాట్లాడేందుకు ముందుకు వెళ్లాడు. అదే సమయంలో బంతిని అందుకున్న కీపర్ క్యారీ అండర్‌ఆర్మ్ త్రోతో ముందుకు విసరగా అది స్టంప్స్‌ను తాకింది. ఆ సమయంలో బెయిర్‌స్టో క్రీజ్‌కు చాలా దూరం ఉండటంతో థర్డ్ అంపైర్ బెయిర్‌స్టోను అవుట్‌గా ప్రకటించాడు. దాంతో ఇంగ్లండ్ బృందం ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురైంది. ఆసీస్ తమ అప్పీల్‌ను కూడా వెనక్కి తీసుకునే ప్రయత్నం చేయకపోవడంతో బెయిర్‌స్టో మైదానం వీడాడు. ఆ సమయంలో స్టేడియం మొత్తం 'పాత ఆస్ట్రేలియా...ఎప్పటిలాగే మోసగాళ్లు' అంటూ ప్రేక్షకులంతా గేలి చేశారు.



లంచ్ సమయంలో పరిస్థితి మరింత ముదిరింది. లార్డ్స్ మైదానంలో ప్రతిష్టాత్మక లాంగ్ రూమ్‌లో ఆసీస్ ఆటగాళ్లు నడుస్తుండగా కొందరు మాటలతో ఖ్వాజాను దూషించారు. సెక్యూరిటీ సిబ్బంది పరిస్థితిని చక్కదిద్దాల్సి వచ్చింది. దీనిపై ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు ఆగ్రహంతో ఎంసీసీకి ఫిర్యాదు చేయగా...వారు చివరకు ఘటనపై క్షమాపణ చెప్పారు. నిబంధనల ప్రకారం చూస్తే బెయిర్‌స్టో అవుట్‌లో తప్పు లేదు. బంతి ఇంకా 'డెడ్' కాకముందే అతను క్రీజ్ వీడాడు. బయటకు వెళ్లే ముందు అతను తన కాలితో క్రీజ్ లోపల నేలను గీకడం కూడా కనిపించినా బంతి కీపర్ చేతుల్లోనే ఉంది. అప్రమత్తంగా ఉన్న క్యారీ స్టంప్ చేశాడు. దాంతో మరోసారి క్రీడా స్ఫూర్తి చర్చ ముందుకు వచ్చింది. కామెంటేటర్లంతా వాదనకు చెరో వైపు నిలిచారు. ముఖ్యంగా ఇలాంటి విషయాల్లో స్పష్టంగా ఉండే భారత స్పిన్నర్ అశ్విన్ మాత్రం ఇందులో తప్పేమి లేదని, అది అవుట్ అని స్పష్టం చేశాడు. 'ఒకటి మాత్రం నిజం. ఒక టెస్టులో వెనక అంత దూరం నిలబడిన కీపర్ స్టంప్స్‌పైకి బంతి విసిరాడంటే అప్పటికే బెయిర్‌స్టో ఇలాంటి ప్రయత్నం చేసిన ఉండటం అతను చూసి ఉంటాడు' అని అశ్విన్ విశ్లేషించాడు.

లంక విజయఢంకా

- 9 వికెట్లతో ఓడిన జింబాబ్వే
- ప్రపంచకప్ క్వాలిఫయర్స్

బులవాయో: వన్డే ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌లో శ్రీలంక దూసుకెళుతోంది. సూపర్ సిక్స్ దశలో ఆదివారం జరిగిన పోరులో శ్రీలంక 9 వికెట్ల తేడాతో జింబాబ్వేపై అలవోక విజయం సాధించింది. ముందుగా టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే 32.2 ఓవర్లలో 165 పరుగులకే కుప్పకూలింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మహీశ్ తీక్షణ (4/25), దిల్షాన్ మదుషంక (3/15), మతీశ పతిరణ (2/18) జింబాబ్వే బ్యాటర్స్‌ను వణికించారు. టాపార్డర్‌లో గుంబీ (0), ఎర్విన్ (14), మదెవెర్ (1)లను వరుసగా మదుషంక పెవిలియన్ చేర్చాడు. ఈ దశలో సీన్ విలియమ్స్ (57 బంతుల్లో 56; 6 ఫోర్లు, 1 సిక్స్), సికందర్ రజా (51 బంతుల్లో 31; 3 ఫోర్లు, 1 సిక్స్) కాసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. నాలుగో వికెట్‌కు 68 పరుగులు జోడించారు. ఆ తర్వాత తీక్షణ స్పిన్ ఉచ్చు బిగించడంతో అనంతరం వచ్చిన వారెవరూ కనీసం 20 పరుగులైనా చేయలేకపోయారు. రియాన్ బర్ల్ (16), లాంగ్‌వె (10), ముజరబని



(0), ఇవాన్స్ (14) లంక బౌలింగ్‌కు దాసోహమన్నారు. దీంతో 38 పరుగుల వ్యవధిలోనే జింబాబ్వే 6 వికెట్లను కోల్పోయింది. తర్వాత సునాయాస లక్ష్యాన్ని శ్రీలంక 33.1 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి 169 పరుగులు చేసి ఛేదించింది. ఓపెనర్ పతుమ్ నిసాంక (102 బంతుల్లో 101 నాటౌట్; 14 ఫోర్లు) అజేయ సెంచరీతో కదం తొక్కాడు. దిముత్ కరుణరత్నే (56 బంతుల్లో 30; 2 ఫోర్లు)తో కలిసి ఓపెనింగ్ వికెట్‌కు 103 పరుగులు జోడించాడు. కరుణరత్నేను ఎన్‌గరవ అవుట్ చేయగా... నిసాంకకు జతకలిసిన కుశాల్ మెండిస్ (42 బంతుల్లో 25 నాటౌట్; 2 ఫోర్లు) మరో వికెట్ పడకుండా లక్ష్యాన్ని ముగించాడు.

వెర్‌స్టాపెన్‌దే టైటిల్



స్పీల్‌బర్గ్: ఫార్ములా వన్‌లో చాంపియన్ రేసర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ ఎదురే లేని జోరుతో దూసుకెళుతున్నాడు. ఆదివారం ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రిలో ఈ రెడ్‌బుల్ డ్రైవర్ విజేతగా నిలిచాడు. ఈ ట్రాక్‌పై తనకు పోటీనిచ్చిన ఫెరారీ రేసర్ చార్లెస్ లెక్‌లెర్క్‌ను వెనక్కి నెట్టి తన వేగంతో అగ్ర స్థానంలో నిలిచాడు. దీంతో నిరుటి విజేత లెక్‌లెర్క్ రెండో స్థానంతో తృప్తి చెందాడు. పోల్ పొజిషన్‌తో రేసును ప్రారంభించిన వెర్‌స్టాపెన్ 71 ల్యాపుల్ని అందరికంటే ముందుగా ఒక గంటా 25 నిమిషాల 33.607 సెకన్లలో పూర్తి చేశాడు. ఈ సీజన్‌లో 25 ఏళ్ల ఈ డచ్ డ్రైవర్‌కిది వరుసగా ఐదో విజయం కాగా... ఓవరాల్‌గా ఇప్పటివరకు జరిగిన 9 రేసుల్లో ఏడో విజయాన్ని నమోదు చేశాడు. దీంతో 377 పాయింట్లతో రెడ్‌బుల్ జట్టు అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఇదే జట్టుకు చెందిన సెర్గియో పెరెజ్ మూడో స్థానంలో నిలిచాడు. తదుపరి రేసు బ్రిటిష్ గ్రాండ్‌ప్రి ఈ నెల 9న సిల్వర్‌స్టోన్ సర్క్యూట్‌పై జరుగుతుంది.

రిచా ఘోష్‌పై వేటు

బంగ్లా టూర్‌కు భారత జట్టు ఎంపిక



న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో పర్యటించనున్న భారత మహిళల క్రికెట్ జట్టును ఆదివారం ప్రకటించారు. గాయంతో పేసర్ రేణుక సింగ్ దూరం కాగా, వికెట్ కీపర్ రిచా ఘోష్‌ను ఈ పరిమిత ఓవర్ల సిరీస్‌లకు (టి20, వన్డే) పక్కనబెట్టారు. యువ స్పిన్నర్ శ్రేయాంక పాటిల్‌కు సెలక్టర్లు అవకాశమివ్వలేదు. బంగ్లాదేశ్‌తో భారత్ మూడేసి టి20లు, వన్డేలు ఆడుతుంది. ముందుగా మిర్పూర్ వేదికగా ఈనెల 9, 11, 13 తేదీల్లో టి20 మ్యాచ్‌లు, అదే స్టేడియంలో 16, 19, 22 తేదీల్లో మూడు వన్డేలు జరుగనున్నాయి.

టి20 జట్టు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి (వైస్ కెప్టెన్), దీప్తిశర్మ, షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, యస్తిక భాటియా, హర్లీన్ డియోల్, దేవిక వైద్య, ఉమా చెత్రి, అమన్‌జోత్ కౌర్, సబ్బినేని మేఘన, అంజలి శర్వాణి, పూజ, మేఘన సింగ్, మోనిక పటేల్, రాశి కనోజియా, అనూష బారెడ్డి, మిన్ను రాణి. వన్డే జట్టులో సబ్బినేని మేఘన, మిన్నురాణి స్థానాల్లో ప్రియా పూనియా, స్నేహ్ రాణాలను తీసుకున్నారు.

ఫేవరెట్‌గా జొకోవిచ్

- మహిళల విభాగంలో రిబాకినా
- నేటి నుంచి వింబుల్డన్ టోర్నీ

లండన్: అల్‌కరాజ్ ప్రపంచ నంబర్‌వన్ అయినా... ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో అందరి కళ్లూ జొకోవిచ్‌పైనే ఉన్నాయి. ఈ సెర్బియన్ స్టార్, డిఫెండింగ్ చాంపియన్ 'హ్యాట్రిక్'తో ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌లో ఎనిమిదో టైటిల్ చేజిక్కించుకుంటాడనే అంచనాలు పెరిగాయి. మరోవైపు స్పెయిన్ సంచలనం అల్‌కరాజ్ కూడా టాప్ ర్యాంకు ఉత్సాహంతో వింబుల్డన్ వేటకు సిద్ధమయ్యాడు. మహిళల సింగిల్స్‌లో నిరుటి విజేత ఎలీనా రిబాకినా కూడా వింబుల్డన్ టైటిల్‌ను నిలబెట్టుకునేందుకు సమరానికి సై అంటోంది. సోమవారం నుంచి వింబుల్డన్ టోర్నీ జరుగుతుంది. ఇప్పటికే సీడింగ్స్, డ్రా విడుదల చేయగా... ఇప్పుడు కోర్టులో టైటిల్ వేటే మిగిలింది. ఇప్పటికే 23 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల రికార్డుతో ఉన్న జొకోవిచ్ ఇప్పుడు 24వ టైటిలే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నాడు. రెండో సీడ్ సెర్బియన్ పురుషుల సింగిల్స్ తొలిరౌండ్లో పెడ్రో కచిన్ (అర్జెంటీనా)తో తలపడతాడు. టాప్‌సీడ్ కార్లోస్ అల్‌కరాజ్... జెరెమి చార్డి (ఫ్రాన్స్)తో జరిగే మొదటి రౌండ్ పోరుతో వింబుల్డన్‌కు శ్రీకారం చుట్టనున్నాడు.



డిఫెండింగ్ చాంపియన్స్ జొకోవిచ్, రిబాకినా

మహిళల సింగిల్స్‌లో రిబాకినా వరుసగా రెండో టైటిల్‌పై ఆశలు పెట్టుకుంది. గతేడాది ఈ 24 ఏళ్ల కజకిస్తాన్ స్టార్ వింబుల్డన్ ట్రోఫీతో తొలి గ్రాండ్‌స్లామ్ విజయాన్ని చవిచూసింది. అయితే ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను తృటిలో కోల్పోయింది. ఆరంభ గ్రాండ్‌స్లామ్‌లో ఆమె రన్నరప్‌గా తృప్తి పడింది. టైటిల్ నిలబెట్టుకునేందుకు తొలి రౌండ్లో అమెరికన్ రోజర్స్‌తో ఆమె తలపడనుంది. ప్రపంచ నంబర్‌వన్ క్రీడాకారిణి, తాజా ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ ఇగా స్వియాటెక్ (పోలండ్)... జు లిన్ (చైనా)తో గ్రాండ్‌స్లామ్ ఆటను మొదలుపెట్టనుంది. సుదీర్ఘ విరామం తర్వాత బరిలోకి దిగుతున్న అమెరికన్ వెటరన్ స్టార్ వీనస్ విలియమ్స్ ఉక్రెయిన్‌కు చెందిన స్వితోలినాతో పోటీ పడుతుంది.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

ఎస్ఎస్‌సీ-మల్టీ టాస్కింగ్ స్టాఫ్, హవల్దార్ పరీక్ష-2023

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కేంద్ర మంత్రిత్వ శాఖలు /విభాగాలు /కార్యాలయాల్లో మల్టీ-టాస్కింగ్ స్టాఫ్, హవల్దార్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 1558.
» పోస్టుల వివరాలు: మల్టీ టాస్కింగ్(నాన్ టెక్నికల్) స్టాఫ్(గ్రూప్ సి నాన్ గెజిటెడ్, నాన్-మినిస్టీరియల్)-1198, హవల్దార్(గ్రూప్-సి నాన్-గెజిటెడ్, నాన్ మినిస్టీరియల్)-360.
» అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మెట్రిక్యులేషన్ లేదా తత్సమానం ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 01.08.2023 నాటికి పోస్టులను అనుసరించి 18-25, 18,27 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: ఎంటీఎస్ ఖాళీలకు సెషన్-1, 2 కంప్యూటర్ ఆధారిత పరీక్షలు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, హవల్దార్ ఖాళీలకు కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామినేషన్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» తెలుగు రాష్ట్రాల్లో పరీక్షా కేంద్రాలు: చీరాల, గుంటూరు, కాకినాడ,కర్నూలు,నెల్లూరు,రాజమహేంద్రవరం, తిరుపతి, విజయనగరం, విజయవాడ, విశాఖపట్నం,హైదరాబాద్,కరీంనగర్,వరంగల్.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:21.07.2023.
» కంప్యూటర్ ఆధారిత పరీక్షల నిర్వహణ: సెప్టెంబర్ 2023.
» వెబ్‌సైట్: ssc.nic.in

యూపీఎస్సీలో 261 పోస్టులు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ).. కేంద్ర ప్రభుత్వ శాఖలు/విభాగాల్లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 261
» పోస్టుల వివరాలు: ఎయిర్ వర్తినెస్ ఆఫీసర్-80, ఎయిర్ సేఫ్టీ ఆఫీసర్-40, లైవ్‌స్టాక్ ఆఫీసర్-06, జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్-05, పబ్లిక్ ప్రాసిక్యూటర్-23, జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్-86,అసిస్టెంట్ ఇంజనీర్ గ్రేడ్1-03,అసిస్టెంట్ సర్వే ఆఫీసర్-07,ప్రిన్సిపల్ ఆఫీసర్-01,సీనియర్ లెక్చరర్-06.అర్హత:సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: రిక్రూట్‌మెంట్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తులకు చివరితేది: 13.07.2023.
» వెబ్‌సైట్: www.upsconline.nic.in

డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్శిటీ హార్టిసెట్-2023

పశ్చిమ గోదావరి జిల్లా వెంకటరామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్శిటీ.. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఎస్సీ ఆనర్స్ హార్టికల్చరల్ కోర్సులో ప్రవేశానికి కామన్ ఎంట్రన్స్ టెస్ట్-హార్టిసెట్-2023 నోటిఫికేషన్‌ను విడుదలచేసింది.

» మొత్తం సీట్ల సంఖ్య: 92(52 యూనివర్శిటీ కాలేజీ సీట్లు, 40 ప్రైవేట్ కాలేజీ సీట్లు)
» అర్హత:డిప్లొమా ఇన్ హార్టికల్చర్ కోర్సులో ఉత్తీర్ణులై ఉండాలి.వయసు:17నుంచి 22ఏళ్ల మధ్య ఉండాలి.
» ప్రవేశ పరీక్ష మాధ్యమం: ఇంగ్లిష్, తెలుగు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రిజిస్ట్రార్, డా.వై.ఎస్.ఆర్ హార్టికల్చరల్ యూనివర్శిటీ, వెంకటరామన్నగూడెం, పశ్చిమగోదావరి జిల్లా చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 15.07.2023.
» పరీక్ష తేది: 22.08.2023.
» వెబ్‌సైట్: https://drysrhu.ap.gov.in

ఐటీబీపీలో 458 కానిస్టేబుల్(డ్రైవర్) పోస్టులు

ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ).. కానిస్టేబుల్(డ్రైవర్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » మొత్తం పోస్టుల సంఖ్య: 458
» పోస్టుల వివరాలు: కానిస్టేబుల్(డ్రైవర్) గ్రూప్ సి నాన్-గెజిటెడ్(నాన్ మినిస్టీరియల్) 458(యూఆర్-195,ఎస్సీ-74, ఎస్టీ-37, ఓబీసీ-110, ఈడబ్ల్యూఎస్-42).
» అర్హత: గుర్తింపు పొందిన బోర్డు లేదా సంస్థ నుంచి మెట్రిక్యులేషన్ లేదా పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.వయసు:21 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
» పే స్కేల్: నెలకు రూ.21,700 నుంచి రూ. 69,100 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్(పీఈటీ), ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్(పీఎస్‌టీ), రాతపరీక్ష, ఒరిజనల్ డాక్యుమెంట్ల వెరిఫికేషన్, ప్రాక్టికల్ స్కిల్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:26.07.2023.
» వెబ్‌సైట్: https://recruitment.itbpolice.nic.in

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులు

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్,స్కూల్ ఆఫ్ మ్యాథమేటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్.. తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 02
» అర్హత: ఎంఎస్సీ(స్టాటిస్టిక్స్)తో పాటు నెట్/స్లెట్‌లో అర్హత సాధించి ఉండాలి.
» వయసు: 70 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు రూ.50,000 చెల్లిస్తారు.
» దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్: deansm@uohyd.ac.in
» దరఖాస్తులకు చివరితేది: 07.07.2023.
» వెబ్‌సైట్: uohyd.ac.in

నర్సింగ్ కోర్సు.. ఆర్మీలో కొలువు



నర్సింగ్.. వైద్య రంగంలో మహోన్నతమైన వృత్తిగా గుర్తింపు! అలాంటి నర్సింగ్ కెరీర్‌పై ఆసక్తి కలిగిన ఇంటర్ బైపీసీ విద్యార్థులకు భారత ఆర్మీ చక్కటి అవకాశం కల్పిస్తోంది. దేశవ్యాప్తంగా ఆరు కళాశాలల్లో బీఎస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశాలకు ప్రకటన విడుదల చేసింది. ఈ కోర్సులో ప్రవేశం దక్కితే.. ఆర్మీలో ఉద్యోగం ఖాయమైనట్లే!! తాజాగా 2023 సంవత్సరానికి సంబంధించి బీఎస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశాలకు ఇండియన్ ఆర్మీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఆర్మీలో బీఎస్సీ నర్సింగ్ కోర్సు.. ప్రవేశ ప్రక్రియ.. కెరీర్ అవకాశాలపై ప్రత్యేక కథనం..

» 2023 సంవత్సరానికి మొదలైన ప్రవేశ ప్రక్రియ
» జాతీయ స్థాయిలో ఆరు కళాశాలల్లో 220 సీట్లు
» నీట్ ర్యాంకు ఆధారంగా మలి దశ ఎంపిక
» కోర్సు అనంతరం ఆర్మీలో కమిషన్డ్ ర్యాంకుతో కొలువు
» రూ.15,600-రూ.39,400 శ్రేణితో ప్రారంభ వేతనం

ఇండియన్ ఆర్మీ ప్రత్యేకంగా.. జాయింట్ మిలటరీ నర్సింగ్ సర్వీస్ పేరుతో.. ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీస్ విభాగం ద్వారా నర్సింగ్ కోర్సులను నిర్వహిస్తోంది. కోర్సు అనంతరం వారికి ఇండియన్ ఆర్మీలోనే కొలువులు ఖరారు చేస్తోంది. ఇండియన్ మిలటరీ నర్సింగ్ సర్వీస్ అందించే బీఎస్సీ నర్సింగ్‌లో చేరడం ద్వారా ఇంటర్మీడియెట్‌తోనే నర్సింగ్ కెరీర్ సొంతం చేసుకునే అవకాశం లభిస్తుంది. ముఖ్యంగా మెడికల్ కోర్సులు లక్ష్యంగా నీట్‌లో ఉత్తీర్ణత సాధించినా.. సీటు అవకాశాలు చేజారిన వారికి చక్కటి ప్రత్యామ్నాయంగా ఈ కోర్సును పేర్కొనొచ్చు.

ఆరు కళాశాలలు.. 220 సీట్లు

- ప్రస్తుతం మొత్తం ఆరు నర్సింగ్ కళాశాలల్లో 220 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అవి..
- కాలేజ్ ఆఫ్ నర్సింగ్-ఏఎఫ్ఎంసీ పుణె-40 సీట్లు.
- కాలేజ్ ఆఫ్ నర్సింగ్-కమాండ్ హాస్పిటల్, ఈస్ట్రన్ కమాండ్, కోల్‌కత-30 సీట్లు
- కాలేజ్ ఆఫ్ నర్సింగ్-ఇండియన్ నేవల్ హాస్పిటల్ షిప్ అశ్విని, ముంబై-40 సీట్లు
- కాలేజ్ ఆఫ్ నర్సింగ్-ఆర్మీ హాస్పిటల్(రీసెర్చ్ అండ్ రిఫరల్), ఢిల్లీ-30 సీట్లు
- కాలేజ్ ఆఫ్ నర్సింగ్-కమాండ్ హాస్పిటల్(సెంట్రల్ కమాండ్), లక్నో-40 సీట్లు
- కాలేజ్ ఆఫ్ నర్సింగ్-కమాండ్ హాస్పిటల్(ఎయిర్‌ఫోర్స్), బెంగళూరు-40 సీట్లు

అర్హతలు

- 2023లో బైపీసీ గ్రూప్‌తో 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణతతోపాటు.. నీట్-యూజీలో అర్హత పొందాలి. ఇంటర్ తొలి ప్రయత్నంలో ఉత్తీర్ణత తప్పనిసరి. అవివాహిత, వితంతు మహిళలు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.
- వయసు: అక్టోబర్ 1, 1998 -సెప్టెంబర్ 30, 2006 మధ్యలో జన్మించి ఉండాలి.
- శారీరక ప్రమాణాలు: కనీసం152 సెంటీ మీటర్ల ఎత్తు ఉండాలి.

ఎంపిక ఇలా

ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్ పరిధిలోని ఆరు కళాశాల్లోని సీట్ల భర్తీకి నీట్-యూజీ ర్యాంకును పరిగణనలోకి తీసుకుంటారు. నీట్‌లో ర్యాంకు పొందిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అలా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారు.ఈ జాబితాలో నిలిచిన అభ్యర్థులకు ఢిల్లీ కంటోన్మెంట్‌లోని బేస్ హాస్పిటల్‌లో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. స్క్రీనింగ్ ప్రక్రియలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.

రాత పరీక్ష కూడా

నీట్ ర్యాంకు ఆధారంగా ఎంపికైన అభ్యర్థులకు మరోసారి ప్రత్యేకంగా రాత పరీక్ష నిర్వహిస్తారు. టెస్ట్ ఆఫ్ జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ జనరల్ ఇంగ్లిష్(టీఓజీఐజీఈ) పేరుతో పరీక్ష ఉంటుంది. జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఇంగ్లిష్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. 40 ప్రశ్నలతో 80 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష వ్యవధి 30 నిమిషాలు. ప్రతి తప్పు సమాధానానికి అర మార్కు కోత విధిస్తారు.

సైకలాజికల్ అసెస్‌మెంట్ టెస్ట్, ఇంటర్వ్యూ

ఇండియన్ ఆర్మీ మెడికల్ విభాగం నిర్వహించే రాత పరీక్షలో ప్రతిభ చూపి.. మెరిట్ జాబితాలో నిలిచిన వారికి మలి దశలో సైకలాజికల్ అసెస్‌మెంట్ టెస్ట్, ఇంటర్వ్యూ కూడా ఉంటుంది. ఇంటర్వ్యూలో అభ్యర్థులకున్న సబ్జెక్ట్ నాలెడ్జ్‌ను, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్‌పై అవగాహనను పరిశీలిస్తారు. దీంతోపాటు వ్యక్తిగత ఆసక్తి, అలవాట్లతోపాటు నర్సింగ్ కెరీర్ పట్ల ఉన్న అంకిత భావాన్ని పరిశీలించేలా ఇంటర్వ్యూలో ప్రశ్నలు అడుగుతారు. అదే విధంగా సైకలాజికల్ అసెస్‌మెంట్‌లో భాగంగా.. అభ్యర్థుల వ్యవహార శైలి, వ్యక్తిగత వైఖరి, దృక్పథం వంటి వాటిని పరిశీలిస్తారు.

ప్రతిభ ఆధారంగా తుది జాబితా

అభ్యర్థులకు సీట్లు ఖరారు చేసే క్రమంలో.. నీట్ స్కోర్, ఆర్మీ మెడికల్ బోర్డ్ నిర్వహించిన రాత పరీక్షలో పొందిన మార్కులు, అదే విధంగా సైకలాజికల్ అసెస్‌మెంట్, ఇంటర్వ్యూలలో పొందిన మార్కులను క్రోడీకరించి.. మెరిట్ ఆధారంగా తుది జాబితా రూపొందిస్తారు.

నాలుగేళ్ల కోర్సు

అన్ని దశల్లోనూ విజయం సాధించిన అభ్యర్థులకు.. ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీస్ పరిధిలోని కళాశాలల్లో నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశం లభిస్తుంది. ఈ కోర్సు పూర్తి చేసుకున్న వారికి నిర్దేశిత యూనివర్సిటీల నుంచి బీఎస్సీ నర్సింగ్ సర్టిఫికెట్ ఇస్తారు. పుణె, ముంబైలలోని కళాశాలల్లో చదివిన వారికి మహారాష్ట్ర యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్; కోల్‌కతలో చదివిన వారికి వెస్ట్ బెంగాల్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్; న్యూఢిల్లీలో చదివిన వారికి ఢిల్లీ యూనివర్సిటీ; లక్నోలో చదివిన వారికి అటల్ బిహారీ వాజ్‌పేయి మెడికల్ యూనివర్సిటీ; బెంగుళూరులో చదివిన వారికి రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ నుంచి సర్టిఫికెట్లు అందిస్తారు.

సర్వీస్ బాండ్

ఆయా కళాశాలల్లో చేరే ముందు అభ్యర్థులు.. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసుకున్న తర్వాత అయిదేళ్ల పాటు ఇండియన్ ఆర్మీలో విధులు నిర్వహిస్తామంటూ.. సర్వీస్ బాండ్ ఇవ్వాల్సి ఉంటుంది. ఎలాంటి ఫీజు చెల్లించకుండానే.. బీఎస్సీ నర్సింగ్ కోర్సును పూర్తి చేసుకోవచ్చు. స్టయిఫెండ్ కూడా అందిస్తారు.

కమిషన్డ్ ఆఫీసర్ హోదా

కోర్సు పూర్తి చేసుకున్న వారికి మిలటరీ నర్సింగ్ సర్వీస్‌లో కమిషన్ ర్యాంకుతో కొలువు ఖరారు చేస్తారు. నిబంధనలను అనుసరించి పర్మనెంట్ లేదా షార్ట్ సర్వీస్ కమిషన్‌ను కేటాయిస్తారు. షార్ట్ సర్వీస్ కమిషన్‌కు ఎంపికైన వారు తొలుత పదేళ్లు, తర్వాత మరో నాలుగేళ్లు మొత్తం 14 సంవత్సరాలు.. మిలటరీ నర్సింగ్ సర్వీస్‌లో నర్సింగ్ ఆఫీసర్లుగా విధులు నిర్వహించే అవకాశం ఉంటుంది. ప్రారంభ వేతన శ్రేణి రూ.15,600-రూ.39,100గా ఉంటుంది. పర్మనెంట్ కమిషన్ ర్యాంకు పొందిన వారు పదవీ విరమణ వయసు వరకు విధులు నిర్వర్తించొచ్చు. షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో పదవీ విరమణ పొందిన వారు.. ఆ తర్వాత కూడా ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ పడే అవకాశం ఉంటుంది. కార్పొరేట్ హాస్పిటల్స్, ఎన్‌జీఓలలో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

లెఫ్టినెంట్ నుంచి మేజర్ జనరల్ వరకు

బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి మిలటరీ నర్సింగ్ సర్వీస్‌లో చేరిన వారికి తొలుత లెఫ్టినెంట్ ర్యాంకుతో నర్సింగ్ ఆఫీసర్ హోదా కల్పిస్తారు. ఆ తర్వాత అదే విభాగంలో కెప్టెన్, మేజర్, లెఫ్టినెంట్ కల్నల్, కల్నల్, బ్రిగేడియర్, మేజర్ జనరల్ వంటి హోదాలకు చేరుకునే అవకాశం ఉంటుంది.

రాత పరీక్షలో విజయానికి ఇలా

- నీట్ ర్యాంకు ఆధారంగా.. తదుపరి దశలో నిర్వహించే జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ జనరల్ ఇంగ్లిష్ రాత పరీక్షలో మంచి మార్కుల కోసం దృష్టి పెట్టాల్సిన అంశాలు..
- జనరల్ ఇంగ్లిష్: కాంప్రహెన్షన్, యాంటానిమ్స్, సినానిమ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్, ఫిల్లింగ్ ద బ్లాంక్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్స్, ఇడియమ్స్, ఫ్రేజెస్, మిస్ స్పెల్ట్ వర్డ్స్‌పై దృష్టి పెట్టాలి.
- జనరల్ ఇంటెలిజెన్స్: అర్థమెటికల్ కంప్యుటేషన్, నాన్-వెర్బల్ సిరీస్, నంబర్ సిరీస్, అనాలజీ, డయాగ్రమ్ క్లాసిఫికేషన్ వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: జూలై 4, 2023
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.joinindianarmy.nic.in

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	803	64,718
నిఫ్టీ ▲	216	19,189

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	13,788	▲	197
డోజోన్స్	34,408	▲	285
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,531	▲	197
డాక్స్	16,148	▲	201
షాంఘై	3,202	▲	20
నికాయ్	33,169	▼	64

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఈవీ జోరు.. బీమా లేదంటే బేజారు!

ప్రస్తుతం మోటారు వాహన చట్టంలోని నిబంధనల ప్రకారం థర్డ్ పార్టీ వెహికల్ ఇన్సూరెన్స్‌ను తప్పకుండా తీసుకోవాలి. ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీల)కు సైతం ఇదే నిబంధన వర్తిస్తుంది. ఎలక్ట్రిక్ వాహనాలు మార్కెట్‌కు కొత్త. ఇంత కాలం ఇంటర్నల్ కంబషన్ ఇంజన్ (ఐసీఈ) వాహనాలే ఉండడంతో బీమా ఉత్పత్తులు వీటికి అనుగుణంగానే తయారయ్యాయి. వీటినే బీమా సంస్థలు ఎలక్ట్రిక్ కార్లు, స్కూటర్లకు సైతం జారీ చేస్తున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాలకు రెండు రకాల పాలసీలు అందుబాటులో ఉన్నాయి. సంప్రదాయ కాంప్రహెన్సివ్ పాలసీలు ఒక రకం. ఓన్ డ్యామేజ్ తోపాటు థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్‌తో కూడిన సమగ్ర బీమా ఇది. మోటారు ఇన్సూరెన్స్ విభాగంలోకి రాని తక్కువ సామర్థ్యం కలిగిన ఎలక్ట్రిక్ వాహనాలకు అస్సెట్ ఇన్సూరెన్స్ పాలసీలను బీమా సంస్థలు విక్రయిస్తున్నాయి. ఇవి ప్రమాద నష్టాలను భర్తీ చేస్తాయి. ''25 కిలోమీటర్లకు పైగా వేగంతో నడిచే అన్ని రకాల ఈవీలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ తప్పనిసరి. ఓన్ డ్యామేజీ కవరేజీ అనేది కేవలం వాహనదారు ఇష్టం మేరకు తీసుకోవచ్చు. అదే 25 కిలోమీటర్ల కంటే తక్కువ వేగం కలిగిన ఈవీలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ కూడా తప్పనిసరి కాదు. కానీ, వాహనదారులు తమ వాహనాలకు సరైన రక్షణ కల్పించుకునేందుకు వీలుగా సరిపడా బీమా రక్షణను తీసుకోవాలని మేము సూచిస్తాం''అని డిజిట్ ఇన్సూరెన్స్ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ ఆదర్శ్ అగర్వాల్ తెలిపారు.

అన్నింటికీ కాదు..

బీమా ఉన్నంత మాత్రాన వాహనంలో ఏ నష్టం జరిగినా బీమా వస్తుందని భావించడానికి లేదు. ఈవీకి ఇది సరిగ్గా వర్తిస్తుంది. ఇంటర్నల్ కంబషన్ ఇంజన్ (ఐసీఈ) కంటే ఈవీలు భిన్నంగా తయారవుతాయి. ముఖ్యంగా ఈవీలో ఒక్క బ్యాటరీ ధరే మొత్తం వాహనం ధరలో 40 శాతం మేర ఉంటుంది. ''ఇప్పటికీ మొత్తం వాహన విక్రయాల్లో ఈవీల వాటా చాలా తక్కువ. భారీ సంఖ్యలో అమ్మకాలు పెరిగితే తప్ప వాటికి ఎదురయ్యే నష్టాలను విశ్లేషించలేము. తగినంత డేటా, క్లెయిమ్స్ అనుభవం ఉన్నప్పుడే ఈవీలకంటూ ప్రత్యేకమైన పాలసీలను తీసుకురావడం సాధ్యపడుతుంది''అని బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ టీఏ రామలింగం తెలిపారు. టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థ కొంత కాలం క్రితం ఈవీల కోసమే ప్రత్యేకమైన పాలసీని రూపొందించినట్టు ప్రకటించింది. 'ఆటో సెక్యూర్ ఈ వెహికల్ కాంప్రహెన్సివ్ పాలసీ' పేరుతో తీసుకొచ్చిన ప్లాన్‌లో ఓన్ డ్యామేజీతో పాటు ఎలక్ట్రిక్ బ్యాటరీ కారణంగా అగ్ని ప్రమాదం జరిగినా కవరేజీ అందులో భాగంగా ఉంది. కానీ, ఇప్పటికీ ఇది మార్కెట్లోకి రాలేదు.



అతని పేరు శివకుమార్ (40). 2022 ఏప్రిల్‌లో ఓ కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ స్కూటర్‌ను ముచ్చటపడి కొనుగోలు చేశాడు. ఆ స్కూటర్ డిటాచబుల్ బ్యాటరీ ఆప్షన్‌తో ఉంది. దాంతో బ్యాటరీని తీసి తన బెడ్‌రూమ్‌లోనే రాత్రి చార్జింగ్ పెట్టాడు. అదే బెడ్ రూమ్‌లో శివకుమార్, అతడి భార్యాపిల్లలు నిద్రించారు. అర్ధరాత్రి బ్యాటరీ నుంచి మంటలు వచ్చి గది అంతటా వ్యాపించాయి. ఈ మంటలకు శివకుమార్ ప్రాణాలు కోల్పోగా, భార్యా పిల్లలు గాయాల పాలయ్యారు. ఆ మధ్య ప్రముఖ కంపెనీ ఎలక్ట్రిక్ స్కూటర్లు మంటలకు ఆహుతి కావడం తెలిసిందే. అంతెందుకు ముంబైలో ఓ ప్రముఖ కంపెనీ కారు పార్క్ చేసి ఉండగా, ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. నిజానికి కంబషన్ ఇంజన్‌తో కూడిన వాహనాల్లో అగ్ని ప్రమాదం జరగదని కాదు. కానీ, చాలా చాలా అరుదు. అదే ఎలక్ట్రిక్ వాహనాల్లో (ఈవీలు) అయితే బ్యాటరీ సిస్టమ్‌లో లోపాల వల్ల అగ్ని ప్రమాద రిస్క్ ఎక్కువగా ఉంటుంది. మరి ఈ అగ్ని ప్రమాదాలకు వాహన బీమాలో కవరేజీ ఉంటుందా? వేటికి అసలు కవరేజీ వస్తుంది? తదితర అంశాలపై అవగాహన కల్పించే కథనమే ఇది.

బ్యాటరీకి లేదు రక్షణ

ప్రస్తుతం మార్కెట్లో ఉన్న ఈవీ పాలసీల్లో పెద్ద లోపం ఉంది. బ్యాటరీ ఒక్కటే డ్యామేజ్ అయితే పరిహారం రాదు. మొత్తం వాహనం డ్యామేజ్ అయితేనే బీమా సంస్థలు క్లెయిమ్‌లు ఆమోదించి పరిహారం చెల్లిస్తున్నాయి. ''వాహన విడిభాగాలు విఫలమైతే మోటారు ఇన్సూరెన్స్ పాలసీల్లో కవరేజీ ఉండదు. సంప్రదాయ పాలసీల్లో అయితే ప్రమాదం వల్ల, అల్లర్లు, దోపిడీలు, వరదల వల్ల వాహనం, దాని విడిభాగాలకు నష్టం జరిగితే పరిహారం వస్తోంది''అని గల్లాగర్ ఇన్సూరెన్స్ బ్రోకర్స్ ప్రాక్టీస్ లీడర్ ఎస్ భోజరాజన్ తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనంలో ఖరీదైన బ్యాటరీని ఎవరైనా ఎత్తుకుపోయినా క్లెయిమ్‌ను బీమా సంస్థలు ఆమోదించకపోవచ్చు. ఈవీలకు బ్యాటరీ అత్యంత కీలకం కనుక బ్యాటరీ ఒక్కదానికే కవరేజీ ఇచ్చే పాలసీల అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 'బ్యాటరీలు, చార్జింగ్ ఎక్విప్‌మెంట్‌కు ఉద్దేశించిన ప్రత్యేకమైన పాలసీలు అవసరం. ఈవీ చార్జింగ్ సదుపాయాలతో ముడిపడిన రిస్క్‌ల కారణంగా ఈవీలు దెబ్బతినే ప్రమాదం లేకపోలేదు. ప్రమాదాల వల్లే నష్టం జరగాలని లేదు. బ్యాటరీ చార్జింగ్ సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం వాటిల్లితే బ్యాటరీతోపాటు, కనెక్టర్‌కూ నష్టం జరుగుతుంది. సంప్రదాయ పాలసీలో బ్యాటరీతోపాటు వాహనం కూడా అగ్నికి ఆహుతి అయితే తప్ప క్లెయిమ్‌ను ఆమోదించవు' అని భోజరాజన్ వివరించారు. అందుకే ఈవీలకే ఉద్దేశించిన ప్రత్యేక పాలసీల అవసరం ఉందని అన్నారు.

మనం ఏమి చేయగలం?

బీమా సంస్థలు పెరుగుతున్న ఈవీ మార్కెట్‌ను అర్థం చేసుకుంటున్నాయి. భవిష్యత్ అంతా ఎలక్ట్రిక్ వాహనాల తరమే కనుక ఈవీల కోసం ప్రత్యేక పాలసీలకు రూపకల్పన చేస్తున్నాయి. కనుక వాహనదారులు అన్ని బీమా సంస్థలను సంప్రదించిన తర్వాతే పాలసీని ఎంపిక చేసుకోవాలి. బ్యాటరీ కవరేజీతో కూడిన ప్లాన్‌ను ఏదైనా సంస్థ ఆఫర్ చేస్తే ఎంపిక చేసుకోవడం మెరుగు. ప్రీమియం కొంచెం ఎక్కువైనా, బ్యాటరీ కవరేజీతో కూడిన ప్లాన్‌ను తప్పక తీసుకోవాలన్నది నిపుణుల సూచన. మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతున్న కొద్దీ బీమా సంస్థలు కూడా ఈవీల కోసమే ఉద్దేశించిన ఎన్నో ఫీచర్లతో పాలసీలను అందుబాటులోకి తెస్తాయి. కేవలం థర్డ్ పార్టీ డ్యామేజ్ కాకుండా ఓన్ డ్యామేజ్ కవరేజీతో కూడిన కాంప్రహెన్సివ్ పాలసీకే ప్రాధాన్యం ఇవ్వాలి. రైడర్లను కూడా యాడ్ చేసుకోవడాన్ని పరిశీలించాలి. డిప్రీసియేషన్ కవర్, గ్యాప్ వ్యాల్యూ కవర్, రోడ్‌సైడ్ అసిస్టెన్స్ తీసుకోవాలని లిబర్టీ జనరల్ ఇన్సూరెన్స్ అండర్ రైటింగ్ ప్రెసిడెంట్ ఉదయన్ జోషి సూచించారు. ముఖ్యంగా ఈవీ వాహనదారులు రిటర్న్ టు ఇన్వాయిస్ రైడర్‌ను తీసుకోవాలని పాలసీబజార్ మోటార్ రెన్యువల్స్ హెడ్ అశ్విని దూబే సూచించారు. ఈ రైడర్‌తో వాహనం ఇన్వాయిస్ విలువ మేర పరిహారం పొందొచ్చన్నారు. కారు చోరీకి గురైనా లేక రిపేర్ చేయడానికి అనుకూలంగా లేని రీతితో దెబ్బతిన్నా లేక అగ్ని ప్రమాదంతో మొత్తం నష్టం వాటిల్లినప్పుడు ఈ రైడర్ కింద పరిహారం వస్తుందన్నారు. పాలసీ కొనుగోలుకు ముందే వేటికి కవరేజీ వస్తుంది, వేటికి మినహాయింపు ఉన్నదీ తప్పకుండా అడిగి తెలుసుకోవాలి.

ప్రీమియం భారం అనుకోవద్దు..

ఈవీలకు ఇచ్చే బీమా పాలసీల ప్రీమియం ఎక్కువగా ఉంటుందనుకోవడం పొరపాటు. ఇంటర్నల్ కంబషన్ ఇంజన్ వాహనాల కంటే ఈవీలకు థర్డ్ పార్టీ కవర్ 15% వరకు తక్కువ. ''ఐసీఈ వాహనాలతో పోలిస్తే ఈవీ కార్లు, బైక్‌లకు కాంప్రహెన్సివ్ కవరేజీ ప్రీమియం 5–20% వ్యత్యాసంతో ఉంటోంది. ఓన్ డ్యామేజ్ కవరేజీలోనూ స్వల్ప వ్యత్యాసం ఉంటోంది. ఏడాది కాలానికి 30 కిలోవాట్ అవర్ ఎలక్ట్రిక్ కారుకు థర్డ్ పార్టీ ప్రీమియం రూ.2,000 స్థాయిలో ఉంది. అదే ఐఈసీ వాహనాలకు (1,000 సీసీ మించని) ప్రీమియం మరో రూ.200 వరకు అటూ ఇటూగా ఉంటోంది. 'ఈవీలకు ప్రీమియం, బీమా సంస్థ ధరల విధానం పైనే ఆధారపడి ఉంటుంది. ఈవీ తయారీ, మోడల్, బ్యాటరీ సామర్థ్యం, ప్రాంతం, వాహనం వయసు వంటి అంశాలు ప్రీమియం ధరపై ప్రభావం చూపిస్తాయి' అని ఉదయన్ జోషి వెల్లడించారు. ఈవీలకు సంబంధించి మరిన్ని క్లెయిమ్‌లు వస్తే కానీ, ప్రీమియం మెరుగ్గా మారగలదన్నారు. ఈవీలకు ఉన్న రిస్క్‌ల నేపథ్యంలో వాటికంటూ ప్రత్యేకమైన ఉత్పత్తులు తీసుకువచ్చేందుకు ఐఆర్‌డీఏఐ సైతం బీమా సంస్థలకు మార్గదర్శకాలు జారీ చేస్తుందని పరిశీలకులు భావిస్తున్నారు.

ఒకే పాలసీలో జీవిత, ఆరోగ్య బీమా ప్రయోజనాలు


• 'ఐషీల్డ్' పాలసీ



ముంబై: ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలు కలిసి 'ఐషీల్డ్' పేరిట కొత్త బీమా పాలసీని ప్రవేశపెట్టాయి. ఇటు ఆరోగ్య బీమా, అటు జీవిత బీమా ప్రయోజనాలు ఉండేలా ఈ పథకాన్ని తీర్చిదిద్దాయి. వైద్య చికిత్సల వ్యయాలకు కవరేజీ ఇస్తూనే పాలసీదారు దురదృష్టవశాత్తూ మరణించిన పక్షంలో కుటుంబానికి పెద్ద మొత్తంలో సమ్ అష్యూర్డ్‌ను అందించేలా ఈ పాలసీ ఉంటుందని ఐసీఐసీఐ లాంబార్డ్ ఈడీ సంజీవ్ మంత్రి తెలిపారు. చికిత్స వ్యయాల భారం పడినా, ఇంటిపెద్దకు ఏదైనా జరిగినా కుటుంబం ఆర్థికంగా కుంగిపోకుండా ఈ సమగ్రమైన బీమా పథకం తోడ్పడగలదని ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ అమిత్ పాల్టా వివరించారు. హాస్పిటలైజేషన్, డే-కేర్ ట్రీట్‌మెంట్ మొదలైన వాటికి ఆరోగ్య బీమా భాగం ఉపయోగపడనుండగా, జీవిత బీమా భాగంతో.. 85 ఏళ్ల వయస్సు వరకూ లైఫ్ కవరేజీ ఉంటుంది.

ఎస్‌బీఐకు కొత్త సీఎఫ్‌వో

కొడవంటి కామేశ్వర రావు ఎంపిక



ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ కొత్త సీఎఫ్‌వోగా కొడవంటి కామేశ్వర రావును ఎంపిక చేసినట్లు తా జాగా పేర్కొంది. 1991 నుంచి బ్యాంకులో విధులు నిర్వహిస్తున్న కామేశ్వర రావు 2023 జూలై 1నుంచి సీఎఫ్‌వోగా బాధ్యతలు చేపట్టినట్లు తెలియజేసింది. సీఎఫ్‌వోగా రాజీనామా చేసిన చరణ్‌జిత్ సురీందర్ సింగ్ అత్రా స్థానే కామేశ్వర రావును నియమించినట్లు వెల్లడించింది. చార్టెర్డ్ అకౌంటెంట్ అయిన కామేశ్వర రావు బ్యాంకింగ్, ఫారెక్స్, ఫైనాన్స్, అకౌంటింగ్ విభాగాలలో విధులు నిర్వర్తించినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఎస్‌బీఐ తెలియజేసింది.

మరోవైపు, చిన్న వ్యాపారాలు చేసుకునే కస్టమర్లకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా ఎస్‌బీఐ 34 ట్రాన్సాక్షన్ బ్యాంకింగ్ హబ్‌లను ఏర్పాటు చేసింది. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా 21 జిల్లా కేంద్రాల్లో వీటిని నెలకొల్పినట్లు ఎస్‌బీఐ తెలిపింది. ప్రీ-లాంచ్‌లో ఈ కేంద్రాల్లో రూ. 1,000 కోట్ల డిపాజిట్లు సేకరించినట్లు వివరించింది.

స్టాక్స్ వ్యూ

భారత్ డైనమిక్స్ | ఐసీఐసీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,123

టార్గెట్: రూ. 1,325



ఎందుకంటే: ప్రభుత్వ రంగ దిగ్గజం భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్) యాజమాన్యం ఇటీవల ఇన్వెస్టర్లతో నిర్వహించిన సమావేశంలో కొన్ని కీలక అంశాలను ప్రస్తావించింది. వీటి ప్రకారం 2025 ఆర్థిక సంవత్సరం తదుపరి రక్షణ శాఖకు సంబంధించిన పలు ఆర్డర్లను పొందేందుకు అవకాశముంది. డీఆర్‌డీవోతో సహకారం ఇందుకు తోడ్పాటును అందించనుంది. దీనికి తోడు విదేశీ దిగ్గజాలతో సాంకేతిక సహకార ఒప్పందాలు, కంపెనీ సొంత పరిశోధన, అభివృద్ధి(ఆర్అండ్‌డీ) సైతం కాంట్రాక్టులు సాధించేందుకు దోహదపడనున్నాయి. రూ. 2,600 కోట్ల విలువైన ప్రస్తుత ఎగుమతుల ఆర్డర్ బుక్ ప్రభుత్వ రంగ సంస్థలలోకెల్లా అత్యధికంకాగా.. కంపెనీ మొత్తం ఆర్డర్ల విలువలో 10 శాతానికి సమానంకావడం ప్రస్తావించదగ్గ విషయం! కంపెనీకి గల పటిష్ట ఆర్డర్ బుక్ విభిన్నతరహా ఆర్జనకు వీలు కల్పించనుంది. నీటిఅడుగున వినియోగించే ఆయుధాల విభాగంలో భారీ నౌకా విధ్వంసక(హెవీవెయిట్ టోర్పెడో) ఆయుధ ప్రయోగాలు అన్ని అంశాలలోనూ విజయవంతంకావడంతో పలు అవకాశాలకు తెరలేవనుంది. వెరసి 2026కల్లా ఎలక్ట్రికల్ హెవీవెయిట్ టోర్పెడోలకు, 2027కల్లా ఆధునిక(అడ్వాన్స్‌డ్) లైట్‌వెయిట్ టోర్పెడోలకు ఆర్డర్లు లభించగలవని అంచనా వేస్తోంది. దీంతో సమీప భవిష్యత్‌లో కంపెనీ ఆదాయ ఆర్జనకు సముద్రగర్భ ఆయుధ విభాగం అదనపు బలాన్నిచ్చే వీలుంది. అయితే ఇకపై ఆయుధ సామగ్రికి సంబంధించిన విజయవంత పరీక్షలు వంటి అంశాలు ఆదాయ వృద్ధిపై ప్రభావాన్ని చూపనున్నాయి.

హీరో మోటోకార్ప్ | జేఎం ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 2,905

టార్గెట్: రూ. 3,200




ఎందుకంటే: ద్విచక్ర వాహన రంగ దిగ్గజం హీరో మోటోకార్ప్ యాజమాన్యం ఇటీవల విశ్లేషకులతో నిర్వహించిన సమావేశంలో పలు కీలక అంశాలను ప్రస్తావించింది. వీటి ప్రకారం ఇకపై కంపెనీని మరింత లాభదాయకంగా పరుగు పెట్టించేందుకు యాజమాన్యం పటిష్ట ప్రణాళికలు అమలు చేస్తోంది. పలు చర్యలు తీసుకుంటోంది. ఇటీవల విడుదల చేసిన ఎక్స్‌టెక్, జూమ్ ప్రొడక్టులకు వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఈ బాటలో మరిన్ని కొత్త మోడళ్లను ప్రవేశపెట్టనుండటంతో ప్రొడక్టుల పైప్‌లైన్ ఆకర్షణీయంగా కనిపిస్తోంది. సమీప భవిష్యత్‌లో 125 సీసీ విభాగంలో ప్రీమియం మోటార్ సైకిళ్లు, స్కూటర్లు, ఎలక్ట్రిక్ వాహనాలను విడుదల చేయనుంది. ప్రొడక్టుల కొనుగోలులో డిజిటల్ సౌకర్యాల కల్పన ద్వారా కస్టమర్లకు మెరుగైన సేవలు అందిస్తోంది. తద్వారా కస్టమర్లను కొనుగోళ్లవైపు ఆకట్టుకునేందుకు హీరో 2.0 బ్రాండుతో 500కుపైగా స్టోర్లను ప్రారంభించే వ్యూహంలో ఉంది. ఈ బాటలో 100 ప్రత్యేక ప్రీమియం షోరూములకు తెరతీయనుంది. సమీప కాలంలో ఎలక్ట్రిక్ వాహన(ఈవీ) విక్రయాలను పెంపొందించుకోవడంపై దృష్టి సారించనుంది. నెట్‌వర్క్ విస్తరణ, విభిన్న ప్రొడక్టుల విడుదల ద్వారా ఇందుకు దన్నుగా నిలవనుంది. ముడివ్యయాలు తగ్గడం, విడిభాగాల గరిష్ట విక్రయాలు, స్థానిక తయారీ, పటిష్ట నిర్వహణ బలం వంటి అంశాలు మార్జిన్లు మరింత పుంజుకునేందుకు దోహదపడనున్నాయి. ఈవీ కంపెనీ ఏథర్‌లో 35 శాతం వాటాను కలిగి ఉంది. మరోవైపు హైఎండ్ ఎలక్ట్రిక్ మోటార్‌సైకిళ్ల అభివృద్ధికి జీరో మోటార్‌సైకిల్స్‌తో భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకుంది. ఈవీ విభాగంలో ఇతర సంస్థల కొనుగోళ్లకూ యోచిస్తోంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఎంచుకోవచ్చా?

నేను ఇటీవలే ప్రత్యామ్నాయ రుణ సాధనాల గురించి వింటున్నాను. ముఖ్యంగా ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ ప్లాట్‌ఫామ్‌ల గురించి తెలిసింది. వీటికి మంచి చరిత్ర ఉందా? అవి 12 శాతం వరకు రాబడిని ఆఫర్ చేస్తున్నాయి. వీటితో ఏదైనా రిస్క్ ఉంటుందా? – శ్రీరామ్ రామనాథన్



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ఈక్విటీలన్నవి సంపద సృష్టికి అనుకూలమైనవి. ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ (డెట్) సాధనాలు పెట్టుబడి రక్షణ, క్రమం తప్పకుండా ఆదాయం కోసం ఉద్దేశించినవి. ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్స్ (ప్రత్యామ్నాయ సాధనాలు) సంప్రదాయ ఈక్విటీ, ఫిక్స్‌డ్ ఇన్‌కమ్, నగదుకు అదనపు వ్యూహాలు మాత్రమే. ఇవి ప్రధానంగా ఐదు విభాగాలు. హెడ్జ్ ఫండ్స్, ప్రైవేటు క్యాపిటల్, నేచురల్ రీసోర్సెస్, రియల్ ఎస్టేట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్. వీటన్నింటిలోనూ లిక్విడిటీ తక్కువ. నియంత్రణలు తక్కువ. పారదర్శకత తక్కువ. వ్యయాలు ఎక్కువ. రిస్క్, రాబడులకు సంబంధించి చారిత్రక డేటా తక్కువగా ఉంది. అందుకుని ఈ అస్సెట్ క్లాస్ (ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్స్) అనేది రిటైల్ ఇన్వెస్టర్ల పెట్టుబడులకు సూచనీయం కాదు.

ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్

వ్యాపారాలకు స్వల్పకాల రుణ సదుపాయమే ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్. సాధారణంగా వీటిని బ్యాంకులు సమకూరుస్తుంటాయి. ప్రైవేటు క్యాపిటల్ పరిధిలోకి ఇవి వస్తాయి. ఇది చాలా పూర్వం నుంచి ఉన్న సాధనం. బ్యాంకులే దీనికి సారథ్యం వహిస్తున్నాయి. ఇందులో రాబడులు పరిమితం. నూరు శాతం నష్టానికి అవకాశం ఉంటుంది. ఇది ఎలా పనిచేస్తుందంటే.. మీరు ఏదైనా కంపెనీకి రుణంపై వస్తువులు సరఫరా చేశారనుకుందాం. దానికి బిల్లు జారీ చేస్తారు. రుణ కాల వ్యవధి ముగిసిన తర్వాత ఆ బిల్లు మొత్తాన్ని కొనుగోలుదారుడు చెల్లిస్తాడు. ఈ రుణం కాల వ్యవధి సాధారణంగా 30–90 రోజులుగా ఉంటుంది. అంటే మీరు సరఫరా చేసిన వస్తువుల బిల్లు మొత్తం మీకు తిరిగి వచ్చేందుకు ఇన్ని రోజుల పాటు ఆగాల్సి ఉంటుంది. ఒకవేళ ఈ లోపే మీకు డబ్బులు అవసరపడ్డాయని అనుకుంటే అప్పుడు బ్యాంకు వద్దకు వెళ్లి ఈ బిల్లును ఇచ్చి దాన్ని నగదుగా మార్చుకోవచ్చు. మరి బ్యాంకులకు ఇందులో ప్రయోజనం ఏమిటి? బ్యాంకులు ఈ బిల్లు మొత్తంలో కొంత తగ్గించి మిగిలినది ఇస్తాయి. అందుకే దీనికి ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ అనే పేరు వచ్చింది. నూరు సంవత్సరాలకు పైగా బ్యాంకులు ఈ వ్యాపారం చేస్తున్నాయి. ఇటీవలి కాలంలో రిటైల్ ఇన్వెస్టర్లకు సైతం ఇది అందుబాటులోకి వచ్చింది. పలు ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్‌లు వీటిని ఆఫర్ చేస్తున్నాయి. ఇన్‌వాయిస్‌కు మీరు ఫండ్ సమకూర్చిన తర్వాత, డబ్బులు తిరిగి రాకపోతే పరిస్థితి ఏంటి? అన్నది ఆలోచించుకోవాలి. ఇన్వెస్టర్‌గా రాబడుల కంటే రిస్క్‌ను అర్థం చేసుకోవడం అత్యంత ముఖ్యమైనది. అదే బ్యాంకులు అయితే డిఫాల్ట్ ఎదురైతే వాటిని ఎదుర్కొనేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని కలిగి ఉంటాయి. ఇందులో లిక్విడిటీ ఉండదు. మీరు విక్రయించాలనుకుంటే కొనుగోలు చేసే వారు లభించడం కష్టం. వీటికంటే ఈక్విటీలు మెరుగైన సాధనం.

కారు కొనుగోలుకు రూ.7 లక్షల రుణం తీసుకున్నాను. దీన్ని ఏడేళ్ల కంటే ముందుగా తీర్చేసేందుకు ఏవైనా ఫండ్స్‌ను సూచించగలరా? – ఆదిత్య



కారు రుణాన్ని ముందుగా చెల్లించేయాలన్న మీ ఆలోచన మంచిది. అయితే కారు వంటి తరిగిపోయే ఆస్తి కొనుగోలుకు రుణం తీసుకోవడాన్ని సాధారణంగా ప్రోత్సహించం. మీరు ఏడేళ్లలోపు రుణం తీర్చేయాలని అనుకుంటున్నారు కనుక.. మీరు స్వల్పకాలం నుంచి మధ్యకాలిక మ్యూచువల్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. దీనివల్ల మీరు పెట్టుబడిని రక్షించుకోవడంతోపాటు రాబడులు సొంతం చేసుకోగలరు. మూడు నుంచి నాలుగేళ్ల తర్వాత కారు రుణాన్ని చెల్లించేద్దామని అనుకుంటే అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవడం ఒక ఆప్షన్. ఇవి ఈక్విటీ, డెట్‌లో ఇన్వెస్ట్ చేసి, అచ్చమైన డెట్ కంటే మెరుగైన రాబడులు ఇస్తాయి. మూడు నాలుగేళ్లలోపే తీర్చేయాలని భావిస్తే ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు.

6 నెలల్లో 20 లక్షల వాహన విక్రయాలు

• జూన్ 'ఆటో' అమ్మకాలు అంతంతే..



ముంబై: ఈ ఏడాది ప్రథమార్ధం వాహన పరిశ్రమకు అత్యుత్తమంగా నిలిచింది. ప్యాసింజర్ విభాగంలో మొత్తం 20 లక్షల వాహనాలు విక్రమయ్యాయి. ఇక నెలవారీగా జూన్ ఆటోమొబైల్ పరిశ్రమకు పెద్దగా కలిసిరాలేదు. మొత్తం 3.37 లక్ష వాహన అమ్మకాలు జరిగాయి. ఏడాది ఇదే నెలలో సరఫరా చేసిన 3.21 లక్షల వాహనాలతో పోలిస్తే ఇది 1.9% మాత్రమే అధికంగా ఉంది. కార్ల తయారీ దిగ్గజాలైన మారుతి సుజుకీ, హ్యుందాయ్ మోటార్.. అమ్మకాల్లో ఓ మోస్తరు వృద్ధి నమోదైంది.

- మారుతి సుజుకీ జూన్‌లో మొత్తం 1,33,027 యూనిట్లను విక్రయించింది. గత ఏడాది ఇదే నెల విక్రయాలతో పోల్చితే కేవలం ఎనిమిది శాతం (1,22,685 యూనిట్లు) వృద్ధి నమోదైంది. వడ్డీ రేట్లు అధికంగా ఉండటంతో పాటు రుతుపవనాలు ఆశించిన స్థాయిలో ఉండకపోవచ్చన్న అంచనాలు విక్రయాలపై ప్రభావం చూపినట్లు కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశాంక్ శ్రీవాస్తవ తెలిపారు.
- హ్యుందాయ్ మోటార్ ఇండియా విక్రయాల్లో కేవలం 2 శాతం మాత్రమే వృద్ధి నమోదైంది. కంపెనీ ఈ కాలంలో 50,001 యూనిట్లను మాత్రమే విక్రయించింది.
- టయోటా కిర్లోస్కర్ మోటార్ ఎంజీ మోటార్, టాటా మోటార్స్ విక్రయాలు వరుసగా 19%, 14%, ఒక శాతం పెరగగా కియా, హోండా కార్ల విక్రయాలు మాత్రం వరుసగా 19%, 35% మేరకు క్షీణించాయి.

కంపెనీ	జూన్ 2023	జూన్ 2022	మొత్తం అమ్మకాలు
మారుతీ	1,33,027	1,22,685	(+)8%
హ్యుందాయ్	62,351	50,001	(+)5%
టాటా మోటార్స్	79,606	80,383	(–)1%
టాటా కిర్లోస్కర్	19,608	18,237	(+)19%
హోండా కార్స్	5,080	7,834	(–)35%
ఎంజీ మోటార్స్	5,125	4,504	(+)14%
కియా	19,391	24,024	(–)19%
ద్విచక్ర వాహనాలు			
హీరోమోటో కార్ప్	4,36,993	4,84,867	(–)8%
రాయల్ ఎన్‌ఫీల్డ్	77,109	61,407	(–)26%

పర్యాటకానికి మహర్దశ

రాష్ట్రంలో కొత్తగా 11 స్టార్ హోటళ్లు, రెండు రోప్‌వే ప్రాజెక్టులు

భారీ పెట్టుబడులకు ముందుకొచ్చిన అంతర్జాతీయ సంస్థలు

ఒబరాయ్, నోవోటెల్, హిల్టన్, హాయత్, మారియట్ వంటి సంస్థల హోటళ్లు

రూ.3,016 కోట్ల పెట్టుబడి.. 17,032 మందికి ఉపాధి

రెండునెలల్లో నిర్మాణ పనులు ప్రారంభించే విధంగా ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం



త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించనున్న పర్యాటక ప్రాజెక్టులు

హోటల్	పెట్టుబడి రూ.కోట్లల్లో	ఉపాధి లభించే వారి సంఖ్య	జిల్లా
ఒబరాయ్ గ్రూపు	250	1,500	తిరుపతి
ఒబరాయ్ గ్రూపు	350	5,500	విశాఖ
ఒబరాయ్ గ్రూపు	250	1,500	వైఎస్సార్
నోవోటెల్	125	3,000	తిరుపతి
హిల్టన్	414	630	కాకినాడ
హిల్టన్	544	700	తూ.గోదావరి
హయత్	218	1,556	తిరుపతి
హయత్	78	951	వైఎస్సార్
మారియట్	122	255	విశాఖ
లెమన్‌ట్రీ	75	200	శ్రీకాకుళం
మై ఫెయిర్	500	1,000	విశాఖ
రోప్‌వే			
దేవభూమి రోప్‌వేస్	30	180	కృష్ణా
దేవభూమి రోప్‌వేస్	60	60	నంద్యాల
మొత్తం	3,016	17,032	



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పర్యాటక రంగానికి ఊతమిచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రాజెక్టులను చేపట్టింది. శ్రీకాకుళం నుంచి తిరుపతి వరకు అన్ని ప్రాంతాల్లో పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేసే విధంగా నిర్దిష్టమైన ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం వెళుతోంది. ఇందులో భాగంగా రూ.3,016 కోట్ల విలువైన 13 పర్యాటక ప్రాజెక్టులను త్వరితగతిన పట్టాలెక్కించడానికి వేగంగా అడుగులు వేస్తోంది. విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)లో కుదిరిన ఒప్పందాలను వేగంగా వాస్తవరూపంలోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి నిర్వహించిన సమావేశంలో ఈ 13 ప్రాజెక్టుల నిర్మాణ పనుల్ని రెండునెలల్లో మొదలుపెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 13 ప్రాజెక్టుల్లో 11 స్టార్ హోటళ్ల నిర్మాణానివి కాగా రెండు పర్యాటక ప్రాంతాల్లో రోప్‌వే నిర్మాణానికి సంబంధించినవి. ఈ 13 ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా 17,032 మందికి ఉపాధి లభించనుంది. అంతర్జాతీయ సంస్థలైన ఒబరాయ్, నోవోటెల్, హయత్, హిల్టన్, మారియట్, మై ఫెయిర్, లెమన్ ట్రీ.. రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టనున్నాయి. ఒబరాయ్ గ్రూపు కడప గండికోట వద్ద భారీ ఫైవ్‌స్టార్ హోటల్ నిర్మాణంతోపాటు తిరుపతి విశాఖల్లో కూడా హోటళ్లు నిర్మించనుంది. అలాగే దేవభూమి రోప్‌వేస్ సంస్థ కృష్ణా, నంద్యాల జిల్లాల్లో పర్యాటక ప్రాజెక్టులు చేపట్టనుంది. రాష్ట్ర పర్యాటకరంగంలో పెట్టుబడులు పెట్టడానికి అనేక సంస్థలు ముందుకొస్తున్నాయని, అందులో తొలుత 13 ప్రాజెక్టులపై దృష్టిసారించామని ఏపీ టూరిజం అథారిటీ ఎండీ కె.కన్నబాబు చెప్పారు. ఈ 13 ప్రాజెక్టులకు డీపీఆర్‌లు పూర్తయ్యాయని, ఒకసారి ఎస్‌ఐపీబీ, మంత్రివర్గ ఆమోదం లభించిన వెంటనే సీఎం చేతుల మీదుగా నిర్మాణ పనులు ప్రారంభించడానికి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఇంతకాలం రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక భారీ ప్రాజెక్టులను చేపడుతున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా విశాఖ, గండికోట ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయడం ద్వారా విదేశీ పర్యాటకులను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ఇంటింటికీ 'పైప్‌లైన్' గ్యాస్

- నవంబర్ నాటికి పనులు పూర్తి చేయనున్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్
- పారాదీప్–హైదరాబాద్ మధ్య 1,212 కిమీ మేర రూ.3338 కోట్లతో పైప్‌లైన్
- ఈ ప్రాజెక్టులో భాగంగా 723 కి.మీ. మేర ఏపీలో పైప్‌లైన్
- అమల్లోకి వస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023 ఒప్పందం
- డిసెంబర్ మొదటివారంలో ప్రాజెక్టు ప్రారంభించేందుకు ప్రణాళికలు



చురుగ్గా జరుగుతున్న పీహెచ్‌పీఎల్ ప్రాజెక్టు పనులు

సాక్షి, విశాఖపట్నం: సిలెండర్ కోసం ఎదురు చూడాల్సిన అవసరం లేదు. ఒక్క కనెక్షన్‌తో నిరంతరం గ్యాస్ సరఫరా అందుబాటులోకి వస్తోంది. అదే పైప్‌లైన్ ద్వారా ఇంటింటికీ గ్యాస్ అందించే ప్రాజెక్టు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ప్రాజెక్టు ఈ ఏడాది డిసెంబర్ నాటికల్లా గాజువాక ఏరియాలో మొదటి విడతలో అందుబాటులోకి రానుంది.

పైప్‌లైన్ ప్రాజెక్టు ఖరీదెంత ?

పారాదీప్ నుంచి హైదరాబాద్ పైప్‌లైన్ (పీహెచ్‌పీఎల్) ప్రాజెక్టు పేరుతో ఐవోసీఎల్ దీన్ని ప్రారంభిస్తోంది. 3 రాష్ట్రాలు, 16 జిల్లాలను కలుపుతూ 1,212 కిలోమీటర్ల పొడవునా పైప్‌లైన్ నిర్మిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల మీదుగా ఈ పైప్‌లైన్ వెళ్తోంది. మొత్తం రూ.3,338 కోట్లు వ్యయంతో ప్రాజెక్టు నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. మన రాష్ట్రంలో 723 కిమీ మేర పైప్‌లైన్ పనులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే విజయవాడ వరకూ పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్టును వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయనున్నారు.

విశాఖలో ఎక్కడ సరఫరా చేస్తారు?

విశాఖలో ఇంటింటికీ పైప్‌లైన్ ద్వారా గ్యాస్‌ను సరఫరా చేస్తారు. తొలి విడతగా గాజువాక ప్రాంతంలోని 16 వేల ఇళ్లకు సరిపడా గ్యాస్‌ను సరఫరా చేసే సామర్థ్యంతో నిర్మాణ పనులు పూర్తి చేశారు. టెక్నికల్ పనులు కూడా చురుగ్గా సాగుతున్నాయి. ఈ ఏడాది నవంబర్‌కి పనులు పూర్తి చేసి డిసెంబర్ నుంచి గాజువాకలో ఇంటింటికీ సరఫరా చేసేలా ఐవోసీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

వినియోగదారులకు ఉపయోగముంటుందా?

ఈ పైప్‌లైన్ గ్యాస్ సరఫరా ద్వారా వినియోగదారులకు బోలెడు లాభాలున్నాయి. ప్రస్తుత సిలెండర్‌కు అవుతున్న ఖర్చు కొంత మేర తగ్గుతుంది. నిరంతరం గ్యాస్ అందుబాటులో ఉంటుంది. మన వాడకం ప్రకారం బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా సరఫరా మొత్తం పైప్‌లైన్ సిస్టమ్‌లోనే సాగుతుంది. కాబట్టి ప్రత్యేకించి స్టోరేజ్ అవసరం ఉండదు. సురక్షితమైన వాతావరణంలో సరఫరా జరుగుతుంది.

ఎలా సరఫరా చేస్తారు..?

పైప్‌లైన్ ద్వారా ఒక కిచెన్ పాయింట్ అందిస్తారు. అవసరాన్ని బట్టి ఓ అదనపు పాయింట్‌ను కూడా అదే కిచెన్‌లో తీసుకోవచ్చు. మంచినీటిని పంపు నుంచి తిప్పితే నీరు వచ్చినట్లే మనకు అవసరం అనుకున్నప్పుడు గ్యాస్‌ను వాడుకోవచ్చు. వినియోగించిన ఇంధనాన్ని లెక్కించేందుకు ప్రత్యేకంగా పైప్‌లైన్‌కు మీటర్ ఏర్పాటు చేస్తారు. మనం వాడుకున్న ఇంధనానికి అనుగుణంగానే కరెంట్‌బిల్లు మాదిరిగా బిల్ చెల్లించాల్సి ఉంటుంది. కరెంట్‌బిల్లుకి యూనిట్లు మారే కొద్దీ శ్లాబ్ పెరుగుతుంటుంది. కానీ ఈ గ్యాస్‌ను ఎంత వినియోగించినా ఫిక్స్‌డ్ శ్లాబ్ ధరని నిర్ణయిస్తారు. ఇలా పైప్‌లైన్ ద్వారా మనకు సరఫరా అందనుంది. ఈ సౌకర్యం త్వరలోనే అందుబాటులోకి రానుండటం విశేషం.

ఏపీ ఈసెట్ ఫలితాల విడుదల

- పరీక్ష రాసినవారు 34,503 మంది... ఉత్తీర్ణులైనవారు 31,933 మంది

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పాలిటెక్నిక్, బీఎస్సీ (గణితం) ఉత్తీర్ణులైన అభ్యర్థులు నేరుగా ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశించేందుకు నిర్వహించే ఏపీ ఈసెట్–2023 ఆన్‌లైన్ పరీక్ష ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. జేఎన్‌టీయూ–కాకినాడ ఆధ్వర్యాన గత నెల 20న నిర్వహించిన ఈ పరీక్ష ఫలితాలను వర్సిటీ వీసీ సమావేశపు హాలులో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి విడుదల చేశారు. ర్యాంకుల వివరాలు, జిల్లాల వారీగా ఉత్తీర్ణత శాతం వివరించారు. ఈ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 34,503 మంది హాజరుకాగా 31,933 మంది ఉత్తీర్ణులయ్యారు. పరీక్షకు హాజరైన 25,902 మంది బాలురలో 23,748 మంది, 8,601 మంది బాలికల్లో 8,185 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ కార్యక్రమంలో సెట్ చైర్మన్, జేఎన్‌టీయూకే ఉప కులపతి డాక్టర్ జి.వి.ఆర్.ప్రసాదరాజు, కన్వీనర్ కృష్ణమోహన్, ఉన్నత విద్యామండలి కార్యదర్శి నజీర్ అహ్మద్, స్పెషల్ ఆఫీసర్ సుధీర్‌రెడ్డి, రెక్టార్ రమణ, కో కన్వీనర్ వెంకటరెడ్డి, పద్మప్రియ పాల్గొన్నారు.

పిడుగు పడి 11 మందికి గాయాలు

- అనకాపల్లి జిల్లా తాటిపర్తి గిరిజన గ్రామంలో ఘటన

రావికమతం (అనకాపల్లి జిల్లా): చెట్టుపై ఆదివారం సాయంత్రం పిడుగు పడడంతో 11 మంది గిరిజన యువకులు గాయపడ్డారు. వీరిలో ముగ్గురిని విశాఖ కేజీహెచ్‌కు, 8 మందిని 108లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. రావికమతం మండలం తాటిపర్తి గిరిజన గ్రామంలో ఆ గ్రామానికి చెందిన సీదిరి శ్రీను, కుంద్ర బాలరాజు, షోమీల శ్రీను, పాడి చినబ్బాయి, బాలకృష్ణ, లోత కళ్యాణం, సుర్ల గణేష్ తదితర యువకులు ఆదివారం వాలీబాల్ ఆడుతుండగా వర్షం రావడంతో అంతా ఒక చెట్టు కిందకు పరుగులు తీశారు. ఆ సమయంలో వారికి సమీపంలోని మరో చెట్టుపై పిడుగుపడడంతో ఆ అదురుకు పలువురు సొమ్మసిల్లి పడిపోయారు. అక్కడే ఉన్న మరికొంత మంది వెంటనే 108కు సమాచారం అందించడంతో హుటాహుటిన అంబులెన్స్ సిబ్బంది వచ్చి, గాయపడిన వారిని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం అందరూ కోలుకున్నారని ఆందోళన చెందాల్సిన పనిలేదని గ్రామ సర్పంచ్ వంజరి గంగరాజు తెలిపారు.

24 గంటలూ అందుబాటులో..

విశాఖ ప్రజలకు పైప్‌లైన్ ద్వారా 24 గంటలూ గ్యాస్‌ను అందించే ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకొస్తున్నాం. ఈ పైప్ లైన్ గ్యాస్ వినియోగదారులకు నిరంతర సేవలు అందించేందుకు ఒక కంట్రోల్ రూమ్ చేస్తాం. ఇన్‌స్టాలేషన్ ప్రక్రియ పూర్తయినప్పటి నుంచి 24 గంటలూ వినియోగదారుడికి అందుబాటులో సేవలందించేందుకు సిబ్బంది ఉంటారు. ఏ ఇంటిదగ్గర చిన్న లీక్ జరిగినా.. సెకెన్ల వ్యవధిలో కంట్రోల్‌రూమ్‌కు సమాచారం చేరుకుంటుంది. వెంటనే ఆ ఇంటికి సరఫరాను నిలిపివేసే ప్రక్రియ కేవలం 10 నుంచి 15 సెకెన్లలోపే జరిగిపోతుంది. గంటల వ్యవధిలోనే సమస్య పరిష్కరించి .. సరఫరా పునరుద్ధరించేలా వ్యవస్థను రూపొందిస్తున్నాం. 16 ఇంచ్‌ల పైప్‌లను భూగర్భంలో అమర్చాం. దాని ద్వారా సరఫరా చేస్తాం. పైప్‌లైన్ పొడవునా ప్రతి 15 నుంచి 20 కిమీ దూరంలో సెక్షన్ వాల్వ్ స్టేషన్లను కూడా ఏర్పాటు చేస్తున్నాం. త్వరలోనే విశాఖ ప్రజలకు గ్యాస్‌ను పైప్‌లైన్ ద్వారా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– అనిల్‌కుమార్, ఏపీ, తెలంగాణ ఐవోసీ ఈడీ

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.